
'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 179

గురువారం 19-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



టెస్టు సమరానికి సై

చెన్నైలో నేటి నుంచి భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి టెస్టు - 14లో



ఫెడ్ అర శాతం వడ్డీ కట్

4.75-5 శాతానికి దిగివచ్చిన ఫెడ్ ఫండ్స్ రేట్లు - 15లో



తొలిదశ పోలింగ్ 59%

జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి తొలిదశ ఎన్నికల్లో 59 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 24 సీట్లకు బుధవారం పోలింగ్ జరిగింది.

- వివరాలు 6లో▶



పేజర్‌లో పేలుడు పదార్థం!

లెబనాన్, సిరియాల్లో పేజర్ల అనూహ్య పేలుళ్లతో గతంలో ఎన్నడూలేనంతగా తొలిసారిగా పేజర్లపై చర్చ మొదలైంది.

- వివరాలు 6లో▶



నిన్న పేజర్లు.. నేడు వాకీటాకీలు

వాకీటాకీలు, సౌర విద్యుత్ వ్యవస్థల పేలుళ్లతో లెబనాన్ దద్దరిల్లింది. ఈ అనూహ్య పేలుళ్ల ఘటనల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో▶



జీబీలకు జీబీలు వాడేస్తున్నారు!

మొబైల్ డేటా వాడకంలో దేశం దూసుకుపోతోంది. 2023లో ఒక్కో యూజర్ నెలవారీ డేటా వినియోగం 29 జీబీలుగా ఉంది.

- వివరాలు 15లో▶

జమిలికి జై

'ఒక దేశం ఒకే ఎన్నిక'కు కేంద్రం పచ్చజెండా

కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం

శీతాకాల సమావేశాల్లోనే బిల్లు పెట్టే అవకాశం!

స్వాగతించిన బీజేపీ, ఎన్డీయే పక్షాలు

ఆచరణసాధ్యం కాదన్న కాంగ్రెస్, విపక్షాలు

కోవింద్ కమిటీ లోక్‌సభ ఎన్నికలకు ముందు గత మార్చిలో జమిలి ఎన్నికలపై నివేదిక సమర్పించింది. 'ఒక దేశం, ఒకే ఎన్నిక'ను రెండు దశల్లో అమలు చేయాలని సూచించింది. 'తొలి దశలో లోక్‌సభకు, అన్ని అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరపాలి. 100 రోజుల్లోపు రెండో దశలో పంచాయతీలు, మున్సిపాలిటీల వంటి స్థానిక సంస్థలన్నింటికీ ఎన్నికలు జరపాలి' అని పేర్కొంది. అన్ని ఎన్నికలకూ ఉమ్మడిగా ఒకే ఎలక్టోరల్ రోల్ ఉపయోగించాలని పేర్కొంది. ఇందుకు కేంద్ర, రాష్ట్రాల ఎన్నికల సంఘాల మధ్య సమన్వయం అవసరం. ఎందుకంటే ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను సీఈసీ, స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్రాల ఎన్నికల సంఘాలు నిర్వహిస్తున్నాయి.

రెండు దశల్లో అమలు

కోవింద్ కమిటీ సిఫార్సు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు 'ఒక దేశం ఒకే ఎన్నిక'పై ఉన్నతస్థాయి నివేదికను అందజేస్తున్న రామ్‌నాథ్ కోవింద్. చిత్రంలో అమిత్ షా

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలు ఈ టర్మ్‌లోనే ఉంటాయని కొద్ది రోజులుగా స్పష్టమైన సంకేతాలిస్తూ వస్తున్న మోదీ సర్కారు ఆ దిశగా కీలక ముందడుగు వేసింది. దేశమంతటా అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 'ఒక దేశం ఒకే ఎన్నిక' ప్రతిపాదనకు జై కొట్టింది. ఈ మేరకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని ఉన్నతస్థాయి కమిటీ చేసిన సిఫార్సులకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దాంతో మన దేశంలో ఎన్నికల నిర్వహణ తీరుతెన్నుల్లో భారీ సంస్కరణలకు రంగం సిద్ధమైంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు అన్ని స్థానిక సంస్థలకూ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని కమిటీ సిఫార్సు చేయడం తెలిసిందే. తొలుత దీనికి జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాలని, ఆ మీదట దశలవారీగా నిర్ణయాన్ని అమలు చేయాలని సూచించింది. 'కమిటీ సిఫార్సుల మేరకు అన్ని వర్గాలతోనూ సంప్రదింపుల ప్రక్రియ చేపట్టిన అనంతరం కేంద్ర న్యాయ శాఖ బిల్లు ప్రతిని రూపొందించి కేబినెట్ ముందు పెడుతుంది. అనంతరం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడతాం' అని కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వచ్చే శీతాకాల సమావేశాలే ఇందుకు వేదిక కావచ్చని

మిగతా 12వ పేజీలో ▶

అంతరిక్షంలో మన జైత్రయాత్ర

'చంద్రయాన్-4'కు ఆమోదం తెలియజేసిన కేంద్ర కేబినెట్ 6 లో



ఆచరణ సాధ్యమేనా?

- జమిలిపై భిన్నాభిప్రాయాలు
- ఆచరణపరంగా ఎన్నో ఇబ్బందులు
- పలు పార్టీల అభ్యంతరాలు - 6లో

క్యాష్‌లెస్.. యూజ్‌లెస్!

ఉద్యోగులు, పెన్షనర్లకు అందని నగదు రహిత ఉచిత వైద్యం

- క్యాష్‌లెస్ వైద్యం అందించని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు
- సొంతంగా డబ్బులు కట్టి చికిత్స చేయించుకుంటున్న తీరు
- రీయింబర్స్‌మెంట్ కోసం అప్లై చేసుకున్నా.. తిరిగొచ్చే సొమ్ము అంతంతేనని ఆవేదన
- ఈహెచ్ఎస్‌తో ప్రయోజనం లేకుండా పోయిందంటున్న ఉద్యోగులు
- కాంట్రిబ్యూటరీ పద్ధతిపై ఇంకా నిర్ణయం తీసుకోని సర్కారు



రూ.28 వేలు ఖర్చయితే.. రూ.12 వేలు వచ్చాయి

మా అమ్మగారికి కంటి ఆపరేషన్ చేయించడం కోసం రూ.28 వేలు ఖర్చయ్యాయి. రీయింబర్స్‌మెంట్ కింద మెడికల్ బిల్లులు సమర్పించినప్పుడు రూ.12 వేలు మాత్రమే, అదీ ఏడాది తర్వాత అందాయి. ప్రభుత్వం నగదు రహిత చికిత్స అందిస్తేనే.. ఏమైనా ప్రయోజనం ఉంటుంది.

– బుర్ర రమేష్, రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ప్రధానోపాధ్యాయుల సంఘం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అటకెక్కింది. నగదు రహిత వైద్యసేవలు అందక ఉద్యోగులు, పింఛన్‌దారులు గగ్గోలు పెడుతున్నారు. నగదు రహిత ఆరోగ్య కార్డుతో వైద్యం చేయడానికి ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. డబ్బులు చెల్లించనిదే అడ్మిట్ చేసుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఉద్యోగులు గత్యంతరం లేక లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి వైద్యం పొందుతున్నారు. ఆరోగ్య పథకంతో తమకు ప్రయోజనం పెద్దగా ఉండటం లేదని వాపోతున్నారు. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి కొనసాగుతున్నా, పూర్తిస్థాయిలో పరిష్కారం కనుగొనడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదని పేర్కొంటున్నారు.

ఆస్పత్రులకు బకాయిలతో..

ఈహెచ్ఎస్ పరిధిలో సుమారు 5.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారు. వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 20 లక్షల మంది ఈ పథకంలోకి వస్తారు. ఈహెచ్ఎస్ కార్డు చూపిస్తే.. ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా ఫీజులేమీ తీసుకోకుండానే అడ్మిషన్ ఇచ్చి వైద్యం చేయాలనేది ఈ పథకం ఉద్దేశం. ఆస్పత్రులకు ఆ సొమ్మును

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

గాడ్సే వారసులు దేశాన్ని పాలిస్తున్నారు



'మోదీ ప్రధాని కావడం ప్రజల దురదృష్టం. దేశాన్ని గాడ్సే వారసులు పరిపాలిస్తున్నారు. వారికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేదు..' అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ధ్వజమెత్తారు.

- వివరాలు 3లో▶

వెంటనే కులగణన చేపట్టాలి



కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- వివరాలు 2లో▶

'క్లాస్'కు సెల్ తీసుకెళ్లొద్దు



ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడొద్దని, అలా చేస్తే చర్యలు తప్పవని విద్యాశాఖ హెచ్చరించింది. అత్యవసరమైతేనే క్లాస్‌రూమ్‌కు ఫోన్ తీసుకెళ్లాలని, అందుకు ప్రధానోపాధ్యాయుడి అనుమతి తప్పనిసరి అని తన ఆదేశాల్లో పేర్కొంది.

- వివరాలు 5లో▶

అన్ని అంశాల్లో మెరికల్లా శిక్షణ



యువ ఐపీఎస్‌లను అనేక అంశాల్లో సుశిక్షితులుగా తీర్చిదిద్దినట్టు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్‌గార్గ్ చెప్పారు. కాగా, 76వ ఐపీఎస్ బ్యాచ్ నుంచి తెలంగాణ, ఏపీకి నలుగురు చొప్పున అధికారులను కేటాయించారు.

- వివరాలు 16లో▶

తెలంగాణ వడ్డించిన విస్తరి

2028 నాటికి వార్షిక బడ్జెట్‌ను రూ.7 లక్షల కోట్లకు చేరుస్తాం

- 'ఎంఎస్ఎంఈ పాలసీ 2024' ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి
- వ్యవసాయ కుటుంబాలు ఉపాధి, వ్యాపార రంగాల్లోనూ ఎదగాలి
- స్కిల్స్ యూనివర్సిటీ కోసం రూ.500 కోట్ల కార్పస్ ఫండ్ సేకరిస్తాం
- అప్పట్లో ఏపీలో ఎకరం అమ్మితే తెలంగాణలో పదెకరాలు వచ్చేవి
- ఇప్పుడు ఇక్కడ ఎకరం అమ్మితే.. ఏపీలో వందెకరాలు కొనొచ్చు..



ఎంఎస్ఎంఈలపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం వడ్డించిన విస్తరి వంటిదని.. చైనా బయట పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా నిలిచేందుకు అనేక అనుకూలతలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగం బలోపేతంతో వేగంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తామని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చి.. ప్రస్తుతం రూ.3 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను 2028 నాటికి రూ.7 లక్షల కోట్లకు చేర్చడం లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. బుధవారం హైదరాబాద్ శిల్ప కళావేదికలో 'తెలంగాణ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాలసీ–2024'ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ అధికారులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ భేటీలో పారిశ్రామిక ప్రగతికి సంబంధించిన పలు అంశాలను సీఎం ప్రస్తావించారు.

పెట్టుబడులతో సంపద పెంచుతాం

''ఏ రంగంలోనైనా పాలసీ లేకుండా పురోగతి సాధ్యం కాదు. ఎంఎస్ఎంఈలో పెట్టుబడులు రాబడుతూ సంపద పెంచడంతోపాటు దళితులు, గిరిజనులు, మహిళలను ప్రోత్సహించే వాతావరణం సృష్టిస్తాం. భేషజాలకు పోకుండా గత ప్రభుత్వం చేసిన మంచి పనులు కొనసాగిస్తూ.. నష్టం చేసే విధానాలను తొలగిస్తాం. పారిశ్రామిక అభివృద్ధితోనే తెలంగాణ ఆర్థికంగా

మిగతా 3వ పేజీలో ▶

కేంద్ర పథకంపై ఒప్పందం..

కేంద్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) శాఖ ప్రపంచ బ్యాంకు సహకారంతో దేశంలో ఎంఎస్ఎంఈల పనితీరును మెరుగుపర్చడం, వేగవంతం చేయడం కోసం పథకాన్ని అమలు చేస్తోంది. కరోనా సమయంలో దెబ్బతిన్న ఎంఎస్ఎంఈలు తిరిగి కోలుకునేందుకు ఉద్దేశించిన ఈ పథకంలో భాగంగా.. రాష్ట్రంలో స్టేట్ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ ఏర్పాటు కోసం బుధవారం ఎంఓయూ కుదుర్చుకున్నారు. కాగా.. పాలసీ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, రాయల నాగేశ్వర్‌రావు, ఐత ప్రకాశ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరు చట్టాలను సవరించడం ద్వారా హైడ్రాకు ప్రత్యేక అధికారాలు


- వాల్టాతో పాటు రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టాలకు సవరణలు
- ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిన శాఖలు
- ఆక్రమణల నిరోధం దిశగా హైడ్రాను బలోపేతం చేయడమే లక్ష్యం... నోటీసులు ఇవ్వడం నుంచి కూల్చివేతల దాకా అన్ని అధికారాల అప్పగింత!
- అవసరమైతే హైడ్రాకు ప్రత్యేకంగా కొత్త చట్టం తేవాలంటున్న నిపుణులు... ఆర్డినెన్సా? అసెంబ్లీ ముందుకా? అన్నదానిపై 20న కేబినెట్‌లో స్పష్టత

- వివరాలు 2లో

ఒక హైడ్రా.. ఆరు చట్టాలు!



పరిశ్రమలకు విద్యుత్ చార్జీల 'హైటెన్షన్'!



హెచ్‌టీ కేటగిరీలో పెరగనున్న విద్యుత్ చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు

- 11 కేవీ కనెక్షన్ల చార్జీలకు సమానంగా 33/ 132/ఆపై కనెక్షన్ల చార్జీల పెంపు
- ఒక్కో యూనిట్‌కు 33కేవీ కనెక్షన్లకు 50పైసలు.. ఆపై కనెక్షన్లకు రూపాయి వరకు భారం
- ఎల్టీ కేటగిరీలో 300 యూనిట్లకుపైగా వాడితే పెరగనున్న ఫిక్స్‌డ్ చార్జీలు
- ఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికలో డిస్కంల ప్రతిపాదనలు... ఆమోదం వస్తే.. నవంబర్ 1 నుంచి పెంపు అమల్లోకి వచ్చే చాన్స్

- వివరాలు 12లో

ఇదంజగత్



ఇది కక్షపూరిత చర్య! ఇక మన కక్షలెలా తీర్చుకుంటాం!

పదిహేనేళ్లు పైబడితే... ఆ వాహనాలు తుక్కుకే!

2009 అంతకంటే ముందు నాటి వాహనాలన్నింటినీ తుక్కుగా మార్చాల్సి ఉంటుంది. 2009 వరకు తయారైన వాహనాలు రాష్ట్రంలో 30 లక్షల వరకు ఉన్నట్టు అంచనా. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 20 లక్షలున్నట్టు అధికారులు చెబుతున్నారు. వీటిని తొలగించాల్సి ఉంటుంది. ఇవన్నీ ఏపీ సిరీస్‌లో ఉన్నవే. 'ఈ నిబంధన కేవలం ప్రైవేట్ వాహనాలకే పరిమితం చేయకుండా ప్రభుత్వ వాహనాలకు కూడా వర్తింపచేయాలి. అప్పుడే లక్ష్యం నెరవేరుతుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు, ప్రభుత్వ వాహనాలు, అంబులెన్సులు.. ఇలా ప్రభుత్వం ఆధీనంలో పదిహేనేళ్ల వయసు దాటిన వాహనాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వాటన్నింటిని కూడా తుక్కుగా మార్చాలి. అసలు రాష్ట్రంలో 2009, అంతకంటే ముందు వాహనాలు ఎన్ని ఉన్నాయో ప్రభుత్వం ప్రకటించాలి'అని వాహనదారుల యాక్టివిస్ట్ దయానంద్ కోరారు.

2009 వరకు కొన్న వాహనాలపై ప్రభావం..

ప్రతిపాదన అమలు విషయాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వం

- కొత్త సంవత్సరం నుంచి అమలు చేసే యోచన
- 2009, అంతకుముందు వాహనాలపై ప్రభావం
- దాదాపు 30 లక్షలు ఉంటాయని అంచనా

సాక్షి, హైదరాబాద్: పదిహేనేళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చాలన్న ప్రతిపాదనను అమలులోకి తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు, పదిహేనేళ్లు పైబడిన వాహనాలను వినియోగించరాదన్నది నిపుణుల మాట. ఇదే అంశాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. కానీ, ఎప్పటి నుంచి దీనిని అమలు చేయాలన్న విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వలేదు. దీని అమలులో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వటంతో అది ముందుకు సాగలేదు. తెలంగాణలో క్రమంగా వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుండటంతో వాతావరణ కాలుష్యం కూడా పెద్ద సమస్యగా మారటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఈ సంవత్సరం చివరి వరకు అవకాశం ఇచ్చి, జనవరిలో దీనిని అమలులోకి తెస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

ఏం చేస్తారు..?

పదిహేనేళ్ల వయసు దాటిన అన్ని రకాల వాహనాలను తుక్కుగా మార్చాల్సి ఉంటుంది. వాహనాలను తుక్కుగా చేసే బాధ్యతను పర్యవేక్షించేందుకు టాటా, మహీంద్ర కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని ఆ అధికారి చెప్పారు. సంబంధిత వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ చెల్లించి తుక్కుగా మార్చేందుకు రవాణా శాఖకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఆమేరకు దానిని తుక్కు జాబితాలోకి మార్చి రికార్డుల నుంచి ఆ చాసిస్ నంబర్‌ను

మిగతా 12వ పేజీలో ▶

2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు

నోటిఫికేషన్



28వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

- వచ్చే నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు
- నవంబర్ 17వ తేదీన సీబీటీ పద్ధతిలో రాత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున పోస్టుల భర్తీ చేపట్టింది. ఇటీవల ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం.. బుధవారం 2,050 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్‌నర్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. తెలంగాణ మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రులు, సంస్థల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా అనుభవమున్న అభ్యర్థులు.. అనుభవ ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. ఈ పోస్టులకు పేస్కేల్ రూ.36,750 – రూ.1,06,990 మధ్య ఉంటుందని తెలిపారు. స్టాఫ్‌నర్స్ పోస్టులను బహుళ ఐచ్ఛిక ఎంపిక విధానంలో రాతపరీక్ష ఆధారంగా భర్తీ చేస్తారు. పరీక్షలో మార్కులకు గరిష్టంగా 80 పాయింట్లు ఉంటాయి. ఇప్పటికే

మిగతా 12వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఉజ్జయినిలో మంత్రి ఉత్తమ్



ఉజ్జయినిలోని మహా కాళేశ్వర జ్యోతిర్లింగ ఆలయం వద్ద ఉత్తమ్, పద్మావతి రెడ్డి


సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమకుమార్‌రెడ్డి, ఆయన సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి దంపతులు బుధవారం మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినిలోని మహా కాళేశ్వర జ్యోతిర్లింగ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల విలీనంపై వివరాలివ్వండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ కార్పొరేషన్‌లో శంషాబాద్ మండలానికి చెందిన చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, రషీద్‌గూడ సహా 51 గ్రామాల విలీనంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ, నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని చెప్పింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. సమీప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 51 గ్రామాలను విలీనం చేసేలా ప్రభుత్వం ఆర్డినెన్స్ 3/2024 జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ శంషాబాద్ మండలానికి చెందిన చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, రషీద్‌గూడ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. మున్సిపల్ కార్పొరేషన్‌లో 51 గ్రామాలను విలీనం చేస్తే వ్యవసాయంపై ఆధారపడిన వారు ఉపాధి, సంక్షేమ పథకాలు కోల్పోయే ప్రమాదం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. పంచాయతీలను సంప్రదించకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమన్నారు. కాగా, ఇదే అంశంపై సింగిల్ జడ్జి వద్ద గత నెల మరో పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే.

కార్డన్ అండ్ సెర్చ్‌లపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: మిషన్ చబుత్రా, ఆపరేషన్ రోమియో, అర్ధరాత్రి కౌన్సెలింగ్.. ఇలా పలు పేర్లతో హైదరాబాద్ నగర పోలీసులు అమలు చేస్తున్న కార్డన్ అండ్ సెర్చ్ కార్యకలాపాలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేస్తూ ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ప్రైవేట్ వ్యాజ్యంగా మార్చవద్దని.. కోర్టు విచారణకు ముందే పబ్లిసిటీ కోసం పత్రికలకు విడుదల చేయొద్దని హెచ్చరించింది. నగరంలో పలు ప్రాంతాల్లో పోలీసులు అమలు చేస్తున్న కార్డన్ అండ్ సెర్చ్ కార్యకలాపాలను ఆపాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. సామాజిక కార్యకర్త ఎస్క్యూ మక్సూద్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసు కార్యకలాపాలతో పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని.. ప్రజల గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యతతో పాటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ఇచ్చిన మానవ హక్కులకు ఉల్లంఘన కలుగుతోందన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. డీజీపీ, హైదరాబాద్ సీపీకి నోటీసులు జారీ చేసింది.

పెండింగ్ సమస్యలపై గురుకుల ఉద్యోగుల నిరసన

నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లోని ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి గురుకుల విద్యా జేఏసీ ఆధ్వర్యంలో వినతులు సమర్పించిన సంగతి తెలిసిందే. తాజాగా గురుకుల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసనలు తెలుపుతున్నారు. గురువారం గురుకుల ఉద్యోగులంతా వారి సొసైటీ కార్యదర్శులు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు జేఏసీ ప్రతినిధులు సీహెచ్ బాలరాజు, కూకుంట్ల యాదయ్య, పి.రుషికేశ్ కుమార్, వి.ప్రభుదాస్, కేవీ చలపతి, డి.బాలస్వామి, వీఆర్ గోవర్దన్ రెడ్డి తదితరులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశాస్త్రీయంగా ఉన్న గురుకులాల పనివేళలు మార్చాలని, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, డైట్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని, వార్డెన్ పోస్టులతో పాటు బోధనేతర పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలనే డిమాండ్లను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ నేతలు తెలిపారు.

ఒక హైడ్రా.. ఆరు చట్టాలు!

ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరు చట్టాలను సవరించడం ద్వారా హైడ్రాకు ప్రత్యేక అధికారాలు



- వాల్టాతో పాటు రెండు రెవెన్యూ చట్టాలు, మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టాలకు సవరణలు
- ఇప్పటికే సవరణల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిన శాఖలు
- ఆక్రమణల నిరోధం దిశగా హైడ్రాను బలోపేతం చేయడమే లక్ష్యం
- నోటీసులు ఇవ్వడం నుంచి కూల్చివేతల దాకా అన్ని అధికారాల అప్పగింతకు రంగం సిద్ధం
- అవసరమైతే హైడ్రాకు ప్రత్యేకంగా కొత్త చట్టం తేవాలంటున్న నిపుణులు
- ఆర్డినెన్సా? అసెంబ్లీ ముందుకా? అన్నదానిపై ఈనెల 20న కేబినెట్‌లో స్పష్టత

సాక్షి, హైదరాబాద్:

'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా)'ను పూర్తిస్థాయిలో బలోపేతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఇందుకోసం ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరు చట్టాలను సవరించడం ద్వారా 'హైడ్రా'కు ప్రత్యేక అధికారాలు కల్పించాలని నిర్ణయించింది. భూ ఆక్రమణల చట్టం-1905, వాల్టా, ల్యాండ్ రెవెన్యూ చట్టం, మున్సిపల్ కార్పొరేషన్స్ యాక్ట్, మున్సిపాలిటీస్ యాక్ట్, పంచాయతీరాజ్ చట్టాలను సవరించడం ద్వారా.. కీలక అధికారాలను హైడ్రాకు బదలాయించాలని భావిస్తోంది. ఆ చట్టాల సవరణ కోసం ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలను రాష్ట్ర ప్రభుత్వం కోరగా.. ఆ శాఖలు వెంటనే ప్రతిపాదనలను పంపాయని తెలిసింది. అయితే ఈ సవరణ ప్రతిపాదనలన్నింటినీ కలిపి చట్టం చేయాలా? ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల పరిధిలోనే ఈ సవరణలను అమలు జరపాలా? అన్నదానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సమాచారం. చట్ట సవరణలు కాకుండా హైడ్రా కోసం ప్రత్యేక చట్టం రూపొందిస్తే బాగుంటుందని భూచట్టాల నిపుణులు సూచిస్తున్నారు.

ప్రస్తుతానికి సహాయకారి మాత్రమే..

ఆక్రమణల కూల్చివేత విషయంలో 'హైడ్రా' ప్రస్తుతానికి ప్రభుత్వ శాఖలకు సహాయకారిగా మాత్రమే ఉంది. ఆక్రమణల నిర్ధారణ, నోటీసులివ్వడం, చర్యలు తీసుకోవడం, కూల్చివేయడం వంటి అధికారాలేవీ హైడ్రాకు దఖలు పడలేదు. ప్రభుత్వ శాఖలకు అనుబంధంగానే పనిచేస్తోంది. ఈ నేపథ్యంలోనే పలు చట్టాలను సవరించి ఈ అధికారాలన్నీ నేరుగా హైడ్రాకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు రెవెన్యూ శాఖ ఇప్పటికే చట్ట సవరణ ప్రతిపాదనలను పంపింది. ఆక్రమణల విషయంలో నోటీసులు ఇచ్చే అధికారం ఇప్పటివరకు కేవలం తహసీల్దార్‌కు మాత్రమే ఉండగా.. ఇకపై తహసీల్దార్‌తోపాటు హైడ్రాలోని అధీకృత అధికారికి కూడా అధికారాలను దఖలు పరుస్తూ రెవెన్యూ చట్టంలో సవరణను ప్రతిపాదించారు. లేదంటే రెవెన్యూ అధీకృత అధికారిని హైడ్రాలోకి తీసుకోవాలని సవరణ ప్రతిపాదనల్లో సూచించినట్టు సమాచారం. అయితే హైడ్రాకు అధికారాల బదలాయింపు కోసం ఆర్డినెన్స్ రూపంలో చట్టం చేయాలా? అసెంబ్లీలో చర్చించి బిల్లు ఆమోదం ద్వారా చట్టం చేయాలా? అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదని, ఈ నెల 20వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో స్పష్టత వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

స్పష్టత కోసమే ప్రత్యేక చట్టం



'హైడ్రా' మనుగడకు ప్రత్యేక చట్టమే ఉపయోగపడుతుంది. చట్టాలకు సవరణలు, ఆ సవరణలతో మరో చట్టం చేసే దాని కంటే హైడ్రాకు ప్రత్యేకంగా చట్టం చేసి మార్గదర్శకాలు రూపొందించుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు రావు. గందరగోళం ఉండదు. న్యాయపరమైన చిక్కులు రావు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు చర్యలు తీసుకునే ప్రక్రియ మొత్తాన్ని ఈ చట్టంలో రూపొందించుకోవచ్చు. మరోవైపు చట్టబద్ధత ద్వారా అధికారాన్ని ఏ సంస్థకు బదలాయించినా ఆ సంస్థ బాధ్యత మరింత పెరుగుతుంది.

- ఎం.సునీల్‌కుమార్, భూచట్టాల నిపుణుడు

వెంటనే కులగణన చేపట్టాలి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

- బీసీ నేతలతో కేటీఆర్ సుదీర్ఘ భేటీ



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో శ్రీనివాస్ గౌడ్, దాసోజు శ్రవణ్, మధుసూదనాచారి తదితరులు

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నవంబర్ పదో తేదీలోపు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో సమగ్ర కుల గణన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం సాయంత్రం బీసీ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులతో కేటీఆర్ సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణ సర్పంచ్‌ల సంఘం, తెలంగాణ ఎంపీటీసీ జిల్లా సంఘం అధ్యక్షులు ఈ సమావేశానికి హాజరయ్యారు. బీసీలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ తీరుపై చర్చించాం. బీసీలకు ఇచ్చిన హామీలను నవంబర్ 10లోగా నెరవేర్చకుంటే బీఆర్‌ఎస్ తరఫున భవిష్యత్ కార్యాచరణ చేపడతాం'అని కేటీఆర్ ప్రకటించారు.

రూ.లక్ష కోట్ల పేరిట మోసం: 'బడ్జెట్‌లో బీసీలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించి ఈ ఏడాది కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. వచ్చే బడ్జెట్లో కనీసం రూ.25 వేల కోట్లను బీసీలకు కేటాయించాలి. రాష్ట్ర కేబినెట్‌లో మరికొందరు బీసీలకు కూడా మంత్రి పదవి ఇవ్వాలి. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో అన్యాయం చేస్తోంది. పద్మశాలి, ముదిరాజ్, గంగపుత్రులకు అన్యాయం చేస్తూ.. మత్స్యకారుల పొట్ట కొడుతోంది. బీసీ గురుకుల విద్యాసంస్థల్లో పూర్తిగా ప్రమాణాలను దిగజార్చింది'అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

బీసీలకు సింహభాగం ఇచ్చాం: 'సీట్లు, పదవుల్లో బీసీలకు బీఆర్‌ఎస్ పార్టీ సింహభాగం ఇచ్చింది. ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కన్నా బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చాం. గతంలో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపించాం. అలాగే 50 కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 27 మంది బీసీలకే ఇచ్చాం. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు కేసీఆర్ పెద్దదిక్కుగా ఉంటారు'అని కేటీఆర్ పేర్కొన్నారు.

కులగణన చేపట్టాలి: 'గతంలో కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వేను 24గంటల్లో పూర్తి చేసిన రీతిలో ఈ ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టాలి. బీసీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో కేసీఆర్‌తో మాట్లాడి విస్తృత కార్యాచరణ ప్రకటిస్తాం. క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రభుత్వానికి కూడా పలు సూచనలు చేయడంతో పాటు పరిష్కారం కోసం ఒత్తిడి చేస్తాం'అని కేటీఆర్ అన్నారు.

జమిలి ఎన్నికలపై స్పష్టత ఇవ్వాలి: 'జమిలి ఎన్నికల విషయంలో కేంద్రం ఏ విధంగా ముందుకు వెళ్తుందో, ఎన్నికల నిర్వహణ ఎలా ఉంటుందో స్పష్టత ఇవ్వాలి. జనాభా లెక్కలతో పాటు సీట్ల పునర్విభజన జరగాలి. వివరాలు పరిశీలించిన తర్వాత జమిలి ఎన్నికలపై మా పార్టీ ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకుంటుంది'అని కేటీఆర్ తెలిపారు.

9 నెలల్లోనే పాలన అర్థమైంది

కాప్రా (హైదరాబాద్): తొమ్మిది నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును తెలంగాణ ప్రజలు అర్థం చేసుకున్నారని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం పదేళ్లపాటు తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్‌కు అధికారం ఇచ్చారని చెప్పారు. కానీ ఇప్పుడు తమకు కొత్త బాధ్యతను ప్రజలు అప్పగించారని.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. ఇవాళ అధికారంలో వాళ్లు ఉండొచ్చు.. రేపు అధికారం తమకు రావచ్చని చెప్పారు. మొదట గుర్రాన్ని చూసి.. తరువాత గాడిదను చూస్తే ఎలా ఉంటుందో.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అలానే ఉందని ఎద్దేవా చేశారు. తాను కేటీఆర్‌తోనే కలిసి నడుస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

ఖర్చుపై పరిమితి వద్దు

ఈహెచ్‌ఎస్‌పై మంత్రికి ఉద్యోగుల జేఏసీ ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగికి లబ్ధి కలిగేలా వ్యూహాత్మకంగా ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఉద్యోగులకు లాభం జరిగే విధంగా, ప్రభుత్వానికి మంచిపేరు వచ్చే విధంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వివిధ ఉద్యోగ సంఘాల నేతలతో సంప్రదించి ఈహెచ్‌ఎస్‌పై కొన్ని ప్రతిపాదనలు తయారు చేసింది. తెలంగాణ ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలోని పలువురు టీఈ జేఏసీ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నివేదించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న హెల్త్ స్కీమ్‌లో ఉన్న లోటుపాట్లు, కొత్తగా ప్రతిపాదించిన హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, వారి కుటుంబాలకు కలిగే ప్రయోజనాలు, తద్వారా ప్రభుత్వానికి వచ్చే పేరు గురించి మంత్రికి వివరించారు. కొత్త ప్రతిపాదనలతో ప్రభుత్వానికి భారం లేకుండా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందే వైద్యసేవల గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

- 3.06 లక్షల ఉద్యోగులు, 2.88 లక్షల పెన్షనర్లు ఉన్నారు.
- ప్రభుత్వం ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం ఏటా రూ.40 కోట్లు ఖర్చు చేస్తోంది.
- నూతన ఈహెచ్‌ఎస్‌లో ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఎంప్యానెల్ చేసిన ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి నగదు రహిత వైద్యం అందించాలి.
- వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుపై ఎలాంటి పరిమితివిధించొద్దు.
- అన్ని రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ విధానం అమలు చేయాలి.
- ప్రధాన కార్డుదారు సహా ఆరుగురు కుటుంబ సభ్యులకు ఈహెచ్‌ఎస్ సదుపాయం కల్పించాలి.
- ఈహెచ్‌ఎస్ కోసం మొత్తం ఎంత ఖర్చు అవుతుందో ఈహెచ్‌ఎస్ లేదా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఏహెచ్‌సీటీ) ఖరారు చేయాలి.
- 50 శాతం ప్రభుత్వం, మిగతా 50 శాతం ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి తీసుకోవాలి.
- ప్యాకేజీలు, చికిత్సలకు అయ్యే ధరలను ఆస్పత్రులకు చెందిన సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలతో ఈహెచ్‌ఎస్ చర్చించి ఖరారు చేయాలి.
- ప్రభుత్వం ఆమోదించిన అన్ని ఎన్‌ప్యానెల్డ్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ప్రాథమిక వైద్య పరీక్షలు మొదలుకొని మందుల వరకు ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ సేవలను పూర్తి నగదు రహితంగా అందించాలి.
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన, అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కూడిన స్టీరింగ్ కమిటీ ఈహెచ్‌ఎస్ అమలును పర్యవేక్షించాలి. లబ్ధిదారులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలి.

నల్లగొండ కమిషనర్ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం

బీఆర్‌ఎస్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా కార్యాలయ భవన క్రమబద్ధీకరణ అంశంపై గతంలోనే ఆదేశాలు ఇచ్చినా..మరోసారి రిట్ పిటిషన్ దాఖలు చేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రూ.లక్ష జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని 4 వారాల్లో నల్లగొండ లీగల్ సర్వీసెస్ అథారిటీలో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన కూల్చివేత ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని, పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. 'బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా కార్యాలయ భవనాన్ని క్రమబద్ధీకరించాలని ఆన్‌లైన్‌లో జూలై 3న చేసుకున్న దరఖాస్తును మున్సిపల్ కమిషనర్ తిరస్కరిస్తూ.. జూలై 20న ఉత్తర్వులు జారీ చేశారు. అనధికారిక నిర్మాణాన్ని 15 రోజుల్లో తొలగించాలని, లేనిపక్షంలో మున్సిపల్ అధికారులే చర్యలు చేపడతారని పేర్కొన్నారు. కమిషనర్ ఉత్తర్వులను కొట్టివేసి.. నల్లగొండ సర్వే నంబర్ 1,506లోని ఎకరం స్థలంలోని నిర్మాణాన్ని క్రమబద్ధీకరించేలా కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలి. ట్రిబ్యునల్ ఏర్పాటు చేసే వరకు కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలి'అని విజ్ఞప్తి చేస్తూ నల్లగొండ బీఆర్‌ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. క్రమబద్ధీకరణ అంశంపై మరోసారి పిటిషన్ వేయడంపై అసహనం వ్యక్తం చేస్తూ, పిటిషన్‌ను కొట్టివేశారు.

క్యాష్‌లెస్ యూజ్‌లెస్!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వమే చెల్లిస్తుంది. అయితే ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో.. ఆస్పత్రులు నగదు రహిత వైద్యం అందించడంపై ఆసక్తి చూపడం లేదు. ఉద్యోగ సంఘాల నే తల లెక్కల ప్రకారం.. ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు దాదాపు రూ.500 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది.

రీయింబర్స్‌మెంట్‌తో మరింత సమస్య

ప్రభుత్వం ఈహెచ్‌ఎస్ పథకంతోపాటు రీయింబర్స్‌మెంట్‌ను కూడా అమలు చేస్తోంది. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులెవరైనా అనారోగ్యానికి గురైతే.. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో సొంత డబ్బుతో చికిత్స చేయించుకోవాలి. తర్వాత ఆస్పత్రి బిల్లులను ప్రభుత్వానికి సమర్పిస్తే.. ఆ సొమ్ము రీయింబర్స్‌మెంట్ అవుతుంది. కానీ దీనితో తీవ్ర ఇబ్బంది ఎదురవుతోందని ఉద్యోగులు, పెన్షనర్లు వాపోతున్నారు. రూ.10 లక్షల బిల్లు అయితే.. రూ.లక్ష, లక్షన్నర మాత్రమే వెనక్కి ఇస్తున్నారని, అది కూడా ఆరేడు నెలల నుంచి రెండేళ్ల సమయం పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగదు రహిత వైద్య పథకం సరిగా అమలవకపోవడం, రీయింబర్స్‌మెంట్ పూర్తిగా రాకపోవడంతో.. ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నామని, ఏటా రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ప్రీమియం కట్టాల్సి వస్తోందని ఉద్యోగులు అంటున్నారు.

కాంట్రిబ్యూటరీ స్కీమ్‌పై అస్పష్టత: గత ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్‌కు కొన్ని రోజుల ముందు 'ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ)' ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకోసం ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి.. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి కొంత, ప్రభుత్వం నుంచి కొంత కలిపి జమ చేయాలని పేర్కొంది. అది అమల్లోకి రాలేదు. కొత్త ప్రభుత్వం ఈ స్కీంపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

బిల్లు కట్టి.. ఎదురుచూపులు

నిజామాబాద్ జిల్లాకు చెందిన రిటైర్డ్ పెన్షనర్ ప్రభుదాస్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందగా.. రూ.లక్ష బిల్లు అయింది. రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుని నాలుగు నెలలైంది. ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు.

తల్లికి చికిత్స చేయించి..

నిజామాబాద్ జిల్లాలోని డీఆర్‌డీవో ఆఫీసులో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింగ్.. తన తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. రూ.లక్షకుపైగా బిల్లు అయితే సొంతంగా చెల్లించారు. రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుని, మూడు నెలలైనా ఇంకా రాలేదు.

నగదు రహిత వైద్యం అందేలా చూడాలి



హెల్త్‌కార్డులు నిరుపయోగంగా మారాయి. రీయింబర్స్‌మెంట్ ద్వారా పూర్తి మొత్తం అందడం లేదు. ఉపాధ్యాయుల మూల వేతనంలో ఒక శాతం ప్రీమియం చెల్లిస్తామని, ప్రత్యేక ట్రస్టుతో పథకం అమలు చేయాలని గత ప్రభుత్వాన్ని కోరాం. అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా.. విధివిధానాలు ఖరారుకాలేదు. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదురహిత వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- ఎం.పర్వత్‌రెడ్డి
రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీయూటీఎస్

ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయడంలేదు



హెల్త్‌కార్డులు నామ్ కే వాస్తేగా మారాయే తప్ప ఎలాంటి ఉపయోగం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా దీనిపై దృష్టిసారించి అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య సేవలు అందించేలా చూడాలి.

- కొమ్ము కృష్ణకుమార్
ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఆదిలాబాద్ జిల్లా



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు సింధూర, శరణి, ఈడీ పునీత్ తదితరులు

సీఎం సహాయ నిధికి విరాళాల వెల్లువ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయ నిధికి నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సింధూర, శరణి, ఈడీ పునీత్ రూ.2.5 కోట్లు, శ్రీరామ్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వైఎస్ చక్రవర్తి రూ.కోటి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ వై.శోభ రూ.50 లక్షలు, మోల్డ్‌టెక్ ఇండస్ట్రీస్ ఉపాధ్యక్షుడు రాణా ప్రతాప్ రూ.25 లక్షలు, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) సంస్థ అధ్యక్షురాలు కన్నెగంటి రమాదేవి, ఉపాధ్యక్షురాలు అడుసుమిల్లి దుర్గా భవాని, సంయుక్త కార్యదర్శి పల్లవి జోషి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను కలసి చెక్కులను అందజేశారు. అలాగే టెక్నో పెయింట్స్ సంస్థ రూ.20 లక్షల విరాళం అందించింది. కంపెనీ డైరెక్టర్లు ఆకునూరి శ్రీనివాస్‌రెడ్డి, సీవీఎల్‌ఎస్ మూర్తి, అనిల్ కొండోత్ బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలసి చెక్కును అందజేశారు. కుమారి ఆంటీ కూడా ముఖ్యమంత్రిని కలసి రూ.50 వేల చెక్కును అందించారు.



సీఎం రేవంత్‌రెడ్డికి విరాళాల చెక్కును అందజేస్తున్న శ్రీరామ్ చిట్స్ ఎండీ చక్రవర్తి తదితరులు

ఢిల్లీ వెళ్లిన భట్టి



సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి ఆయన హస్తినకు వెళ్లినట్టు సమాచారం. ఈ సందర్భంగా పలువురు కేంద్ర ప్రభుత్వ పెద్దలు, వివిధ శాఖల ఉన్నతాధికారులను ఆయన కలుస్తారని తెలుస్తోంది. దీంతో పాటు కాంగ్రెస్‌పార్టీ హైకమాండ్ నేతలను కూడా భట్టి కలుస్తారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. భట్టి ఈనెల 21 లేదా 22వ తేదీ నుంచి 10 రోజుల పాటు అమెరికాలో అధికారికంగా పర్యటిస్తారని సమాచారం.

కేటీఆర్ X రాజనర్సింహ

గాంధీలో గర్భిణి, శిశు మరణాలపై 'ఎక్స్' వేదికగా మాటల యుద్ధం



కేటీఆర్, మంత్రి దామోదర రాజనర్సింహ చేసిన పోస్టులు

గాంధీ ఆస్పత్రి: గాంధీ ఆస్పత్రిలో గర్భిణి, శిశు మరణాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి దామోదర రాజనర్సింహ మధ్య ఎక్స్ వేదికగా మాటల యుద్ధం రాజుకుంది. '48 మంది పసిబిడ్డలు, 14 మంది బాలింతలు.. ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తోంది. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? వ్యవస్థలు పనిచేస్తున్నాయా?'అని కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నిస్తే.. 'ప్రభుత్వ దవాఖానాలను నాశనం చేసే కుట్రలు మానుకో కేటీఆర్'అంటూ మంత్రి దామోదర రాజనర్సింహ చురకలు అంటించారు.

పసిబిడ్డల ప్రాణాలకు విలువ లేదా: కేటీఆర్

'ఎంతోమందికి ప్రాణం పోసిన గాంధీ ఆస్పత్రిలో ఇంత విషాదం ఎవరి పాపం? పసిబిడ్డల ప్రాణాలకు విలువ లేదా, తల్లుల గర్భశోకానికి జవాబు ఉండదా.. తప్పు చేయకపోతే సర్కార్ ఈ లెక్కలను ఎందుకు దాస్తోంది. ఆ తల్లీబిడ్డల ఉసురు మీకు తగలదా, గాంధీలోనే ఇన్ని మరణాలుంటే రాష్ట్రంలో పరిస్థితిని ఊహించుకుంటే భయంగా ఉందని' బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. 'నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యం ఇస్తూ తల్లీబిడ్డను ఇంటివద్దకు దిగబెట్టి వచ్చేలా కేసీఆర్ వ్యవస్థలను తయారు చేశారు. మరి మన సీఎం ఏం చేస్తున్నారో.. పాలన గాలికి వదిలి, ప్రచార ఆర్భాటాలు, విగ్రహ రాజకీయాలు చేస్తే ఇలాగే ఉంటుందని' విమర్శించారు.

నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ కేటీఆర్ అన్న రాజనర్సింహ

గరీబోళ్లు వైద్యం చేయించుకునే ప్రభుత్వ ఆస్పత్రులను నాశనం చేస్తూ, ప్రభుత్వ వైద్యం, వైద్యులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ కేటీఆర్ అంటూ మంత్రి దామోదర 'ఎక్స్'వేదికగా ఘాటుగా స్పందించారు. గాంధీ ఆస్పత్రిపై బురదజల్లి వైద్యం కోసం వచ్చే నిరుపేదల మనోధైర్యం దెబ్బతీయడం బాధాకరమన్నారు. గాంధీ ఆస్పత్రికి అత్యంత విషమంగా ఉన్న రోగులు చివరి నిమిషంలో వస్తారు..వారిని బతికించేందుకు వైద్యులు ఎంతో కష్టపడతారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కొన్ని మరణాలు సంభవిస్తాయి. కాంగ్రెస్ వచ్చాకే మరణాలు జరిగాయంటూ నంబర్లను భూతద్దంలో చూపెట్టే ప్రయత్నం కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాసే సహజగుణానికి కేటీఆర్ మాటలు అద్దం పడుతున్నాయన్నారు. గాంధీ దవాఖానకు వచ్చేది దొరజనం కాదు, నా జనం.. నేను కూడా గాంధీ ఆస్పత్రిలోనే పుట్టాను. బీఆర్‌ఎస్ నాశనం చేసిన వైద్యవ్యవస్థను గాడిన పెడుతున్నామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు.

క్లుప్తంగా...

రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్

- నాగార్జునను రూ.400 కోట్లు డిమాండ్ చేశారు.. ఇవ్వనందుకే ఎన్ కన్వెన్షన్‌ను కూల్చారు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని, హైడ్రా పేరుతో భయపెట్టి వసూళ్ల దందా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సినీహీరో నాగార్జునను రూ.400 కోట్లు అడిగితే ఇవ్వనందుకే ఎన్ కన్వెన్షన్‌ను కూల్చారని, ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయని విమర్శించారు. అదే కాంగ్రెస్ నాయకుల ఫామ్‌హౌస్‌లు ఎందుకు కూల్చరని నిలదీశారు. తెలంగాణలో సుపరిపాలన లేదని, దరిద్రపు పాలన నడుస్తోందని, ప్రజాపాలన నడుస్తలేదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేల మీద కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలైనా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, జాబ్ కేలండర్ తూతూమంత్రంగా ప్రకటించారని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యంలో అవినీతి కుటుంబపాలన, దందాలు నడుస్తున్నాయని, పార్టీ ఫిరాయింపులపై రాహుల్‌గాంధీది ఒక విధానం అయితే.. రేవంత్‌కి ఇంకో విధానమా అని బాల్క సుమన్ ప్రశ్నించారు.

రాహుల్‌పై వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ నేతల వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు నిర్వహించింది. ఢిల్లీ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత తర్వీందర్ సింగ్, కేంద్రమంత్రి రన్వీత్ సింగ్ బిట్టు తదితరులు.. రాహుల్‌గాంధీ టెర్రరిస్టుగా సంబోధించడంపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉదయం గాంధీభవన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. గాంధీభవన్ ముందు బీజేపీ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం బేగంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పాల్గొన్నారు. నారాయణగూడలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయ ముట్టడికి ప్రయత్నించారు. దీంతో ఆమెను పోలీసులు అడ్డుకున్నారు.

కౌశిక్‌రెడ్డి పిచ్చోడిలా మాట్లాడుతున్నారు: సీతక్క



సాక్షి, మహబూబాబాద్: భార్య, కూతురుతో సహా ఆత్మహత్య చేసుకుని చనిపోతామని ప్రచారం చేసి, ప్రజల సానుభూతితో గెలిచిన హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిచ్చోడిలా మహిళలను దూషిస్తూ కించపరిచేవిధంగా మాట్లాడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమం అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ... రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు ప్రధాని మోదీ బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆడవారు పాలనకు పనికిరారని అనడం శోచనీయమన్నారు. దేశంకోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీకి అప్పుడు తెలంగాణ తల్లి గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మానుకోట ఎంపీ బలరాంనాయక్, మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ పాల్గొన్నారు.

శామీర్‌పేటలో 'కలెక్షన్ సెంటర్' ప్రారంభించిన టీఎస్‌సీఏబీ చైర్మన్ రవీందర్‌రావు



సీసీ సెంటర్ వద్ద కూరగాయలను పరిశీలిస్తున్న రవీందర్‌రావు

శామీర్‌పేట: దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దనే లక్ష్యంతో సీసీ కేంద్రం ఏర్పాటు చేశామని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ రవీందర్‌రావు అన్నారు. శామీర్‌పేటలోని సొసైటీలో ఫార్మ్‌రైజ్ వన్ ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేసిన కూరగాయలు, పండ్ల కలెక్షన్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ ఈ కలెక్షన్ సెంటర్ రాష్ట్రంలోనే మొట్టమొదటిదని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు కష్టపడి పండించిన పంట దళారుల పాలుకాకుండా నేరుగా సీసీ సెంటర్‌కు తరలించొచ్చని తెలిపారు. రైతుల సమయం ఆదా అవుతుందని, దూర ప్రయాణ ఖర్చులు తగ్గుతాయన్నారు. కమీషన్ భారం లేకుండా రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ సెంటర్ ముఖ్య ఉద్దేశమన్నారు. నాబార్డు సీజీఎం సుశీల, ప్రపంచ బేయర్ సంస్థ ప్రతినిధి జెర్మీ విలియమ్స్, ఆసియా ప్రతినిధి రోస్టిన్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు.



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ బయటి ప్రాంతం. (ఇన్‌సెట్)లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపలి భాగం

అదిగదిగో.. సొరంగం

'ఎస్ఎల్‌బీసీ'పై చిగురిస్తున్న ఆశలు.. వైఎస్ హయాంలో అంకురార్పణ

- నవంబర్‌లో రానున్న టన్నెల్ బోరింగ్ బేరింగ్
- డిసెంబర్‌లో తిరిగి ప్రారంభం కానున్న పనులు
- ఇటీవల అమెరికాలో రాబిన్స్ కంపెనీతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి
- రెండేళ్లలో అన్ని పనుల పూర్తికి ప్రభుత్వం కార్యాచరణ
- రేపు టన్నెల్ పనుల పురోగతిని పరిశీలించనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కరువు నేలను సస్యశ్యామలం చేస్తూ... ఫ్లోరైడ్ భూతాన్ని పారదోలేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాలను అందించే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు దాదాపు పదేళ్ల తర్వాత తిరిగి ప్రారంభం కానున్నాయి. శ్రీశైలం నుంచి సొరంగమార్గం ద్వారా (గ్రావిటీ) ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 గ్రామాలకు తాగునీరు అందించేందుకు 2005లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ఆమోదంతో ఈ ప్రాజెక్టు మొదలైంది. 2007లో పనులు ప్రారంభం అయ్యాయి. 30 టీఎంసీల నీటిని తరలించేందుకు రూ.2,813 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు మొదట్లో వేగంగా సాగాయి. నాగర్‌కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లి వద్ద టన్నెల్ ఔట్‌లెట్‌లో టన్నెల్ బోరింగ్ మెషన్ (టీబీఎం) బేరింగ్, ఇతర పరికరాలు పాడైపోవడంతో పనులు ఆగిపోయి 9 నెలలు అవుతోంది. ఇక శ్రీశైలం వద్ద ఇన్‌లెట్‌లో వస్తున్న సీపేజీ కారణంగా పనులు ఆగిపోయి మూడేళ్లకు పైగా అవుతోంది.

మిగిలింది 9.56 కిలోమీటర్లు

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లి వరకు 43.930 కిలోమీటర్ల పొడవున సొరంగాన్ని 10 మీటర్ల వెడల్పుతో చేపట్టారు. శ్రీశైలం వద్ద నీటిని తీసుకునే ఇన్‌లెట్ నుంచి, మన్నేవారిపల్లి ఔట్‌లెట్ నుంచి రెండు వైపులా సొరంగం తవ్వకం పనులు చేపట్టారు. రెండువైపులా కలిపి 34.37 కిలోమీటర్లు టన్నెల్ తవ్వకం పూర్తికాగా, ఇంకా 9.56 కిలోమీటర్లు మిగిలి ఉంది. అందులో ఔట్ నుంచి ఇప్పటివరకు 20.435 కిలోమీటర్ల పొడ వునా సొరంగం పనులు పూర్తి కాగా, మరో 3.545 కిలోమీటర్ల పొడవునా తవ్వకం పూర్తి చేయాల్సి ఉంది. అయితే అక్కడ రాయి గట్టిదనం ఎక్కువ ఉన్నందున తరచూ బేరింగ్, ఇతర పరి కరాలు పాడైపోతున్నాయి. ఇక ఇన్‌లెట్‌లో 13.935 కిలోమీటర్ల పొడవున టన్నెల్ పనులు పూర్తి కాగా, మరో 6.015 కిలోమీటర్ల పొడవున టన్నెల్ తవ్వాల్సి ఉంది. అక్కడ సీపేజీ వస్తుండటంతో డీవాటరింగ్ ప్రక్రియ చేపట్టారు. దానిని పూర్తిగా అరికట్టడంతోపాటు, బేరింగ్‌ను అమెరికా నుంచి దిగుమతి చేసుకొని ఔట్‌లెట్‌లో పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో..

ఎస్ఎల్‌బీసీ సొరంగం, ఇతర పనులను రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కాంట్రాక్టు సంస్థ, అధికారులతో సమీక్షిస్తూదాదాపు రూ.2,200 కోట్లు గ్రీన్ చానల్ ద్వారా ఇచ్చేలా అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు శుక్రవారం ఉదయం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఔట్‌లెట్ పనులను పరిశీలిస్తారు. త్వరలోనే టీబీఎం బేరింగ్ మెషన్ కూడా రానుంది.

మంత్రి కోమటిరెడ్డి ప్రత్యేక చొరవ..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టును వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంజూరు చేయించారు. దీంతో ఆయన ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల అమెరికా వెళ్లి మరీ బేరింగ్, ఇతర పరికరాలను తయారు చేసే రాబిన్స్ కంపెనీని సందర్శించి, అక్కడి ప్రతినిధులతో భేటీ అయ్యారు. వీలైనంత త్వరగా బేరింగ్, ఇతర పరికరాలను పంపించాలని కోరారు. ఏడు మీటర్ల వ్యాసం, 37 మెట్రిక్ టన్నుల బరువు ఉండే బేరింగ్, ఇతర పరికరాలు నవంబర్‌లో రాష్ట్రానికి వస్తాయి. డిసెంబర్ లేదా వచ్చే జనవరిలో పనులను ప్రారంభించే అవకాశముంది.

పెండింగ్ పనులివే..

- టన్నెల్-1 తవ్వకం పూర్తి చేయడంతోపాటు లైనింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ టన్నెల్ నుంచి వచ్చే నీటిని నిల్వ చేసేందుకు నిర్మించిన నక్కలగండి (డిండి బ్యాలెన్సింగ్) రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. గేట్లు బిగించాల్సి ఉంది.
- ముంపునకు గురయ్యే నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని నక్కల గండి తండా, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని కేశ్యతండా, మర్లపాడు తండా ముంపునకు గురయ్యే 629 గిరిజన కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది.
- మరోవైపు డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న 170 హెక్టార్ల భూములకు బదులు నేరెడుగొమ్ము వద్ద భూమిని అటవీశాఖకు ఇచ్చేందుకు ప్రభుత్వం సర్వే పనులను ప్రారంభించింది.
- చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి వద్ద చేపట్టిన టన్నెల్-2 పనులు 7.130 కిలోమీటర్లు పూర్తయ్యాయి. వాటికి సంబంధించిన లైనింగ్ సగం వరకు పూర్తి కాగా, ఇంకా 3.206 కిలోమీటర్లు చేయాల్సి ఉంది. వాటన్నింటిని రెండేళ్లలో పూర్తిచేసే లక్ష్యంతో ఉంది.

గాడ్సే వారసులు దేశాన్ని పాలిస్తున్నారు

- మోదీ ప్రధాని కావడం ప్రజల దురదృష్టం
- బీజేపీ నేతలు తీవ్రవాదుల్లా మాట్లాడుతున్నారు
- భవిష్యత్ ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలా?
- హనుమకొండ ధర్నాలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫైర్



ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మొక్కులు చెల్లించిన మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో పొన్నం

సాక్షిప్రతినిధి, వరంగల్/హుజూరాబాద్/గీసుకొండ: 'భారత ప్రధానిగా మోదీ ఎన్నికవడం దేశ ప్రజల దురదృష్టం. ప్రస్తుతం దేశాన్ని గాడ్సే వారసులు పరిపాలిస్తున్నారు. వారికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేదు..'అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం హనుమకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్‌గౌడ్.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తర్వాత కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు.

చెవులు, కళ్లు మూసుకున్న మోదీ, అమిత్ షా

బీజేపీ నేతలు తీవ్రవాదుల మాదిరిగా దేశ భద్రతకు భంగం కలిగించే విధంగా మాట్లాడుతుంటే వారి నాయకులు మోదీ, అమిత్ షాలు చర్యలు తీసుకోకుండా చెవులు, కళ్లు మూసుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారని మహేశ్‌గౌడ్ విమర్శించారు. దేశ భవిష్యత్ ప్రధానిని పట్టుకుని 'నాయనమ్మకు పట్టిన గతే పడుతుంది'అని అన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాహుల్‌గాంధీ నాయనమ్మ ఎందుకు చనిపోయింది. ఆస్తుల సంపాదనలో భాగంగా చనిపోయిందా? సొంతవారికి సేవ చేసే క్రమంలో చనిపోయిందా? ఎందుకు చనిపోయిందో దేశ ప్రజలకు తెలుసు.. బీజేపీలో తెలియని అజ్ఞానులే అలా మాట్లాడుతున్నారు..'అని ధ్వజమెత్తారు. దేశం కోసం ఒక్క ఇందిరమ్మే కాదు ఆ కుటుంబం మొత్తం సర్వం త్యాగం చేసిందన్నారు.

వారి కుక్క అయినా ఏనాడైనా జైలుకు వెళ్లిందా?

'దేశ స్వాతంత్ర్యం కోసం నేటి ప్రధాని మోదీ, అమిత్ షాలు ఏనాడైనా జైలుకు వెళ్లారా? కనీసం వారి కుక్క అయినా జైలుకు వెళ్లిందా?'అంటూ మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ దేశప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్నారని, ఆయన భవిష్యత్‌లో ప్రధాని కానుండటాన్ని తట్టుకోలేక బీజేపీ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీని మనం కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం ఉందంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి మహేశ్‌గౌడ్ సూచించారు. అంతకుముందు మహేశ్‌గౌడ్.. వరంగల్ భద్రకాళి అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తదితరులతో కలిసి దర్శించుకున్నారు. ధర్నాలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో కూడా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మహేష్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీపై ఈగ వాలినా ఊరుకోమని అన్నారు. ఇలావుండగా వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్ హవేలిలోని నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు సూచనల మేరకు నాగేంద్రస్వామి రక్షా కంకణాన్ని కట్టుకున్న మహేశ్‌గౌడ్.. తాను అనుకున్న పదవి రావడంతో బుధవారం ఆలయంలో మొక్కులు చెల్లించారు.

గాంధీభవన్‌కు ప్రతి వారం... ఇద్దరు మంత్రులు

విధివిధానాలు తయారు చేయాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి ప్రతి వారంలో ఇద్దరు మంత్రులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌ను సందర్శించనున్నారు. ఈనెల 15వ తేదీన టీపీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా చేసిన ప్రతిపాదన మేరకు విధిగా ఇద్దరు మంత్రులు ప్రతివారం గాంధీభవన్‌కు రానున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌తో పాటు విధివిధానాలు తయారు చేయాలని మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం గాంధీభవన్ సిబ్బందిని ఆదేశించారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో రోజుకో మంత్రి గాంధీభవన్‌కు రావడంతో పాటు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పార్టీ కార్యకర్తలను కలిసే విధంగా, సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజలను కలిసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజల ఫిర్యాదులు, అర్జీలను ఆ రోజున గాంధీభవన్‌కు వచ్చే మంత్రి తీసుకుంటారని, ఆ తర్వాత వాటిని శాఖల వారీగా విభజించి ఆయా మంత్రిత్వ కార్యాలయాలకు పంపే విధంగా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. మంత్రులు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని కూడా ఆయన ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, 20 నుంచి మంత్రుల రాక ప్రారంభమవుతుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

ఎంఐఎంకు భయపడేది జాతీయ పార్టీ అవుతుందా?

కేంద్రమంత్రి బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: రజాకార్ల వారసత్వ పార్టీ ఎంఐఎంకు భయపడి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. పిడికెడు మంది ఉన్న ఎంఐఎంకు భయపడేది జాతీయ పార్టీ అవుతుందా? ఉద్యమ పార్టీ అవుతుందా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ విమోచన దినోత్సవాల నేపథ్యంలో కరీంనగర్‌లోని టీఎన్జీవోస్ భవన కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

కేసీఆర్ పాలనలోనే ఎంఎస్ఎంఈ పరుగులు: కేటీఆర్

కాంగ్రెస్ సర్కారు పాలసీయే దీన్ని స్పష్టం చేసింది



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కేసీఆర్ పాలనలోనే పరుగులు పెట్టాయని కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన 'ఎంఎస్ఎంఈ పాలసీ'స్పష్టం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పారిశ్రామిక రంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్‌పై బురద చల్లాలని రేవంత్‌రెడ్డి ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా.. లెక్కలు మాత్రం అబద్ధాలు చెప్పవని స్పష్టం చేశారు. గత పదేళ్లలో ఎంఎస్ఎంఈ వృద్ధిరేటు 11-15% ఉందని ప్రభుత్వమే ఒప్పుకుందని.. తెలంగాణలో ఏటా ఎంఎస్ఎంఈల సంఖ్య 15%, వాటి ద్వారా ఉపాధి 20% పెరిగిందని కేటీఆర్ చెప్పారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలు 30% ఉద్యోగాలు పొందారని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ఐపాస్ వంటి ప్రగతిశీల విధానాలు, చిన్న పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహకాలతోనే ఈ అద్భుత ప్రగతి సాధ్యమైందన్నారు. కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేశారనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకోక తప్పదన్నారు.


దేశానికే ఆదర్శంగా నిలిపాం: హరీశ్‌రావు

ఎంఎస్ఎంఈ రంగం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి చెందిందని.. బీఆర్ఎస్ సాధించిన విజయాలను తమ ఘనతగా రేవంత్ ప్రభుత్వం చెప్పుకోవడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పలురాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడినా తెలంగాణలో అనుసరించిన ఐపాస్ లాంటి విధానాలు దృఢంగా నిలిపాయన్నారు. పెట్టుబడుల్లో 115 శాతం పెరుగుదలతో తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలవడంతోపాటు ఉద్యోగాల కల్పనలో ఎంఎస్ఎంఈ రంగం 20 శాతం వృద్ధి రేటు సాధించిందని చెప్పారు.

మోదీ హామీలు నెరవేరుస్తుంటే..

కాంగ్రెస్ మోసం చేస్తోంది: బీజేపీ నేత లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశలో మోదీ సర్కార్ పనిచేస్తుంటే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మాత్రం ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం వందరోజుల పాలనలో అనేక సానుకూల నిర్ణయాలతో ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చే చర్యలు చేపట్టిందన్నారు. కానీ అందుకు పూర్తిభిన్నంగా తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయకుండా ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో లక్ష్మణ్.. మోదీ 3.0 పాలనలో భాగంగా.. 100 రోజుల్లో చేసిన అభివృద్ధిని, తీసుకున్న నిర్ణయాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రోగ్రెస్ రిపోర్టును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందరోజుల పాలనలో పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వేలు, భద్రత, ఇంధనం, సాంకేతికత వంటి అనేక రంగాలలో మోదీ సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు.



మాదాపూర్ శిల్పకళా వేదికలో ఎంఎస్ఎంఈ పాలసీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గాంధీ, జయేశ్ రంజన్, నిర్మలా జగ్గారెడ్డి.

ఆరు పరిష్కారాలతో.. ఎంఎస్ఎంఈ పాలసీ

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ను ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం 'ఎంఎస్ఎంఈ పాలసీ 2024'ను విడుదల చేసింది. ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ఆరు కీలక సవాళ్లు.. భూలభ్యత, రుణ సదుపాయం, ముడి సరుకుల కొరత, నైపుణ్యం కలిగిన కార్మికులు లేకపోవడం, వ్యాపార విస్తరణ సవాళ్లు, సాంకేతికత, ఇతర సవాళ్లకు పరిష్కారం చూపేలా పలు అంశాలను పొందుపర్చారు. ఎంఎస్ఎంఈలకు వివిధ దశల్లో అందించాల్సిన 40 విధానపరమైన అంశాలను ఈ పాలసీలో చేర్చారు. ఆరు సవాళ్లకు పరిష్కారంపై ఫోకస్ పెట్టారు. అవి..

1. అందుబాటులో భూమి..

- ఔటర్ రింగు రోడ్డు, రీజనల్ రింగు రోడ్డు మధ్య ఏర్పాటయ్యే పది కొత్త పారిశ్రామిక పార్కుల్లో ఐదింటిని ఎంఎస్ఎంఈలకు కేటాయిస్తారు. అందులో ఒకటి మహిళలకు, మరొకటి వినూత్న స్టార్టప్‌లకు ప్రత్యేకిస్తారు. కొత్త పార్కులలో ఐదు శాతం ప్లాట్లు మహిళలకు, 15 శాతం ప్లాట్లు ఎస్సీ, ఎస్టీలకు ఇస్తారు. ఎస్సీ, ఎస్టీలకు భూమిపై రాయితీ 50 శాతం (గరిష్ఠంగా రూ. 50 లక్షల వరకు) ఇస్తారు. ప్రైవేటు భాగస్వామ్యంతో 119 నియోజకవర్గాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాలు ఏర్పాటు చేస్తారు.

2. మూలధన పెట్టుబడి రాయితీ..

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.కోటి లేదా 50 శాతం, ఇతరులకు రూ. 30 లక్షలు లేదా 25 శాతం రాయితీ ఇస్తారు. మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.20లక్షలు లేదా 20 శాతం వరకు అదనపు రాయితీ ఇస్తారు.

3. ముడి పదార్థాల లభ్యత..

10 జిల్లాల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో గిడ్డంగుల అందుబాటులో ఉంచుతారు. దిగుమతి సుంకం రీయింబర్స్‌మెంట్ చేస్తారు.

4. కార్మికులకు నైపుణ్య శిక్షణ..

స్కిల్ యూనివర్సిటీలో ఎంఎస్ఎంఈ కేంద్రీకృత కోర్సులు అమల్లోకి తెస్తారు. పారిశ్రామికవాడల్లో వర్కర్ హాస్టళ్లు ఏర్పాటు చేస్తారు. కార్మిక చట్టం నిబంధనల సరళీకరణ చేపడతారు.

5. సాంకేతిక వినియోగం..

ఎంఎస్ఎంఈలకు సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం కోసం సమగ్ర సర్వే చేపడతారు. రూ.100 కోట్లతో 'యంత్రం'పేరిట ఫండ్ ఏర్పాటు చేస్తారు. డిజిటల్ టెక్నాలజీకి ప్రోత్సాహమిస్తారు. మేధో సంపత్తి హక్కుల రిజిస్ట్రేషన్ ఖర్చు వంద శాతం తిరిగి చెల్లిస్తారు.

6. మార్కెట్ విస్తరణ..

ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల కొనుగోలు కోసం భారీ పరిశ్రమలను ప్రోత్సహించడం, ఎంఎన్సీలకు అనుబంధంగా ఉండే ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు, పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ అమలు వంటి చర్యలు చేపడతారు. వీటి అమలు కోసం పరిశ్రమల శాఖ కమిషనరేట్‌లో ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తారు.

తెలంగాణ వడ్డించిన విస్తరి

▶ మొదటి పేజీ తరువాయి

బలోపేతం అవుతుంది..'' అని సీఎం రేవంత్ చెప్పారు. వ్యవసాయ రంగంపై ఎక్కువ మంది ఆధారపడటంతో రైతులకు ప్రభుత్వపరంగా ఎన్ని విధాలుగా సాయం అందించినా వారి పరిస్థితి మెరుగుపడటం లేదని పేర్కొన్నారు. వ్యవసాయ కుటుంబాలు ఉద్యోగ, ఉపాధి కల్పన, వ్యాపార రంగాల్లోనూ ఎదగాలన్నారు. గతంలో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎకరం అమ్మితే తెలంగాణలో పది ఎకరాలు కొనే పరిస్థితి ఉండేదని.. తెలంగాణ యువత ఐటీ రంగంలో అడుగుపెట్టి సిలికాన్ వ్యాలీని శాసించే స్థాయికి ఎదగడంతో ఇప్పుడు పరిస్థితి తారుమారైందని, ఇక్కడ ఎకరా అమ్మితే ఆంధ్రాలో వంద ఎకరాలు కొనొచ్చని వ్యాఖ్యానించారు.

స్కిల్ యూనివర్సిటీకి విరాళాలు సేకరిస్తాం

నైపుణ్య శిక్షణ కోసం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్వహణకోసం యూనివర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో రూ.300 కోట్ల నుంచి రూ. 500 కోట్ల కార్పస్ ఫండ్ సేకరిస్తామని సీఎం రేవంత్ చెప్పారు. భూములు కోల్పోయే వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామన్నారు. అమెరికాలో హడ్సన్, లండన్‌లోని థేమ్స్ తరహాలో మూసీ నదిని అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రంలో 65 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్లను సున్నా వడ్డీపై రుణాలుగా ఇస్తామని ప్రకటించారు. శిల్పారామంలో మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం మూడు ఎకరాలు కేటాయిస్తున్నామని చెప్పారు.

సామాజిక న్యాయానికి పునాది: భట్టి విక్రమార్క

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతోనే రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగం వేళ్లూనుకుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఈలు మూతపడుతున్నా తెలంగాణలో ఆ రేటు తక్కువగా ఉందని పేర్కొన్నారు. చిన్న పరిశ్రమల టేకోవర్ల సమస్య కూడా తక్కువగా ఉంటోందని తెలిపారు. తాము ఎంఎస్ఎంఈ పాలసీ ద్వారా సామాజిక న్యాయానికి పునాదులు వేశామని... గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.2వేల కోట్ల సబ్సిడీని ఎంఎస్ఎంఈలకు విడతల వారీగా చెల్లిస్తామని ప్రకటించారు.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలసీ: మంత్రి శ్రీధర్‌బాబు

అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఎంఎస్ఎంఈలను తీర్చిదిద్దే లక్ష్యంతో కొత్త విధానం తెస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఎంఎస్ఎంఈలను గ్రోత్ సెంటర్లుగా మారుస్తామన్నారు. అన్ని జిల్లాల్లో ఎంఎస్ఎంఈలు, పారిశ్రామిక పార్కులు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పార్కులు ఏర్పాటు చేసి... మహిళలకు 5శాతం, ఎస్సీ, ఎస్టీ ఎంట్రప్రెన్యూర్లకు 15శా రిజర్వ్ చేస్తామని ప్రకటించారు. 119అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళలను ప్రోత్సహిస్తూ 'ఫ్లాట్ ఫ్యాక్టరీలు', ఎస్ఎంఎస్ఈ క్లస్టర్లలో పది చోట్ల కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఎస్ఎంఈలకు సులభంగా ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.100 కోట్లతో యంత్రాల ఆధునీకరణకు నిధి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంఎస్ఎంఈల ఉత్పత్తుల కొనుగోలు కోసం 'ప్రొక్యూర్‌మెంట్ పాలసీ', బహుళ జాతి కంపెనీలతో భాగస్వామ్యాలు, పాలసీ అమలు కోసం టాస్క్‌ఫోర్స్, లీజు పాలసీ వంటివాటిని కొత్త విధానంలో పొందుపర్చామని వెల్లడించారు.



మీ యౌవనోత్సాహాలను అలాగే ఉంచుకోండి –
మీరు పెద్దయ్యాక వాటిని మరింత మెరుగ్గా ఉపయోగించుకోగలుగుతారు.
– సెనెకా

సాక్షి
గురువారం, 19 సెప్టెంబర్ 2024

సరైన దిశలో తొలి అడుగు

కోర్టు నోరు విప్పిందంటే న్యాయం నిలబడుతుందని సామాన్యులకు ఆశ. దేశంలో చట్టాలను తుంగలో తొక్కుతున్న బుల్‌డోజర్ సంస్కృతిపై మంగళవారం దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కాసింతైనా సంతోషం కలిగిస్తున్నది అందుకే. అనేక రాష్ట్రాలలో క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును ఎదుర్కొంటున్న నిందితులు, వారి కుటుంబ సభ్యుల ప్రైవేట్ గృహాలు, ఆస్తులపై బుల్‌డోజర్లను నడిపిస్తూ... 'దాన్ని ఘనకార్యంగా పేర్కొంటూ, సమర్థించుకుంటున్న' వైఖరి పాలకుల సాక్షిగా పెచ్చుమీరుతోంది. ఈ పరిస్థితుల్లో తదుపరి విచారణ జరిగే అక్టోబర్ 1 దాకా దేశవ్యాప్తంగా ఈ అడ్డగోలు కూల్చివేతలన్నిటికీ సుప్రీమ్ కోర్ట్ అడ్డుకట్ట వేయడం విశేషం. అదే సమయంలో నీటి వసతులు, రైల్వే లైన్లకు అడ్డుగానూ, ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాల్లోనూ సాగిన దురాక్రమణలనూ, అనధికారిక నిర్మాణాలనూ కూల్చేందుకు అభ్యంతరం లేదని సుప్రీమ్ పేర్కొంది. అలాగే, కూల్చివేతలపై దేశవ్యాప్తంగా అమలయ్యేలా నిర్ణీత మార్గదర్శకాల్ని రూపొందించాలన్న కోర్ట్ ప్రతిపాదన హర్షణీయం. ఇన్నాళ్ళ తరువాత ఇప్పటికైనా ఇది సరైన దిశలో సరైన అడుగు.

యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ఉత్తరప్రదేశ్‌లో 2017లో ఈ బుల్‌డోజర్ న్యాయానికి బీజం పడింది. ఆ తరువాత ఇది అనేక బీజేపీ పాలిత రాష్ట్రాలకు పాకింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఇప్పటికి 4.5 లక్షల దాకా గృహాలు ఇలా నేలమట్టమయ్యాయని అంచనా. ఇకపై చట్టవిరుద్ధంగా ఒక్క కూల్చివేత జరిగినా అది పూర్తిగా రాజ్యాంగ విధానానికే విరుద్ధమని కోర్ట్ పేర్కొనడం గమనార్హం. నిజానికి, గతంలోనూ కోర్టులు ఇలాంటి వ్యాఖ్యలు చేసినా, వాటి ఆదేశాలను ధిక్కరిస్తూ అనేకచోట్ల కూల్చివేతలు యథేచ్ఛగా సాగాయి. అసలు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నిందితుల మీదకు బుల్‌డోజర్‌ను నడిపిస్తున్న తీరుపై చాలా కాలంగా చర్చ జరుగుతోంది. తప్పు చేసినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సింది పోయి, నోటీసులైనా ఇవ్వకుండా, నిర్ణీత ప్రక్రియ ఏదీ పాటించకుండా వారికి శిక్షగా బుల్‌డోజర్‌ను ఉపయోగించడమేమిటనే ధర్మబద్ధమైన ప్రశ్నలు వినిపిస్తూ వచ్చాయి. పైపెచ్చు, ముస్లిమ్‌ల ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని కూల్చివేతలు సాగించడమనేది బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పాలనా విధానంగా తయారవడం ఆందోళన రేపింది.

ఈ పరిస్థితుల్లో జస్టిస్ బి.ఆర్. గవాయ్, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీమ్ కోర్ట్ డివిజన్ బెంచ్ ఈ పద్ధతిని తప్పుబట్టింది. ఒక కేసులో నిందితులైనంత మాత్రానో, లేదంటే దోషి అయినంత మాత్రానో వారి ఇంటిని కూల్చేయవచ్చా? అందుకు చట్టం అనుమతిస్తుందా? లేదు కదా! ఆ మాటే సుప్రీమ్ అంటోంది. పైగా ఇంట్లో ఎవరో ఒకరు నేరం చేస్తే, కూల్చివేతలతో ఆ కుటుంబం మొత్తానికీ శిక్ష విధించడం ఏ రకంగా సబబు? ప్రభుత్వ పాలన నిర్వహించే కార్యనిర్వాహక వ్యవస్థే జడ్జిగా మారి, శిక్షించవచ్చా? ఆక్రమణలనూ, అనధికారిక నిర్మాణాలనూ తొలగించేందుకు వివిధ రాష్ట్రాల్లోని స్థానిక చట్టాలు అనుమతిస్తున్నాయి. కానీ, వాటిని ప్రతిపక్షాల పీక నొక్కేందుకూ, నిర్ణీత వర్గాలపై ప్రతీకారేచ్ఛకూ సాధనంగా మార్చుకోవడంతోనే అసలు సమస్య. గొంతు విప్పిన భారతీయ ముస్లిమ్‌లపై ఉద్దేశపూర్వకంగా సాగుతున్న దాడిలో భాగమే ఈ కూల్చివేతలని చివరకు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సైతం పేర్కొనే పరిస్థితి వచ్చిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ఈ బుల్‌డోజర్ న్యాయం దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో సాగుతున్నా, అన్ని చోట్లా ఒక అంశం మాత్రం సర్వసాధారణం. అది ఏమిటంటే – గతంలో కోర్టులిచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా, నిర్ణీత ప్రక్రియ అంటూ లేకుండానే ఈ కూల్చివేతలు కొనసాగడం! దురాక్రమణలకు వ్యతిరేకంగా ఉద్యమం అంటూ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ లాంటి చోట్ల ఇటీవలి కూల్చివేతల్లోనూ చట్ట ఉల్లంఘన నిర్భీతిగా సాగింది. గుజరాత్, అస్సామ్, త్రిపురల్లో సైతం కూల్చివేతల పర్వానికి కట్టడి లేకుండా పోయింది. అసాంఘిక శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోందనే భావన కల్పిస్తూ, రాజకీయ లబ్ధి పొందడం అధికార పార్టీల వ్యూహం. దానిలోని మతపరమైన కోణాన్ని కప్పిపుచ్చడం వాటికి వెన్నతో పెట్టిన విద్య. ఈ బుల్‌డోజర్ సంస్కృతిపై భారత అత్యున్నత న్యాయస్థానం జోక్యానికి ఇంతకాలం పట్టడం విచారకరమే. అయితే, ఇప్పుడిక పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా 'విశాఖ' మార్గదర్శకాలు చేసినట్టుగానే దీనిపైనా అఖిల భారత స్థాయిలో కోర్టు మార్గదర్శకాలు ఇవ్వనుండడం ఒకింత ఊరట.

అనధికారిక నిర్మాణాల గుర్తింపు, నోటీసులివ్వడం, వాదనలు వినడం, అనంతరం చట్టబద్ధంగా కూల్చివేతలు జరపడం... ఈ ప్రక్రియ అంతటికీ దేశవ్యాప్తంగా ఒకే విధమైన నియమావళి ఉండడం కచ్చితంగా మంచిదే. ఇటీవలి కూల్చివేతల డేటాను నిశితంగా సమీక్షిస్తే అనేక లోపాలు కనిపిస్తాయి. అందుకే, ఈ అంశంపై సంబంధిత వర్గాల నుంచి సూచనలు కోరుతున్న కోర్ట్ రేపు మార్గదర్శకాల రూపకల్పనలోనూ జాగ్రత్తగా వ్యవహరించడం కీలకం. మత ఘర్షణలు, ఆ వెంటనే సాగే కూల్చివేతల మధ్య సంబంధాన్ని కప్పిపుచ్చేందుకు పాలకులు ఎత్తులు వేయడం తరచూ చూస్తున్నాం. ఆ పన్నాగాలు పారనివ్వకుండా మార్గదర్శకాల తయారీ అవసరం. అలాగే, ఎప్పుడో నోటీసులు ఇచ్చామని మభ్యపెట్టేందుకు వెనకటి తేదీలతో కాగితాలు చూపించి, పాలనా యంత్రాంగం ఇష్టారీతిన సాగించే కూల్చివేతలకు చెక్ పెట్టాలి. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జరిగే ఏ చర్యలనూ అనుమతించని రీతిలో నియమావళిని కట్టుదిట్టంగా రూపొందించాలి. ఆదేశాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి, కోర్టు ధిక్కారం కింద కఠిన చర్యలు చేపట్టాలి. ప్రజలెనుకున్న పాలకులు తామే జడ్జీలుగా, తామే శిక్షలు అమలు చేసేవారిగా ప్రవర్తిస్తే అది పౌరుల ప్రాథమికహక్కులకే భంగకరం.

కులగణన ఆరంభమయ్యేది ఎప్పుడు?

విశ్లేషణ



ఆర్. కృష్ణయ్య

గత శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్' ప్రకటించాక, రాష్ట్రంలో బీసీలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులయ్యారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేపడతారనీ, స్థానిక సంస్థలలో 42 శాతం ప్రజాప్రాతినిధ్యం లభిస్తుందనీ, బీసీల సమగ్రాభివృద్ధికి అవకాశం ఉంటుందనీ నమ్మారు. మెజారిటీ బీసీలు ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీ గెలుపులో ప్రధాన భూమిక పోషించారు. కానీ, రేవంత్ ప్రభుత్వం తన జీ.ఓ.ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోంది. జీ.ఓ. 199లో బీసీ కమిషన్ బీసీ జన గణనను చేపట్టి, స్థానిక సంస్థలలో వారి రిజర్వేషన్లను నిర్ణయించడం జరుగుతుందని స్పష్టంగా పేర్కొంది. కాని జీ.ఓ. 26లో మొత్తం కులగణన చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో దేన్ని నమ్మాలి?

దేశంలో, రాష్ట్రంలో మెజారిటీ జనాభా వెనుకబడిన తరగతుల వారిదే. రాష్ట్రంలో ఈ వర్గాల జనాభా 56 శాతం. బీసీ జాబితాలోని ఏ, బీ, సీ, డీ, ఈ గ్రూపులలో 130 కులాలు ఉన్నాయి. బీసీలు భిన్నమైన సంప్రదాయాలు, ఆచారాలు, కళారూపాలు, కులదైవాలు కలిగి ఉండి తమవైన ప్రత్యేకతలు సంతరించుకుని ఉన్నారు. ఇప్పటికీ అనేక సామాజిక కులాలు, జాతులు ఆధునిక అభివృద్ధికి నోచుకోలేక పోయాయి. వీరిని వర్తమాన ప్రగతిలో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు సంకల్పశుద్ధితో, నిర్దిష్టమైన ప్రణాళికలతో ప్రభుత్వం కృషిచేయాలి. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీలలోని సంచార, అర్ధసంచార, విముక్త జాతులు, కులాలు ఏ అభివృద్ధికీ నోచుకోకుండా ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టితో వీరిని ప్రగతి పథంలోకి తీసుకు రావడానికి చేసిన కృషి శూన్యమే. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కూడా గడిచిన పదేళ్లలో కొంతమేరకు గురుకుల పాఠశాలల ద్వారా చదువుకోవడానికి ఈ వర్గాలకు అవకాశం లభించింది. అయితే గత ప్రభుత్వం ఆశించిన మేరకు అండదండలు ఇవ్వలేదనే కారణంగా, ఈసారి బీసీలు కాంగ్రెస్‌కు అండగా నిలబడ్డారు. అయితే రేవంత్ ప్రభుత్వం కూడా గత పాలకులకన్నా మరింత నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించడం పట్ల బీసీలు ఆందోళన చెందుతున్నారు.

గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్' ప్రకటించాక, రాష్ట్రంలో బీసీలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులయ్యారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేపడతారనీ, స్థానిక సంస్థలలో 42 శాతం ప్రజాప్రాతినిధ్యం లభిస్తుందనీ, బీసీల సమగ్రాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలులోకి వస్తాయనీ సంపూర్ణంగా నమ్మారు. మెజారిటీ బీసీలు ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీ గెలుపులో ప్రధాన భూమిక పోషించారు. అనుకున్నట్లుగానే కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం జరిగిపోయాయి. తమకు ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా నెరవేరతాయని బీసీలు కొంతకాలం వేచి చూసే ధోరణిని ప్రదర్శించారు. కాగా ప్రభుత్వం ఎంతకీ ఉదాసీన వైఖరిని వీడక పోవడంతో ఉద్యమబాట పట్టక తప్పలేదు. ఎట్టకేలకు రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక కుల సర్వే (కులగణన)కు ప్రభుత్వం ముందుకు వచ్చింది. తదనుగుణంగా మార్చి 15న జీఓఎంఎస్ నం. 26ను విడుదల చేసింది. కాగా గడిచిన 6 నెలలుగా ఇందుకు సంబంధించి ప్రభుత్వం తన వైపు నుండి ఎలాంటి కార్యాచరణ మొదలు పెట్టలేదు. తిరిగి బీసీ సంఘాలు తీవ్రంగా ఉద్యమాలు మొదలుపెట్టాయి. ఆమరణ నిరాహార దీక్షల స్థాయికి ఉద్యమాల తీవ్రత పెరిగింది. అయినప్పటికీ ప్రభుత్వంలో ఉలుకూ, పలుకు లేకపోవడం పట్ల బీసీ సంఘాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. క్రమంగా ఈ ప్రభుత్వం బీసీ వ్యతిరేక ప్రభుత్వం అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ వ్యతిరేకి అనే విమర్శలను ఎదుర్కోవలసి వస్తోంది.



ఈ నేపథ్యంలోనే మిక్కిలి అనుభవంతో, క్రియాశీలంగా పని చేస్తున్న డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు నేతృత్వంలోని బీసీ కమిషన్ గడువు ఆగస్టు 31తో ముగిసింది. సర్వత్రా ఈ కమిషన్ గడువును పెంపుదల చేస్తారని భావించారు. అలాగే కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్‌లను నిర్ణయించడం లాంటి కీలక అంశాలను త్వరితగతిన చేయడానికి సహకరిస్తుందని అనుకున్నారు. కాగా అందుకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురితో బీసీ కమిషన్‌కు కొత్త పాలకమండలిని నియమించింది ప్రభుత్వం. దీంతో మళ్లీ కథ మొదటి కొచ్చినట్టయ్యింది. 6 నెలలు పొడిగిస్తే సులభంగా అయ్యే పనిని, కొత్త పాలకమండలిని వేసి మళ్లీ కొత్తగా పని మొదలు పెట్టడం అనేది కేవలం సమయాన్ని వృథా చేయడమే. బీసీ రిజర్వేషన్‌లకు విఘాతం కలిగించడానికే కుట్ర జరుగుతున్నదని బీసీలు చేస్తున్న ఆరోపణలు నిజమని భావించడం తప్పేమీ కాదు.

బలహీన వర్గాలు చాలా కాలంగా తాము చేస్తున్న డిమాండ్ కులగణన నిర్వహించాలన్నది. ఆ దిశగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినందుకే, ఆ పార్టీకి అండగా నిలబడ్డారు. అయితే కేవలం జీ.ఓ. ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదు. ఆ కార్యక్రమాన్ని అంకితభావంతో, చిత్తశుద్ధితో పూర్తిచేయడానికి ప్రభుత్వం ముందుకు రావాలి. కానీ అలా రావడంలేదు. దీన్ని బట్టి రేవంత్ ప్రభుత్వం ఈ వెనుకబడిన కులాల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో లేదనే రీతిలో వ్యవహరిస్తోందన్న సామాజిక వేత్తల అభిప్రాయాలు నిజమే అని నమ్మాల్సి వస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగం అంతా ఒక నెలరోజుల పాటు పూర్తి సమయాన్ని కేటాయిస్తే, కులగణనను సమర్థమంతంగా పూర్తిచేయవచ్చు. కానీ అలాంటి చర్యల దిశగా ప్రభుత్వం కృషి చేయడం లేదు. ఇటీవల బీసీ కమిషన్‌కు కొత్త పాలకమండలిని నియమిస్తూ జారీచేసిన జీ.ఓ. 199లో... ఈ కమిషన్ బీసీ జన గణనను చేపట్టి, స్థానిక సంస్థలలో వారి రిజర్వేషన్లను నిర్ణయించడం జరుగుతుందని స్పష్టంగా పేర్కొంది. ఇది మరొక వివాదానికి దారి తీస్తోంది. జీ.ఓ. 26లో మొత్తం కులగణన చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో దేన్ని నమ్మాలి? ఈ కారణంగా ప్రభుత్వానికి ఒక స్పష్టత లేదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటివి, ప్రత్యేకంగా న్యాయ నిపుణుల సలహాలతో ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. కాగా ప్రభుత్వం ఆదరాబదరాగా ఇచ్చిన జీ.ఓ. మరింత గందరగోళానికి దారి తీస్తున్నదని న్యాయ నిపుణులు అంటున్నారు.

బీసీ గణన, కులగణన అనేవి పూర్తిగా వేరు వేరు ప్రక్రియలు అనే స్పష్టత ప్రభుత్వానికి లేనట్లు అర్థమవుతోంది. బీసీల గణన అంటే... కేవలం బీసీ కులాలకు సంబంధించినటువంటి వివరాలను, గణాంకాలను సేకరించడం. కులగణన అనగా మొత్తం రాష్ట్రంలో ఉన్న అన్ని కులాల, వర్గాల సమాచారాన్ని సేకరించడం. కులగణన చేయడం వలన రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల వివరాలు అందుబాటులోకి వస్తాయి. ఈ సమాచారాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేసి విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. కేవలం బీసీ గణన చేయడం ద్వారా బీసీలలో ఉన్న తారతమ్యాల వివరాలు మాత్రమే అందుబాటులోకి వస్తాయి. దాని వలన పెద్దగా ఉపయోగం లేదు. అందువలన కులగణన లేదా కుల సర్వే పూర్తి స్థాయిలో చేపట్టాల్సిన అనివార్యతను ప్రభుత్వం గమనించి ఆ దిశగా ప్రణాళికలతో ముందుకు వెళ్లాలి. బీసీ గణన, కులగణన అంటూ ప్రభుత్వం ప్రజలను గందరగోళానికి గురిచేయడం మంచిది కాదు. ఇప్పటికైనా స్పష్టమైన వైఖరితో ప్రభుత్వం యావత్ కులగణనకు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

న్యాయపరంగా పరిశీలించినప్పుడు కులగణన లేదా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సామాజిక, ఆర్థిక కుల సర్వే... స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ వాటాను నిర్ణయించడానికి అత్యంత ఆవశ్యకమైనది. దీనికి సంబంధించి రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ క్రింద ప్రత్యేకంగా నిపుణులతో కూడిన 'డెడికేటెడ్ కమిషన్'లను నియమించాలి. సమగ్రంగా అధ్యయనం చేయించాలి. ఆ కమిషన్‌లు ఇచ్చే సిఫారసులు, నివేదికల ఆధారంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. ఇందుకు సంబంధించి డా॥ కె. కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావు గవాలి లాంటి కీలక కేసులలో గౌరవ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాలు స్పష్టంగా మార్గదర్శకాలను సూచించాయి. ఇందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం, ఉత్తర్వులను జారీచేయడం, సముచితం కాదని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

వ్యాసకర్త రాజ్యసభ సభ్యుడు,
జాతీయ బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎలాంటి దారుణం!



నుర్ (లెబనాన్)లోని మా కుటుంబ సభ్యులు, స్నేహితులు దిగ్భ్రాంతి కలిగించే సన్నివేశాలను నాతో పంచుకున్నారు. జనాలు వీధుల వెంట పరుగెత్తడం, ఆడవాళ్లు తమ నెత్తులు బాదుకోవడం, జనాల్లో గందరగోళం, మూర్ఛలు పోవడం, అంబులెన్సులు పరుగులుపెట్టడం, రెస్క్యూ కార్మికుల ఏడుపులు...(హెజ్బొల్లా సభ్యుల వందలాది పేజర్లు పేలిపోయిన ఘటన గురించి)

– జిస్సన్ ఫకీహ్, ఆమ్నెస్టీ క్యాంపెయినర్

ఎలాంటి నిఘా!



యూదులు, ఇజ్రాయెలీలు, ఇంకా యోగ్యులైన ప్రతి ఒక్కరినీ 'మొసాద్' (ఇజ్రాయెల్ నిఘా సంస్థ)కు పని చేసేలా ఇజ్రాయెల్ ఉత్తేజపరిచింది. ఇతర ఏ దేశపు గూఢచర్య సంస్థ అయినా ఇజ్రాయెల్ ముందు నవ్వులాటగా మారిపోగలదు. నమ్మశక్యం కాని చర్య ఇది!

– బెన్ బడేజో, వ్యాఖ్యాత

ఆందోళనకరం



టెక్ ఫీల్డ్‌లో పనిచేస్తున్న వాళ్లు ఎవరైనా ఈ పేజర్ స్టోరీ పట్ల ఆందోళన చెందకపోతే, ఇది చెంది తీర వలసిన విషయం అని గుర్తించండి. దీని పరిణామాలు చాలా విధాలుగా ఉంటాయి.

– పాల్ బెర్నాల్, ఐటీ ప్రొఫెసర్

నిలబడిన ఆప్



భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక రాజకీయ పార్టీ మీద మోదీ ప్రభుత్వం అతిపెద్ద ప్రతీకార చర్యకు పాల్పడినప్పటికీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఇంకా సజీవంగా ఉంది, చురుగ్గా ఉంది, మున్ముందు గట్టి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉంది. ఇది అద్భుతం కంటే తక్కువేమీ కాదు.

– ప్రదీప్ మ్యాగజైన్, రచయిత

ఇంత అవమానమా?



అఫ్గానిస్తాన్‌కు చెందిన అల్పులు కూడా అన్ని దౌత్య మర్యాదలను విస్మరించి, ఉద్దేశపూర్వకంగా (పాకిస్తాన్) జాతీయ గీతాన్ని అవమానించేంత వరకూ పరిస్థితి వచ్చింది (అఫ్గాన్ అధికారులు తమ స్థానాల్లోంచి లేవలేదు). ఖైబర్ – పఖ్తూన్వా ముఖ్యమంత్రి, ఆయన సహచరుల సమక్షంలోనే వాళ్లు అలా చేసినప్పటికీ ఏమీ జరగనట్టుగా వాళ్లు నటించడం సిగ్గుచేటు.

– సయ్యద్ తలత్ హుస్సేన్, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

ఎత్తుగడ ఫలించేనా?

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా రాజీనామా చేసి, సహచర మంత్రి ఆతిశీని ఆ పీఠంపై తాత్కాలికంగా కూర్చోబెట్టడం ఉన్నంతలో తెలివైన ఎత్తుగడ. మద్యం పాలసీ వ్యవహారంలో ఈడీ, సీబీఐ కేసుల నేపథ్యంలో ఆయన ఆరు మాసాలు జైల్లో ఉన్నారు. సుప్రీం కోర్టు బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసు నమోదు అయినప్పుడు గానీ, జైలులో ఉన్నప్పుడు గానీ ముఖ్యమంత్రి పీఠం వదులుకొని, ప్రజాభిమానం పొందేవరకు ఇటు చూడనని అనలేదు. బెయిల్ వచ్చాక మాత్రమే ఆ అగ్నిపరీక్షకు సిద్ధం అయ్యారు.

ఇప్పుడు ఆయన ముందున్న ఆప్షన్స్‌లో ఇదే మెరుగు. ఎందుకంటే ముఖ్యమంత్రిగా కొనసాగినా సుప్రీం ఆదేశాలు ఆయన అధికారాలకు కత్తెర వేశాయి. ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లరాదనీ, ఫైళ్లు కదపరాదనీ సవాలక్ష ఆంక్షలు. ఒకవైపు లెఫ్టినెంట్ గవర్నర్, రెండో వైపు ఆంక్షల పరిధుల్లో ఆయన చేయగలిగేది తక్కువ. వచ్చే ఎన్నికల్లో చెప్పుకోగలిగేది తక్కువ. పోనీ అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్దామంటే అది ఆయన చేతుల్లో లేదు. రద్దు మాత్రం చెయ్యగలడు గానీ ఎన్నికలకు అనుకున్న టైమ్‌లో వెళ్లగలగడం లెఫ్టినెంట్ గవర్నర్ ఇష్టం మీద ఉంటుంది. ఆపై ఎన్నికల కమిషన్ ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి రాజీనామా చేసి తన భవిష్యత్ ప్రజల చేతిలో పెట్టారు ఆప్ అధినేత.

దీంతో ఆయన్ని అన్యాయంగా బలిపశువు చేశారన్న ఉద్వేగం, ఆయన పదవీ త్యాగం చేశారన్న సానుభూతీ ఎన్నికల వరకూ కొనసాగే వీలుంటుంది. ఈలోగా ఢిల్లీ ప్రభుత్వ వైఫల్యాలు ఆయన ఖాతాలో పడవు. అదో లాభం. పాచిక పారుతుందో లేదో అప్పుడే చెప్పలేం. మళ్ళీ ఎన్నికల వేళకి ఆప్‌కు మెజారిటీ వచ్చి, అంతవరకూ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తికి పార్టీ విధేయత తప్ప, సొంత ఎజెండాలు తయారవక పోతే కేజ్రీవాల్ వ్యూహం నెరవేరినట్టే. లేకపోతే ఒక మంచి ఎత్తుగడతో విఫలయత్నం చేసినట్టే!

– డా॥ డి.వి.జి. శంకరరావు; మాజీ ఎంపీ,
విజయనగరం I 94408 36931

ఇది రాజకీయ ఎత్తుగడల వైఫల్యం

విశ్లేషణ



బర్ఖా దత్

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గుండ్రంగా వేసిన ఖాళీ తెల్లని కుర్చీల ముందు కూర్చుని, వైద్యులతో భేటీ కోసం 'వేచి వేచి వేచి' చూసిన చిత్రం చాలా ఆసక్తిని పుట్టించింది. ప్రత్యేకించి దాని తర్వాత ముఖ్యమంత్రి చేతులు జోడించి, నిరసన తెలుపుతున్న వైద్యులతో చర్చించే విషయమై ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించడంలో జరిగిన వైఫల్యానికి క్షమాపణలు చెప్పడం... నాటకీయంగా ఉద్వేగభరితంగా తాను 'రాజీనామాకు సిద్ధంగా ఉన్నాను' అనే ఎత్తుగడను వేయడం మరీ విశేషం.

వాస్తవానికి, ఆ క్షణమాత్రపు దృశ్యంలో ప్రదర్శితమైన ప్రహసనం ప్రతి ఒక్కరికీ అర్థమవుతుంది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి చేసిన ఈ వ్యాఖ్యలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. విశేషం ఏమంటే, ఇదే ప్రత్యక్ష ప్రసారం విషయంలోనే ఆ చర్చలు ప్రారంభం కావడానికి ముందే విఫలమయ్యాయి.

ప్రభుత్వ వైద్య కళాశాలలో యువ వైద్యురాలిపై జరిగిన హత్యాచారంపైనా... దాని వెంబడే చోటు చేసుకున్న తప్పుడు చర్యలు, వాటిని కప్పిపుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నాలపైనా గత నెల రోజులకు పైగా ఆందోళన చేస్తున్న వైద్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రితో తమ సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాల్సిందేనని ముందస్తు షరతు పెట్టారు. సుప్రీంకోర్టు ఈ కేసును ప్రత్యక్ష ప్రసారం చేయగలిగినప్పుడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం దానిపై విభేదించడానికి ఎటువంటి కారణం లేదని వాదిస్తూ, వారు ఈ డిమాండ్‌పై ఇప్పటికీ మొండిగా ఉన్నారు. అదే సమయంలో చర్చలను రికార్డ్ చేసి, సుప్రీంకోర్టు అనుమతితో తర్వాత విడుదల చేయాలనే ప్రతిపాదనను వైద్యులు అంగీకరించలేదు.

మమతా బెనర్జీ ఈ పనిని నిరసనల ప్రారంభంలోనే ఎందుకు చేయలేదని ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. ముడిచిన చేతులు, మధురమైన స్వరం, ప్రతిష్టంభనను ఛేదించలేకపోయినందుకు క్షమాపణ చెప్పడం, వైద్యుల కోసం రెండు గంటలకు పైగా వేచి ఉండటాన్ని నొక్కి చెప్పడం... బహుశా నేరం జరిగిన కొన్ని గంటలు లేక రోజులలో ఇదే విధానం పాటించి ఉంటే, ఇంత సంక్షోభం ఏర్పడేది కాదు. ఉద్యమాలలో పుట్టి, రూపుదిద్దుకున్న ఈ రాజకీయ నాయకురాలు ఇలా సహజ ప్రవృత్తి రాహిత్యాన్ని ప్రదర్శించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కోల్‌కతా పోలీసు చీఫ్ తన పదవికి రాజీనామా చేస్తానని ప్రతిపాదించినప్పటికీ రాబోయే పండుగ సీజన్ కారణంగా తాను దానిని తిరస్కరించినట్లు ఆమె వెల్లడించడం మరింత అయోమయం కలిగించింది. ఆమె ప్రకటనపై స్పందిస్తూ ఒక యువ వైద్యుడు ఇలా అన్నాడు: 'ప్రస్తుతం పండుగల గురించి ఎవరు ఆలోచిస్తున్నారు?' (ప్రభుత్వం అనంతరం కోల్‌కతా నగర కమిషనర్‌ను మార్చింది.)

ముఖ్యమంత్రి మమతా బెనర్జీని విమర్శించడంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అందరికంటే ముందు ఉండవచ్చు; కానీ, మణిపుర్ విషయానికి వస్తే, అక్కడ బీజేపీ ఏ సహజ ప్రవృత్తినీ ప్రదర్శించకపోవడం గురించి ఇలాంటి ప్రశ్నలనే ఆ పార్టీ నాయకత్వంపై సంధించవలసి ఉంటుంది.



మళ్ళీ, స్పష్టంగా చెప్పాలంటే, 2023 మే నుండి హింసాత్మక జాతి ఘర్షణల్లో 200 మందికి పైగా మరణించిన మణిపుర్ రాష్ట్రానికీ, పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జి కర్ హాస్పిటల్ కేసుకూ మధ్య నేను వాచ్యార్థంగా కూడా ఎలాంటి పోలికలను చూపడం లేదు. చిన్న, పెద్ద సంక్షోభ సమయాల్లో రాజకీయ నాయకులు ఎలా స్పందిస్తారనే దానికే ఈ సారూప్యత పరిమితం. ఇంగితజ్ఞానం చాలా అవసరమైనప్పుడే అది వారికి లేకుండా పోయినట్లు కనిపిస్తుంది.

మణిపుర్‌లో ఎన్.బీరేన్ సింగ్‌ను ముఖ్యమంత్రి స్థానం నుండి తొలగించడానికి బీజేపీ మొండిగా నిరాకరించడం ఏ రకంగానూ వివరించలేనిది. రాష్ట్రంలో పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందంటే, చాలామంది దీనిని అంతర్యుద్ధంతో పోల్చారు. అక్కడ మైతేయి, కుకీ సమాజాల మనుషులు ఒకరు ఆధిపత్యం వహించే భౌగోళిక ప్రాంతాలలోకి మరొకరు ప్రవేశించలేరు. జాతి సమూహాలను స్పష్టంగా వేరు చేసే 'బఫర్ జోన్'ను ప్రమాదవశాత్తూ దాటిన కారణంగా సైన్యానికి చెందిన ఒక మాజీ సైనికుడు వారం క్రితం హత్యకు గురయ్యాడు. ఈ నెల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు చనిపోయిన 11 మందిలో మహిళలు కూడా ఉన్నారు. రెండు వర్గాల ప్రజలు, రైతులు, విద్యార్థుల చేతుల్లో వేల సంఖ్యలో ఆయుధాలు ఉన్నాయి.

ప్రతి ఒక్కరికి దేశభక్తి పరీక్షలను నిర్వహించే కీ-బోర్డ్ జాతీయవాదులు, స్వల్పంగా అసమ్మతి వ్యక్తం చేసే ప్రజలను జాతి వ్యతిరేకులుగా ముద్ర వేయడానికి వెనుకాడరు. అలాంటిది ఒక మాజీ సైనికుడు అయిన హవల్దార్ లిమ్‌ఖోలాల్ మాతే భార్య 'నా భర్త భారతదేశం కోసం పోరాడాడు, కానీ తనను ఒక జంతువులా చంపేశారు' అని ఏడుస్తూ చెప్పినప్పుడు, జాతీయవాదానికి స్వీయ నియమిత మధ్యవర్తులందరూ ఎక్కడ ఉన్నారు?

మణిపుర్‌లో రాజకీయ పార్టీలు పతనమయ్యాయి. ఈ గొడవలో ముఖ్యమంత్రి పాత్రపై విచారణ జరిపించాలని కోరిన పది మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురు బీజేపీకి చెందిన వారే. హింస బయటినుంచి ఉన్నప్పుడు, ఉదాహరణకు తిరుగుబాట్లు లేదా యుద్ధ సమయంలో రాజకీయ నాయకత్వం కొనసాగింపును నేను అర్థం చేసుకోగలను. కానీ ఇది తనపై తాను యుద్ధంలో ఉన్న రాష్ట్రం. ఇది శాంతి భద్రతల వైఫల్యం. కానీ ఇది అన్నింటికంటే, రాజకీయాల వైఫల్యం. ముఖ్యమంత్రిని తొలగించడం అనేది స్పష్టంగా సరైన పని కావడమే కాకుండా, ఘర్షణ పడుతున్న పార్టీలను చర్చల బల్ల వద్దకు తీసుకురావడానికి కూడా అవకాశం కల్పిస్తుంది.

పశ్చిమ బెంగాల్ నుండి మణిపుర్ వరకు, తప్పక చేయవలసిన చర్యే చాలాసార్లు సరైనది అవుతుంది. కానీ అలా చేయకపోగా దాన్ని ప్రతిఘటించడమే ఇక బాగు చేయలేని పరిస్థితికి నెట్టినట్టు అవుతోంది.

వ్యాసకర్త ప్రముఖ జర్నలిస్టు, రచయిత
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

త్యాగచింతన

హిందూ ధార్మిక జీవన విధానంలో భోగమయ జీవనం లేదు. త్యాగమయ జీవనమే ప్రధానం. భారతీయ జీవన ఆదర్శాలు త్యాగం, సమర్పణ అంటారు స్వామి వివేకానందులు. మన జీవన తత్త్వంలోనే త్యాగం, సమర్పణ సహజంగా కనిపిస్తుంటాయి.

'న కర్మణా న ప్రజయా ధనేన
త్యాగేనైకే అమృతత్వ మానశుః

అనేది కైవల్యోపనిషత్తు వాక్యం. అమృతత్వం కర్మల వల్లా, బాధ్యతల వల్లా, సంతానం వల్లా, సంపదల వల్లా వచ్చేది కాదు. అది త్యాగం వల్ల మాత్రమే లభిస్తుంది అనేది ఈ వాక్య అర్థం. జీవితం అమృతమయం కావడమంటే, త్యాగమయం కావడం తప్ప మరేది కాదు. మన జీవన పరంపర యజ్ఞ భావనతో ముడిపడి ఉంది. యజ్ఞం అంటే సమర్పణ. ఇతరులకు అర్పించడం. యజ్ఞం అదే నేర్పిస్తుంది. సమిధలన్నింటినీ అగ్ని దేవునికి ఆహుతి ఇస్తూ 'ఇదం న మమ. ఇదం స్వాహా' 'ఇది నాది కాదు, ఇది నీకు అర్పిస్తున్నాను' అంటుంటారు.

జ్యోతిర్మయం

'తేన త్యక్తేన భుంజీథాః' అనేది మన ఉపనిషత్తులలో చెప్పిన మరొక విషయం. ఈ సృష్టి సమస్తం ఈశ్వరత్వం వ్యాపించి ఉన్నది. నాదంటూ ఏమీ లేదు. నాకు అవసరమైనంత మేరకు మాత్రమే నేను అనుభవిస్తాను. అది కూడా త్యాగమయ భావనతోనే. అంతకన్నా ఎక్కువగా స్వీకరించడం తగదు. ఈ త్యాగం, సమర్పణ అనేవి అత్యుత్తమ సంస్కారాలు. హైందవ జీవనంలో అతి సహజంగా ఇవి అలవడేలా వ్యవస్థ రూపుదిద్దుకుంది. 'నా ఇల్లు' నుండి ప్రారంభించి నా బస్తీ, నా గ్రామం, నా దేశం, ఈ ప్రపంచం' అంతా ఒక్కటనే భావన వికసించాలనేది మన ఆకాంక్ష. అందుకే 'ఈ భూమి అంతా ఒక్కటే కుటుంబం (వసుధైక కుటుంబం)' అని ధ్యేయవాక్యంగా ఉపయోగిస్తాం.

ధర్మరక్షణార్థం తన వెన్నెముకను ధారపోశాడు దధీచి. ఒక పక్షి కోసం తన శరీరం మొత్తం అర్పించాడు శిబి చక్రవర్తి. ప్రాణుల బాధలు తొలగించడానికి సర్వస్వార్పణ చేశాడు మహారాజు రంతిదేవుడు. తనదంతా సమర్పించడానికి సర్వదక్షిణ యాగం చేశాడు రఘుమహారాజు. మనమూ ఆ పరంపరలో పయనించాలి.

– సాకి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.6.29 వరకు, తదుపరి విదియ తె.4.03 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.11.21 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.10.30 నుండి 11.57 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.43 వరకు, తదుపరి ప.2.45 నుండి 3.33 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.54 నుండి 8.22 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.51, **సూర్యాస్తమయం:** 5.59.

క్లాస్ రూమ్‌కు సెల్ తీసుకెళ్లొద్దు

ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆదేశాలు | సెల్‌ఫోన్ వాడితే చర్యలు తప్పవని హెచ్చరిక | కలెక్టర్ల ఆకస్మిక తనిఖీల నేపథ్యంలో నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్: తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడొద్దని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అలా చేస్తే శిక్ష తప్పదని హెచ్చరించింది. ఫోన్ వాడే టీచర్లను ఓ కంట కనిపెట్టాలని అధికారులకు సూచించింది. క్లాస్ రూ మ్‌లోకి అసలు ఫోన్ లేకుండానే వెళ్లాలని స్పష్టం చేసింది. అత్యవసరమైతేనే ఫోన్ తీసుకెళ్లాలని, దానికీ ప్రధానోపాధ్యాయుడి అనుమతి తప్పనిసరి అని పేర్కొంది. వాస్తవానికి ఈ నిబంధన పాతదేనని ఉన్నతాధికారులు అంటుండగా, ఇకపై దీన్ని కఠినంగా అమలు చేయనున్నట్లు డీఈవోలు చెబుతున్నారు. కొన్ని నెలల పాటు సెల్‌ఫోన్ వినియోగంపై నిఘా పెట్టాలని ఎంఈవోలకు ఆదేశాలిచ్చారు. దీనిపై ఉపాధ్యాయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా యి. ఇది టీచర్లకు ఇబ్బందికరంగా మారుతుందని, హెచ్ఎంలు వేధించేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు.

వాట్సాప్ చూస్తూ..ఫోన్ మాట్లాడుతూ..!

ఇటీవల కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. అనేక మంది టీచర్లు సెల్‌ఫోన్‌లో వాట్సాప్, ఇతర సోషల్ మీడియా ఫాలో అవుతూ గడుపుతున్నారని గుర్తించారు. కొంతమంది ఎక్కువ సమయం ఫోన్‌లో మాట్లాడుతున్నారనే ఫిర్యాదులొచ్చాయి. దాదాపు 12 జిల్లాల నుంచి ఈ తరహా ఉదంతాలను జిల్లా అధికారులు గుర్తించారు. వీటిని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి పంపారు. సెల్‌ఫోన్‌పై క్లాస్‌రూంలో నిషేధం విధించాలని సూచించారు. పైగా టీచర్లు బోధనకు ముందుగా సన్నద్ధమవ్వడం లేదని, క్లాస్ రూంలో సెల్‌ఫోన్ ద్వారా సెర్చ్ చేసి పాఠాలు చెబుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. విద్యార్థులు క్లిష్టమైన ప్రశ్నలు వేసినప్పుడు సెల్‌ఫోన్‌లో సెర్చ్‌చేసి సమాధానమిస్తున్నారని ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకుని సెల్‌ఫోన్‌పై నిషేధం విధించినట్టు ఉన్నతాధికారులు తెలిపారు.



ఫోన్ లేకుండా స్కూల్ నడుస్తుందా?



టీచర్లు వ్యక్తిగత ప్రయోజనాలకు సెల్ వాడుతున్నారని చెప్పడం అర్థం లేని మాట. అసలు సెల్ ఫోన్ లేకుండా స్కూళ్ళు నడిచే అవకాశం ఉందా? విద్యార్థుల ముఖ హాజరు తీసుకోవాలంటే ఫోన్ కావాలి. ఉన్నతాధికారులకు పంపే అన్ని రిపోర్టులను సెల్ లేదా ట్యాబ్ ద్వారానే పంపాల్సి ఉంటుంది. అత్యాధునిక టెక్నాలజీ వాడమని ప్రభుత్వాలే చెబుతున్నాయి. సెల్‌ఫోన్‌తో పనులు చేయాలని చెప్పే అధికారులు ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలి.

– చావా రవి
(టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

స్వీయ నియంత్రణ మంచిది



తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడకంపై నిషేధం కన్నా.. టీచర్లు స్వీయ నియంత్రణ పాటించేలా చర్యలు తీసుకోవాలి. బోధనకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన అవసరం ఉంది. నిషేధాన్ని అడ్డం పెట్టుకుని కొంతమంది హెచ్ఎంలు అనవసరంగా టీచర్లను వేధించకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా స్కూల్లో ఫోన్ వినియోగానికి టీచర్లు దూరంగా ఉండాలి.

– సయ్యద్ షౌకత్ అలీ (టీఎస్పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు)

తాను పెట్టిన కరెంట్ తీగలు.. తనకే మృత్యుపాశాలై..

- జంతువుల నుంచి రక్షణ కోసం పంట చుట్టూ వైర్లు పెట్టిన రైతు
- అవే వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మృతి



వెంకటయ్య మృతదేహం

చిన్నకోడూరు (సిద్దిపేట): అడవి జంతువుల నుంచి పంటను రక్షించడానికి తాను పెట్టిన కరెంట్ వైర్లే ఆ రైతు పాలిట మృత్యుపాశాలయ్యాయి. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. గోవులాపూర్ గ్రామానికి చెందిన నీరుగొండ వెంకటయ్య (42) వ్యవసాయంతోపాటు తాపీ మేస్త్రీగా పని చేస్తాడు. రోజూ ఉదయం 6 గంటలకు పొలం పనులు చూసుకుని అనంతరం సిద్దిపేట పట్టణానికి మేస్త్రీ పనికి వెళ్తాడు. రోజు మాదిరిగా బుధవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. మొక్కజొన్న పంట వేసిన వెంకటయ్య అడవి జంతువుల నుంచి రక్షణ కోసం పంట చుట్టూ కరెంట్ వైర్లు వేశాడు. అతడు పంట చుట్టూ తిరుగుతున్న క్రమంలో గట్టుపైనుంచి నడుస్తూ జారిపడి వైర్లను తాకాడు. దీంతో విద్యుత్ సరఫరా అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నమైనా తండ్రి ఇంటికి రాకపోవడంతో కుమారుడు పొలం వద్దకు వెళ్లగా తండ్రి మృతిచెంది కనిపించాడు. ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ముగ్గురు గురుకుల విద్యార్థుల అదృశ్యం

- తమను ఎవరూ వెతకవద్దని లేఖ

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండ భీమనపల్లి మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు పదవ తరగతి విద్యార్థులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుమ్మడవెల్లికి చెందిన అబ్దుల్ రహమాన్, హుజూర్‌నగర్‌కు చెందిన ముజీబ్, జాన్ పహాడ్‌కు చెందిన తౌఫిక్ ఈనెల 17న పాఠశాలలో అల్పాహారం తిన్న అనంతరం సమాచారం ఇవ్వకుండా గోడ దూకి వెళ్లిపోయారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. పాఠశాలలోని సీసీ కెమెరాలను పరిశీలించగా గోడదూకి వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు, గురుకుల రీజనల్ కోఆర్డినేటర్ విష్ణుమూర్తికి సమాచారం అందించారు. అధికారుల సూచనల మేరకు దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఈ నెల 16న పాఠశాల ప్రహరీ గోడవైపు నుంచి ఓ ప్యాకెట్ తీసుకుంటుండగా పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు గమనించి అడిగారు. అందులో కల్లు ప్యాకెట్లు ఉండటంతో విద్యార్థులను మందలించారు. అయితే సదరు విద్యార్థులు తమకెలాంటి సంబంధం లేదని తెలిపారు.



దేవరకొండలోని మైనార్టీ గురుకుల పాఠశాల

అందులో ఓ విద్యార్థి తమకు ఆ ప్యాకెట్లకు ఎలాంటి సంబంధం లేదని, తాము ఏ తప్పూ చేయలేదని లేఖ రాసిపెట్టాడు. తమను ఎవరూ వెతకవద్దని లేఖలో పేర్కొని ఉంది. ఈ నెల 17న వారు అదృశ్యమయ్యారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ పాఠశాలకు చేరుకొని ఆరాతీశారు. విద్యార్థుల ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే, రెండు రోజులు గడుస్తున్నా పిల్లల ఆచూకీ తెలియక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

భద్రాచలం ఆలయ ప్రధానార్చకుడిపై సస్పెన్షన్ వేటు

మరో ముఖ్య అర్చకుడిపై కూడా..

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులతో పాటు ఆయన దత్తపుత్రుడు, ముఖ్య అర్చకుడు అయిన పీటీపీ సీతారాంపై దేవాదాయ శాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. సీతారామానుజాచార్యులు తనను లైంగికంగా వేధిస్తున్నాడని, సీతారాం సైతం వేధింపులకు పాల్పడుతున్నాడని ప్రధానార్చకుడి కోడలు (సీతారాం భార్య) ఆమె పుట్టిలయిన తాడేపల్లిగూడెంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదై సుమారు నెల కావస్తున్నా ఆలయ అధికారులకు సమాచారం ఇవ్వలేదు. కాగా, గత రెండు రోజుల నుంచి మీడియాలో ఈ వార్తలు ప్రచురితం కావడంతో ఈఓ రమాదేవి మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ కలెక్టర్, దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదికను అందజేశారు. దీనిపై స్పందించిన దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు బుధవారం వీరిని సస్పెండ్ చేసినట్లు ఈఓ తెలిపారు.

భద్రాద్రి ఈవో ఆరోపణలు అవాస్తవం

భద్రాచలం: భద్రాచలం దేవస్థానం పేరు వా డుకుని విరాళా లు సేకరిస్తున్నామంటూ రామాలయ ఈవో రమాదేవి చేసిన ఆరోపణలు అవాస్తవమని భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ ఆలయ ప్రధానార్చకుడు పద్మనాభాచార్యులు స్పష్టం చేశారు. భద్రాచలంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరిట ధర్మ ప్రచారం చేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా అనేకమంది భద్రాద్రి పేరుతో దుకాణాలు, ఆలయాలు, సంస్థలు నెలకొల్పారని గుర్తు చేశారు. తాము కూడా ఆలయ నిర్మాణానికి పూనుకున్నామని వెల్లడించారు. ఆలయ నిర్మాణ సంకల్పం మొదలు భద్రాచలం ఆలయ అధికారుల అనుమతితో విగ్రహాలకు పూజలు చేసి.. అమెరికాలోని అట్లాంటా ఆలయంలో ప్రతిష్ఠించామని వెల్లడించారు. తొమ్మిదేళ్లుగా లేనిది.. ఇప్పుడు విరాళాలు సేకరిస్తున్నారని ఆరోపించటం సరికాదన్నారు. న్యాయబద్ధంగానే ఆలయ నిర్మాణం కోసం పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఉడుముతో ఇన్‌స్టా రీల్స్.. కేసు నమోదు.. అరెస్ట్





కడెం: లైకుల కోసం ఉడుమును పట్టుకుని రీల్స్ చేసిన యువకుడిపై కేసు నమోదైంది. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం అకొండపేట్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మాడుగుల రాధాకృష్ణ గత నెలలో ఉడుమును పట్టుకుని 'భయ్యా ఇప్పుడే నా వేట.. దొరకపట్టిన ఇప్పుడు పొలంలోకి వచ్చింది. కేజీన్నర ఉంటాది భయ్యా కష్టపడి పట్టుకున్నా.. ఇయ్యాల దావతే' అంటూ ఇన్‌స్టాగ్రాంలో రీల్ పోస్ట్ చేశాడు. కరీంనగర్‌కు చెందిన జంతు ప్రేమికుడు ఎదులపురం గౌతం ఈ రీల్‌ను చూసి ఇటీవల నిర్మల్ డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేశాడు. డీఎఫ్‌వో ఆదేశాల మేరకు బుధవారం నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో గీతారాణి తెలిపారు.

నిన్న పేజర్లు నేడు వాకీటాకీలు

లెబనాన్‌లో మళ్లీ అనూహ్య పేలుళ్లు

14 మంది దుర్మరణం ● 450 మందికి గాయాలు ● ఇజ్రాయెల్ కొత్త యుద్ధ తంత్రం

బీరుట్: వాకీటాకీలు, సౌర విద్యుత్ వ్యవస్థల పేలుళ్లతో లెబనాన్ దద్దరిల్లింది. గాజా స్ట్రిప్‌పై భీకర భూతల, గగనతల దాడులతో తెగబడిన ఇజ్రాయెల్ తాజా తన లక్ష్యాన్ని లెబనాన్ వైపు తిప్పిందని బుధవారం నాటి అనూహ్య పేలుళ్ల స్పష్టమైంది. హెజ్‌బొల్లా సాయుధులు విరివిగా వాడే పేజర్‌లు పేలి 24 గంటలు గడవకముందే లెబనాన్‌లో బుధవారం వాకీటాకీలు, సౌరవిద్యుత్ వ్యవస్థలు పేలిపోయాయి. ఈ అనూహ్య పేలుళ్ల ఘటనల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. 450 మంది గాయాలపాలయ్యారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. పేజర్‌ల పేలుళ్లతో 13 మంది చనిపోయి 2,800 మంది రక్తమోడిన తరుణంలో మరో 'సాంకేతిక' పేలుళ్ల పర్వానికి దిగి ఇజ్రాయెల్ కొత్త యుద్ధ తంత్రానికి తెరలేపిందని అంతర్జాతీయంగా విశ్లేషణలు వెల్లువెత్తాయి. గాజా స్ట్రిప్‌లో దాదాపు మొత్తం భూభాగాన్ని జల్లెడపట్టిన ఇజ్రాయెల్ ఇప్పుడు తన లక్ష్యాన్ని లెబనాన్‌కు మార్చుకుందని తాజా ఉదంతం చాటుతోంది.

అంతిమయాత్ర వేళ పేలుళ్లు

పేజర్‌ల పేలుళ్లలో మరణించిన ముగ్గురు హెజ్‌బొల్లా సభ్యులు, ఒక చిన్నారి అంతిమయాత్రలు బీరుట్ శివారులోని దహియేలో కొనసాగుతున్నపుడే వాకీటాకీలు పేలడం గమనార్హం. ''బీరుట్‌లో చాలా చోట్ల వాకీటాకీలు పేలాయి. ఎలక్ట్రానిక్ పరికరాలు పేలిన ఘటనల్లో 9 మంది చనిపోయారు'' అని లెబనాన్ ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటించింది. బీరుట్ నగరంతోపాటు లెబనాన్‌లో చాలా చోట్ల పేలుళ్లు జరిగాయని హెచ్‌బొల్లా ప్రతినిధులు చెప్పారు. వాయవ్య తీర పట్టణమైన సిడాన్‌లో ఒక కారు, ఒక మొబైల్ ఫోన్ దుకాణం వాకీటాకీల పేలుడుకు ధ్వంసమైన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రక్తమోడుతూ వందలాది మంది ఆస్పత్రులకు పోటెత్తుతున్న దృశ్యాలు స్థానిక మీడియాలో కనిపించాయి. ''ఇలాంటిది నేనెప్పుడూ చూడలేదు. గాయపడిన వారిలో చాలా మందికి చేతివేళ్లు తెగిపోయాయి. కళ్లు దెబ్బతిన్నాయి'' అని బీరుట్‌లోని దీయూ ఆస్పత్రిలో వైద్యురాలు నౌర్ ఎల్ ఓస్తా చెప్పారు. '' వరుస అనూహ్య పేలుళ్లతో ఇజ్రాయెల్, హెజ్‌బొల్లాలు పూర్తిస్థాయి యుద్ధానికి ఆజ్యంపోస్తున్నాయి' అని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ బుధవారం ఆందోళన వ్యక్తంచేశారు.


బాల్బెక్ సిటీలోని ఓ ఇంట్లో పేలిన వాకీటాకీ


లెబనాన్‌లో దుకాణంలో పేలుడు దృశ్యం

దాడికి ఇదే సరైన సమయమా?

వేలాది మంది హెజ్‌బొల్లా సైనికులు గాయాలపాలై ఆస్పత్రులకు పరిమితమయ్యారు. పేజర్‌ల పేలుడుతో హెజ్‌బొల్లాలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కోలుకోనంతగా దెబ్బతింది. వాకీటాకీలు, సోలార్ వ్యవస్థల పేలుళ్లతో పౌరుల్లో ఆందోళనల నడుమ దేశంలో శాంతిభద్రతలపై లెబనాన్ దృష్టిపెట్టాల్సిఉంది. ఈ తరుణంలో దాడి చేస్తే శత్రువును భారీగా దెబ్బ కొట్టవచ్చని ఇజ్రాయెల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తమ గడ్డపై వరుస పేలుళ్లతో ఆగ్రహించిన లెబనాన్, హెజ్‌బొల్లా సాయుధాలు దాడులకు తెగబడొచ్చన్న ఇజ్రాయెల్ భావించింది. దీంతో ముందస్తు జాగ్రత్తగా లెబనాన్ సరిహద్దు ప్రాంతాలకు ఇజ్రాయెల్ అదనపు బలగాలను తరలించింది. అక్టోబర్ 8న గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దమనకాండ మొదలైన నాటి నుంచి ఇజ్రాయెల్‌పైకి హెజ్‌బొల్లా రాకెట్, డ్రోన్ దాడులు చేస్తోంది.

ఉద్రిక్తతలను ఆపండి: ఐరాస

లెబనాన్ వాకీటాకీల పేలుళ్ల ఘటనపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తంచేసింది. '' పరిస్థితి చేయిదాట కుండా ఇరు పక్షాలు సంయమనం పాటించాలి'' అని ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అన్నారు. '' బందీలను విడిచిపెట్టి శాంతి స్థాపనకు కట్టుబడాలి. ఎలక్ట్రానిక్ పరికరాల పేలుళ్లకు పాల్పడటం చూస్తుంటే ఇది భారీ సైనిక చర్యకు కసరత్తులా తోస్తోంది'' అని గుటెరస్ వ్యాఖ్యానించినట్లు ఆయన అధికార ప్రతినిధి స్టీఫెన్ డ్యుజారిక్ చెప్పారు.

యుద్ధంలో కొత్త దశ మొదలైంది: ఇజ్రాయెల్

వాకీటాకీల ఉదంతం తర్వాత రమాట్ డేవిడ్ వైమానిక స్థావరంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యావ్ గాలంట్ మాట్లాడారు. '' యుద్ధంలో కొత్త దశకు తెరలేపుతున్నాం. యుద్ధక్షేత్ర కేంద్ర స్థానం ఉత్తరం నుంచి దిశ మార్చుకుంటోంది. మాకు ఇప్పుడు స్థిరత్వం అవసరం. బలగాలు, వనరులను వేరే లక్ష్యం వైపు వినియోగించే అవకాశముంది. బుధవారం అద్భుత ఫలితాలు సాధించాం'' అని సైనికులనుద్దేశించి ప్రసంగించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అత్యున్నత స్థాయి భద్రతాధికారులతో అత్యవసరంగా సమావేశమయ్యారు. హెజ్‌బొల్లాపై అదనపు దాడులకు సిద్ధమవుతున్నామని చెప్పారు. దీంతో లెబనాన్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సమాయత్తమవుతోందని అర్థమవుతోంది. కాగా, వరుస పేలుళ్లపై స్వతంత్ర్య దర్యాప్తు జరపాలని ఐరాస మానవహక్కుల సంస్థ చీఫ్ వోకర్ టర్క్ డిమాండ్‌చేశారు.


పేలిన పేజర్ ముక్కలు

పేజర్‌లో 3 గ్రాముల పేలుడు పదార్థం!

ఉత్పత్తి స్థాయిలోనే అమర్చారన్న హెజ్‌బొల్లా

సెల్‌ఫోన్లతో నిఘా ముప్పు ఉంటుందని పేజర్లకు మారిన హెజ్‌బొల్లా సభ్యులు	ఈఏడాది తొలినాళ్లలో 5,000 కొత్త పేజర్లకు ఆర్డర్

ఘటనలో 12కు పెరిగిన మరణాల సంఖ్య

లెబనాన్, సిరియాల్లో పేజర్‌ల అనూహ్య పేలుళ్లతో గతంలో ఎన్నడూలేనంతగా తొలిసారిగా పేజర్‌లపై చర్చ మొదలైంది. మంగళవారం నాటి ఘటనలో లెబనాన్, సిరియాల్లో మరణించిన వారి సంఖ్య బుధవారానికి 12కు పెరిగింది. ఇందులో ఇద్దరు చిన్నారులుసైతం ఉన్నారు. దాదాపు 3,000 మంది గాయపడ్డారు. అసలు ఏమిటీ పేజర్లు? అవి ఎలా పనిచేస్తాయి? వాటిల్లోకి పేలుడు పదార్థం ఎలా వచ్చి చేరింది? తదతర అంశాలను ఓసారి చూద్దాం.

ఫోన్‌లో నిఘా భయం.. అందుకే పేజర్

గాజా స్ట్రిప్‌లో హమాస్‌కు బాసటగా నిలుస్తూ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా.. ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తోంది. తమ వ్యూహాలు ఇజ్రాయెల్‌కు చిక్కకుండా ఉండేందుకు హెజ్‌బొల్లా ఒక కొత్త ఎత్తుగడ వేసింది. ఫోన్ల ద్వారా సున్నిత, రహస్య సమాచార మార్పిడి జరిగితే ఇజ్రాయెల్ పసిగట్టే ప్రమాదం ఉందని గ్రహించి ఫోన్లకు స్వస్తి పలికింది. వెంటనే ఫోన్లను పగలగొట్టి పాతిపెట్టాలని హెజ్‌బొల్లా ప్రధాన కార్యదర్శి హసన్ నస్రల్లామ్ తమ సభ్యులకు ఫిబ్రవరి 13న పిలుపునిచ్చారు. ఫోన్లకు బదులు పేజర్ వాడాలని సూచించారు. పేజర్‌లో సమాచారం అత్యంత సురక్షితంగా, భద్రంగా ఉంటుందని వారి నమ్మకం. దీంతో యుద్ధక్షేత్రంలో ఉండే సైనికులు మొదలు సహాయక సేవల్లో ఉండే వైద్యుల వరకు వివిధ విభాగాల సభ్యులు పేజర్ వాడటం మొదలెట్టారు. వీరి కోసం ఈ ఏడాది ప్రారంభంలో కొత్త పేజర్‌లను విదేశాల నుంచి తెప్పించారు. పోలీసు, అగ్నిమాపక శాఖలు సహా పలు అత్యవసర సేవల్లో పనిచేసే సిబ్బంది తక్షణ హెచ్చరికల కోసం పేజర్‌లపై ఆధారపడుతున్నారు.

బ్రాండ్ మాదే.. ఉత్పత్తి మాది కాదు


హుసు చింగ్-కువాంగ్

లెబనాన్‌లో పేలుళ్లకు ఉపయోగించిన పేజర్ ఏఆర్-924 రకానికి చెందినది. ఈ ఏడాది ప్రారంభంలో 5,000 పేజర్లను హెజ్‌బొల్లా ఆర్డర్ చేసింది. తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో సంస్థ నుంచి ఏఆర్-924 పేజర్లను తెప్పించినట్లు లెబనాన్ భద్రతా వర్గాలు తెలిపాయి. ఉత్పత్తి స్థాయిలోనే ఇజ్రాయెల్ గూఢచారసంస్థ మొస్సాద్ రంగంలోకి దిగి ప్రతి పేజర్‌లో 3 గ్రాముల బరువైన పేలుడు పదార్థాన్ని మదర్‌బోర్డులో అమర్చిందని హెజ్‌బొల్లా, లెబనాన్ భద్రతా వర్గాలు ఆరోపిస్తున్నాయి. పేల్చేందుకు శత్రువు పంపిన కోడ్‌ను మదర్ బోర్డ్ అందుకున్నాక పేజర్‌లోని పేలుడు పదార్థం క్రియాశీలమై పేలిందని భద్రతా వర్గాలు అంచనా వేస్తున్నాయి. పేజర్‌లను నెలల తరబడి వాడుతున్నా వాటిలోని పేలుడు పదార్థాన్ని హెజ్‌బొల్లా వర్గాలు గుర్తించకపోవడం తీవ్ర భద్రతావైఫల్యంగా చెబుతున్నారు. ఆ పేజర్లను మొదట్లో స్కాన్ చేసినపుడు ఎలాంటి పేలుడు పదార్థం జాడ కనిపించలేదని వారు చెబుతున్నారు. అయితే ఈ పేజర్లను హంగేరీకి చెందిన 'బీఏసీ కన్సల్టింగ్ కేఎఫ్‌టీ' అనే సంస్థ రూపొందించిందని ఆ బ్రాండ్ యజమాని గోల్డ్ అపోలో వ్యవస్థాపకుడు హుసు చింగ్-కువాంగ్ తెలిపారు. 'ఏఆర్-924 అనే బ్రాండ్ మాత్రమే మాది. ఆ బ్రాండ్ పేరుతో ఉన్న ఉత్పత్తి మాది కాదు. ఆ బ్రాండ్ పేరును వాడుకునేందుకు బీఏసీకి అనుమతి ఇచ్చాం. ఈ మేరకు మూడేళ్లక్రితం ఒప్పందం కుదిరింది'' అని చింగ్‌కువాంగ్ బుధవారం చెప్పారు. అయితే బీఏసీ కన్సల్టింగ్ కేఎఫ్‌టీ అనేది ఒక డొల్లకంపెనీ అని వార్తలొచ్చాయి. హంగేరీలోని బుడాపెస్ట్ నగరంలో సంస్థ ప్రధాన కార్యాలయం ఒక జనావాస అపార్ట్‌మెంట్‌లో ఉంది. అక్కడ ఒక కిటికీకి బీఏసీ కన్సల్టింగ్ అనే స్టిక్కర్ తప్పితే అక్కడ ఏమీ లేదని అసోసియేటెడ్ ప్రెస్ పాత్రికేయులు తేల్చారు.

బుడాపెస్ట్ సిటీలో బీఏసీ కార్యాలయం


గతంలోనూ సాంకేతికతను వాడిన ఇజ్రాయెల్

పేజర్‌కాకుండా గతంలో ఇలాగే వస్తువుల్లో పేలుడు పదార్థాలను అమర్చి శత్రువులను అంతంచేసిన చరిత్ర మొస్సాద్‌కు ఉంది. టెక్నాలజీ సాయంతో పేలుళ్లు జరిపిన సుదీర్ఘ చరిత్ర ఇజ్రాయెల్‌కు ఉంది. 1996లో హమాస్ కీలక బాంబ్‌మేకర్ యాహ్యా అయాస్‌ను హతమార్చేందుకు ఇజ్రాయెల్ పేలుడు పదార్థాన్ని మొబైల్ ఫోన్‌లో అమర్చింది. ఇజ్రాయెల్ నిఘా సంస్థ షిన్‌బెట్ గతంలో యాహ్యా ఫోన్‌లో 15 గ్రాముల ఆర్‌డీఎక్స్ పేలుడు పదార్థాన్ని నింపింది. తండ్రికి అయాష్ ఫోన్ కాల్ చేసినప్పుడు ఫోన్ మాట్లాడేది అయాష్ అని నిర్ధారించుకున్నాక దానిని పేల్చి అయాస్‌ను అంతంచేశారు. రిమోట్ ద్వారా నియంత్రించే కృత్రిమమేధతో పనిచేసే మిషిన్‌గన్‌తో ఇరాన్ అణు శాస్త్రవేత్త, ఉప రక్షణ మంత్రి మొసెన్ ఫక్రిజాదేను 2020లో హతమార్చింది. ఇజ్రాయెల్ 2021లో ఇరాన్ చమురు మంత్రిత్వ శాఖకు చెందిన సర్వర్లను హ్యాక్ చేసి దేశవ్యాప్తంగా చమురు సరఫరాను స్తంభింపజేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్‌లోని రెండు ప్రధాన గ్యాస్ పైప్‌లైన్లను పేల్చి పలు నగరాల సేవలకు అంతరాయం కలిగించింది. జూలైలో టెహ్రాన్‌లోని ఒక అతిథిగృహంలోని గదిలో నెలల క్రితమే శక్తివంతమైన బాంబును అమర్చి హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హనియాను హతమార్చింది.

- నేషనల్ డెస్క్, సాక్షి

అంతరిక్షంలో మన జైత్రయాత్ర

'చంద్రయాన్-4'కు ఆమోదం తెలియజేసిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనల్లో మరో ముందడుగు పడింది. అంతరిక్ష రంగంలో భారత్ జైత్రయాత్రకు మార్గం సుగమమైంది. ఈ దిశగా పలు కీలక కార్యక్రమాలకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. చందమామపైకి భారత వ్యోమగాములను పంపించి, అక్కడ నమూనాలు సేకరించి, క్షేమంగా వెనక్కి తీసుకురావడానికి ఉద్దేశించిన చంద్రయాన్-4 మిషన్‌కు ఆమోద ముద్రవేసింది. వ్యోమగాములను పంపించడానికి అవసరమైన సాంకేతికత పరిజ్ఞానాన్ని, వ్యూహాలను ఈ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2,104.06 కోట్లు ఖర్చు చేయబోతోంది. చంద్రయాన్-4 స్పేస్ క్రాఫ్ట్ అభివృద్ధి, లాంచింగ్ బాధ్యతను ఇస్రోకు అప్పగించబోతున్నారు. ఈ నూతన మిషన్‌కు పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన టెక్నాలజీనే ఉపయోగించనున్నారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో చంద్రయాన్-4ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. అంతరిక్షంలో సొంతంగా 'భారతీయ అంతరిక్ష కేంద్రం' నిర్మించుకోవడంతోపాటు 2040 నాటికి వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగానే చంద్రయాన్-4కు శ్రీకారం చుడుతోంది. ఈ మిషన్‌లో భారతీయ పరిశ్రమలను, విద్యా సంస్థలను భాగస్వాములను చేస్తారు.



ఎన్‌జీఎల్‌వీ సూర్య

పాక్షిక పునర్వినియోగ తదుపరి తరం లాంచ్ వెహికల్(ఎన్‌జీఎల్‌వీ) 'సూర్య' అభివృద్ధికి సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇస్రో లాంచ్ వెహికల్ మార్క్-3 కంటే మూడు రెట్లు అధికంగా పేలోడ్‌ను ఇది మోసుకెళ్లగలదు. మార్క్-3తో పోలిస్తే ఖర్చు మాత్రం కేవలం 50 శాతమే పెరుగుతుంది. ఎన్‌జీఎల్‌వీ 'సూర్య' అభివృద్ధికి ప్రభుత్వం రూ.8,240 కోట్లు కేటాయించింది. గగన్‌యాన్ కార్యక్రమాన్ని మరింత విస్తరింపజేస్తూ భారతీయ అంతరిక్ష స్టేషన్‌లో మొదటి మాడ్యూల్(బీఏఎస్-1) అభివృద్ధికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. గగన్‌యాన్‌లో భాగంగా 2028 డిసెంబర్ నాటికి ఎనిమిది మిషన్లు పూర్తిజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గగన్‌యాన్‌కు రూ.20,193 కోట్లు కేటాయించింది. కార్యక్రమ విస్తరణ కోసం అదనంగా రూ.11,170 కోట్లు కేటాయించింది.

- బయోటెక్నాలజీ రీసెర్చ్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్(బయో-రైడ్) పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. బయో టెక్నాలజీ రంగంలో పరిశోధనలు, అభివృద్ధికి ఈ పథకం తోడ్పాటు అందించనుంది. ఈ పథకం అమలుకు రూ.9,197 కోట్లు కేటాయించారు.
- యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ రంగాల్లో నేషనల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్(ఎన్‌సీఓఈ) ఏర్పాటు ప్రతిపాదనకు కేబినెట్ అంగీకారం తెలిపింది. ఈ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ద్వారా ఇండియాను కంటెంట్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది.
- 2024-25 రబీ సీజన్‌లో ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపై రూ.24,474.53 కోట్ల రాయితీ ఇచ్చేందుకు కేబినెట్ సుముఖత వ్యక్తంచేసింది. ఈ రాయితీ వల్ల సాగు వ్యయం తగ్గుతుందని, రైతులకు భరోసా లభిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రైతన్నలకు కొరత లేకుండా నిరంతరాయంగా ఎరువులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.
- ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్(పీఎం-ఆశా)కు కేబినెట్ నుంచి ఆమోదం లభించింది. రైతులకు తగిన మద్దతు ధర అందించడంతోపాటు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలను నియంత్రించడానికి 2025-26లో రూ.35,000 కోట్లతో ఈ పథకం అమలు చేస్తారు. పీఎం-ఆశాతో రైతులతోపాటు వినియోగదారులకు సైతం లబ్ధి చేకూరుతుందని ప్రధాని మోదీ స్పష్టంచేశారు.
- దేశవ్యాప్తంగా గిరిజన వర్గాల సామాజిక-ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడమే లక్ష్యంగా 'ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్'కు మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ఈ పథకానికి రూ.79,156 కోట్లు కేటాయించారు.

'వీనస్ ఆర్బిటార్ మిషన్'

శుక్ర గ్రహంపై మరిన్ని పరిశోధనలకు గాను 'వీనస్ ఆర్బిటార్ మిషన్' అభివృద్ధికి కేంద్ర కేబినెట్ అంగీకారం తెలిపింది. డిపార్టుమెంట్ ఆఫ్ స్పేస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అమలు చేస్తారు. శుక్ర గ్రహం కక్ష్యలోకి సైంటిఫిక్ స్పేస్ క్రాఫ్ట్ పంపించాలని నిర్ణయించారు. 'వీనస్ ఆర్బిటార్ మిషన్'కు కేంద్ర కేబినెట్ రూ.1,236 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.824 కోట్లతో స్పేస్‌క్రాఫ్ట్‌ను అభివృద్ధి చేస్తారు.


అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్‌బెహారాలో పోలింగ్ స్లిప్‌లు చూపిస్తున్న మహిళా ఓటర్లు

జమ్మూకశ్మీర్ తొలిదశ పోలింగ్ 61 శాతం

శ్రీనగర్//జమ్మూ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి బుధవారం తొలిదశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 61 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసి, రాష్ట్ర హోదాను తొలగించి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాక.. తొలిసారిగా కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో గత ఏడు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే అత్యధిక పోలింగ్ శాతమని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పి.కె.పోల్ వెల్లడించారు. మారుమూల ప్రాంతాల నుంచి నివేదికలు అందాక, పోస్టల్ బ్యాలెట్‌లను కూడా కలుపుకొంటే పోలింగ్ శాతం మరింత పెరగవచ్చని తెలిపారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మొత్తం 90 స్థానాలుండగా.. బుధవారం తొలి విడతలో 24 సీట్లలో పోలింగ్ జరిగింది. 23 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కశ్మీర్ లోయలో 16 సీట్లకు, జమ్మూలో 8 సీట్లకు బుధవారం పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ బూత్‌ల బయట ఓటర్లు క్యూ కట్టారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. 61 శాతం పోలింగ్ నమోదైందని పి.కె. పోల్ ప్రకటించారు. సెప్టెంబరు 25న రెండో దశ, అక్టోబరు 1న మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి. హరియాణాతో కలిసి అక్టోబరు ఎనిమిదో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ఆచరణ సాధ్యమేనా?

జమిలిపై భిన్నాభిప్రాయాలు

జమిలి. ప్రస్తుతం దేశమంతటా ప్రతిధ్వనిస్తున్న పదం. అయితే లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ఏ మేరకు ఆచరణ సాధ్యమన్న దానిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ వంటి నాలుగైదు అసెంబ్లీలకు మాత్రమే లోక్‌సభతో పాటు ఎన్నికలు జరుగుతున్నాయి. చాలా అసెంబ్లీలకు విడిగా, వేర్వేరుగానే ఎన్నికలొస్తున్నాయి. వీటన్నింటినీ ఒక్కతాటిపైకి తెచ్చి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అందుకు పలు అసెంబ్లీలను గడువుకు ముందే రద్దు చేయడం, కొన్నింటిని పొడిగించడమో, లేదంటే గడువు తీరాక సుప్త చేతనావస్థలో ఉంచడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఇది ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టేనన్న అభిప్రాయముంది. లేదంటే లోక్‌సభ కొత్తగా తొలిసారి కొలువుదీరిన తేదీని 'అపాయింటెడ్ డే'గా ప్రకటించి, ఆ తర్వాత ఏర్పాటయ్యే అసెంబ్లీల అన్నింటి గడువూ.. వాటి ఐదేళ్ల కాలపరిమితితో సంబంధం లేకుండా.. లోక్‌సభతో పాటే ముగిసే ప్రతిపాదనను అమలు చేయాలి. ఇలా ఒకసారి చేస్తే సరిపోతుందని, ఇక అప్పటి నుంచి జమిలి ఎన్నికలే ఉంటాయని కోవింద్ కమిటీ పేర్కొంది. ఇందులో ఆచరణపరంగా ఎన్నో ఇబ్బందులున్నాయన్నది నిపుణుల మాట. అంతేగాక అసలు ఈ ప్రతిపాదన రాష్ట్రాల అధికారాల్లో అవాంఛిత జోక్యమే తప్ప మరోటి కాదని పలు పార్టీలు వాదిస్తున్నాయి. పైగా లోక్‌సభతో పాటే అసెంబ్లీలకు ఎన్నికలు జరిగితే జాతీయాంశాలే తెరపైకి వస్తాయని, రాష్ట్రాల్లోని స్థానికాంశాలు పక్కకు పోతాయని ప్రాంతీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కారణంగా డీఎంకే వంటి పలు పార్టీలు జమిలిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆ మేరకు అసెంబ్లీల్లో తీర్మానం కూడా చేశాయి. పైగా హంగ్, అవిశ్వాస తీర్మానం నెగ్గడం వంటి ఏ కారణంతో అయినా గడువుకు ముందే చట్టసభ రద్దయితే ఎన్నికల తర్వాత ఏర్పడే కొత్త సభ ఐదేళ్లు కాకుండా రద్దయిన సభలో మిగిలిన కాలావధి పాటు మాత్రమే కొనసాగాలని కోవింద్ కమిటీ సూచించింది. అలాగైతే జమిలి ప్రక్రియకు భంగం కలగకుండా ఉంటుందని పేర్కొంది. కానీ దీనిపైనా పలు పార్టీలు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నాయి. ప్రజాతీర్పు కోరి అత్యంత వ్యయ ప్రయాసలకు ఓర్చి అధికారంలోకి వచ్చాక ఐదేళ్లు కొనసాగరాదనడం అప్రజాస్వామికమని, రాజ్యాంగ స్ఫూర్తికి కూడా విరుద్ధమని వాదిస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్యాంగ వ్యతిరేకం: ఖర్గే

''ఒకే దేశం.. ఒకే ఎన్నిక మన దేశంలో ఆచరణ సాధ్యం కాదు. ఇలాంటి ఎన్నికలు రాజ్యాంగం, సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకం. దేశంలో ఎన్నికలు వచ్చినప్పుడల్లా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్తకొత్త ఎత్తుగడలు వేయడం బీజేపీకి అలవాటే. ప్రజాస్వామ్య విరుద్ధమైన జమిలి ఎన్నికలను దేశ ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోరు''

అది సంఘ్ పరివార్ రహస్య అజెండా

''ఒకే దేశం-ఒకే ఎన్నిక అనేది దేశ సమాఖ్య నిర్మాణాన్ని బలహీనపరుస్తుంది. ఇది సంఘ్ పరివార్ రహస్య అజెండాలో ఒక భాగమే. దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల వ్యవస్థను మార్చేసి అధ్యక్ష తరహా పాలనా విధానాన్ని తీసుకురావాలన్నదే సంఘ్ పరివార్ అసలు కుట్ర. భారత పార్లమెంటరీ వ్యవస్థను దెబ్బతీయాలన్న ఆలోచనను మానుకోవాలి''.

- పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

ప్రజలంతా వ్యతిరేకించాలి

సమాఖ్య వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ నిర్మాణాన్ని దెబ్బతీసే జమిలి ఎన్నికలను ప్రజలంతా వ్యతిరేకించాలి. ఒకే దేశం-ఒకే ఎన్నిక ద్వారా ప్రాంతీయ పార్టీలను బలహీనపర్చేందుకు బీజేపీ కుతంత్రాలు సాగిస్తోంది. ప్రభుత్వం మధ్యలోనే కూలిపోతే ఏం చేస్తారు?

- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ

18 సవరణలు చేయాలి

- రాజ్యాంగ, చట్ట సవరణలు అవసరం
- కోవింద్ కమిటీ సూచన

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలంటే 18 రాజ్యాంగ, చట్ట సవరణలు అవసరమవుతాయి. కమిటీ ఈ విషయాన్ని తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్లతో సంప్రదించి భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ఓటర్ల జాబితాను రూపొందించాల్సి ఉంటుంది. దానికోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 325ని సవరించాల్సి ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే 'ఆర్టికల్ 324ఏ'కు సవరణ అవసరం. ఈ రెండు అంశాలు రాష్ట్రాల పరిధిలోకి వచ్చేవి కాబట్టి రాజ్యాంగ సవరణలు చేయాలంటే ఆర్టికల్ 368(2) ప్రకారం దేశంలోని సగం రాష్ట్రాలు సమ్మతి తెలపాల్సి ఉంటుందని కోవింద్ కమిటీ తెలిపింది.

జమిలి ఇలా

రెండు దశలుగా అమలు

కోవింద్ కమిటీ లోక్‌సభ ఎన్నికలకు ముందు గత మార్చిలో జమిలి ఎన్నికలపై నివేదిక సమర్పించింది. 'ఒక దేశం, ఒకే ఎన్నిక'ను రెండు దశల్లో అమలు చేయాలని సూచించింది. ఏం చెప్పిందంటే...

- జమిలి ఎన్నికలను అమల్లోకి తెచ్చేందుకు చట్టపరంగా చెల్లుబాటయ్యే వ్యవస్థను కేంద్రం అభివృద్ధి చేయాలి.
- తొలి దశలో లోక్‌సభకు, అన్ని అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరపాలి.
- అనంతరం 100 రోజుల్లోపు రెండో దశలో పంచాయతీలు, మున్సిపాలిటీల వంటి స్థానిక సంస్థలన్నింటికీ ఎన్నికలు జరపేలా వ్యవస్థలను రూపొందించాలి.
- సార్వత్రిక ఎన్నికలు జరిగి, కొత్తగా కొలువుదీరే లోక్‌సభ తొలిసారి సమావేశమయ్యే తేదీని 'అపాయింటెడ్ డే'గా రాష్ట్రపతి నోటిఫై చేయాలి. దాంతో లోక్‌సభకు, అన్ని అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు నాంది పడుతుంది.
- అపాయింటెడ్ డే తర్వాత ఏర్పడే అన్ని అసెంబ్లీల గడువూ లోక్‌సభతో పాటే ముగుస్తుంది. తదనంతరం లోక్‌సభ, అన్నీ అసెంబ్లీల ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి.
- లోక్‌సభలో ఏ పార్టీకీ మెజారిటీ రాకుండా హంగ్ ఏర్పడి, లేదా అవిశ్వాస తీర్మానం వంటివి నెగ్గి సభ రద్దయినా మళ్లీ ఎన్నికలు జరపాలి.
- అలాంటి సందర్భంలో కొత్త సభ గడువు.. రద్దయిన సభలో మిగిలిన కాలావధి వరకు మాత్రమే ఉంటుంది.
- అసెంబ్లీలకు కూడా ఇదే వర్తిస్తుంది. అంటే హంగ్ తదితర కారణాలతో ఎన్నికలు జరిగి మధ్యలో కొత్తగా ఏర్పడే అసెంబ్లీలు ఐదేళ్లు కొనసాగకుండా లోక్‌సభతో పాటే రద్దవుతాయి.
- అన్ని ఎన్నికలకూ ఉమ్మడిగా ఒకే ఎలక్టోరల్ రోల్, ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్) ఉపయోగించాలి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆమోదం ఈజీ కాదు

జమిలి ఎన్నికలకు పార్లమెంటు ఆమోదముద్ర పొందడం బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే సర్కారుకు అంతా ఈజీ కాబోదు. నవంబర్ గేమ్ అధికార కూటమికి అంత అనుకూలంగా లేదు. జమిలికి సంబంధించి కోవింద్ కమిటీ పలు రాజ్యాంగ సవరణలు సూచించింది. వాటికి ఆమోదం లభించాలంటే ఉభయ సభల్లోనూ మూడింట రెండొంతుల మంది ఎంపీల మద్దతు తప్పనిసరి. అందుకు 543 మంది ఎంపీలున్న లోక్‌సభలో 362 మంది; 245 మంది ఎంపీలుండే రాజ్యసభలో 164 మంది మద్దతు అవసరం. కానీ ఎన్డీయే కూటమికి లోక్‌సభలో 293 మంది, రాజ్యసభలో 113 మంది ఎంపీలే అన్నారు. అయితే కోవింద్ కమిటీ ముందు జమిలిని సమర్థించిన పార్టీలకున్న లోక్‌సభ సభ్యుల సంఖ్య 271 మాత్రమే. దాన్ని వ్యతిరేకించిన 15 పార్టీలకు 205 మంది లోక్‌సభ సభ్యులున్నారు. విపక్ష ఇండియా కూటమికి రాజ్యసభలో 85 మంది సభ్యుల బలముంది.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



మాతా, శిశు మరణాలపై..
సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో గత నెలలో 48 మంది శిశువులు, 14 మంది గర్భిణులు మృత్యువాత పడ్డారనే ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. -8లో



'మహా'మురుగు..ఇంకెన్నాళ్లు?
హైదరాబాద్ మహానగరంలో ఎక్కడ చూసినా రోడ్లపై నిత్యం మురుగు పరుగులే.. ముక్కుపుటాలదిరే దుర్వాసనే. పెరుగుతున్న గృహాలకు తగినట్లుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదు. -10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0/23.0
నగర పరిధిలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. సాయంత్రవ వేళ చల్లని గాలులు వీస్తాయి.

రాత్రి వరకు కొనసాగిన నిమజ్జనాలు



బుధవారం మధ్యాహ్నం తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌పై..

సాయంత్రం 5 గంటల తర్వాత ట్యాంక్‌బండ్‌పై తొలగిన ఆంక్షలు

నెక్లెస్ రోడ్డులో కొనసాగిన రద్దీ

గణేష్ నిమజ్జన ఘట్టం బుధవారం రాత్రి వరకు కొనసాగింది. ప్రతియేటా మధ్యాహ్నం వరకు పూర్తయ్యే గణనాథుల నిమజ్జన ఘట్టం ఈ సారి రాత్రి వరకు కొనసాగింది. సాయంత్రం 5 గంటలకు ట్యాంక్ బండ్‌లో నిమజ్జనాలను నిలిపివేసి తెలుగు తల్లి ఫ్లై ఓవర్, సెక్రటేరియేట్, ట్యాంక్‌బండ్ వైపు రోడ్డును క్లియర్ చేశారు. రాత్రి వరకు కూడా ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై ఆంక్షలు కొనసాగాయి. విగ్రహాలన్నింటిని నెక్లెస్‌రోడ్డు వైపుకు మళ్లించారు. నెక్లెస్ రోడ్డుతో పాటు ఎన్టీఆర్‌మార్గ్‌లో నిమజ్జనాలను అధికారులు పూర్తి చేశారు. – బంజారాహిల్స్







పీపుల్స్ ప్లాజాలో నిమజ్జనమవుతున గణనాథులు..

సాగర్‌లో లక్ష విగ్రహాలు

- ఈసారి మూడు గంటల ముందే నిమజ్జనం పూర్తి
- నగర సీపీ సీవీ ఆనంద్

ఖైరతాబాద్: హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 3 గంటల ముందే పూర్తి చేశామని, సోమవారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని అన్ని జంక్షన్లలో ట్రాఫిక్ ఫ్రీ చేయగలిగామని, ఇదంతా ప్రణాళిక ప్రకారం వ్యవహరించడం వల్లే సాధ్యమైందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఎన్టీఆర్ మార్గ్‌లో కొనసాగుతున్న నిమజ్జనోత్సవాలను పరిశీలించిన అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆనంద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో హుస్సేన్ సాగర్‌లో ఒక్కరోజే 15 వేల విగ్రహాలు నిమజ్జనమయ్యాయని తెలిపారు. మొత్తం 11 రోజుల్లో హుస్సేన్ సాగర్‌లో లక్ష విగ్రహాలు నిమజ్జనం చేశారన్నారు. ఇంకా మిగిలి ఉన్న విగ్రహాలను ప్రణాళిక ప్రకారం నెక్లెస్ రోడ్డు, ఐమాక్స్ పక్కన ఉన్న పార్కింగ్ ప్రాంతంలో ఉంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఖైరతాబాద్ మహాగణపతి ఉదయం 6.30 గంటలకు శోభాయాత్ర ప్రారంభమై మధ్యాహ్నం 1.40కి పూర్తిచేశాం..ఇందుకు సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులకు, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రణాళిక ప్రకారం సౌత్ జోన్‌లో నిమజ్జన కార్యక్రమంలో చత్రినాక, సంతోష్‌నగర్, మాదన్నపేటలకు చెందిన నిర్వాహకులు ముందుకొచ్చి విగ్రహాలను త్వరగా తరలించారన్నారు. ఈస్ట్‌జోన్, సౌత్ జోన్‌ల పరిధిలో మండప నిర్వాహకులు ఎంత చెప్పినా ముందుకు రాలేదని, అందుకే ఆలస్యమవుతుందన్నారు. ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందన్నారు. వచ్చే సంవత్సరం నుంచైనా మండప నిర్వాహకులు మొత్తం ప్రక్రియను అర్థం చేసుకొని పోలీసులకు, జీహెచ్‌ఎంసీకి సహకరించాలన్నారు. అంబేద్కర్ విగ్రహం, తెలుగుతల్లి జంక్షన్ల మధ్య రెండు భారీ వినాయక విగ్రహాలు ఇరుక్కుపోవడం వల్ల కొంత ఆలస్యమైందని, ఓల్డ్ సిటీ, ఆబిడ్స్ మెయిన్ రోడ్లలో వాహనాలు బ్రేక్ డౌన్ కావడం 4–5 గంటల ఆలస్యానికి కారణమైందన్నారు. పోలీసు సిబ్బంది, అధికారులు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ట్రాన్స్‌కో, ఆర్టీఏ సిబ్బంది, అధికారులు 40 గంటల పాటు నిద్రాహారాలు మాని పనిచేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే గొడవలు చాలా తగ్గాయని, చిన్న చిన్న గొడవలు జరిగిన సంఘటనలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించామని తెలిపారు. మొదటి ఫేజ్, రెండవ ఫేజ్‌లలో కలిపి సిటీ పోలీసులు 15 వేల మంది, ఇతర జిల్లాల నుంచి వచ్చిన 10 వేల మంది మొత్తం 25 వేల మంది పోలీసులు నిమజ్జనోత్సవాల్లో విధులు నిర్వహించారని తెలిపారు. మొత్తం మీద నిమజ్జనోత్సవాలను సజావుగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి చేతులెత్తి మొక్కుతున్నానని నగర సీపీ తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

పాతబస్తీకి కొత్త సొబగులు

- ఫ్లై ఓవర్లకు సుందరీకరణ
- ఓల్డ్‌సిటీపై జీహెచ్‌ఎంసీ ఫోకస్



సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ పనులపై జీహెచ్‌ఎంసీ ఫోకస్ పెట్టింది. పాతబస్తీ పరిధిలో కొచ్చే చార్మినార్ జోన్‌లో ఇప్పటికే పలు మార్గాల్లో రహదారుల విస్తరణ, ఫ్లై ఓవర్లు, తదితర పనులు త్వరితంగా చేయాలంటూ సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. పనులు చేపట్టాల్సిన ప్రాంతాల్లో కమిషనర్ ఆమ్రపాలి క్షేత్రస్థాయి పర్యటనలు చేసి అక్కడి పరిస్థితుల్ని తెలుసుకున్నారు. ఇబ్బందులుంటే పరిష్కరించుకోవడంతోపాటు పనుల్ని త్వరితంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇది ఓవైపు దృశ్యంకాగా, మరోవైపు ఇప్పటికే ఉన్న ఫ్లై ఓవర్లను అందంగా కనిపించేలా థీమాటిక్ థీమ్స్‌తో సుందరంగా తీర్చిదిద్దేందుకు సిద్ధమయ్యారు. ఒవైసీ ఫ్లై ఓవర్, చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్, కందికల్‌గేట్, ఫలక్‌నుమా ఫ్లై ఓవర్లను చూడటానికి అందంగా ప్రత్యేకంగా తీర్చిదిద్దేందుకు టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. అంచనా వ్యయం రూ.1.50 కోట్లు కాగా, దాదాపు ఆర్నెల్లలో పనులు పూర్తికాగలవన్నారు. నగరం మొత్తం అందంగా కనిపించాలన్న ప్రభుత్వ నిర్ణయాని కనుగుణంగా అధికారులు ఈ పనులకు సిద్ధమైనట్లు సమాచారం. బెంగళూర్ నేషనల్ హైవే నుండి శాస్త్రిపురం జంక్షన్ వరకు, చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్ నుంచి బార్కాస్ రోడ్ వరకు, లక్కీస్టార్ హోటల్ నుంచి హఫీజ్‌బాబానగర్ వరకు, బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు, తదితర ప్రాంతాల్లో రోడ్ల విస్తరణలతో పాటు ఇతరత్రా ప్రాంతాల్లో పలు పనులకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు.

వరమా.. కలవరమా?



ప్రతి నెలా ఆస్తిపన్ను వసూళ్లపై భిన్నాభిప్రాయాలు



కొంచెం మోదం...కొంచెం ఖేదం తప్పదంటున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: కరెంట్ బిల్లు, వాటర్‌బిల్లు మాదిరిగానే జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆస్తిపన్నును సైతం నెలనెలా వసూలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై అటు జీహెచ్‌ఎంసీ వర్గాల్లో, ఇటు ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ, దిగువ మధ్యతరగతి ప్రజలకు నెలనెలా ఆస్తిపన్ను చెల్లింపు ఊరట కలిగించనున్నప్పటికీ, నిర్ణీత వ్యవధిలో చెల్లించని పక్షంలో జీహెచ్‌ఎంసీ నుంచి అందాల్సిన సేవలు కానీ..వాటర్, కరెంట్ వంటి సేవలు కానీ నిలిపివేస్తారేమోనననే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్నుతోపాటు ఒక భవనానికి సంబంధించిన వాటర్, కరెంట్ బిల్లులు, ఇతరత్రా వివరాలన్నీ సంబంధిత అధికారులకు తెలుస్తాయి. దాంతో ఏ ఒక్క బిల్లు చెల్లించపోయినా ఇబ్బందులెదురవుతాయేననే అనుమానం వారిని వెంటాడుతోంది. నిర్ణీత వ్యవధిలో చెల్లించలేని పక్షంలో ఇబ్బందులెదురవుతాయేమోననే సంశయాలున్నాయి.

భిన్న వాదనలు..సూచనలు

- పైన చెప్పినవి ప్రజల వైపునుంచి వ్యక్తమవుతున్న అనుమానాలు కాగా, నెలనెలా ఆస్తిపన్ను చెల్లింపుల వల్ల జీహెచ్‌ఎంసీకి ప్రతినెలా కచ్చితంగా ఎంత ఆదాయం రాగలదో అంచనా ఉంటుందని, అందుకనుగుణంగా నిధులు ఖర్చు చేయవచ్చునని, ఇది జీహెచ్‌ఎంసీకి ఎంతో ఉపయుక్తమని కొందరు అధికారులు పేర్కొన్నారు.
- జీహెచ్‌ఎంసీకి ఏడాదికి దాదాపు రూ. 2వేల కోట్లు ఆస్తిపన్ను ద్వారా ఖజానాకు చేరుతోంది. అయితే ఆర్థిక సంవత్సరం ఆరంభంలో ఎర్లీబర్డ్ రాయితీ ఉండే ఏప్రిల్ నెలలో, ఆర్థిక సంవత్సరం ముగిసే ఫిబ్రవరి, మార్చి నెలల్లో అధిక మొత్తంలో వసూలవుతోంది. ఎర్లీబర్డ్ ద్వారా ఏప్రిల్ ఒక్క నెలలోనే గత ఆర్థిక సంవత్సరం రూ. 827 కోట్లు వసూలైంది. ఒకేసారి అంతపెద్ద మొత్తం వస్తే ప్రాజెక్టుల పనులకు, పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఆసరాగా ఉంటుందంటున్న వారూ అన్నారు.
- అలాగే ఆర్థిక సంవత్సరం చివరి రెండు మాసాల్లోనూ అధికమొత్తం వసూళ్ల వల్ల ఏవైనా పనులకు వీలుంటుందని వారు చెబుతున్నారు. దాని కంటే నెలనెలా స్థిరాదాయమే మంచిదనే వారే ఎక్కువగా ఉన్నారు. ప్రతినెలా వచ్చే ఆస్తిపన్నుతో సిబ్బంది జీతాల చెల్లింపులకు కటకట ఉండదని, ఇప్పటి మాదిరిగా నెల వస్తోందంటే జడుసుకోవాల్సిన పరిస్థితి ఉండదని వారు చెబుతున్నారు.
- నెలనెలా వసూలైతే సగటున నెలకు రూ.150 కోట్ల వరకు ఆస్తిపన్ను రూపేణా వచ్చే అవకాశముంది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది జీతభత్యాలకు అది సరిపోతుంది. అయితే నిర్వహణ పనులు కానీ, ప్రాజెక్టుల పనులు కానీ చే యడానికి నిధులుండవని, కనీస నిర్వహణ పనులు కూడా చేయలేని పరిస్థితి ఎదురవుతుందని అంటున్నారు.

పనులు చేయకుంటే ప్రజలు ఊరుకోరు..

నెలనెలా ఆస్తిపన్ను వసూలు చేస్తే ప్రజల నుంచి కొంత ఒత్తిడి ఎదురయ్యే అవకాశం కూడా ఉందంటున్నారు. జీహెచ్‌ఎంసీ కల్పించాల్సిన ఏ సదుపాయం కల్పించకపోయినా ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్లు, నాలాలతోసహ అన్ని పనులూ సకాలంలో చేయకతప్పదంటున్నారు. పనులు చేసేందుకు టౌన్‌ప్లానింగ్, అడ్వర్టయిజ్‌మెంట్స్, ట్రేడ్ లైసెన్సులు, ఎస్టేట్స్ అద్దెలు, తదితర మార్గాల ద్వారా వచ్చే నిధుల్ని వినియోగించుకోవచ్చునని వారు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. జీతాల కటకట సమస్య మాత్రం తీరిపోతుందని, అది జీహెచ్‌ఎంసీకి ఎంతో ఉపశమనమని అంటున్నారు. ఇలా ఎవరి అభిప్రాయాలు వారు వ్యక్తపరుస్తున్నారు.

బకాయిలు పెరగవు..

నెలనెలా ఆస్తిపన్ను వసూళ్ల వల్ల బకాయిలు పెరగకుండా ఉంటాయని, అది జీహెచ్‌ఎంసీకి ఎంతో ప్రయోజనమని చెబుతున్న అధికారులు కూడా ఉన్నారు. పేరుకుపోయిన బకాయిలు భారీ మొత్తంలో కాగితాల్లో కనిపించడమే తప్ప అవి వసూలు కావని, ముమ్ముందైనా బకాయిలంటూ పేరుకుపోకుండా ఉంటే అది బల్దియాకు లాభమే అంటున్నారు. ప్రజల్లో సైతం నెలనెలా చెల్లింపుల వల్ల వెసులుబాటు ఉంటుందంటున్న వారితోపాటు నెలనెలా కట్టే బదులు ఒకేసారి చెల్లిస్తే ఆర్నెళ్లు, ఏడాది వరకు తిరిగి ఆలోచించాల్సిన పని ఉండదంటున్న వారూ ఉన్నారు. ఇలా ఎవరి కోణంలో వారు ఆలోచిస్తున్నారు.

ఎన్‌ఎండీసీకి రాజభాషా కీర్తి అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఎండీసీ లిమిటెడ్‌కి 2023–2024 సంవత్సరానికి గాను సీ రీజియన్ అండర్‌టేకింగ్ విభాగంలో ప్రతిష్టాత్మకమైన 'రాజభాషా కీర్తి అవార్డు' లభించింది. న్యూఢిల్లీలో అధికార భాషా విభాగం, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన హిందీ దివస్ రాజభాషా సమ్మేళనంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఎన్‌ఎండీసీ అధికార భాషా విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు రెండవ బహుమతితో గుర్తింపు పొందింది. ఎన్‌ఎండీసీ చీఫ్ జనరల్ మేనేజర్ (పర్సనల్ – అడ్మినిస్ట్రేషన్) ప్రియదర్శిని హోం వ్యవహారాల రాష్ట్ర మంత్రి నిత్యానంద రాయ్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, రాజ్యసభ సభ్యుడు సుధాంశు త్రివేది సమక్షంలో ఈ అవార్డును అందుకున్నారు.

నేటి నుంచి 'న్యూరో'పై వర్క్‌షాప్

సాక్షి, సిటీబ్యూరో: న్యూరో సర్జరీలో సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల ద్వారా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చే దిశగా గురువారం నుంచి 27వ న్యూరో–స్పైన్ సర్జన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వార్షిక సమావేశం జరగనుంది. 450 మందికి పైగా వెన్నెముక శస్త్రచికిత్స నిపుణులు ఒక్కచోట చేరి, న్యూరో విభాగంలో అభివృద్ధిపై చర్చించనున్నారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో 22వ తేదీ వరకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ సమావేశాలకు కొరియన్ స్పైనల్ న్యూరోసర్జరీ సొసైటీ, బ్రిటీష్ అసోసియేషన్ ఆఫ్ స్పైన్ సర్జన్స్, బ్రెజిలియన్ స్పైన్ సొసైటీ నుంచి ప్రముఖులు భాగస్వామ్యం కానున్నారు. రోబోటిక్–అసిస్టెడ్, నావిగేషన్–గైడెడ్ స్పైన్ సర్జరీలు, ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ తదితర అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చ జరగనుంది. సమావేశాన్ని కిమ్స్ గ్రూప్ ఆఫ్ ఆస్పిటల్స్ ఎండీ, ఛైర్మన్ డాక్టర్ బి.భాస్కర్‌రావు తదితరులు ప్రారంభించనున్నారు.


'వంట గ్యాస్' లబ్ధిదారులకో పత్రం

నేరుగా మంత్రి సంతకంతో జారీ
- లబ్ధిదారులకు పోస్టు, డీలర్ల ద్వారా అందజేత
- గ్రేటర్‌లో ఒక శాతం కుటుంబాలకే వర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 31.18 లక్షలు ఉండగా అందులో కేవలం ఒక శాతం కనెక్షన్‌దారులకు మాత్రమే రూ.500లకు సబ్సిడీ వంట గ్యాస్ వర్తిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమల చేస్తున్న అభయ హస్తం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నుంచి పోస్టులో లేఖలు అందుతున్నాయి. పోస్టులో లేఖలు అందని లబ్ధిదారులకు మాత్రం ఎల్పీజీ ఏజెన్సీ, ప్రభుత్వ చౌకధరల దుకాణాల డీలర్లు నేరుగా ఎంపిక పత్రం అందజేస్తున్నారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ప్రారంభమై మూడు నెలలు దాటింది. ఎంపికైన లబ్ధిదారులు బహిరంగ మార్కెట్ ధర చెల్లించి రెండు నుండి మూడు సిలిండర్లు డ్రా చేసుకోవడంతో రూ.500 మినహాయించి మిగితా సొమ్ము నగదు రూపంలో బ్యాంక్ ఖాతాలో జమ అవుతోంది.


మంత్రి లేఖ పత్రంలో ఇలా..

'తెలంగాణ ప్రభుత్వం అభయహస్తం కార్యక్రమం ద్వారా కేవలం రూ.500లకే ఎల్పీజీ సిలిండరును అందించాలనే లక్ష్యంతో మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం లక్ష్యం మహిళా సాధికారత, దార్రిద్యరేఖకు దిగువన ఉన్నవారిపై ఆర్థిక భారం తగ్గించడం, వారికి కాలుష్య రహిత వంట మాధ్యమాన్ని అందించడం. ఈ పథకంలో మిమ్మల్ని లబ్ధిదారులుగా ఎంపిక చేయడం జరిగింది. మీ కుటుంబానికి గత మూడు సంవత్సరాల సగటు వినియోగం ఆధారంగా ఎల్పీజీ సిలిండర్లు పరిమితం చేయబడతాయి. సబ్సిడీ వ్యత్యాసం మొత్తం నగదు డీబీటీ ఆధారిత ఆన్‌లైన్ బదిలీ ద్వారా మీ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయబడుతోంది. ఈ విషయానికి సంబంధించి, సిలిండర్ అందిన తర్వాత సబ్సిడీ నగదు మీ బ్యాంకు ఖాతాలో 4 రోజులలో జమ జరగడంలో ఏదైనా జాప్యం జరిగితే 1967 లేదా 18004250033 ఫోన్ నెంబర్లను సంప్రదించాలి' అని లేఖలో పేర్కొన్నారు.



ప్రియమైన
శుభాకాంక్షలతో
(ఉత్తమ్ కుమార్ రెడ్డి)
తెలంగాణ రాష్ట్రం

రూ.500లకు వంట గ్యాస్ లబ్ధిదారుడి ఎంపిక పత్రం



24 లక్షలపైనే దరఖాస్తులు

ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500కు వంటగ్యాస్ వర్తింపు కోసం గ్రేటర్ పరిధిలోని సుమారు 30.18 లక్షల ఎల్పీజీ కనెక్షన్‌దారుల్లో సుమారు 24.74 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే వారిలో 19.10 లక్షల కుటుబాలు మాత్రమే తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉన్నాయి. అయితే సబ్సిడీ గ్యాస్ మాత్రం మూడు లక్షల లోపు కనెక్షన్‌దారులు మాత్రమే ఎంపికైనట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే మిగితా సుమారు 16 లక్షల కనెక్షన్లు దారులు అర్హులుగా ఉన్నా.. సబ్సిడీ వర్తింపు మాత్రం అందని ద్రాక్షగా తయారైంది.

పెరిగిన వ్యర్థాలు

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచి నగరంలో రోజుకు సగటున 230 మెట్రిక్‌టన్నుల వ్యర్థాల సేకరణపెరిగింది. జీహెచ్‌ఎంసీ తెలిపిన సమాచారం మేరకు పండుగకు ముందు ఆగస్టునెలలో రోజుకు సగటున 7900 మెట్రిక్‌టన్నుల వ్యర్థాల సేకరణ జరగ్గా, గణేశ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాక ఐదోరోజు నుంచి వ్యర్థాలు పెరిగాయి. ఐదోరోజునుంచి నిమజ్జనాలు అధికంగా జరగడమే ఇందుకు కారణం. నిమజ్జనాల సందర్భంగా వెలువడే పూజా వ్యర్థాలు, తదితరమైనవి ఇందుకు కారణమని అధికారులు పేర్కొన్నారు.

గణేశ్ నవరాత్రుల్లో 230 మెట్రిక్ టన్నులు అధికం..
- సగటున రోజుకు 8130.73 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ

తేదీ	వ్యర్థాలు (మెట్రిక్ టన్నులు)
7	8337.96
8	7863.28
9	6008.52
10	7527.32
11	8810.10
12	8691.86
13	8448.18
14	8542.32
15	8296.44
16	8364.44
17	8547.58

వెరసి సగటున రోజుకు 8130.73 మెట్రిక్ టన్నులు

- ఆగస్టునెలలో రోజుకు సగటున వెలువడిన వ్యర్థాలు 7900 మెట్రిక్ టన్నులు. అంటే రోజుకు సగటున 230 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు అధికంగా సేకరించారు.
- మంగళ, బుధవారాల్లో నిమజ్జనాల సందర్భంగా వెలువడిన వ్యర్థాల సేకరణ ఇంకా పూర్తికాలేదు.
- కలర్ పేపర్ షాట్స్ వినియోగించవద్దని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కోరినా.. భక్తులు పెద్దగా పట్టించుకోలేదు. రోడ్లనిండా ఆ వ్యర్థాలే పోగయ్యాయి. వాటిని తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు రేయింబవళ్లు పనులు చేస్తున్నారు.
- గురువారం మిలాద్‌ఉన్‌నబీ నేపథ్యంలో వ్యర్థాలు లేకుండా, పారిశుధ్యంపై ఫిర్యాదులు రాకుండా తగుచర్యలు తీసుకోవాలని ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు.



మారువేషాలతో చోరీలు

- ఘరానా దొంగల ముఠా అరెస్ట్
- 60తులాల బంగారు నగలు
- బైక్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ చింతమనేని శ్రీనివాస్

రాజేంద్రనగర్: మారు వేషాలతో దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా ముఠాను రాజేంద్రనగర్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. వీరి నుంచి బైక్, 60తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మాట్లాడుతూ.. నంద్యాల ప్రాంతానికి చెందిన జి సుధాకర్(33) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. శ్రీనగర్ కాలనీ ,మెహదీపట్నం ప్రాంతాల్లో ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. జల్సాలకు అలవాటు పడిన అతను చోరీలకు పాల్పడుతున్నాడు. అతడిపై పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 50కి పైగా కేసులు ఉన్నట్లు తెలిపారు. బట్టతల ఉండడంతో విగ్గును ఉపయోగించే అతను మహిళల వేషధారణలో దొంగతనాలకు పాల్పడేవాడు. గతంలో ఆసిఫ్ నగర్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి పీడీ యాక్ట్‌పై జైలుకు పంపారు. జైలులో అతడికి పాత నేరస్తుడు సరూర్ నగర్ ప్రాంతానికి చెందిన బండారి సాంసంగ్, కొత్తూరుకు చెందిన శనిదేవ్, పంజాబ్‌కు చెందిన అమృత్ సింగ్‌తో పరిచయం ఏర్పడింది.ఐదు నెలల క్రితం జైలు నుంచి బయటికి వచ్చిన సుధాకర్ ముఠాను ఏర్పాటు చేశాడు.రాజేంద్రనగర్ ,పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లలో రెండు , రాయదుర్గంలో ఒకటి దొంగతనాలకు పాల్పడ్డాడు. చోరీ సొత్తును తన సోదరుడు సురేష్ అప్పగించేవాడు. అతను నగలను విక్రయించి ,లేదా తాకట్టు పెట్టి నగదు రూపంలోకి మార్చేవాడు. ఈ ముఠా రాజేంద్రనగర్ స్టేషన్ పరిధిలో లక్ష్మినగర్ ప్రాంతంలో ఓ రియల్ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో 60 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా బండ్లగూడ ప్రాంతంలో డీసీఎంలో వచ్చిన నిందుతులు ఓ ద్విచక్రవాహనాన్ని దొంగిలించి తీసుకెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఐదు చోరీలకు సంబంధించి వివరాలు వెల్లడించారు.నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసులకు డీసీపీ రివార్డును అందజేశారు.

వచ్చాడు..పొడిచాడు..పారిపోయాడు

- ఇద్దరు వ్యక్తులపై గుర్తుతెలియని వ్యక్తి దాడి
- మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లో ఘటన
- ఒకరి మెడపై, మరొకరి ముఖంపై కత్తితో దాడి
- డబ్బుల వ్యవహారమే కారణంగా అనుమానం


గాయపడిన సంతోష్, పవన్

మేడ్చల్‌రూరల్: ఇద్దరు వ్యక్తులు వ్యాపార విషయాలు మాట్లాడుకుంటుండగా అక్కడికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి వారిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టాపూర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన రంజిత్ తన స్నేహితులు సంతోష్, పవన్‌కుమార్, విక్రమ్‌తో కలిసి కిష్టాపూర్‌లోని సాయినగర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని సీడ్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వీరు కిష్టాపూర్‌లోని ఓ సీడ్ కంపెనీ నుంచి సీడ్స్ కొనుగోలు చేసి వాటిని బీహార్‌లో విక్రయించేవారు. ఈ క్రమంలో మంగళవారం విత్తనాలు కొనుగోలు చేసిన వారు రాత్రి గదిలో బసచేసి బుధవారం ఉదయం బీహార్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అర్ధరాత్రి నలుగురు కలిసి బాల్కానిలో నిలుచుని వ్యాపార విషయాలు మాట్లాడుకుంటుండగా అక్కడికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఒక్కసారిగా సంతోష్, పవన్ లపై కత్తితో దాడికి పాల్పడి పరారయ్యాడు. దీంతో సంతోష్ మెడకు, పవన్ మొఖంపై తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ పరిస్థితి విషమంగా ఉండగా పవన్‌కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

డబ్బుల వ్యవహారమే దాడికి కారణమా?

డబ్బుల విషయమై తగాదాల కారణంగానే గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సంతోష్, పవన్‌లతో ఓ వ్యక్తికి డబ్బుల వ్యవహారంలో విభేదాలు నెలకొనడంతో అతడే వ్యక్తి దాడికి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

మోత మోగింది!

- గణేశ్ నిమజ్జనం వేళ డీజేల హోరు
- పరిమితికి మించి శబ్ద కాలుష్యం
- ఆంక్షలను పట్టించుకోని మండప నిర్వాహకులు
- కనిపించని పీసీబీ, మున్సిపల్, పోలీసుల తనిఖీలు
- వినికిడి సమస్యలు తప్పవంటున్న వైద్యులు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో వినాయకుడు మోత మోగించేశాడు. గణేష్ నిమజ్జనం వేళ డీజేలు, టపాసులతో హోరెత్తించారు. గ్రేటర్‌వ్యాప్తంగా పరిమితికి మించి శబ్ద కాలుష్యం వెలువడింది. నివాస, సున్నితమైన ప్రాంతాలలో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిర్దేశించిన దాని కంటే చాలా రెట్లు ధ్వని కాలుష్యం మించిపోయింది. పీసీబీ పరిమితులను గణేష్ మండప నిర్వాహకులు ఏ మాత్రం పట్టించుకోలేదు. రాత్రి వేళల్లో డీజేలు, టపాసుల మోతతో కాలనీలు దద్దరిల్లిపోయాయి. సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదు చేసినా పీసీబీ, మున్సిపల్, పోలీసు విభాగాలు ఏమాత్రం పట్టించుకున్న దాఖలాల్లేవు. శబ్ద కాలుష్యంతో పిల్లలు, వృద్ధులలో వినికిడి సమస్యలు ఏర్పడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- గణేష్ ఊరేగింపుల్లో డీజేల చప్పుళ్లు, లౌడ్ స్పీకర్లు, జనరేటర్ల వినియోగం, టపాసులు కాల్చడం, వాహనాల హారన్లు, యువతీ యువకులు బూరలతో శబ్దాలు చేయడం తదితర కారణాలతో నిమజ్జనం వేళ పరిమితికి మించి శబ్ద కాలుష్యం నమోదైంది. ప్రధానంగా హుస్సేన్‌సాగర్, అబిడ్స్, బహదూర్‌పురా, చార్మినార్, ఖైరతాబాద్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, బాలాపూర్, రామాంతాపూర్, తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్ ప్రాంతాల్లో ధ్వని కాలుష్యం ఎక్కువగా నమోదైంది. ఆయా ప్రాంతాల్లోని నివాసితులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వేరే రాష్ట్రాల్లో కేసులు..

పుణే, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలను ఉల్లంఘించి, పరిమితికి మించి శబ్ద కాలుష్యం కలిగించిన గణేష్ మండప నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. కానీ, మన దగ్గర మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో అధిక శబ్దాలను గుర్తించేందుకు పోలీసులు ప్రధాన రహదారుల్లో నాయిస్ డిటెక్షన్ ఉపకరణాలు ఏర్పాటు చేశారు. కానీ, వాటి నిర్వహణ లేక అలంకారప్రాయంగా మారాయి.

వినికిడి సమస్యలు..

మితిమీరిన శబ్దాలతో చిన్న పిల్లల కర్ణభేరి సూక్ష్మ నాడులు దెబ్బతింటాయి. వృద్ధులకు వినికిడి శక్తి లోపించే ప్రమాదం ఉంది. పరిమితికి మించి శబ్దాలతో తలనొప్పి, చికాకు, గుండె స్పందనలో వేగం, రక్త ప్రసరణ పెరగడంతో పాటు ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మానసికంగా, శారీరకంగా కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. 65 డెసిబుల్స్‌కు మించిన ధ్వనితో గుండె జబ్బులు, చెవుడు కూడా రావచ్చు.

పేషెంట్ల భద్రతకు 'పింక్ బుక్'

- పుస్తకం విడుదల చేసిన అపోలో హాస్పిటల్స్
- హెల్త్ కేర్ రంగంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగం



సాక్షి, సిటీబ్యూరో: హెల్త్‌కేర్ రంగంలో మెరుగైన సేవలు అందించేందుకు, తీసుకోవాల్సిన జాగ్రత్తల సమాహారంతో అపోలో హాస్పిటల్స్ 'పింక్ బుక్' పేరిట మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆస్పత్రుల్లో పేషెంట్ కేర్, భద్రత విషయంలో పాటించాల్సిన ప్రొటోకాల్స్‌ను ఈ పుస్తకంలో పొందుపరిచారు. నాలుగు దశాబ్దాలుగా రోగుల భద్రత విషయంలో అపోలో ఆస్పత్రుల్లో అలుపెరగని కృషి చేస్తున్నామని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి పేర్కొన్నారు. కేవలం అపోలో ఆస్పత్రుల్లోనే పేషెంట్ల భద్రతపైనే కాకుండా మొత్తం హెల్త్ కేర్ రంగంలో కూడా ఉపయోగపడేలా ఈ పింక్ బుక్ రోడ్‌మ్యాప్ లాంటిదని చెప్పారు. హెల్త్ కేర్ రంగంలో ఎన్నో ఆవిష్కరణలు తీసుకొచ్చామని, అయితే పేషెంట్స్, డాక్టర్ల భద్రత తమకు చాలా ముఖ్యమని వివరించారు. తమ అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలనే ఈ బుక్‌లో చేర్చామని, హెల్త్‌కేర్ రంగంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- మద్యం మత్తులో ఈతకు వెళ్లి ఇద్దరు గల్లంతు
- ఒకరి మృతి, మరొకరి కోసం కొనసాగుతున్న గాలింపు


నెల్సన్ మృతదేహం

మేడ్చల్‌రూరల్: మద్యం మత్తులో సరదాగా చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు నీటిలో మునిగి గల్లంతైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి అర్కల్‌గూడలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన నెల్సన్(35), దీపు (29)తో పాటు మరో వ్యక్తి మునీరాబాద్ గ్రామంలో నివాసం ఉంటూ స్థానిక క్రికెట్ గ్రౌండ్‌లో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం వారు ముగ్గురు కలిసి పార్టీ చేసుకున్నారు. అనంతరం మద్యం మత్తులో ఈత కొట్టేందుకు అర్కల్‌గూడ గ్రామ పరిధిలోని కోమటి కుంట చెరువుకు వెళ్లారు. నెల్సన్, దీపు నీటిలో దిగగా మరో వ్యక్తి గట్టున నిలుచుని వారిని సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తున్నాడు. ప్రమాదవశాత్తు వారిలో ఒకరు నీటిలో మునిగిపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించిన మరో వ్యక్తి సైతం నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఒడ్డున ఉన్న వ్యక్తి స్థానికులకు తెలుపడంతో వారు మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గత ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టగా నెల్సన్ మృతదేహం లభ్యమైంది. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. గురువారం ఉదయం దీపు కోసం గాలింపు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక..

- భవనం పైనుంచి దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం
- మహేశ్వరంలోని జ్యోతిరావుపూలె వసతి గృహంలో ఘటన


కె.సిద్ధు (ఫైల్)

మహేశ్వరం: హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేని ఓ విద్యార్థి తరగతి గది మొదటి అంతస్తు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలె బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు చెందిన కురుమేటి సిద్ధు(16) మహేశ్వరం గేటు వద్ద ఉన్న జ్యోతిరావు పూలె హాస్టల్‌లో ఇంటర్ సెకండియర్ (బైపీసీ) చదువుతున్నాడు. ఆగస్టు 14న తల్లిదండ్రులు విద్యార్థిని హాస్టల్లో చేర్పించారు. 35 రోజులకు గాను కేవలం 13 రోజులు మాత్రమే వసతి గృహంలో ఉన్నాడు. సెప్టెంబర్ 6న బంధువు చనిపోయారని ఇంటికి వెళ్లిన సిద్ధు బుధవారం మధ్యాహ్నం 12:15 గంటలకు సోదరుడితో కలిసి హాస్టల్‌కు వచ్చాడు. తరగతి గదికి వెళ్లకుండా 12:35 గంటలకు మొదటి అంతస్తు బాల్కనీ పైనుంచి దూకాడు. ఈ విషయాన్ని గమనించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భవనం పైనుంచి దూకిన విద్యార్థి ముఖానికి తీవ్ర గాయలవడంతో పాటు పండ్లు ఊడిపోయాయి. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బలవంతంగా హాస్టల్‌లో చేర్పించడంతోనే సిద్ధు అఘాయిత్యానికి పాల్పడ్డాడని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాతా, శిశు మరణాలపై గందరగోళం!

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన పోస్ట్



సాక్షి, సిటీబ్యూరో/ గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్యప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం, అనుభవాలేమితో గత నెలలో 48 మంది శిశువులు, 14 మంది గర్భిణులు మృత్యువాత పడ్డారనే ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఆగస్టు నెలలో మృతి చెందిన గర్భిణిలు, శిశువుల ఊరు, పేరు, తేదీ, సమయం పూర్తి వివరాలతో పాటు, ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలపై పోస్ట్ చేయడం, ఆస్పత్రి పాలనాయంత్రాంగం తక్షణం స్పందించకపోవడంతో ఇది నిజమా, కాదా అనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గత సర్కార్ ఇచ్చిన న్యూట్రిషన్, కేసీఆర్ కిట్లు గర్భిణిలు, బాలింతలకు ఇవ్వకపోవడంతో పౌష్టికాహార లోపం, వైద్యుల నిర్లక్ష్యం, అనుభవం ఉన్న వైద్యులను పల్లెలకు బదిలీ చేయడంతో, కొత్తగా బాధ్యతలు చేపట్టిన వైద్యుల అనుభవ రాహిత్యంతో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో నెలరోజుల వ్యవధిలో 62 మందిగర్భిణిలు, శిశువులు మృతి చెందారని, ఒక్క గాంధీఆస్పత్రిలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా గత ఎనిమిదినెలల్లో ఎంత మంది గర్భిణిలు, బాలింతలు, శిశువులు మృత్యువాత పడ్డారో అంటూ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. గాంధీకి వచ్చే హైరిస్క్ కేసులను సరిగా హ్యాండిల్ చేయలేకపోవడంతో మరణాల సంఖ్య పెరిగిందని, గత ప్రభుత్వ హయాంలో గాంధీలో ఫెర్టిలిటీ (సంతానోత్పత్తి) సెంటర్ ప్రారంభించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఫెర్టిలిటీ సెంటర్‌కు సౌకర్యాలు కల్పించకుండా నిర్వీర్యం చేసిందని సదరు పోస్ట్‌లో పేర్కొన్నారు. గాంధీలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ర్యాంకు లేదా సీనియర్ వైద్యున్ని నియమించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఇటీవలే పదవీ విరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్‌ను నియమించారని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, 15 ఏళ్లుగా పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు(డీఈఓ)లను అర్ధాంతరంగా తొలగించారని పోస్ట్‌లో ఆరోపించారు.

అవన్నీ అవాస్తవాలు: రాజకుమారి, గాంధీ సూపరింటెండెంట్

గర్భిణిలు, శిశు మరణాలపై సామాజిక మాధ్యమంలో వైరల్ అయిన పోస్టులో చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత నెలలో 30 మంది శిశువులు మృతి చెందారని, ప్రైవేటు, కార్పొరేట్‌తోపాటు ఇతర జిల్లాల నుంచి ప్రాణాపాయస్థితిలో చివరి నిమిషంలో గాంధీఆస్పత్రిలో చేర్పించడంతో తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడేందుకు నిష్ణాతులైన వైద్యులు నిరంతరం శ్రమిస్తుంటారని వివరించారు. గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు న్యూట్రిషన్ కిట్లు ఇస్తున్నామని పేర్లు మారాయని స్పష్టం చేశారు. రిటైర్డ్ అయిన ఆఫీస్ సూపరింటెండెంట్ రామయ్యకు ఉన్న అనుభవం మేరకు లీగల్ కేసులు, న్యాయపరమైన అంశాలను చూసే బాధ్యతను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తాత్కాలికంగా అప్పగించామని, గాంధీ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌గా డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్‌ను నియమించామన్నారు. ఫెర్టిలిటీ సెంటర్‌ను త్వరలోనే అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తెస్తామని, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు కోసం సంబంధిత కాంట్రాక్టర్లతో ఇటీవలే సమావేశం కాగా, వేతన బకాయిలు చెల్లించేందుకు అంగీకరించారని, డీఈఓలను తొలగించలేదని, వారి సేవలను ఇతర విభాగాల్లో వినియోగించుకుంటామన్నారు. గాంధీఆస్పత్రికి ఉన్న గుర్తింపును మసకబార్చే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు.

కూతురిపై లైంగిక దాడి కేసులో తండ్రికి జైలు


రాములు (ఫైల్)

మల్కాజిగిరి: కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు చెప్పింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మల్కాజిగిరికి ప్రాంతానికి చెందిన సురుగు రాములు ప్లంబర్‌గా పని చేసేవాడు. 2019 ఏప్రిల్‌లో మద్యం మత్తులో తన కుమార్తెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుపై విచారణ చేపట్టిన ఫోక్సో స్పెషల్ ట్రాక్ జడ్జి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బాలికపై లైంగికదాడి

నిందితుడి రిమాండ్

మేడిపల్లి: ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఓ బాలిక బోడుప్పల్‌లోని బంధువుల ఇంట్లో ఉంటూ 8వ తరగతి చదువుతోంది. కేశవరెడ్డి అనే వ్యక్తి ఆమెకు మాయ మాటలు చెప్పి తన గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ విషయాన్ని బంధువులకు చెప్పడంతో వారు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైద్యం వికటించి యువకుడి మృతి

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

మేడిపల్లి: వైద్యం వికటించి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్‌కు చెందిన పంజాల అజయ్(32) తన తండ్రి కొన్ని నెలల క్రితం మృతి చెందడంతో అప్పటినుంచి డిప్రెషన్‌లో ఉంటున్నాడు. పీర్జాదిగూడలో ని తన చెల్లెలు ఇంటికి వచ్చిన అతను ఈ నెల 15న బాత్‌రూంలో కాలుజారి కింద పడ్డాడు. గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతడిని జేపీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. తలకు ఆపరేషన్ చేశామని, రోగి కోలుకుంటున్నట్లు వైద్యులు చెప్పారు. అయితే బుధవారం ఉదయం అతను మృతి చెందాడని బంధువులు ఆగ్రహానికి లోనయ్యారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే అజయ్ మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

లారీ ఢీ కొని మహిళ దుర్మరణం

భర్త కళ్లెదుటే భార్య మృతి


రత్నం మృతదేహం

మేడ్చల్‌రూరల్: వ్యక్తిగత పనులపై నగరానికి వెళ్లేందుకు ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన భార్యభర్తలు కిలోమీటర్ దూరంలోనే రోడ్డు ప్రమాదానికి గురికాగా భర్త కళ్లెదుటే భార్య మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక కేఎల్ఆర్ వెంచర్‌లో నివాసం ఉంటున్న యండం మాధవరావు అతని భార్య యండం రత్నం(50) బుధవారం ఉదయం కూకట్‌పల్లి వెళ్లేందుకు బైక్‌పై ఇంటి నుండి బయలుదేరారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్ఎంసీ లారీ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెనుక కూర్చున్న రత్నం లారీ కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మాధవరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

ఏపీఎస్ఐ సభ్యురాలిగా డాక్టర్ లక్ష్మి



సాక్షి, సిటీబ్యూరో: అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏపీఎస్ఐ) సభ్యురాలిగా ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్ఓడీ, ప్రొఫెసర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి ఎంపికయ్యారు. ఇటీవల కోయంబత్తూర్‌లో జరిగిన నేషనల్ ప్లాస్టిక్ సర్జరీ కాన్ఫరెన్స్‌లో ప్రొఫెసర్ లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెకు మెంటార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందజేసి సన్మానం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ పీజీలు ఈ సదస్సు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్లాస్టిక్వెస్ట్ చాలెంజ్‌లో పలువురు ప్లాస్టిక్ సర్జన్లు పాల్గొన్నారు.

రూ.6 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



దివ్య గణేష్ లడ్డూని దక్కించుకున్న సంజనా గైక్వాడ్

శ్రీనగర్‌కాలనీ: ఐకానిక్ ఫారమ్స్ శ్రీ దివ్య గణేష్ లడ్డూ 6,11,100 రూపాయలకు సంజనా గైక్వాడ్ సొంతం చేసుకున్నారు. బుధవారం అమీర్‌పేటలోని కార్యాలయంలో నిమజ్జనోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి లడ్డూ వేలం వేశారు. అనంతరం ఆలేరు ఐకానిక్ ఫార్మ్స్‌లో గణనాథుని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఐకానిక్ ఫార్మ్స్ ఎండీ శ్రీనివాసగౌడ్, సుధీర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా లడ్డూ వేలం



వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో వెంకటగిరి డెవలప్‌మెంట్ అండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మంటపం వద్ద బుధవారం లడ్డూ వేలం పోటాపోటీగా జరిగింది. ఈ పోటీలో లక్షా వెయ్యి నూట పదహారు రూపాయలకు బీజేపీ సీనియర్ నాయకులు రాజేందర్ గుప్తా పాడుకుని లడ్డూను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ నేతలు పులిరామ్, జ్ఞానేశ్వర్, లక్ష్మణ్‌రెడ్డి, బడుగు సతీష్, శ్రీనివాస్, సందీప్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవానీనగర్ గణేషుడి లడ్డూ రూ.1.52 లక్షలు

బంజారాహిల్స్: దుర్గాభవానీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి లడ్డూ వేలంపాటను బుధవారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు జరుపటి అశోక్‌కుమార్ రూ.1.52 లక్షలకు దక్కించుకున్నారు.

హనుమాన్ యూత్ అసోసియేషన్ వినాయకుడి లడ్డూ రూ. 80 వేలు



లడ్డూను దక్కించుకున్న దేరంగుల తిరుపతయ్య...

ఫిలింనగర్: ఫిలింనగర్ దుర్గాభవానీనగర్‌లో హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలంపాటలో రూ.80,000లకు దేరంగుల తిరుపతయ్య దక్కించుకున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ ప్రైవేట్ మోటర్ డ్రైవర్స్ అండ్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 22,23 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమర్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా మహాసభల గోడ పత్రికను కార్యదర్శి లతీఫ్‌తో కలిసి ఆవిష్కరించారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల మహాసభలో భాగంగా తొలి రోజులైన 22వ తేదీన భారీ ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. రెండో రోజు 23వ తేదీన ప్రతినిధుల మహాసభ జరుగుతుందని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.సాంబశివరావు, విఎస్ బోస్, రాష్ట్ర అధ్యక్షులు జమాలయ, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం పాల్గొన్నారు.

'సొసైటీ స్థలాన్ని జలమండలికి ఎలా కేటాయిస్తారు?'

బంజారాహిల్స్: యథాతథస్థితి కొనసాగించాలని హైకోర్టు తీర్పునిచ్చిన తర్వాత కూడా రెవెన్యూ అధికారులు తమ సొసైటీ స్థలాన్ని జలమండలికి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు శ్రీరాధికా కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యుడు రవికాంత్ ఆరోపించారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని తట్టికాన వాటర్ సెక్షన్ పక్కన తాము 1982లో పుక్‌రాజ్, వెంకట్‌రెడ్డి నుంచి 10 ఎకరాల పట్టా స్థలాన్ని కొనుగోలు చేశామని శ్రీ రాధికా హౌసింగ్ సొసైటీ పేరుతో సర్వే నెంబర్ ఓల్డ్ 129/90లో ధ్రువపత్రాలన్నీ తమవైపే ఉన్నాయని ఆయన అన్నారు. అయితే గత రెండు వారాల నుంచి రెవెన్యూ అధికారులు తమ స్థలంలోకి వచ్చి జలమండలికి స్థలం కేటాయించినట్లు తెలిసిందని ఈ మేరకు జలమండలి ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని ఇది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుందన్నారు. తక్షణం నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.



వీడియో జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం



ఎన్టీఆర్‌మార్గ్‌లో పేరుకుపోయిన పూజా వ్యర్థాలు



ఎన్టీఆర్ మార్గ్‌లో...

600 టన్నుల వ్యర్థాల తరలింపు

ఇంకా కొనసాగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ

- ఒక్కో షిఫ్ట్‌లో 300 మంది కార్మికులు
- 25 వాహనాల ద్వారా చెత్త తరలింపు
- నేడు కూడా కొనసాగనున్న పనులు

బంజారాహిల్స్: గణేష్ నిమజ్జనం సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజాల నుంచి 600 టన్నుల పూజా వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని 25 వాహనాల ద్వారా తరలించారు. ఇందుకోసం ప్రతిరోజూ ఒక్కో షిఫ్ట్‌లో స్వీపర్లు, ఎస్ఎఫ్‌లు కలిసి 300 మంది సిబ్బంది పని చేశారు. 13 ప్రత్యేక వాహనాలను కేటాయించి ఎప్పటికప్పుడు వ్యర్థాలతో పాటు చెత్తా చెదారాన్ని తొలగించారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 డీఎంసి రజినీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో చెత్త తరలింపు కార్యక్రమం కొనసాగింది. దీనికి తోడు నిమజ్జన శోభాయాత్రకు అడ్డుగా ఉండే చెట్లకొమ్మలు ఎక్కడికక్కడ తొలగించగా 130 టన్నుల గ్రీన్ వేస్ట్‌ను కూడా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వినాయక నిమజ్జనం సందర్భంగా పూజా వ్యర్థాలతో పాటు చెత్తా చెదారం 50 టన్నులు అదనంగా ఉండటం గమనార్హం.

నేడు కూడా స్వీపింగ్...

రజినీకాంత్‌రెడ్డి, డీఎంసీ, సర్కిల్17

నిమజ్జనం సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజాలలో గురువారం కూడా స్వీపింగ్ చేపట్టనున్నారు. ఇందుకోసం ఇతర సర్కిళ్ళ నుంచి అదనపు సిబ్బందిని తీసుకుంటాం. గురువారం రాత్రిలోగా అన్ని ప్రధాన రహదారులు సాధారణ స్థాయికి తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. బుధవారమే చాలా వరకు వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని తరలించాం. ఇంకా నిమజ్జనం కొనసాగుతుండటంతో ఆ వ్యర్థాలను కూడా ఒక్కరోజులోగా పూర్తిగా తొలగించడం జరుగుతుంది.



సెక్రటేరియట్ వద్ద..



పర్యవేక్షిస్తున్న డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి..

సమ్మెలో ఆరోగ్యశ్రీ సిబ్బంది



విధులు బహిష్కరించి ధర్నా చేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది

బంజారాహిల్స్: ఆరోగ్య మిత్రలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్య సిబ్బంది బుధవారం బంజారాహిల్స్‌లోని కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్ల పరిష్కారం జరిగే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జీఓ నెంబర్ 60 ప్రకారం నెలకు రూ.22,750లు వేతనం చెల్లించాలన్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ సిబ్బంది గుర్తించాలన్నారు. తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరిస్తేనే విధుల్లో చేరతామని తేల్చిచెప్పారు.

తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావం



ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభలో లోగోను ఆవిష్కరించిన అతిథులు

పంజగుట్ట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటుచేయాలని తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభ బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్యాల యాకయ్య అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ నూతన కమిటీని ప్రకటించడంతో పాటు లోగోను ఆవిష్కరించారు. అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర నాయకులు పశ్య పద్మ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజాలుపాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుండి నడిపి ఐలమ్మ అట్టడుగు వర్గాలకు బాసటగా నిలిచారన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్యాల యాకయ్య, కార్యక్రమంలో ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు పాల్గొన్నారు.

అంకుర ఆస్పత్రి వైద్యుల అరుదైన చికిత్స

బంజారాహిల్స్: సేఫ్టీ పిన్‌ను మింగిన మూడు నెలల పసికందును అంకురా హాస్పటల్ వైద్యులు చికిత్స అందించి కాపాడారు. శిశువు ఆస్పత్రికి తీసుకువచ్చిన 30 నిమిషాల్లో డాక్టర్ త్రిపాఠి, వైద్య బృందం పరీక్షలు జరిపి 2 సెంటీమీటర్ల సేఫ్టీ పిన్ కడుపు లైనింగ్‌లో ప్రమాదకరంగా ఉందని గుర్తించారు. ఎండోస్కోపీ, కనిష్ట ఇన్వాసివ్ టెక్నిక్ ఉపయోగించి విజయవంతంగా సేఫ్టీ పిన్‌ను తొలగించి శిశువు ప్రాణాలను కాపాడారు. ఈ సందర్భంగా అంకురా హాస్పటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపాటాలజిస్ట్ డాక్టర్ పారిజాత్ రామ్ త్రిపాఠి, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణప్రసాద్ వున్నంలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గృహోపకరణాలు కూడా చిన్నపిల్లలకు గణనీయమైన ప్రమాదాలను తెచ్చిపెడతాయని, తల్లిదండ్రులు జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంకుర హాస్పటల్ వైద్యులు



ఆకలి వేటలో అలసి..

హుస్సేన్‌సాగర్‌లో గణేష్ నిమజ్జనానికి నగర వ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా జనాలు తరలి వస్తారు. పొట్టకూటి కోసం మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ఇలా కొంత మంది వారి చిన్నారులకు గాంధీ వేషాలు వేసి సొమ్ము చేసుకుంటారు. ఆకలి వేటలో అలిసి సొలిసిన ఈ చిన్నారులు బుధవారం ఇలా కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్

అంతర్జాతీయ ప్లేస్‌మెంట్‌లు సాధించిన కేఎల్‌హెచ్ విద్యార్థులు



విద్యార్థులతో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతినిధులు..

బంజారాహిల్స్: సాంకేతిక విద్యతో భాషా అధ్యయనాలను ఏకీకృతం చేయడం ద్వారా అసాధారణమైన ఫలితాలను సాధించవచ్చని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ స్పష్టంచేశారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులకు అంతర్జాతీయ ప్లేస్‌మెంట్‌లు దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరగతి గది నుంచే విజయం ప్రారంభం కావాలన్నదే తమ లక్ష్యమని, ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. యూనివర్సిటీ విదేశీ విభాగం ఆధ్వర్యంలో అనేక మంది విద్యార్థులు జపనీస్ భాషలో ఎన్ 5 స్థాయి సర్టిఫికేషన్‌ను సాధించినట్లు పేర్కొన్నారు.

ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై కొనసాగిన ఆంక్షలు



మూసివేసిన ఖైరతాబాద్ ఫ్లై ఓవర్...

బంజారాహిల్స్: ప్రతియేటా నిమజ్జనాల తెల్లవారు మధ్యాహ్నం వరకు పూర్తయ్యే నిమజ్జనాలు ఈ సారి రాత్రి బుధవారం రాత్రి వరకు కూడా కొనసాగడంతో ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌ను రాత్రి వరకు కూడా తెరవలేదు. ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌ను మంగళవారం ఉదయం నుంచి బుధవారం రాత్రి వరకు మూసివేశారు. దీంతో సెక్రటేరియేట్ హిమాయత్‌నగర్ వైపు వెళ్ళాల్సిన వాహనదారులు లక్డీకపూల్ నుంచి వెళ్ళాల్సి వచ్చింది. దీంతో ఖైరతాబాద్ నుంచి లక్డీకాపూల్ వరకు పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది.

లంబాడీల ఐక్యవేదిక నగర కార్యదర్శిగా శ్రీనునాయక్



ఫిలింనగర్: లంబాడీల ఐక్యవేదిక గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా దుర్గా భవానీనగర్ బస్తీకి చెందిన వడ్యావత్ శ్రీను నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయనకు రాష్ట్ర చీఫ్ కో–ఆర్డినేటర్ గుగులోతు రమేష్‌జాదవ్ నాయక్ నియామక పత్రం అందజేశారు.

నేటి నుంచి 'రైజింగ్ విత్ కైండ్‌నెస్ యూత్ సమ్మిట్'

బంజారాహిల్స్: 'రైజింగ్ విత్ కై ండ్‌నెస్ యూత్ సమ్మిట్'ను ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. కామన్వెల్త్ సహకారంతో జరిగే ఈ శిఖరాగ్ర సదస్సు రెండో ఎడిషన్‌ను హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా తాజ్ కృష్ణా హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హార్ట్‌ఫుల్‌నెస్ యూత్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ నివేదిత శ్రేయాన్స్‌లు మాట్లాడారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది

అమీర్‌పేట: ఈఎస్ఐ డిస్పెన్సరీలలో పారామెడికల్ సిబ్బంది కొరత రోగులకు శాపంగా మారింది. తగినంత సిబ్బంది లేని కారణంగా సకాలంలో వైద్యం అందడం లేదు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న డిస్పెన్సరీల్లో చాలా కాలం నుండి ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి.ఈఎస్ఐ కార్డు లబ్ధిదారుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోవడం, నియామకాలు చేపట్టక పోవడంతో ఉన్న సిబ్బందిపై తీవ్ర ఒత్తిడికి లోనవుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఫార్మాసిస్టులు లేని చోట్ల ఇతర సిబ్బంది చేత మందులు ఇప్పిస్తున్నారని రోగులు వాపోతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 300 పోస్టుల వరకు ఖాళీగా ఉన్నట్లు ఈఎస్ఐ డైరెక్టరేట్ అధికారులు పేర్కొంటున్నారు. అయితే కాంట్రాక్ట్ విధానం ద్వారా 182 పారామెడికల్ పోస్టులు భర్తీ చేయాలని రెండేళ్ల క్రితం జాయింట్ డైరెక్టర్లకు గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అందుకు సంబంధించి నోటిఫికేషన్ కూడా ఇచ్చి అర్హుల నుండి దరఖాస్తులు సేకరించారు. కాని నేటి వరకు పోస్టులు భర్తీ చేయలేదు. నగరంలోని డిస్పెన్సరీల్లో రోగుల రద్దీ పెరిగి పోతున్నా సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడం విడ్డూరం.

ఆర్థిక అంశాలపై అవగాహన ఉండాలి



ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ సహకారంతో 'ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యత'పై బుధవారం అవగాహన తరగతులను నిర్వహించారు. ఆర్‌బీఐ ప్రతినిధి, గ్రేడ్ బీ అధికారిణి తాన్యా సంగ్మా హాజరై ఆర్థిక మార్పిడి విధానాలు, ఫెమా చట్టం, విద్యా లక్ష్మీ స్కీం, బ్యాంక్ అంబుడ్స్‌మెన్ చట్టం, పెట్టుబడిపై రూల్ 72 వంటి వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే అప్పుల నిర్వహణ, వడ్డీ రేట్లను అర్థం చేసుకోవడం, డబ్బును సంపాదించే ప్రక్రియలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్థిక అంశాలపై క్విజ్, చర్చలు కొనసాగాయి. యువకుల జీవితాలను ప్రభావితం చేసే ఆర్థిక వ్యవస్థల గురించి అవగాహన కల్పించడమే కాకుండా ఈ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన సమాచారాన్ని అందించిందని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు



సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని ఆలయాల హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. దేవాదాయ శాఖ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, దేవస్థానం ఈఓ శ్రీనివాసరాజుల పర్యవేక్షణలో సిబ్బంది హుండీ లెక్కింపు చేపట్టారు. మొత్తం 20 హుండీలకు సంబంధించి 170 రోజులకు గాను రూ.11,11,466ల ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అర్చకులు పాల్గొన్నారు.

నిమ్స్ వైద్యులకు ఐసీఎంఆర్ గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: కోవిడ్ కష్టకాలంలో మూడేళ్లపాటు శ్రమించి సేవలందించిన నిమ్స్ వైద్యులకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. నిమ్స్ వైద్యుల సేవల్ని ఐసీఎంఆర్ గుర్తించి ప్రశంసాపత్రాలు అందజేసింది. ప్రశంసాపత్రాలు అందుకున్నవారిలో జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ నవల్ చంద్ర, ప్రొఫెసర్ వైఎస్ఎన్ రాజు, ప్రొఫెసర్ సుబ్బలక్ష్మి, జుమనా హుస్సేన్, మైక్రో బయాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఉమాబాల, ప్రొ.తేజా, పద్మజా, ఎంవీఎల్ఎన్ రామ్మోహన్ ఉన్నారు. ఐసీఎంఆర్ సహకారంతో గాంధీ, ఈఎస్ఐ, ఎంజీఎం ఆసుపత్రులను సమన్వయం చేసుకుంటూ కొవిడ్ రోగులకు అందించిన సేవలు, వసతులు, సౌకర్యాలపై ఎప్పటికప్పుడు నివేదికలను అందించింది. ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందుకున్న వైద్యులను నిమ్స్ సంచాలకుడు నగరి బీరప్ప, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్, సీనియర్ వైద్యులు అభినందించారు.

వైర్‌మెన్ దరఖాస్తుల గడువు పొడిగింపు



సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక విద్యాశిక్షణ మండలి విద్యుత్ వైర్‌మెన్, సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తు గడువు ఈ నెల 23 వరకు పొడిగించినట్లు తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ ప్రతినిధుల బృందం సాంకేతిక విద్యా శిక్షణ మండలి కార్యదర్శి పుల్లయ్యను కలిసి వినతిపత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. అయితే సూపర్‌వైజర్ పరీక్ష తేదీలో ఎటువంటి మార్పు ఉండదని తెలియజేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డ్ కార్యదర్శి కాంతారావుకి కూడా వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. పరీక్షల కోసం ఈ మధ్యకాలంలో సెలవులు ఎక్కువగా రావడం, ఆన్‌లైన్‌లో పెట్టడం వలన అభ్యర్థులు ఇబ్బందులకు గురైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, కందుకూరి మహేష్, వినోద్ రావు సత్యనారాయణ, రామ్ రెడ్డి.ఎమ్, నరేంద్రచారి, సుధాకర్, దేశాయే గౌడ్, చింతల రాము, ఊరు పక్క నరేష్, నాగయ్య, నక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు. వైర్‌మన్ సూపర్వైజర్ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఈ నెల 23 నుంచి వారం రోజులపాటు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నక్క యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు.

కాక్‌టెయిల్ చికిత్సలొద్దు..

– జీవీకే హెల్త్ హబ్ మెడికల్ డైరెక్టర్ శాస్త్రి



సాక్షి, సిటీబ్యూరో: వైరల్ ఇన్‌ఫెక్షన్ల విషయంలో కాక్‌టెయిల్ చికిత్సలు చేసుకోవద్దని జీవీకే హెల్త్ హబ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శాస్త్రి సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది 'వరల్డ్ పేషెంట్ సేఫ్టీ'థీమ్‌గా జరుపుకోవాలని ప్రకటించింది. ఈ నేపథ్యంలో బుధవారం జీవీకే హెల్త్ హబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రోగ నిర్ధారణ విషయంలో రోగి భద్రతను మరింత మెరుగుపర్చేందుకు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కచ్చితమైన రోగ నిర్ధారణ నుంచి ఆస్పత్రుల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్లు నివారిస్తే పేషెంట్ కేర్ నాణ్యత పెరుగుతుందని వివరించారు. పేషెంట్ వ్యాధిని బట్టి డాక్టర్లు బాధ్యతాయుతంగా మందులు రాయాలని, ఇది చాలా ముఖ్యమని చెప్పారు. మందుల బ్రాండ్ పేర్లతోపాటు వాటి అసలు పేర్లు రాస్తే ఎలాంటి గందరగోళం ఉండదని, అప్పుడే రోగి సరైన చికిత్స అందుకుంటారని పేర్కొన్నారు. శాంపుల్ సేకరణ నుంచి రోగి భద్రత ప్రారంభం అవుతుందని, ల్యాబ్స్ నుంచే వారికి పేషెంట్ కేర్ సుసాధ్యం చేయాలని జీవీకే హెల్త్ హబ్ ల్యాబ్ సర్వీసెస్ డైరెక్టర్ కేవీవీఆర్ లక్ష్మి పేర్కొన్నారు. ల్యాబ్స్‌లో వ్యాధి నిర్ధారణ టెస్టులు చాలా జాగ్రత్తగా చేయాలని సూచించారు.


హెచ్‌సీఏ అండర్–19 సెలక్షన్లల్లో అవకతవకలు

– ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపణ



ఉప్పల్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) చేపట్టిన అండర్ –19 సెలక్షన్లల్లో అవకతవకలు జరిగాయని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఉప్పల్ హెచ్‌సీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హెచ్‌సీఏ అండర్–19 క్రికెట్‌లో అసలైన క్రీడాకారులకు ప్రాధాన్యత లేకుండా సెలక్షన్స్ జరిగాయని ఆరోపించారు. బాధితుల్లో కొంతమంది ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రతిభ, ఆసక్తి గల క్రీడాకారులను అనైతిక కారణాలు చూపి సెలక్షన్స్ నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 నుంచి 2025 వరకు జరిగిన సెలక్షన్స్ జరిపిన తీరును బయటపెట్టాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీఏను ప్రక్షాళన చేయాల్సి అవసరం ఉందన్నారు. హెచ్‌సీఏ అవకతవకలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానన్నారు. అవకతవకలపై హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజు, సభ్యులను కలిసి మాట్లాడినట్లు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రేపటితరానికి ఎంతో మేలు చేస్తాయని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. బుధవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

'మహా'మురుగు..

ఇంకెన్నాళ్లు?

- నిత్యం రోడ్లపై పారుతున్న డ్రైనేజీ మురుగునీరు
- ఇంకా నగానికిపైగా నిజాంకాలం నాటి పైప్‌లైన్ వ్యవస్థే
- అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ల సామర్థ్యం పెరిగేనా?
- ఇప్పటికైనా జలమండలి దృష్టి సారించేనా?



ఫైల్

సాక్షి, సిటీబ్యూరో: ఇంకెన్నాళ్లు.. ఈ 'మహా'మురుగు!? హైదరాబాద్ మహానగరంలో ఎక్కడ చూసినా రోడ్లపై నిత్యం మురుగు పరుగులే.. ముక్కుపుటాలదిరే దుర్వాసనే. పెరుగుతున్న గృహాలకు తగిన సామర్థ్యం మేర అండర్ గ్రౌండ్ సీవరేజి పైప్‌లైన్ల వ్యవస్థ లేదు. అక్కడక్కడా పైప్‌లైన్ వ్యవస్థ దెబ్బతినడంతోపాటు సగం వరకు పగిలి, సరిగ్గా మూతల్లేని మ్యాన్‌హోళ్లు నోళ్లు తెరుచుకొని ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ప్రతినిత్యం సామాన్యుల నుంచి ప్రజా ప్రతినిధులు, సీఎం వరకు ప్రయాణించే మార్గాల్లో సైతం ఇదే పరిసితి నెలకొంది. మురుగు నీటి వ్యవస్థ నిర్వహణను పర్యవేక్షించే జలమండలి డ్రైనేజీ పైపులైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ పేరుతో తాత్కాలిక పనులు కొనసాగిస్తూ చేతులు దులుపుకుంటుందే తప్ప శాశ్వత పరిష్కారానికి చొరవ చూపడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలంలో చిన్నపాటి వాన పడినా డ్రైనేజీలు పొంగిపార్లి మురుగునీరు రోడ్లపైనే కాకుండా ఇళ్లలోకి సైతం వెళ్తున్న దుస్థితి నెలకొంది.



సామర్థ్యానికి మించి మురుగు కనెక్షన్లు..

మహానగరంలో దినసరి 2,815 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ ఫర్ డే) మురుగునీరు వస్తుండగా, ప్రస్తుతం పైప్‌లైన్ల సామర్థ్యం 796 ఎంఎల్‌డీ మించి లేదని అధికారిక గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు మురుగునీటితోపాటు వ్యర్థాలు కూడా వదులుతుండటంతో అక్కడక్కడా పైప్‌లైన్లు స్తంభించిపోయి బయటికి చొచ్చుకొని వస్తోంది. మురుగు సమస్య పరిష్కారానికి సరికొత్త సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నా, అది కాస్త మూణ్ణాళ్ల ముచ్చటగా మారుతోంది.

కేవలం పదివేల కిలోమీటర్ల లోపే...

మహానగరం నలుమూలలు విస్తరిస్తున్నా మురుగునీటి భూగర్భ పైప్‌లైన్ వ్యవస్థ విస్తరణ 9,769.74 వేల కిలోమీటర్లకు మించిలేదు. అందులో సుమారు 612 కిలోమీటర్లు ట్రంక్‌లైన్లు ఉన్నాయి. మొత్తం మీద వాటిపై 6,31379 మ్యాన్‌హోళ్లు ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం పెరుగుతున్న గృహ సముదాయలకు అనుగుణంగా మరో 8 వేల కిలోమీటర్ల డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు అవసరం. వాటిపై మరో ఆరువేల వరకు మ్యాన్ హోల్స్ అవసరం ఉందని గణాంకాలు సైతం స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ప్రధాన మార్గాల్లో సుమారు రెండు లక్షల వరకు మ్యాన్ హోళ్లు ఉంటాయన్నది అంచనా.

నిజాం కాలం నుంచే...

నగరంలో నిజాంకాలం నుంచే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కొనసాగుతోంది. అప్పట్లో వరద నీళ్లు పోయేందుకు నాలాలు, నివాసాలు, ఇతర నిర్మాణాల నుంచి వెలువడే మురుగునీటిని తరలించేందుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అప్పటి జనాభాకు ఐదింతలు పెరిగినా కూడా సీవరేజి పైపులైన్లు పనిచేసేలా పక్కా ప్లానింగ్‌తో నిర్మాణాలు చేపట్టారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ నగర జనాభా 25 రెట్లు పెరిగినా పాతకాలం నాటి డ్రైనేజీలు ఇప్పటికీ కోర్‌సిటీలో వినియోగంలో ఉండటం విశేషం. అవి చాలాచోట్ల దెబ్బతినడం, కెపాసిటీ సరిపోకపోవడంతో మురుగునీళ్లు రోడ్లపై పారుతున్నాయి.

పైప్‌లైన్ల క్లీనింగేది..?

మహానగరంలో భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ల క్లీనింగ్ వ్యవస్థ అంతంత మాత్రంగా తయారైంది. ఫలితంగా సుమారు 600కిపైగా ప్రాంతాల్లో నిత్యం మురుగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది.కోర్ సిటీలో నిజాంకాలం నాటి పైపులైన్లను కొన్ని ప్రాంతాల్లో రిస్టోర్ చేసినా.. ఎప్పటికప్పుడు పైప్‌లైన్ క్లీనింగ్‌పై పర్యవేక్షణ లోపించింది. పూడికతీత కోసం యంత్రాలు వినియోగిస్తున్నా పనితీరు మొక్కుబడిగా తయారైంది. ప్రస్తుతం 212పైగా జెట్టింగ్ మెషీన్లు, 1,327 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నా క్షేత్రస్థాయిపై పర్యవేక్షణలోపంతో పైప్‌లైన్ వ్యవస్థ క్లీనింగ్ సరిగాలేదు.

ఫిర్యాదులకు స్పందన అంతంతే..

మురుగు సమస్యపై వస్తున్న ఫిర్యాదుల స్పందన కూడా అంతంత మాత్రమే. నిత్యం మురుగు పొంగే సగం ప్రాంతాల నుంచి మాత్రమే జలమండలి కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు వస్తుంటాయి. దినసరి ఫిర్యాదుల సంఖ్య వెయ్యికిపైగానే ఉంటుందన్నది అధికార రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గతేదాడితో పోల్చితే ఈ ఏడాది ఫిర్యాదుల సంఖ్య మరో 50 శాతం పెరిగాయి. ఎక్కువగా రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోందని, గృహలైన్లు స్తంభించాయని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికైనా జలమండలి అధికారులు డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తారా..? లేక ప్రేక్షక పాత్ర పోషిస్తారా? అనేది వేచిచూడాల్సిందే.

జలమండలి కాల్ సెంటర్‌కు ఈ ఏడాది అందిన ఫిర్యాదులు...

నెల	రోడ్లపై ఓవర్‌ఫ్లో	స్తంభించిన గృహలైన్లు
జనవరి	32,343	14,313
ఫిబ్రవరి	32,301	14,874
మార్చి	33,195	15,928
ఏప్రిల్	31,059	16,093
మే	43,991	20,635
జూన్	38,176	17,373
జూలై	30,814	14,390
ఆగస్టు	31,534	13,345

ఎమ్మార్‌సీఈలో 'ల్యాబ్ ఆన్ వీల్స్'



మొబైల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, ఇన్ఫోసిస్ ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో మొదటిసారిగా ఇన్ఫోసిస్ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్ సహకారంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. బుధవారం ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం 5 రోజులపాటు సాగనుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడుతూ సమాజానికి ప్రయోగాత్మక విద్యను ఏ ప్రాంతంలోనైనా అందించాలనే ఉద్దేశంతో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్ అనే మొబైల్ ల్యాబ్ ప్రారంభించిందని తెలిపారు. తెలంగాణలో మొదటిసారిగా తమ కళాశాలలో మొబైల్ ల్యాబ్ విద్యార్థులకు అందుబాటులో ఉంచడం సంతోషకరం అన్నారు. ల్యాబ్‌లో 3డి ప్రింటింగ్, 4.0 కిట్స్, ల్యాప్‌టాప్ వంటి పరికరాలతోపాటు ఇద్దరు ట్రైనర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎమ్మార్‌సీఈతోపాటు ఇతర కళాశాలల విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లకు ఆఫర్

సాక్షి, సిటీబ్యూరో: మొండి బకాయిలను ఒకేసారి సెటిల్‌మెంట్ చేసుకునేందుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా బంపర్ ఆఫర్ ప్రకటించింది. రుణాలు తీసుకుని మొండి బకాయిలు పడిన కస్టమర్ల కోసం ఆకర్షణీయమైన డిస్కౌంట్‌లతో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకునేందుకు సంఝౌతా కార్నివల్ పేరిట అవకాశం కల్పిస్తోంది. ఈ మేరకు బుధవారం బ్యాంక్ అధికారిక వర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు ఈ అవకాశం కల్పిస్తున్నామని, ఖాతాదారులు సంబంధిత బ్రాంచ్‌ను సందర్శించి రుణాల నుంచి విముక్తి కావాలని బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు.

రాందేవ్ రావ్ హాస్పిటల్‌కు అరుదైన గుర్తింపు

ఎన్‌ఏబీహెచ్ డిజిటల్ స్టాండర్డ్స్‌లో ప్రముఖ స్థానం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావ్ హాస్పిటల్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్(ఎన్‌ఏబీహెచ్) గుర్తింపు లభించింది. ఉత్తమ ఆరోగ్య ప్రమాణాలు పాటించినందుకుగాను ఈ గుర్తింపు లభించింది. ఈ మేరకు ఎన్‌ఏబీహెచ్ ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆసుపత్రి క్వాలిటీ జనరల్ మేనేజర్ క్రాంతికుమార్ అవార్డు అందుకున్నారు. ఆరోగ్య ప్రమాణాల విభాగంలో దేశవ్యాప్తంగా వంద, రాష్ట్రంలో నాలుగు ఆసుపత్రులను ఎన్‌ఏబీహెచ్ గుర్తించింది. తమ హాస్పిటల్ రజత పతకం సాధించటం సంతోషంగా ఉందని హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, సీఈఓ యోబు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంతటి అరుదైన గుర్తింపును పొందటం ఎంతో గర్వించదగిన విషయమని ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు విక్రమ్‌దేవ్‌రావు, మీరా రావు, అపర్ణ, ప్రశాంత్‌రావు అన్నారు. క్వాలిటీ కంట్రోల్ టీం జనరల్ మేనేజర్ క్రాంతి కుమార్, భారతి, ఐటీ సర్వీస్ మేనేజర్ రవీందర్, గోపికృష్ణ, ఉమాశంకర్, సిబ్బందిని వారు అభినందించారు.

గవర్నర్‌తో కజకిస్తాన్ కాన్సుల్ భేటీ

– మెరుగైన ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ



సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కజకిస్తాన్ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ బుధవారం భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఇటీవల అలీఖాన్ కజకిస్తాన్ రాజధాని అస్తానాలో అధికారిక పర్యటించిన సందర్భంగా జరిపిన చర్చలను గవర్నర్‌కు వివరించారు. హైదరాబాద్ – అస్తానా మధ్య విమాన సర్వీసులు ప్రారంభించే అవకాశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగిందని, కజకిస్తాన్ అధికారులు ఈ విమాన సర్వీసులు ప్రారంభించడానికి ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది చివరలో వారు హైదరాబాద్‌కు వస్తారని, జీఎంఆర్ విమానాశ్రయ అధికారులు, భారతీయ ఎయిర్‌లైన్ ఆపరేటర్లతో భేటీ అవుతారని అలీఖాన్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కజకిస్తాన్ కాన్సులేట్ భాగస్వామ్యంతో పర్యాటక ప్రమోషన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య పర్యాటక సంబంధాలను బలోపేతం చేయడానికి కజకిస్తాన్ టూరిజం నేషనల్ కంపెనీ జేఎస్సీ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ కైరాత్ సద్వకసోవ్ నవంబర్ లేదా డిసెంబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి జిల్లాలో జలశక్తి కేంద్రాలు

- నీటి సంరక్షణ కోసం శాస్త్రీయ వ్యూహాలు
- జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ సుశీల్ కుమార్ సింగ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రతి జిల్లాలో జలశక్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ సుశీల్ కుమార్‌సింగ్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో జలశక్తి అభియాన్ 'క్యాచ్ ది రెయిన్–2024 నారిశక్తి సే జలశక్తి'అనే ఇతివృత్తంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సంరక్షణకు శాస్త్రీయ వ్యూహాలు అవసరమని అభిప్రాయపడ్డారు. నీటి సంరక్షణ, నిర్వహణలో మహిళలు కీలక భూమిక నిర్వహించాలని, నీటి సంరక్షణ, ప్రాముఖ్యత, భూగర్భ జలాలు, నాణ్యమైన నీటి సరఫరా, స్వచ్ఛమైన నీటి వనరుల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జలశక్తి అభియాన్‌లో భాగంగా నీటి సంరక్షణ ద్వారా హైదరాబాద్ జిల్లాను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలో వెయ్యికిపైగా సరస్సులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా రెయిన్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. వాటర్ రీచార్జ్ గుంతలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చట్టవిరుద్ధంగా బోర్ వెల్‌లను ఏర్పాటు చేయకుండా వాల్టా చట్టం అమలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి కే జగన్నాథరావు, డీఈవో ఆర్.రోహిణి, డాక్టర్ ఎం.సుధీర్ కుమార్, పి. సంధ్యారాణి, జీహెచ్‌ఎంసీ ఈఈ ఎ.నారాయణ, హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ సీజీఎం ఎస్. పద్మజ, సర్కిల్ మేనేజర్ జి.జ్యోత్స్న ప్రియదర్శిని, ఎన్జీవో కల్పనా రమేష్, బి.పుష్పలత, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సుశీల్‌కుమార్ సింగ్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌గా రాజశేఖర్



గన్‌ఫౌండ్రీ: టీమ్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌గా వీఎస్ రాజశేఖర్ బుధవారం నియమితులయ్యారు. ఈనెల 21వ తేదీ నుంచి ఆస్ట్రేలియాలో జరగుతున్న కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ సీనియర్, జూనియర్ యూత్ చాంపియన్‌షిప్ పోటీలకు కోచ్‌గా వ్యవహరించనున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన స్పోర్ట్స్ అథారిటీ కృతజ్ఞతలు తెలిపారు.

అగ్రి వర్సిటీ పాలిటెక్నిక్ డైరెక్టర్ ధర్మారెడ్డి మృతి



ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్ కళాశాల డైరెక్టర్ కె.ధర్మారెడ్డి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం మృతి చెందారు. 1985లో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శాస్త్రవేత్తగా ఉద్యోగంలో చేరారు. ఆ తరువాత వివిధ కళాశాలల్లో పనిచేశారు. 1989–2011 వరకు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో పనిచేశారు. 2011–2013 వరకు పాలెం పాలిటెక్నిక్ కళాశాలలో, 2013–2016 వరకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేసి 2016లో పదవీవిరమణ చేశారు. 2016–2022 వరకు కన్సల్టెంట్‌గా పనిచేసి ఆ తరువాత హెటిరో డ్రగ్స్‌లోని అనురాగ్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో కూడా పనిచేశారు.

'ఎల్వీ ప్రసాద్'కు అరబిందో మద్దతు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని రుద్రారంలో ఏర్పాటు చేయబోయే నేత్ర సంరక్షణా కేంద్రంలో ఓపీ సేవల విషయంలో మద్దతు ఇస్తామని అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రకటించింది. రుద్రారం గ్రామంలోని ఎకరం ప్రాంగణంలో పెట్టబోయే నూతన 20,000 చదరపు అడుగుల ద్వితీయశ్రేణి నేత్ర సంరక్షణా కేంద్రంలో ఔట్ పేషెంట్ సౌకర్యం ఒక భాగంగా ఉంటుంది. ఆధునిక పరికరాలు, సుశిక్షితులైన ఎల్వీపీఇఐ నేత్ర సంరక్షణా సిబ్బంది కలిగిన ఈ కేంద్రం అంధత్వాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఈ ప్రాంతానికి నాణ్యమైన సేవలను అందిస్తుందని వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్వీ ప్రసాద్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జీఎన్‌రావు, ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు డా.ప్రశాంత్ గార్గ్‌కు అరబిందో ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కు అందజేశారు. అంధత్వం నివారించడంలో తాము భాగస్వామ్యం అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి పేర్కొన్నారు.

రైల్వే ప్రాజెక్ట్‌లకు కేంద్ర సహకారం: ఈటల



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజిగిరి: రాష్ట్ర ప్రభుత్వం సహకరించినా, సహకరించకపోయినా కేంద్రం సహకారంతో రైల్వే ప్రాజెక్ట్‌లు పూర్తి చేస్తామని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం సఫిల్‌గూడ రైల్వే స్టేషన్‌లో సుమారు రూ 2.23 కోట్లతో చేపట్టిన బుకింగ్ ఆఫీస్, పార్కింగ్ ఏరియా అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ రైల్వే ప్రాజెక్ట్‌లపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని కొన్ని రైల్వే స్టేషన్లు, రైల్వేలైన్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. సుమారు రూ 749 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను విమానాశ్రయం తరహాలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపారు. మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న వాజ్‌పేయినగర్ ఆర్‌యూబీ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని, ఎంపీ సహకారంతో నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రవణ్, మేకల సునీతాయాదవ్, రాజ్యలక్ష్మి, గున్నాల సునీతాయాదవ్, హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయి, ట్రావెలర్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ తదితరులు పాల్గొన్నారు.



టికెట్ కౌంటర్ ప్రారంభించి కొనుగోలు చేసిన ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మర్రి

మేదర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జంటనగరాల మహేంద్ర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్



చిక్కడపల్లి: రూ.వెయ్యి కోట్లతో మేదర ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జంటనగరాల మహేంద్ర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. మేదర కులస్తులకు సబ్సిడీపై వెదురు సరఫరా చేయాలన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ప్రపంచ వెదురు దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీడు భూముల్లో వెదురు పెంచేందుకు ప్రతీ కుటుంబానికి 5 ఎకరాలు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఉచితంగా వెదురు మొక్కలను సరఫరా చేయాలన్నారు. వెదురు సహకార సంఘాలను పునరుద్ధరించాని కోరారు. ఉప్పల్ భగాయత్‌లో మేదర ఆత్మగౌరవ భవన నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లి గురుమూర్తి, కోశాధికారి కైలాష్‌కుమార్, ఉపాధ్యక్షుడు పిల్లి రాంకుమార్, ప్రచార కార్యదర్శి కె.నర్సింగ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాతకోటి సూర్యప్రకాష్, సంయుక్త కార్యదర్శి పి.రామకృష్ణ, సభ్యులు జే.శ్యామ్‌కుమార్, కె.రమేష్, ఎ.ప్రసాద్, పి.రాజగోపాల్, సత్యనారాయణ, పి.మహేందర్, జె.చందర్, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకృతి ఎగ్జిబిషన్



నగరంలోని హోటల్ తాజ్ దక్కన్ వేదికగా 18, 19, 20 తేదీల్లో కొనసాగే ఆకృతి ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకులు శశినాథ ప్రారంభించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 19, సెప్టెంబర్, 2024



హైదరాబాద్ వైబ్స్

► యాంటిక్ లొకేషన్స్‌కు ఈ తరం ఫిదా
► చార్మినార్ మొదలు పురానాపూల్ వరకు సెల్ఫీ క్లిక్స్
► సోషల్ మీడియాలో సందడి చేస్తున్న సెల్ఫీ ఫొటోలు

మనిషి జీవనశైలిలో వచ్చిన అధునాతన మార్పుల్లో సెల్ఫీకి ప్రత్యేక స్థానముంది. ప్రస్తుత జీవన విధానంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ఎక్స్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సాప్.. ఇలా ఎన్నో వేదికలపై సెల్ఫీ అజరామరంగా వెలుగుతోంది. 2012 తర్వాత సెల్ఫీ అనే వ్యాపకం గ్లోబల్ వేదికగా తన ప్రశస్తిని పెంచుకూంటూ వస్తోంది. అయితే.. ప్రస్తుతం నగరంలోని ఓల్డ్ సిటీ సెల్ఫీ స్పాట్స్‌గా గుర్తింపు పొందుతోంది. తమని తాము మాత్రమే కాకుండా తమ వెనుక ఓ చారిత్రక కట్టడం, వారసత్వ వైభవాన్ని క్లిక్‌మనిపించడం ఈ తరానికి ఓ క్రేజీ థాట్‌గా మారింది. ఇందులో భాగంగానే పాతబస్తీలోని కొన్ని ప్రాంతాలు సెల్ఫీ స్పాట్స్‌కు హాట్‌స్పాట్స్‌గా మారాయి..! - సాక్షి, సిటీబ్యూరో



సిటీ స్పాట్స్.. సెల్ఫీ షాట్స్

సెల్ఫీ స్పాట్స్‌గా మారిన పాతబస్తీ అందాలు

ప్రస్తుతం హైదరాబాద్ అంటే ఐటీ, మోడ్రన్ లైఫ్ వంటి విషయాలు మదికి వస్తాయేమో కానీ.., గతంలో మాత్రం చార్మినార్ గుర్తొచ్చేది. ఇప్పటికీ కూడా హైదరాబాద్‌ను మొదటిసారి సందర్శించిన ప్రతి ఒక్కరూ చార్మినార్‌ను చూడాలనే అనుకుంటారు. అనుకోవడమే కాదు.. నగరానికొచ్చి చార్మినార్‌తో సెల్ఫీ తీసుకోలేదంటే ఏదో అసంతృప్తి. ఇలా సిటీలో బెస్ట్ సెల్ఫీ స్పాట్‌గా చార్మినార్ అందరినీ దరిచేర్చుకుంటుంది. ఉదయం వాకింగ్ మొదలు అర్ధరాత్రి ఇరానీ ఛాయ్ ఆస్వాదించే వారి వరకు ఈ చార్మినార్‌తో సెల్ఫీ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఓల్డ్ సిటీ ఇప్పటికీ తన వైభవాన్ని సగర్వంగా నిలుపుకుంటుంది అంటే చార్మినార్ వల్లే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ మధ్య కాలంలో అర్ధరాత్రి నగరవాసులు అతి ఎక్కువగా సందర్శిస్తున్న ప్రాంతాల్లో ఈ సెల్ఫీ స్పాట్ ఒకటి.

ఓల్డ్‌సిటీ షాపింగ్ అంటే లక్షల క్లిక్కులే..

ఓల్డ్ సిటీ అంటే ఒక్క చార్మినార్ మాత్రమే కాదు.. ఇక్కడ దొరికే మట్టి గాజులకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. షాపింగ్ అంటే నో చెప్పని యువతులు ఉన్నారంటే అతిశయోక్తి కాదేమో. యువతుల మనస్సును హత్తుకునే ఎన్నో అలంకరణ వస్తువులు, గాజులు, డ్రెస్ మెటీరియల్స్ ఇక్కడ విరివిగా లభ్యమవుతాయి. రంజాన్ సీజన్‌లో ఇక్కడ షాపింగ్ చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి సైతం రావడం విశేషం. ఈ సమయంలో ఇక్కడే లక్షల సెల్ఫీలు క్లిక్, క్లిక్‌మంటుంటాయి.





మిడ్ నైట్ స్పాట్.. నిమ్రా

చార్మినార్ పక్కనే ఉన్న నిమ్రా కేఫ్ కూడా ది బెస్ట్ సెల్ఫీ స్పాట్‌గా మారింది. ఇక్కడ టీ తాగుతూ సెల్ఫీ తీసుకోవడం, అది కూడా అర్ధరాత్రి ఛాయ్‌కి రావడం ఇక్కడి ప్రత్యేకత. పాతబస్తీకి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఛాయ్ ఆహ్వానించడం నిమ్రా కేఫ్ ప్రత్యేకత. ప్రముఖ బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్దికీ ఇదే కేఫ్‌లో సెల్ఫీ దిగి అక్కడే ఫోన్ మర్చిపోయి ఎయిర్‌పోర్ట్ వెళ్లాడు. అయితే అంతే జాగ్రత్తగా తన ఫోన్ తనకు తిరిగి రావడంతో నగరవాసులపై గౌరవం పెరిగిందని చెప్పుకున్నారు. దీనికి సమీపంలోని షాగౌస్ బిర్యాని తింటూ సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఓ ట్రెండ్. ఇలా పిస్తాహౌజ్, ఇరానీ ఛాయ్, పాయా సూప్ తదితర ఫుడ్ స్పాట్‌లు సెల్ఫీ స్పాట్‌లుగా మారాయి.



యాంటిక్ స్పాట్ 'ఇత్వార్ మార్కెట్'..

ఓల్డ్‌సిటీలో ఎన్నో ఏళ్లుగా ప్రతీ ఆదివారం జరిగే ఇత్వార్ మార్కెట్(సండే మార్కెట్)కు ఎంతో విశిష్టత ఉంది. ఇంట్లో వినియోగించే నట్లు, బోల్టులు మొదలు హెలికాప్టర్‌కు వాడే పనిముట్ల వరకు ఇక్కడ లభ్యమవుతాయని ప్రశస్తి. ఈ మార్కెట్‌కు పొద్దుపొద్దున్నే పోయి నచ్చిన వస్తువులను కొనుక్కోవడం ఎంతో మందికి వ్యాపకం. అయితే.. అక్కడ కనిపించే యాంటిక్‌పీస్, అరుదైన వస్తువులతో సెల్ఫీ తీసుకోవడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది.

మొదటి 'సెల్ఫీ'..

సెల్ఫీ అనే పదాన్ని మొట్టమొదటిసారిగా ఆస్ట్రేలియాలోని ఓ న్యూస్ వెబ్‌సైట్‌లో వాడారు. కానీ సెల్ఫీ అనే పదం ప్రాచుర్యం పొందింది మాత్రం 2012 తర్వాతే అని చెప్పాలి. సోషల్ మీడియా ఊపందుకుంటున్న 2013లో ఈ సెల్ఫీ అనే కొత్త పదం విపరీతంగా చక్కర్లు కొట్టింది. ముఖ్యంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ పదం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ డిక్షనరీ సెల్ఫీ అనే పదాన్ని 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపిక చేసింది.

చింత చెట్టు కింద సెల్ఫీ..

హైదరాబాద్ నగరంలో 1908లో వచ్చిన వరదలకు దాదాపు 15 వేల మందికి పైగా మరణించారు. ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో చాలా ప్రాణనష్టం జరిగింది. ఈ తరుణంలో అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా హాస్పిటల్‌కు సమీపంలో ఉన్న చింతచెట్టు దాదాపు 150 మంది ప్రాణాలను కాపాడింది. వరదల్లో చిక్కుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న నగరవాసులు ఈ చెట్టు ఎక్కి తమ ప్రాణాలను దక్కించుకున్నారు. అయితే ఇప్పటికీ ఈ చెట్టు పటిష్టంగా ఉంది. ఈ చరిత్ర తెలిసిన వారు ఆ సమీపంలోకి వెళ్లినప్పుడు ఓ సెల్ఫీ తీసుకోవడం మాత్రం మరిచిపోరు.

ఈ వీధులన్నీ సెల్ఫీలమయమే..

పాతబస్తీలోనే కొలువుదీరిన సాలార్‌జంగ్ మ్యూజియం, వందేళ్ల సిటీ కాలేజ్, హైకోర్టు పరిసర ప్రాంతాలు, పురానాపూల్, చార్మినార్ చౌరస్తా కేంద్రంగా నాలుగు దిక్కుల్లోని విధుల్లో నిర్మించిన కమాన్‌లు కూడా సెల్ఫీ స్పాట్‌లుగా మారాయి.



ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకునేలా..

బంజారాహిల్స్: నగరంలో తొలిసారిగా ఆర్టిస్టిక్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో బేతల్ పేరుతో ఈ నెల 30వ తేదీన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నటి స్రవంతి చొక్కారపుతో పాటు పలువురు మోడల్స్ ఎగ్జిబిషన్‌ను బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు ప్రసన్న మాట్లాడుతూ లగ్జరీ ఫ్యాషన్ ఉత్పత్తులు ఆర్టిస్టిక్‌వేలో రూపొందించిన డిజైనర్లు తయారు చేసిన ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాషన్ లవర్స్‌కు ఇక్కడే లభించే ఉత్పత్తులు ఎంతగానో నచ్చుతాయని వారు తెలిపారు.



అందరికీ.. సూట్ అయ్యేలా

సిటీలో.. వందేళ్ల బ్రాండ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వేదికగా వందేళ్ల వారసత్వ చరిత్ర కలిగిన ప్రముఖ సూట్ మేకర్ పీఎస్ రావు ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ఆవిష్కరించారు. పీఎస్ రావు భాగస్వాములు, మూడు తరాల వ్యాపారవేత్తలు మచ్చేందర్ పిషి, కేతన్ పిషి, నవీన్ పిషి జూబ్లీహిల్స్‌లో బుధవారం ఈ స్టోర్‌ను ప్రారంభించారు. కేతన్ పిషి మాట్లాడుతూ.. నాణ్యత పట్ల అత్యున్నత స్పృహ, ఫ్యాషన్ హంగులపై అవగాహన మెండుగా ఉన్న నగరంలో తమ 8వ స్టోర్ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. నగరంలోని రెడీ టు వేర్ వస్త్రాలు, నాణ్యతను మిళితం చేసే క్లాసిక్ బెస్పోక్ టైలరింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను తమ స్టోర్ తీర్చనుందని వివరించారు. పురుషుల ఫైన్ సూటింగ్ పరిశ్రమలో బెంగళూరులో వందేళ్ల ఘన చరిత్ర ఉన్న తమ బ్రాండ్ ముత్యాల నగరంలోనూ సూట్ కాన్సర్జీ సేవలు అందించనున్నామని చెప్పారు.





అతిపెద్ద డిజైన్ ఫెస్టివల్ 'డిజైన్ డెమోక్రసీ'

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా అతిపెద్ద డిజైన్ ఫెస్టివల్ 'డిజైన్ డెమోక్రసీ 2024'ను అక్టోబర్ నెలలో నిర్వహించనున్నారు. వచ్చేనెల 4 నుంచి 6వ తేదీ వరకు హైటెక్స్ వేదికగా కొనసాగే ఈ డిజైన్ ఫెస్టివల్ తెలంగాణ ప్రతిభ, నైపుణ్యాన్ని ప్రదర్శించే వేడుకగా నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని బుధవారం హోటల్ రాడిసన్ బ్లూ వేదికగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పల్లికా శ్రీవాస్తవ్ మాట్లాడుతూ.. కళ, రూపకల్పనకు సమ్మిళిత వేదికను సృష్టించడమే లక్ష్యంగా 'డిజైన్ డెమోక్రసీ' ఏర్పాటు చేస్తున్నామన్నారు. సృజనాత్మకత, వైవిధ్యాన్ని భవిష్యత్ ట్రెండ్‌లకు అందించే అద్భుత వేదికను రూపొందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు హస్తకళలు, ఆవిష్కరణల నగరంగా గుర్తింపు ఉందని, లైటింగ్, ఫర్నిచర్ మొదలు ఆర్కిటెక్చరల్ ఫొటోగ్రఫీ వరకు స్థానిక ప్రతిభను ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నామని డిజైన్ డెమోక్రసీ సహ–వ్యవస్థాపకురాలు శైలజా పట్వారీ పేర్కొన్నారు. లైటింగ్, ఆర్ట్, ఫర్నిచర్, రగ్గులు, యాక్సెసరీస్ విభాగాలతో సహా బహుళ విభాగాల్లో ఎగ్జిబిటర్లు ఉత్పతులు ప్రదర్శిస్తారని వివరించారు. తెలంగాణ మ్యూజియం నుంచి బ్రాండ్ డైరెక్టర్ మాన్సీ నేగి, క్యూరేటర్ సుప్రజా రావు అసాధారణమైన షోకేస్‌లను క్యూరేట్ చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు.



డిజైర్.. @ తాజ్..

బంజారాహిల్స్: విభిన్న రకాల దుస్తులు, ధగధగలాడే ఆభరణాలు ధరించి మోడల్స్ సందడి చేశారు. బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో డిజైర్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. నగరంలోని పలువురు మోడల్స్ ఉత్సాహంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో లగ్జరీ ఫ్యాషన్ ఉత్పత్తులతో పాటు వెడ్డింగ్, లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ దుస్తులు, ఆభరణాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రముఖ డిజైనర్లు రూపొందించిన విభిన్న రకాలు వస్తువులు ఇక్కడ లభ్యమవుతాయని నిర్వాహకురాలు అనితా అగర్వాల్ తెలిపారు.

హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో

శ్రీనగర్‌కాలనీ: చేనేతకారుల ఉత్పత్తులను ప్రతిఒక్కరూ ధరించి ప్రోత్సహించాలని మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతిరెడ్డి, సోషలిస్ట్ సుధాజైన్ అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో హంస ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో ది లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో పేరిట చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రీతిరెడ్డి, సుధాజైన్ హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. చీరలను తిలకించి చేనేతకారులను అభినందించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారు 70స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని నిర్వాహకురాలు శైలజా యముసామి తెలిపారు. ఈ నెల 26 వరకూ ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు.





అశ్విత.. పాకశాస్త్ర ప్రావీణ్య!

పాకశాస్త్రంలో సత్తాచాటిన తెలంగాణ అమ్మాయి

పాటిస్సేరీ-కన్ఫెక్షనరీ' స్కిల్‌లో కాంస్య పతకం

సంగారెడ్డి నుంచి ఫ్రాన్స్‌లోని లియాన్ దాకా..

ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్న అశ్విత పోలీస్

తనను తాను ప్రూవ్ చేసుకునేందుకు రాత్రింబవళ్లు కష్టం

సాక్షి, సిటీబ్యూరో: నలుగురు అమ్మాయిల్లో రెండో కుమార్తె.. చిన్నతనంలోనే తనను తాను ప్రూవ్ చేసుకోవాలని నిర్ణయించుకుంది. తనకిష్టమైన రంగంలో పేరు తెచ్చుకోవాలని కష్టపడింది. పాకశాస్త్రంలో ప్రావీణ్యం సాధించింది. అందుకు ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపింది. రోజుకు 12–14 గంటల పాటు శ్రమించింది. చివరకు తన కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. దేశ ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై రెపరెలాడించింది. దేశ గౌరవాన్ని మరో అందలం ఎక్కించింది. ఆమే.. అశ్విత పోలీస్. సంగారెడ్డికి చెందిన అశ్విత తాజాగా పారిస్‌లోని



లియోన్‌లో జరిగిన వరల్డ్ స్కిల్ కాంపిటీషన్‌లో 'పాటిస్సేరీ-కన్ఫెక్షనరీ' విభాగంలో బెస్ట్ ఆఫ్ నేషన్ అవార్డును అందుకుంది. కాంస్య పతకం కూడా సాధించింది. తెలంగాణ నుంచి ఈ అవార్డు సాధించిన ఏకైక మహిళ అశ్విత కావడం ప్రశంసనీయం.

ఎన్నో ఇబ్బందులకు ఎదురొడ్డి..!

అశ్విత తండ్రి రవీందర్ ఎలక్ట్రీషియన్.. తల్లి అరుణ గృహిణి.. ఇంటి ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే.. ఆ తండ్రి పడే కష్టాలను ఆమె అర్థం చేసుకుంది. చదువు మాత్రమే తమ నిర్ణయాలు తాము తీసుకునే వెసులుబాటు కల్పిస్తుందని మనసావాచా నమ్మింది. బంధువుల నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వాటికి ఎదురొడ్డింది. సంకల్పంతో ముందడుగు వేసింది. బేగంపేటలోని శ్రీశక్తి కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా చేసింది. ప్రస్తుతం పార్ట్‌టైం జాబ్ చేస్తూ డిగ్రీ చేస్తోంది. హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో నిలదొక్కుకోవాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుందని అశ్విత చెబుతోంది. తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశంతో డబుల్ ఇంటర్న్‌షిప్‌లు చేస్తూ చదువు కొనసాగించానని పేర్కొంది. రెండు, మూడు రోజులు కనీసం నిద్ర కూడా లేకుండా కష్టపడ్డ రోజులు చూశానని, రోజుకు 12–14 గంటలు కష్టపడితేనే ఇవాళ గుర్తింపు వచ్చిందని గుర్తు చేసుకుంది. ప్రస్తుతం పార్ట్‌టైం జాబ్ చేస్తూ బెంగళూరులో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది.

రెండేళ్లకోసారి పోటీలు..

పాకశాస్త్రంలో నైపుణ్యతపై రెండేళ్లకోసారి పోటీలు జరుగుతుంటాయి. 2024 పోటీలకు సంబంధించి 2022 డిసెంబర్‌లోనే ప్రాసెస్ ప్రారంభమైంది. తొలుత రీజినల్ లెవల్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. ఇందులో మెరుగైన ప్రదర్శన ఇస్తే.. జాతీయ స్థాయికి అర్హత సాధిస్తారు. ఇలా జాతీయ స్థాయిలో కూడా ఆయా విభాగాల్లో టాప్ వచ్చిన వారిని అంతర్జాతీయ స్థాయిలో జరిగిన వరల్డ్ స్కిల్స్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. ఇలా అశ్వితకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గోల్డ్ గెలుచుకుంది. లియోన్‌లో జరిగిన పోటీలకు దాదాపు 70 దేశాల నుంచి 1,400 మంది పాల్గొన్నారు. కేక్స్, చాకొలేట్స్ విభాగంలో అశ్విత.. బెస్ట్ ఆఫ్ నేషన్‌తో పాటు కాంస్య పతకం దక్కించుకుంది.





వీసీలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు

- మెడికల్ అన్‌ఫిట్ పేరిట అక్రమాలకు పాల్పడేవారి సమాచారం ఇస్తే రూ.10 వేలు నజరానా
- సీఎండీ బలరాంనాయక్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్/భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి ఆస్తులు, క్వార్టర్లను పరిరక్షించుకోవడానికి హైడ్రా తరహాలో చర్యలు తీసుకుంటామని సీఎండీ ఎన్.బలరాం హెచ్చరించారు. వాటిని కాపాడుకోవడం కోసం ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో బుధవారం విజిలెన్స్ విభాగంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ పూర్తి పారదర్శకంగా, అవినీతి రహితంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, కొంతమంది అక్రమార్కులు అమాయకులైన కార్మికులను మోసం చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐడీ నివేదికలో దోషులుగా తేలిన సింగరేణి ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తామని, ఇతరులపై చట్ట ప్రకారం చర్య లు తీసుకుంటామని చెప్పారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందజేసి అన్‌ఫిట్ అవుతున్న వారికి కంపెనీ ద్వారా లభించే టర్మినల్ బెనిఫిట్స్‌ను నిలిపేస్తామన్నారు. మెడికల్ బోర్డు సహా కంపెనీకి నష్టం కలిగించే పనులు చేస్తు న్న ఉద్యోగులు, ఇతరుల సమాచారాన్ని కంపెనీ విజిలెన్స్ విభాగానికి చెందిన సెల్‌నంబరు 9491144104తో పాటు vig@scclmines.com వెబ్‌సైట్‌కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి ఇస్తామని ప్రకటించారు. కాంట్రాక్ట్ పనుల్లో నాణ్యత పాటించకుంటే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. సింగరేణి చరిత్రలోనే తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత ఉద్యోగ నియా మక పరీక్షలు పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఇందులో 272 ఎక్స్‌టర్నల్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల చేశామన్నారు. త్వరలోనే మిగిలిన 327 పోస్టుల ఫలితాలను విడుదల చేస్తామన్నారు.


పరిశ్రమలకు విద్యుత్ చార్జీల 'హైటెన్షన్'!

హెచ్‌టీ కేటగిరీలో పెరగనున్న విద్యుత్ చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు ● 11 కేవీ కనెక్షన్ల చార్జీలకు సమానంగా 33/ 132/ఆపై కనెక్షన్ల చార్జీల పెంపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హైటెన్షన్ (హెచ్‌టీ) కేటగిరీ వినియోగదారులకు విద్యుత్ బిల్లులు షాక్ కొట్టనున్నాయి. విద్యుత్ చార్జీల తోపాటు ఫిక్స్‌డ్ చార్జీలు కూడా పెరగబోతున్నాయి. లోటెన్షన్ (ఎల్టీ) కేటగిరీలో కూడా నెలకు 300 యూనిట్లకుపైగా వినియోగించేవారికీ ఫిక్స్‌డ్ చార్జీ (డిమాండ్ చార్జీ)లు వాతపెట్టబోతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో రాష్ట్రంలో రూ.1,200 కోట్ల మేర విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతి కోరుతూ.. దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్) బుధవారంరాత్రి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) అనుమతి కోరాయి. ఈ మేరకు వార్షిక ఆదాయ అవసరాల నివేదిక, కొత్త టారిఫ్ ప్రతిపాదనలను సమర్పించాయి. హెచ్‌టీ కేటగిరీకి చార్జీల పెంపుతో రూ.700 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల పెంపుతో రూ.100 కోట్లు కలిపి రూ.800 కోట్లు భారం పడనుంది. మరో రూ.400 కోట్లను ఎల్టీ వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీల పెంపు ద్వారా రాబట్టుకుంటామని డిస్కంలు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. దీనిపై ఈఆర్సీ త్వరలో బహిరంగ విచారణ, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి కొత్త టారిఫ్ ఉత్తర్వులను జారీ చేస్తుంది. నవంబర్ 1 నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

హెచ్‌టీలో ఏకరూప చార్జీలతో..

ప్రస్తుతం హైటెన్షన్ (హెచ్‌టీ) కేటగిరీలో 11 కేవీ, 33 కేవీ, 132 కేవీ/ఆపై సామర్థ్యం పేరిట మూడు ఉప కేటగిరీల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మూడింటికి వేర్వేరు చార్జీలను విధిస్తున్నారు. ఇందులో 132 కేవీ చార్జీలు తక్కువగా, 33 కేవీ చార్జీలు కొంత తక్కువగా ఉండగా.. వీటికంటే 11 కేవీ చార్జీలు ఎక్కువగా ఇకపై అన్నింటికీ 11 కేవీతో సమానంగా.. ఎక్కువ చార్జీలను వసూలు చేయనున్నారు. అంటే 33కేవీ చార్జీలు ఒక్కో యూనిట్‌పై 50పైసల చొప్పున, 132కేవీ/ఆపై కనెక్షన్ల చార్జీలు రూపాయి చొప్పున పెరగనున్నాయి. హెచ్‌టీ కేటగిరీలోకి సాధారణ పరిశ్రమలు, లైట్స్ అండ్ ఫ్యాన్స్, కోళ్ల ఫారాలు, సీజనల్ పరిశ్రమలు, ఫెర్రో అల్లాయ్ యూనిట్లు, ఇతరులు, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, తాత్కాలిక సరఫరా వంటి వినియోగదారులు వస్తారు.



ఎల్టీ కేటగిరీలో 300 యూనిట్లు దాటితే వాతే

ఎల్‌టీ కేటగిరీలోని గృహ కనెక్షన్లకు లోడ్ సామర్థ్యం (కాంట్రాక్టెడ్ లోడ్) ఆధారంగా ప్రతి కిలోవాట్ (కేడబ్ల్యూ)కు రూ.10 చొప్పున ప్రస్తుతం ఫిక్స్‌డ్ చార్జీలను విధిస్తున్నారు. ఇకపై నెలలో విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించితే వారి ఫిక్స్‌డ్ చార్జీలను కిలోవాట్‌కు రూ.10కి బదులు రూ.50 చొప్పున వసూలు చేస్తారు. ఉదాహరణకు ప్రస్తుతం నెలకు 300 యూనిట్లకుపైగా వినియోగించే గృహ వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీల కింద రూ.30 విధిస్తుంటే.. కొత్త ప్రతిపాదనలు అమల్లోకి వస్తే రూ.150 విధిస్తారు.

- ఇక ఎల్టీ కేటగిరీలోని ఇతర వినియోగదారులకు సంబంధించిన ఫిక్స్‌డ్ చార్జీల పెంపునకు కూడా డిస్కంలు ప్రతిపాదనలు చేసినట్టు తెలిసింది. లోటెన్షన్ కేటగిరీలోకి గృహాలు, గృహేతర/ చిన్న వాణిజ్య, పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత కార్యకలాపాలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా పథకాలు, సాధారణ వినియోగదారులు వస్తారు. వీటికి విద్యుత్ చార్జీలను యథాతథంగా కొనసాగించాలని డిస్కంలు ప్రతిపాదించాయి.

ఆదాయ లోటు రూ.13,022 కోట్లు..

రాష్ట్ర డిస్కంలు 2024–25లో రూ.13,022 కోట్ల ఆదాయ లోటును ఎదుర్కోవాల్సి ఉంటుందని అంచనా వేశాయి. ఇందులో ఎస్పీడీసీఎల్ వాటా రూ.8,093 కోట్లు కాగా ఎన్పీడీసీఎల్ వాటా రూ.4,929 కోట్లు. విద్యుత్ చార్జీల పెంపుతో రూ.1,200 కోట్ల అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటామని.. మిగతా రూ.11,822 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందజేస్తుందని డిస్కంలు ఈఆర్సీకి ఇచ్చిన ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి.

హెచ్‌టీ కేటగిరీలో విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశమిదీ.. (ఒక్కో యూనిట్‌కు.. రూ.లలో)

కేటగిరీ	ప్రస్తుత చార్జీలు	పెరగనున్న చార్జీలు
హెచ్‌టీ- ఐ(ఏ) - ఐ(బీ): ఇండస్ట్రీ జనరల్/ లైట్స్ అండ్ ఫ్యాన్స్/ పౌల్ట్రీ ఫారమ్స్/ఫెర్రో అల్లాయ్ యూనిట్లు		
11 కేవీ	7.65	7.65
33 కేవీ	7.15	7.65
132 కేవీ/ఆపై	6.65	7.65
హెచ్‌టీ- ఐ(ఏ): సీజనల్ పరిశ్రమలు		
11 కేవీ	8.60	8.60
33 కేవీ	7.90	8.60
132 కేవీ/ఆపై	7.70	8.60
హెచ్‌టీ- ఐఐ(ఏ): ఇతరులు		
11 కేవీ	8.80	8.80
33 కేవీ	8.00	8.80
132 కేవీ/ఆపై	7.80	8.80
హెచ్‌టీ- ఐఐఐ: విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు		
11 కేవీ	8.50	8.50
33 కేవీ	7.85	8.50
132 కేవీ/ఆపై	7.45	8.50
హెచ్‌టీ- ఐవి: తాత్కాలిక		
11 కేవీ	11.80	11.80
33 కేవీ	11.00	11.80
132 కేవీ/ఆపై	10.80	11.80

స్వరాష్ట్రంలో 'సమృద్ధి'

- దేశాభివృద్ధిలో ఏటేటా పెరుగుతున్న తెలంగాణ వాటా
- రాష్ట్రమేర్పడే నాటికి జీడీపీలో 3.8 శాతంగా రాష్ట్ర వాటా
- తాజా అంచనాల ప్రకారం 4.9 శాతానికి పెరుగుదల
- ప్రధానికి ఆర్థిక సలహా మండలి నివేదిక

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే వయసులో చిన్నదైన తెలంగాణ రాష్ట్రం నానాటికీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, దేశాభివృద్ధిలో రాష్ట్ర వాటా ఏటేటా పెరుగుతోందని కేంద్ర గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే ఆర్థిక సలహా మండలి ఇటీవల ప్రధానమంత్రికి ఇచ్చిన రాష్ట్రాల ఆర్థికాభివృద్ధి నివేదిక మేరకు జాతీయోత్పత్తి (జీడీపీ)లో రాష్ట్ర వాటా 4.9 శాతంగా తేలింది. తెలంగాణ ఏర్పాటయ్యాక జీడీపీలో రాష్ట్రం వాటా 3.8 శాతం కాగా, పదేళ్లలోనే ఇది గణనీయంగా పెరిగింది. 2020–21 ఆర్థిక సంవత్సరానికి జీడీపీలో రాష్ట్ర వాటా 4.7 శాతానికి చేరగా, తాజా అంచనాల మేరకు 2023–24లో 4.9 శాతానికి చేరింది. 2014లో ఉమ్మడి రాష్ట్రం విడిపోయేనాటికి ఆంధ్రప్రదేశ్ వాటా 8.4 శాతంగా ఉండేదని అంచనా.



ఇప్పుడు అది 9.7 శాతానికి పెరిగింది. అయితే అందులో 1.1 శాతం తెలంగాణ వాటానే పెరిగింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కూడా అభివృద్ధి బాటలోనే పయనిస్తున్నా.. జీడీపీలో ఆ రాష్ట్ర వాటా పెరుగుదల స్వల్పంగానే ఉంది. రాష్ట్రం విడిపోయే నాటికి 4.6 శాతం ఉండగా, 2020–21 నాటికి 4.9 శాతానికి చేరింది. అయితే 2023–24 నాటికి 4.7 శాతానికి తగ్గింది. మొత్తంమీద రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి బాటలోనే ఉన్నాయని, రెండు రాష్ట్రాల జీడీపీ వాటా ఏటేటా పెరుగుతోందని ఆర్థిక సలహా మండలి నివేదికలోని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

దక్షిణాది రాష్ట్రాలే టాప్

ఇతర అన్ని రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లోనే ఆర్థికాభివృద్ధి ఎక్కువగా కనిపిస్తోంది. 1991 సంవత్సరానికి ముందు దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడులు జీడీపీలో తమ భాగస్వామ్యాన్ని చెప్పుకోదగిన స్థాయిలో నమోదు చేయలేదని, ఆ తర్వాత మారిన పరిస్థితుల్లో ఇప్పుడు సింహభాగం వాటా దక్షిణాది రాష్ట్రాలదేనని ఆర్థిక సలహా మండలి నివేదిక చెపుతోంది. ప్రస్తుత జీడీపీలో దాదాపు 30 శాతం ఈ రాష్ట్రాలదేనని వెల్లడించింది. తలసరి ఆదాయం కూడా జాతీయ సగటుతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణలో జాతీయ సగటుతో పోలిస్తే 193.6 శాతం అధికమని, కర్ణాటక 181, తమిళనాడు 171, కేరళ 152.5 శాతం జాతీయ సగటు కంటే ఎక్కువగా తలసరి ఆదాయం కలిగి ఉన్నాయని ఆ నివేదికలో వెల్లడయింది.

దుర్మార్గం, మహాపచారం

తిరుమల మహా ప్రసాదంపై సీఎం చంద్రబాబు ఉన్మాద వ్యాఖ్యలు

- ఉద్దేశ పూర్వకంగా రాజకీయం చేయడం క్షమార్హం కాదు
- ఇలా అన్యాయంగా అబాండాలు వేస్తే సర్వనాశనమవుతారు
- టీటీడీ మాజీ చైర్మన్‌లు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి మండిపాటు

సాక్షి, అమరావతి: ఒక ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు తిరుమల మహా ప్రసాదమైన లడ్డూపై చేసిన ఉన్మాద వ్యాఖ్యల పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వందలాది కోట్ల భక్తులు విస్తుపోతున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినే రీతిలో విస్మయకరమైన వ్యాఖ్యలు నిరాధారంగా ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. జంతువుల నూనెలతో లడ్డూ ప్రసాదాన్ని తయారు చేశారని ఒక హిందువుగా చంద్రబాబు నోటి వెంట అలాంటి మాటలు ఎలా వచ్చాయని నివ్వెరపోతున్నారు. అత్యంత సున్నితమైన అంశాన్ని కావాలని వివాదంగా మార్చి, రాజకీయంగా లబ్ధి పొందాలనే దుగ్ధకు తిరుమలను వాడుకోవడం దారుణం, దుర్మార్గమని నిప్పులు చెరుగుతున్నారు. మనిషి పుట్టుక పుట్టిన వారెవ్వరూ ఇంత దారుణంగా మాట్లాడరని, రాజకీయాల కోసం దేవదేవుడినీ వదలక పోవడం పెద్ద పాపమని చెబుతున్నారు. కొంత కాలంగా చంద్రబాబు మానసిక పరిస్థితి పలు సందేహాలకు తావిస్తోందంటున్నారు. ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల తేకపోగా, వచ్చిన సీట్లను కూడా వద్దని కాలదన్నడం.. వరదల్లో అమరావతి మునగడం ప్రత్యక్షంగా అందరి కళ్లకు కనిపిస్తున్నా, ఆ మాటంటే నోటికి తాళమేస్తానని హెచ్చరించడం.. వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమవ్వడం .. వీటన్నిటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తాజాగా తిరుమల ప్రసాదాన్ని వివాదం చేశారని స్పష్టమవుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఏమాత్రం విలువలు, విశ్వసనీయత లేని వ్యక్తి చంద్రబాబు అని, ఇలాంటి వ్యక్తికి ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హతే లేదని మండిపడుతున్నారు. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రంగా మార్చి లబ్ధి పొందాలనుకుంటే సర్వనాశం అవుతారని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలపై టీటీడీ బోర్డు మాజీ చైర్మన్‌లు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలు నిప్పులు చెరిగారు.


పరాకాష్టకు బాబు బురద రాజకీయాలు



తిరుమల ప్రసాదాలపై చంద్రబాబు చేసిన ఆరోపణలు అత్యంత దుర్మార్గం. రాజకీయ లబ్ధి కోసం, రాజకీయ స్వార్థం కోసం భగవంతుడ్ని వాడుకుంటే.. అలాంటి ఆరోపణలు చేసినవాడ్ని భగవంతుడు క్షమించడు. రాజకీయ ప్రత్యర్థులను దృష్టిలో ఉంచుకుని భగవంతుడి పేరుమీద ఆరోపణలు చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. గతంలో వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి ఆరోపణలు చేసిన సందర్భాలున్నాయి. దీనికి అప్పుడు భగవంతుడు శిక్ష కూడా విధించాడు. అయినా చంద్రబాబు మారలేదు. ఇప్పుడు మళ్లీ అలాంటి ఆరోపణలే చేస్తున్నాడు. వాస్తవం ఏంటంటే, తిరుమలలో అన్న ప్రసాదాలు తయారు చేసే విషయంలో అధికారులకు ఎలాంటి ప్రమేయం ఉండదు. పవిత్రమైన శ్రీ వైష్ణవుల అమృత హస్తాల మీదుగా ఈ పదార్థాలు తయారవుతాయి. ప్రసాదాల్లో పదార్థాల వినియోగం వారి చేతుల మీదుగా ఉంటుంది. అలాంటి వారి హస్తాల మీదుగా తయారయ్యే ప్రసాదాల మీద చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నాడంటే ఆయన బురద రాజకీయాలు పరాకాష్టకు చేరాయి.

- భూమన కరణాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ ఛైర్మన్

చంద్రబాబు పెద్ద పాపమే చేశాడు



దివ్య క్షేత్రం తిరుమల పవిత్రతను, వందల కోట్ల మంది హిందువుల విశ్వాసాలను చంద్రబాబు నాయుడు దారుణంగా దెబ్బ తీసి పెద్ద పాపమే చేశాడు. తిరుమల ప్రసాదంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గం. మనిషి పుట్టుక పుట్టిన వారెవ్వరూ కూడా ఇలాంటి మాటలు మాట్లాడరు. ఇలాంటి ఆరోపణలు చేయరు. రాజకీయ లబ్ధి కోసం ఎంతటి నీచానికైనా చంద్రబాబు వెనుకాడడని మరోమారు నిరూపించుకున్నారు. భక్తుల విశ్వాసాన్ని బలపరిచేందుకు తిరుమల ప్రసాదం విషయంలో నేను, నా కుటుంబం ఆ దేవ దేవుని సాక్షిగా ప్రమాణానికి సిద్ధంగా ఉన్నాం. చంద్రబాబు కూడా తన కుటుంబంతో ప్రమాణానికి సిద్ధమా?

- వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు, టీటీడీ బోర్డు మాజీ ఛైర్మన్

దేశాభివృద్ధి కోసమే జమిలి ఎన్నికలు: ఏలేటి



సాక్షి, హైదరాబాద్ : దేశాభివృద్ధి కోసమే జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగడం వల్ల సమయం డబ్బు రెండూ ఆదా అవుతాయన్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే దేశంలో నిత్యం ఏదో ఒక ఎన్నికలు జరుగుతుండటంతో దేశాభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...దేశ అభ్యున్నతి కోసం తీసుకున్న నిర్ణయాలు కొంతమందికి నచ్చవన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణకు మరికొంత సమయం పడుతుంది కాబట్టే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. పార్లమెంట్‌లో జమిలి ఎన్నికలపై బిల్లు ప్రవేశపెడతారని, అప్పుడు అందరికీ మాట్లాడే అవకాశం వస్తుందని తెలిపారు. దీనిపై ప్రతిపక్షాలకు ఏవైనా అభ్యంతరం ఉంటే చర్చలో చెప్పొచ్చునని సూచించారు. దేశంలో అన్ని సామాజికవర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా మోదీ సర్కార్ వంద రోజుల పాలన పూర్తి చేసుకుందన్నారు. 75 ఏళ్ల పైబడిన ఆరు కోట్ల మందికి హెల్త్ కార్డులు అందజేశారని తెలిపారు. త్వరలోనే ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక శక్తిగా భారత్ నిలవబోతోందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

సమాఖ్య స్ఫూర్తి నాశనం అవుతోంది: అసదుద్దీన్



సాక్షి,హైదరాబాద్: వన్ నేషన్ వన్ ఎలక్షన్ విధానం సమాఖ్యస్ఫూర్తిని నాశనం చేస్తుందని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...సమస్యను సృష్టించడానికి ఈ విధానం ఒక మార్గమని, అందుకే దీనిని వ్యతిరేకిస్తున్నానన్నారు. దేశానికి ఏకకాల ఎన్నికలు అనవసరం, ఆచరణాత్మకం కాదని స్పష్టం చేశారు. రాజ్యాంగ నిర్మాణంలో ప్రాథమిక అంశాలైన సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్యాలను ఈ విధానం నాశనం చేస్తుందని వివరించారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాకు తప్ప ఎవరికీ బహుళ ఎన్నికలు సమస్య కాదని స్పష్టం చేశారు. దేశంలో తరచుగా, నిర్దిష్ట కాలాలలో జరిగే ఎన్నికలు ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనాన్ని మెరుగుపరుస్తాయని ఒవైసీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక ప్రైవేట్ మద్యం

ఏపీలో ప్రైవేట్ మద్యం దుకాణాలకు అనుమతిస్తూ ప్రభుత్వ నిర్ణయం

రాష్ట్రంలో కొత్త మద్యం విధానానికి మంత్రి మండలి ఆమోదం



- అక్టోబర్ నుంచి అమలులోకి తెచ్చేలా సన్నాహాలు
- ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం వ్యాపారం
- 180 ఎంఎల్ మద్యాన్ని రూ.99కి విక్రయించాలని నిర్ణయం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పదిహేనేళ్లు పైబడితే... ఆ వాహనాలు తుక్కుకే!

▶ మొదటి పేజీ తరువాయి

తొలగిస్తారు. అనంతరం దాన్ని తుక్కుగా మార్చే కంపెనీకి అప్పగిస్తారు. అక్కడ అధికారుల సమక్షంలో చాసిస్‌ను కట్ చేస్తారు. ఆ వాహనానికి నిర్ధారిత మొత్తాన్ని (ప్రభుత్వంతో ఆ కంపెనీకి కుదిరిన ధరల మేరకు) కంపెనీ వాహన యజమానికి చెల్లిస్తుంది. అనంతరం ఓ సర్టిఫికెట్ జారీ చేస్తారు. తదుపరి కొత్త వాహనాన్ని కొన్నప్పుడు దాని ఇన్వాయిస్ మొత్తంలో పదిశాతం (ఇది కూడా ఒప్పందం ఆధారంగా నిర్ధారిస్తారు) వరకు తగ్గింపు ఇస్తారు. ఇలా వాహనాలను యజమానులు కచ్చితంగా తుక్కుగా మార్చేందుకు ముందుకు రావాల్సి ఉంటుంది. పదిహేనేళ్ల దాటిన వాహనాలను తుక్కుగా మార్చకుండా అధికారుల కళ్లు గప్పి వాడితే.. దొరికినప్పుడు భారీ పెనాల్టీ విధిస్తారు. తుక్కుగా మారిస్తే వచ్చే రాయితీ, ఇతర మొత్తాలను కూడా చెల్లించరు.

జమిలికి జై

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతున్నారు. ఈ మేరకు ఒకే బిల్లు గానీ, అవసరమైతే పలు బిల్లులు గానీ ప్రవేశపెట్టే అవకాశముందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు లా కమిషన్ కూడా జమిలిపై త్వరలో నివేదిక సమర్పించనుంది. 2029 నుంచి ఒకేసారి అన్ని ఎన్నికల నిర్వహణ, హంగ్ వచ్చే పక్షంలో ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటు తదితర సిఫార్సులను కమిషన్ చేయవచ్చని సమాచారం. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో జమిలి ఎన్నికలు కీలక వాగ్దానంగా ఉంటూ వస్తోంది. కేబినెట్ నిర్ణయాన్ని బీజేపీ, ఎన్డీయే పక్షాలు స్వాగతించగా కాంగ్రెస్, ఇతర విపక్షాలు మాత్రం ఇది ఆచరణసాధ్యం కాదంటూ పెదవి విరిచాయి. సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మోదీ సర్కారు ఆడుతున్న డ్రామాగా దీన్ని అభివర్ణించాయి.

త్వరలో అమలు కమిటీ

జమిలి ఎన్నికలకు ఇప్పటికే చాలా రాజకీయ పక్షాలు సమ్మతి తెలిపాయని కేంద్రం పేర్కొంది. ఇప్పుడు వ్యతిరేకిస్తున్న పార్టీలు కూడా వైఖరి మార్చుకుంటాయని ఆశాభావం వెలిబుచ్చింది. దేశ ప్రజల్లో అత్యధికులు ఈ ప్రతిపాదనను సమర్థించిన నేపథ్యంలో ఆ దిశగా వాటిపై అంతర్గత ఒత్తిళ్లు వస్తున్నాయని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. కేబినెట్ నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కోవింద్ కమిటీ సిఫార్సులను ముందుకు తీసుకెళ్లేందుకు త్వరలో ఒక అమలు కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. 'ఈ అంశంపై రానున్న కొద్ది నెలల పాటు ప్రజలు, పార్టీలు, మేధావులు... ఇలా అన్ని రకాల వేదికల్లోనూ లోతుగా చర్చలు జరుగుతాయి. జమిలి ఎన్నికలకు విస్తృత ఏకాభిప్రాయం సాధించేందుకు కృషి చేస్తాం. దీర్ఘకాలంలో దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఎంతగానో ప్రభావితం చేసే ఇలాంటి కీలక అంశాలపై ఏకాభిప్రాయం కావాలన్నది మా ప్రభుత్వ విశ్వాసం. ఇది మన దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే చర్య' అని చెప్పుకొచ్చారు. కమిటీ చేపట్టిన సంప్రదింపుల సందర్భంగా ఏకంగా 80 శాతం మందికి పైగా జమిలికి మద్దతిచ్చారని ఆయన చెప్పారు. ముఖ్యంగా యువత దీన్ని పూర్తి స్థాయిలో సమర్థించిందన్నారు. కాబట్టే జమిలికి ప్రస్తుతం విపక్షాల వ్యతిరేకంగా ఉన్నా.. విపక్షాలపై కూడా వైఖరి మార్చుకుందామంటూ అంతర్గతంగా ఒత్తిడి వస్తోందని ఒక ప్రశ్నకు బదులుగా మంత్రి అభిప్రాయపడ్డారు. వచ్చే శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో జమిలి బిల్లు పెడతారా అన్న ప్రశ్నకు ఆయన సూటిగా బదులివ్వలేదు. మోదీ 3.0 హయాంలోని దీన్ని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే చెప్పారని గుర్తు చేశారు.



1967 దాకా జమిలి ఎన్నికలే

స్వాతంత్య్రం వచ్చాక 1951 నుంచి 1967 దాకా దేశమంతటా లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. ఆ తర్వాత మధ్యంతరాలు తదితర కారణాలతో జమిలికి తెర పడింది. ఈ నేపథ్యంలో జమిలి కోసం భారీ కసరత్తే చేయాల్సి ఉంటుంది. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ముందుకు జరపడం, కొన్నింటిని ఆలస్యం చేయడం వంటి చర్యలు అవసరం అవుతాయి.

భారత ఎన్నికల ప్రస్తుత ముఖచిత్రం

ఎన్నిక	ఏడాది
ఢిల్లీ	2025
బిహార్	2025
అసోం	2026
కేరళ	2026
తమిళనాడు	2026
పశ్చిమ బెంగాల్	2026
పాండిచ్చేరి	2026
గోవా	2027
గుజరాత్	2027
మణిపూర్	2027
పంజాబ్	2027
ఉత్తరప్రదేశ్	2027
ఉత్తరాఖండ్	2027
హిమాచల్ ప్రదేశ్	2027
మేఘాలయ	2028
నాగాలాండ్	2028
త్రిపుర	2028
తెలంగాణ	2028
ఛత్తీస్‌గఢ్	2028
మధ్యప్రదేశ్	2028
కర్నాటక	2028
మిజోరం	2028
రాజస్థాన్	2028
లోక్ సభ 2029 (గత జూన్‌లో ముగిశాయి)	
ఆంధ్రప్రదేశ్ 2029 (గత జూన్ లో ముగిశాయి)	
అరుణాచల్ ప్రదేశ్ 2029 (గత జూన్ లో ముగిశాయి)	
ఒడిశా 2029 (గత జూన్ లో ముగిశాయి)	
సిక్కిం 2029 (గత జూన్ లో ముగిశాయి)	
జమ్మూ కాశ్మీర్ 2024 (అక్టోబర్)	
హరియాణా 2024 (అక్టోబర్)	
మహారాష్ట్ర 2024 (నవంబర్)	
జార్ఖండ్ 2024 (నవంబర్)	

..పోస్టులకు నోటిఫికేషన్

▶ మొదటి పేజీ తరువాయి

వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన/చేస్తున్న వారికి గరిష్ఠంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇస్తారు. గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించిన వారికి ప్రతి 6 నెలలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా అనుభవమున్న వారు ధ్రువీకరణ పత్రాన్ని పొందిన తర్వాత ఆ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్‌లో ఏ సేవలు అందించి ఉంటే.. ఆ కేటగిరీ పోస్టులకు మాత్రమే పాయింట్లు వర్తింపజేస్తారు. మరిన్ని వివరాలకు తమ వెబ్‌సైట్ (https://mhsrb.telangana.gov.in)ను సందర్శించాలని ఆయన కోరారు.

ఇవీ పోస్టుల వివరాలు
ప్రజారోగ్య విభాగం, వైద్య విద్యా విభాగంలో – 1,576
తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో – 332
ఆయుష్‌లో – 61
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో– 1
ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో – 80

జోన్లవారీగా స్థానికులకు 95% రిజర్వేషన్

స్టాఫ్‌నర్స్ పోస్టులను జోన్లవారీగా భర్తీ చేయనున్నారు. ఆయా జోన్ల అభ్యర్థులకు 95 శాతం పోస్టులను కేటాయిస్తారు. మిగతావి ఓపెన్ కేటగిరీ కింద భర్తీ చేస్తారు. జోన్-1లో ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు.. జోన్-2లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల.. జోన్-3లో కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి.. జోన్-4లో కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్.. జోన్-5 లో సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి, జనగాం.. జోన్-6లో మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్.. జోన్-7లో పాలమూరు, నారాయణపేట, జోగుళాంబ-గద్వా ల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలు ఉన్నాయి.

నోటిఫికేషన్‌లోని ముఖ్యాంశాలివీ..

- అభ్యర్థులు నోటిఫికేషన్ తేదీ నాటికి బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం పూర్తి చేసి ఉండాలి. దరఖాస్తు తేదీ నాటికి తెలంగాణ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదు చేసుకోవాలి.
- ఎవరైనా అభ్యర్థి ఈ అర్హతలకు సమానమైన ఇతర అర్హతలను కలిగి ఉంటే.. ఆ విషయాన్ని బోర్డు ఏర్పాటు చేసిన 'నిపుణుల కమిటీ'కి రిఫర్ చేస్తారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా బోర్డు నిర్ణయం తీసుకుంటుంది.
- దరఖాస్తుదారులకు కనీసం 18 ఏళ్లు, గరిష్ఠంగా 46 ఏళ్ల వయో పరిమితి ఉంటుంది. వయసును 2024 జూలై 1 ఆధారంగా లెక్కిస్తారు. వివిధ వర్గాలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన వయోపరిమితి సడలింపులు వర్తిస్తాయి.
- ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తుల్లో మార్పులు చేయడానికి వచ్చే నెల 16వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎడిట్‌కు అవకాశం కల్పించారు.
- నవంబర్ 17వ తేదీన సీబీటీ పద్ధతిలో రాత పరీక్ష ఉంటుంది.
- హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేటల్లో పరీక్షా కేంద్రాలు ఉంటాయి. అభ్యర్థులు తమ ప్రాధాన్యం ప్రకారం సెంటర్లను ఎంపిక చేసుకోవాలి.

చర్మం ముడతలు లేకుండా, కాంతిమంతంగా ఉండాలంటే...



● టేబుల్ స్పూన్ మినప్పప్పు, 6 బాదాంపప్పులు కలిపి నీటిలో రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఈ రెండింటినీ మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని శరీరానికి పట్టించి, మృదువుగా రుద్దాలి. అరగంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. చర్మం మృదువుగా, తాజాగా కనిపిస్తుంది.

● టేబుల్ స్పూన్ చొప్పున ఆరెంజ్ జ్యూస్, నిమ్మరసం తీసుకొని కప్పు పెరుగులో కలపాలి. ఈ మిశ్రమాన్ని శరీరానికి పట్టించి, ఆరనివ్వాలి. తర్వాత చల్లని నీటితో స్నానం చేయాలి.



● గ్లోబల్ ఫ్యాషన్ ఫెస్టివల్ 2024

మణిపురి విప్పిన పైడి బొమ్మ

ఇటీవల జరిగిన గ్లోబల్ ఫ్యాషన్ ఫెస్టివల్‌లో నటి, మోడల్ ఊర్వశి రౌతేలా వేదిక మీద నడుస్తూ ఉంటే దివి నుంచి దిగి వచ్చిన దేవకన్యగా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆమె ధరించిన అచ్చమైన బంగారంతో రూపొందించిన మణిపూర్ సంప్రదాయ బ్రైడల్ డ్రెస్ స్పెషాలిటీని చూపుతిప్పుకోనివ్వలేదు.

ఈ యేడాది జరిగిన గ్లోబల్ ఫ్యాషన్ ఫెస్టివల్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో డిజైన్ చేసిన పొట్లోయ్ డ్రెస్‌లో నటి, మోడల్ ఊర్వశి రౌతేలా మెరిసిపోయింది. ఈ ప్రత్యేక సందర్భం కోసం ఆమె బంగారు జరీ దారాలతో ఎంబ్రాయిడరీ చేసిన ఎరుపు రంగు పొట్లోయ్‌ను ధరించింది. సాధారణంగా వధువులు ధరించే సంప్రదాయ దుస్తుల మధ్య ఊర్వశి అద్భుతంగా మెరిసిపోయింది. ప్రఖ్యాత మణిపురి డిజైనర్ రాబర్ట్ నౌరెమ్ రూపొందించిన ఈ దుస్తులలో మణిపూర్‌లోని మెయిటీ కమ్యూనిటీ సాంస్కృతిక గొప్పతనాన్ని, నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సాధారణంగా మణిపూర్ వధువులు ఈ దుస్తులను ధరిస్తారు. పొట్లోయ్ అనేది వారి సంప్రదాయంలోని ప్రత్యేకమైన, ఐకానిక్ డ్రెస్.

క్లిష్టమైన వర్క్

స్థూపం, డ్రమ్– ఆకారపు స్కర్ట్‌ని పొట్లోయ్ అంటారు. మణిపురి బ్రైడల్‌ని ప్రత్యేకంగా చూపే వాటిలో ఇది అత్యంత ముఖ్యమైనది. మందపాటి ఫైబర్, వెదురుతో డ్రమ్ ఆకారం చేసి, శాటిన్ క్లాత్‌ని చుడతారు. దానిని థ్రెడ్‌వర్క్, సీక్విన్స్, అద్దాలతో భారీగా అలంకరిస్తారు. స్కర్ట్‌పైన చేసే వారి హస్తకళ చాలా క్లిష్టమైనది. ఒక పొట్లోయ్‌ని పూర్తి చేయడానికి కొన్ని రోజుల పాటు కృషి చేస్తారు. దీనికి అలంకరణగా నడుము పట్టీ, వధువు తలమీదుగా కప్పే షీర్ వీల్, మోచేతులవరకు ఉండే జాకెట్టుతో ఈ డ్రెస్‌కు పూర్తి లుక్ వస్తుంది. ఇతర అలంకరణలో లేయర్డ్ నెక్లెస్‌లు, కోకిగ్ లీటింగ్ గా పిలిచే కేశాలంకరణ ఆభరణాలు ప్రత్యేకమైనవి.

పొట్లోయ్ చరిత్ర

పొట్లోయ్ మూలాలు మెయిడింగు భాగ్యచంద్ర మహారాజ్ (1763–1798) పాలనలో గుర్తించినట్టు చారిత్ర ఆధారాల ద్వారా తెలుస్తోంది. అతను శాస్త్రీయ రాస్-లీలా నృత్యానికి ఈ దుస్తులను పరిచయం చేశాడు. కాలక్రమేణా ఇది మెయిటీ వధువుల సంప్రదాయ వివాహ దుస్తులలో భాగమైంది. దీంతో వీరికి పొట్లోయిస్ సృష్టించే కళ తరతరాలుగా సంక్రమించింది. అధికారిక సంస్థల కంటే కుటుంబాలలో నేర్చిన నైపుణ్యాలతో పొట్లోయ్‌ను రూపొందించడం అనేది శ్రమతో కూడుకున్న ప్రక్రియ. దీని తయారీలో చాలా మంది కళాకారులు పాల్గొంటారు. అందుకే, దీనిని సామూహిక సమాజ ప్రయత్నంగా చెబుతారు. తన వేషధారణ ఎంపిక ద్వారా, ఊర్వశి ఫ్యాషన్ స్టేట్‌మెంట్ మాత్రమే కాకుండా మణిపూర్ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకురావడంలో సహాయపడింది.

డిజైనర్ రాబర్ట్

రాబర్ట్ నౌరెమ్ ఈశాన్య భారతదేశంలోని సాంప్రదాయ ఫ్యాషన్‌ను హైలైట్ చేయడానికే ప్రయత్నిస్తుంటారు. అతను గతంలో సుస్మితా సేన్, హర్నాజ్ కౌర్ సంధు, లారా దత్తా వంటి ప్రముఖ వ్యక్తులకు ఇన్నాఫీ, ఫనెక్ వంటి సాంప్రదాయ మణిపురి దుస్తులలో మెరిపించాడు. ఇన్నాఫీ అనేది బ్లౌజ్‌పై ధరించే తేలికపాటి మస్లిన్ శాలువా. ఫనెక్ అనేది మణిపురి మహిళలు సాధారణంగా ధరించే చారలతో కూడిన చీరలాంటి వస్త్రం. ఈయేడాది గ్లోబల్ ఫ్యాషన్ ఫెస్టివల్‌లో మొదటిసారిగా ఊర్వశి రౌతేలా చేత మణిపురి బ్రైడల్ డ్రెస్‌ను ధరింపజేసి అంతర్జాతీయ ప్రేక్షకులకు ఆకట్టుకున్నారు.



● ఇటీవల గురుగ్రామ్ బ్రిస్టోల్ హోటల్ లాన్‌లో జరిగిన ఫ్యాషన్ వేదికపై మణిపూర్ పొట్లోయ్ ధరించి ఊర్వశి రౌతేలా!

● విమెన్ ఇన్ ఖాకీ

నాలుగో సింహం

T.R.A.I.N.E.D & P.O.W.E.R.E.D.

'ఎన్ని ప్రయత్నాలు చేశామన్నది కాదు... లక్ష్యం చేరామా? లేదా? అన్నదే ముఖ్యం' అన్నట్లుగా పట్టుదలతో ఐపీఎస్ సాధించారు ఈ ఆఫీసర్లు. ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం అయినా అందరి టార్గెట్ విమెన్ ఇన్ ఖాకీనే. హైదరాబాద్‌లో జరిగిన 76వ బ్యాచ్ రెగ్యులర్ రిక్రూట్స్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఈ ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులు 'సాక్షి ఫ్యామిలీ'తో మాట్లాడిన విశేషాలు...



సైబర్ నేరాలు నియంత్రిస్తాను

నేను ఢిల్లీలో పుట్టి పెరిగాను. విద్యాభ్యాసం అంతా అక్కడే కొనసాగింది. మా అమ్మ ప్రభుత్వ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. నాన్న ఢిల్లీలో జిల్లా విద్యాశాఖ అధికారి. నేను ఢిల్లీ యూనివర్సిటీలో జాగ్రఫీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. జేఎన్‌యూలో మాస్టర్స్ చేశాను. తొలి మహిళా ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ గురించి తెలుసుకుంటూ పెరిగాను. ఆమె స్ఫూర్తితోనే ఐపీఎస్ కావాలని కలలు కన్నాను. సమాజ సేవలో విమెన్ ఇన్ ఖాకీగా ఉండాలి అన్నదే నా లక్ష్యం. నా భర్త, మా అత్తమామలు, నా కుటుంబ సహకారంతోనే ఐదో ప్రయత్నంలో నా లక్ష్యాన్ని ఛేదించాను.

ఐపీఎస్‌గా సెలెక్ట్ కాకముందు ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్‌లో నాలుగేళ్లు ఢిల్లీలో పని చేశాను. 2018లో నాకు వివాహం అయ్యింది. నా భర్త ఐఆర్ఎస్ అధికారి. ఐపీఎస్ కావాలన్నది నా కల. నా భర్త సహకారంతో నా ప్రయత్నాలు కొనసాగిస్తూనే వచ్చాను. ఐదో ప్రయత్నంలో సాధించాను. నాలుగు ప్రయత్నాల్లోనూ ప్రిలిమ్స్, మెయిన్స్‌ను క్లియర్ చేసినా నేను అనుకున్న ఐపీఎస్ రాలేదు. అందుకే ప్రయత్నం కొనసాగించాను. ఐపీఎస్ శిక్షణ అనేది నన్ను మానసికంగా, శారీరకంగా దృఢంగా మార్చింది. ఏపీ కేడర్‌కు వెళుతున్నాను. మహిళల భద్రతకు, సైబర్ నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తాను.

– దీక్ష, ఢిల్లీ



కిరణ్ బేడి స్ఫూర్తి

నేను పెద్ద పోలీస్ ఆఫీసర్ కావాలన్నది మా అమ్మానాన్నల కల. అది నెరవేర్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఆరో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించాను. నా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఆజంగఢ్. బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో పూర్తి చేశాను. తర్వాత నుంచి సివిల్ సర్వీసెస్ కోసం ప్రిపరేషన్ మొదలు పెట్టాను. నాన్న వ్యాపారం చేస్తుంటారు. మా కుటుంబం నుంచి మొదటి పోలీస్ అధికారిని నేనే. మొదటి ఐదు ప్రయత్నాలు విఫలమైనా ఆరో ప్రయత్నంలో సక్సెస్ సాధించాను. సివిల్స్ క్లియర్ చేయాలంటే ఒక మెంటార్ తప్పనిసరి అని నా అభిప్రాయం. లేదంటే మార్కెట్‌లో ఉన్న మెటీరియల్ అంతా చదువుకుంటూ కూర్చుంటే మన శక్తి, సమయం సరిపోదు. అది వృథా ప్రయత్నమే అవుతుంది. ఇప్పటికే సివిల్స్ క్లియర్ చేసిన వారి సూచనలతో ముందుకు వెళ్లడం ముఖ్యం. నేను ఐదుసార్లు విఫలం అయినా కూడా నా ప్రయత్నాన్ని వదలలేదు. కిరణ్‌బేడీ నాకు స్ఫూర్తి. నేను ఇప్పుడు తెలంగాణ కేడర్‌కు అలాట్ అయ్యాను.

– వసుంధర యాదవ్, ఉత్తరప్రదేశ్



నా శక్తిని తెలుసుకున్నాను

చదువుకునే సమయంలో మా నాన్నే నీకో లక్ష్యం ఉండాలమ్మా అన్నారు. పోలీస్ ఆఫీసర్ కావాలనుకున్నాను. మాది నంద్యాల. వ్యవసాయ కుటుంబం. అమ్మా నాన్నలు పెద్దగా చదవకపోయినా మా చదువుల విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. కెరీర్ విషయంలోనూ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. సమాజ సేవలో ప్రజలకు దగ్గరగా ఉండాలని నా లక్ష్యం. 2020లో మొదటి అటెంప్ట్ చేశాను. 2022 రెండో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించాను. సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యేప్పుడు ఒక స్ట్రాటజీ ఉండాలి. ఎక్కడ మనం బలంగా ఉన్నాం, ఎక్కడ మెరుగు పర్చుకోవాలన్నది గుర్తించి దానికి తగ్గట్టుగా ప్రిపేర్ కావాలి. సీనియర్ల సూచనలు తీసుకోవడం ఉపయోగపడుతుంది. మొదటిసారి నేషనల్ పోలీస్ అకాడమీలో అడుగుపెట్టినప్పుడు ఇంత కఠినమైన శిక్షణ చేయగలనా అనుకున్నాను. కానీ అకాడెమీ ట్రెనింగ్ నాలో శక్తిని తెలుసుకునేలా చేసింది. క్రమంగా మనల్ని శిక్షణలో భాగం చేస్తారు. ఏపీ కేడర్‌కు అలాట్ కావడం సంతోషంగా ఉంది. మహిళా భద్రత అనేది నా ప్రధాన లక్ష్యం.

– మనీశా రెడ్డి, నంద్యాల



ఆత్మవిశ్వాసం పెరిగింది

నీపై నీకు విశ్వాసం ఉంటే ప్రయత్న లోపం లేకుండా సాధన చేస్తే కాలం కూడా కలిసి వస్తుందని నమ్ముతాను. అపజయాలనేవి మనల్ని నిర్వచించలేవు. కొన్నిసార్లు మీ ప్రయత్నంలో లోపం లేకున్నా ఏదో ఒక చిన్న తప్పుతో విజయం రాకపోవచ్చు. అంత మాత్రాన నిరాశ చెందాల్సిన పని లేదు. మాది ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ జిల్లా. నా విజయంలో కుటుంబ సహకారం ఉంది. నేను రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌లో 2019లో సెలక్ట్ అయ్యాను. కానీ నా లక్ష్యం మాత్రం సివిల్ సర్వీసెస్. నాలుగు ప్రయత్నాల్లో విఫలమైనా నిరాశ చెందలేదు. ఐదోసారి ఐపీఎస్ సాధించాను. నా కుటుంబంలో నేనే మొదటి ఐపీఎస్ అధికారిని. ఔట్ డోర్ శిక్షణలో 15 కిలోల బరువుతో 40 కిలోమీటర్లు నడవడం వంటి ఎన్నో కఠిన శిక్షణల తర్వాత ఆత్మవిశ్వాసం పెరిగింది. నేను యూపీ కేడర్‌కు అలాట్ అయ్యాను.

– సోనాలి మిశ్రా, ఉత్తరప్రదేశ్

– నాగోజు సత్యనారాయణ, స్టేట్ క్రైం రిపోర్టర్
ఫొటోలు: ఏ. జాన్

మరోసారి మన్రో

మార్లిన్ మన్రో విషాద మరణంలో జాన్ ఎఫ్ కెనడీ, అతని సోదరుడు రాబర్ట్ పాత్ర ఎంత అనేది చా...లా పాత టాపిక్ అయినప్పటికీ ఎప్పటికప్పుడు కొత్త టాపిక్. 'ది ఫిక్సర్' పుస్తకంతో ఈ టాపిక్ మరోసారి తెర మీదికి వచ్చింది...

పదహారు సంవత్సరాల వయసులో ఫ్యాక్టరీ కార్మికుడైన జేమ్స్ డొమెర్టీని పెళ్లి చేసుకుంది మార్లిన్ మన్రో. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భర్త సీరియస్‌గా ఉద్యోగ విధుల్లో ఉన్నప్పుడు ఆమె మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది.

సినిమాల్లోకి అడుగు పెట్టాక, కెరీర్‌లో పైకి వెళుతున్న కొద్దీ మన్రో వ్యక్తిగత జీవితంపై ప్రేక్షకులకు ఆసక్తి పెరిగింది. మొదటి భర్త నుంచి విడాకులు తీసుకున్న మన్రో బేస్ బాల్ స్టార్ జో డిమాజియోతో ప్రేమలో పడింది. పెళ్లి చేసుకుంది. వీరి పెళ్లి కూడా ఎక్కువ కాలం నిలవలేదు. కెరీర్‌పై దృష్టి పెట్టిన మన్రో వ్యక్తిగత జీవితాన్ని పట్టించుకోలేదు. మత్తు పదార్థాలకు దగ్గర అయింది. కాలం గడుస్తున్న కొద్దీ ఆ వ్యసనం మరింత తీవ్రమైంది. ఆ తీవ్ర వ్యసనమే ఆమె పాలిట మృత్యువుగా మారింది.

అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ బర్త్ డే పార్టీకి హాజరైన మార్లిన్ మన్రో బర్త్ డే సాంగ్ పాడింది. వీరిద్దరు కలిసి ఉన్న 'ఫోటో' ఆధారంగా అప్పటి నుంచి ఇప్పటి వరకు మన్రో–కెనడీల గురించి రకరకాల కోణాలలో కథలు వినిపిస్తూనే ఉన్నాయి. కెనడీ బర్త్ డే పార్టీకి హాజరైన మూడు నెలలకే మన్రో చనిపోయింది.

తన మరణానికి కొన్ని గంటల ముందు మన్రోకు అప్పటి అమెరికా అటార్నీ జనరల్ రాబర్ట్ ఎఫ్ కెనడీతో తీవ్రంగా వాదోపవాదాలు జరిగాయని, అతడే ఆమెకు అధిక మోతాదులో మత్తు మందు ఇచ్చి ఉండొచ్చనే వెర్షన్ కూడా వినిపించింది.


కెనడీ సోదరులు, వారి సర్కిల్ తాలూకు ప్రైవేట్ ప్రపంచంపై 'ది ఫిక్సర్' పుస్తకం దృష్టి సారిస్తుంది. మళ్లీ కెనడీ సోదరుల దగ్గరికి వస్తే....మార్లిన్ రెండవ భర్త జో డిమాజియో చెప్పిన దాని ప్రకారం మన్రో అంత్యక్రియలకు హాజరు కాకుండా కెనడీ సోదరులను నిషేధించారు. 'కెనడీలంతా లేడీ కిల్లర్లే' అంటూ ఘాటుగా తిట్టేవాడు జో డిమాజియో.



ఫ్రెడ్ ఒటాస్ ఇన్వెస్టిగేషన్ ఫైల్స్ మాత్రమే కాకుండా 'డెయిలీ మెయిల్' పత్రికలో వన్స్ అపాన్ ఏ టైమ్ వచ్చిన 'ఆస్క్ నాట్' సీరియల్‌లోని సమాచారాన్ని కూడా 'ది ఫిక్సర్' రచయితలు జోష్ యంగ్, మాన్ఫ్రెడ్‌లు వాడుకున్నారు. మార్లిన్ మన్రోపై ఎన్నో సినిమాలు, వందలాది పుస్తకాలు వచ్చాయి. ఎన్ని వచ్చినా, ఎప్పుడు వచ్చినా.... మార్లిన్ మన్రో జీవితం ఎప్పుడూ ఆసక్తికరమే.

మన(సు)లో మాట

చదవడమంటే నిద్ర వస్తుందంటాడు..?



మా అబ్బాయికి 12 సం॥లు. వేదపాఠశాలలో చదువుతున్నాడు. క్లాసులో నిద్రపోతున్నాడని టీచర్ల కంప్లైంట్. బాబు ఇష్టం మీదే వేదపాఠశాలలో చేరాడు. సెలవులకు వచ్చినప్పుడు కూడా సమయం దొరికితే నిద్రపోతున్నాడు. ఎన్నిసార్లు మందలించినా నిద్రపోవడం మానడం లేదు. మా బాబు అతి నిద్ర తగ్గించి, బాగా చదివేటట్లు ఏదైనా సలహా చెప్తారా?

– రాజేశ్వరి, తిరుపతి

వాస్తవానికి పిల్లలకు తమకిష్టంలేని సబ్జెక్టు చదువుతున్నప్పుడు బోర్ కొట్టి నిద్ర రావడం సహజమే! కానీ మీ అబ్బాయి తన ఇష్టంతోనే వేదపాఠశాలలో చేరాడంటే, అతని అతి నిద్రకు వేరే ఆరోగ్య కారణాలు ఉండవచ్చు. క్లాసులు లేప్పుడు, సెలవుల్లో కూడా అతిగా నిద్రపోతున్నాడని రాశారు. ఇలాంటి అతి నిద్ర సమస్యను 'హైపర్ సోమ్నియా' అంటారు. నార్కొలెప్సి, స్లీప్ ఆప్నియా లాంటి ఆరోగ్య సమస్యలున్నవారు, ఇలా అతిగా నిద్రపోతుంటారు. మీరు బాబును మందలించడం వల్ల పిల్లవాడు ఆత్మవిశ్వాసం కోల్పోయి, సమస్య మరింత పెద్దది అయే ప్రమాదముంది. ఆధునిక వైద్యశాస్త్రంలో అతి నిద్రను తగ్గించేందుకు అద్భుతమైన ఔషధాలు ఉన్నాయి. ఒకసారి అబ్బాయిని సైకియాట్రిస్టుకు చూపించి, తగిన వైద్యం చేయిస్తే, మీ బాబు అతి నిద్రను తగ్గించి, మళ్లీ మామూలుగా చదివేటట్లు చేయవచ్చు.



– డా. ఇండ్ల విశాల్ రెడ్డి సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

స్పీచ్ థెరపీ

ఆటిజం పిల్లలకు మాటివ్వండి



సియాన్ విల్సన్

యుకేలో ముప్పై ఏళ్లుగా పిల్లలు, టీనేజర్లు, వారి కుటుంబాలతో కలిసి పనిచేయడంలో నైపుణ్యం కలిగిన పీడియాట్రిక్ ఆక్యుపేషనల్ థెరపిస్ట్ సియాన్ విల్సన్. ఆటిజంలో క్లినికల్ స్పెషలిస్ట్‌గా స్కూళ్లు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేశారు. సోషల్ కోచ్‌గా సేవలు అందిస్తున్నారు. భారతదేశం పిల్లల్లో డిజేబిలిటీ ఏ స్థాయిలో ఉంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు అనే విషయంపై సమీక్ష జరపడానికి ఇండియాకు వచ్చారు. పాతికేళ్లుగా చిల్డ్రన్ డిజేబిలిటీస్ పై వర్క్ చేస్తున్న మాధవి ఆదిమూలం, సియాన్ విల్సన్ లు యుకెలోనూ, ఇండియాలోనూ ఉన్న పరిస్థితులు, అమలు చేయాల్సిన విధానాల గురించి హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జరిగిన ఈవెంట్‌లో డిజేబిలిటీ చిల్డ్రన్ తల్లిదండ్రులతో కలిసి చర్చించారు.

నాటి రోజుల్లో ఉమ్మడి కుటుంబాల వల్ల ఇంట్లో ప్రతి ఒక్కరూ ఒక థెరపిస్ట్‌గా పిల్లల వృద్ధికి దోహదపడేవారు. ఇప్పుడు తల్లితండ్రీ మాత్రమే కాదు ఒంటరి తల్లుల సంఖ్య పెరుగుతున్న ఈరోజుల్లో పిల్లల పెంపకం సమస్యగానే మారుతోంది అంటున్నారు నిపుణులు.



లక్ష్మీ ప్రసన్న

పరువు కాదు ముఖ్యం

'చాలా మంది తల్లులు తమ పిల్లల్లో ఉన్న ఆటిజం సమస్యను గుర్తించడమే లేదు. ఒక వేళ ఏదైనా డిజేబిలిటీ ఉన్నా బయటకు తెలిస్తే పరువు పోతుంది అనుకుంటున్నారు. 'మా అమ్మాయి/అబ్బాయిని ట్యూషన్‌కో లేదో మ్యూజిక్, డ్యాన్స్ స్కూల్‌కో తీసుకెళుతున్నామని చెప్పి, తీసుకువస్తున్నామ'ని చెబుతున్నారు. టీనేజర్ స్థాయిలో ఉన్న పిల్లలను కూడా ఇంట్లోనే ఉంచుతున్నారు. వారికి ఎలాంటి థెరపీ ఇవ్వకపోవడం వల్ల సమస్య ఇంకా పెరుగుతుంది. దీంతో అప్పుడు నిపుణులను కలుస్తున్నారు. సమస్యను మొదట్లోనే గుర్తిస్తే, పరిష్కారం కూడా త్వరగా లభిస్తుంది' అని వివరించారు థెరపిస్ట్ లక్ష్మీ ప్రసన్న.

స్పెషలిస్ట్‌లు ఎక్కువ

''యుకేలో స్పెషల్ చిల్డ్రన్ డెవలప్‌మెంట్‌కి సంబంధించిన విధానం, ఖర్చు అంతా అక్కడి కౌన్సిల్ చూసుకుంటుంది. కొన్నాళ్లుగా ఇండియాలోని ప్రముఖ చైల్డ్ డెవలప్‌మెంట్ క్లినిక్స్‌తో సంప్రదింపులు చేస్తున్నాను. ఇక్కడితో పోల్చితే యుకేలో స్పెషల్ చిల్డ్రన్‌ని చాలా చిన్నవయసులోనే గుర్తించడంలో అవగాహన అక్కడి పేరెంట్స్‌కు ఎక్కువ ఉంది. ఆటిజం చైల్డ్‌లో స్పీచ్ థెరపీ ద్వారా సరైన మెరుగుదలను తీసుకురావడానికి వారి స్థితిని బట్టి నార్మల్ స్కూల్ స్టూడెంట్స్‌తో కలుపుతారు. అయితే, అలాంటి ఒక చైల్డ్‌కి ఒక టీచర్ చొప్పున లెర్నింగ్ సపోర్ట్ అసిస్టెంట్‌ను కేటాయిస్తారు. అంటే, తన వయసు పిల్లలతో కలిసి ఉండే ధోరణి వల్ల ఆ స్పెషల్ చైల్డ్‌లో మానసిక ఆరోగ్యం బాగవుతుంటుంది. ఎవరూ కూడా ఈ విధానానికి అడ్డు చెప్పరు' అంటూ దేశంలో స్పెషల్ చైల్డ్ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి తెలియజేశారు సియాన్ విల్సన్.

పరువుతో వెనకడుగు వేయద్దు

''అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ పేరుతో 19 ఏళ్లుగా ఆటిజం పిల్లలకు సేవలు అందిస్తున్నాను. మా బాబు స్పెషల్ కిడ్ అవడంతో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ అయిన నేను స్పెషలైజేషన్ చేసి, ఈ తరహా పిల్లల కోసమే పనిచేస్తున్నాను. ఇప్పుడు మా బాబు వయసు 24 ఏళ్లు. వాడు సంగీతంలో నైపుణ్యం సాధించడంతో పాటు ప్రదర్శనలు కూడా ఇస్తున్నాడు. మా బాబును ఇక్కడ సాధారణ స్కూల్లో చేర్చడానికి చాలా ఇబ్బందులు పడ్డాను. ఎడీహెచ్‌డీ ఆటిజం ఉన్న పిల్లల్లో మెరుగుదల కనిపిస్తున్నప్పుడు వారిని, మిగతా అందరిలాగే స్కూళ్లో చేర్చగలిగే శక్తిని కూడా అందించాల్సి ఉంటుంది. అప్పుడు వాళ్లు సాధారణంగా ఎదుగుతారు. అంతేకాదు ఆటిజం పిల్లల పెంపకంలో వారిలో కొన్ని నైపుణ్యాలు కనిపిస్తుంటాయి. ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తూ ఉంటే మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి. తమకు తాముగా పనులు చేసుకోవడమే కాదు నైపుణ్యాలను కూడా చూపుతారు. అందుకే ఈ విషయాల్లో గ్రామీణ స్థాయిలోనూ అవగాహన క్యాంపులను నిర్వహిస్తున్నాం. ఇందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నాం. ఆక్యుపేషనల్ థెరపిస్ట్‌ల కొరత మన దగ్గర చాలా ఉంది. థెరపిస్ట్‌ల సంఖ్య, తల్లిదండ్రులలో అవగాహన పెరిగితే ఈ సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుంది' అని వివరించారు మాధవి ఆదిమూలం.



మాధవి ఆదిమూలం

– నిర్మలారెడ్డి
ఫొటోలు: బాలస్వామి, సాక్షి



పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా పాంటింగ్

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కొత్త హెడ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. 2028 వరకు పాంటింగ్ ఈ పదవిలో కొనసాగనున్నాడు. గత ఏడేళ్లుగా ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా పని చేసిన పాంటింగ్ ఈ సీజన్ ముగిశాక ఆ బాధ్యతల నుంచి వైదొలిగాడు. పాంటింగ్ శిక్షణలో ఢిల్లీ క్యాపిటల్స్ 2020 ఐపీఎల్ సీజన్‌లో ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. 'తదుపరి నాలుగు సీజన్లకు పంజాబ్ జట్టుకు పాంటింగ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరించనున్నాడు. అతడి అనుభవం జట్టుకు ఉపయోగపడుతుంది' అని ఫ్రాంచైజీ సీఈవో సతీశ్ మీనన్ బుధవారం పేర్కొన్నారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లకు హెడ్ కోచ్‌గా పనిచేసిన 49 ఏళ్ల పాంటింగ్ ఇప్పుడు మూడో జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నాడు. పంజాబ్ జట్టుతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని పాంటింగ్ వెల్లడించాడు. గత పది సీజన్లలో ఒక్కసారి కూడా ప్లే ఆఫ్స్‌కు చేరలేకపోయిన పంజాబ్... ఆస్ట్రేలియాకే చెందిన ట్రెవర్ బేలిస్‌ను తప్పించి ఆ స్థానంలో హెడ్ కోచ్‌గా ప్రపంచకప్ విజేత పాంటింగ్‌ను నియమించుకుంది.

టెస్టు సమరానికి సై

సొంతగడ్డపై గత 12 ఏళ్లలో ఒక్క టెస్టు సిరీస్ కూడా చేజార్చుకోని రికార్డు... 51 టెస్టులు ఆడితే 40 విజయాలు, 4 ఓటములు మాత్రమే... ఇదీ భారత జట్టు స్థాయి. మరోవైపు భారత్‌పై ఆడిన 13 టెస్టుల్లో ఒక్క గెలుపు లేకపోగా 11 ఓటములే... వాటిలో భారత గడ్డపై ఆడిన మూడింటిలోనూ చిత్తుగా ఓడిన వైనం... బంగ్లాదేశ్ రికార్డు ఇది! ఇలాంటి నేపథ్యంలో

ఇరు జట్ల మధ్య మరో టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. బలాబలాలను బట్టి చూస్తే మరో మాటకు తావు లేకుండా భారత్‌దే పైచేయి కాగా... ఇటీవల పాకిస్తాన్‌పై సాధించిన గెలుపుతో బంగ్లాదేశ్ ప్రదర్శన కాస్త ఆసక్తి రేపుతోంది. మన స్థాయికి తగినట్లుగా టీమిండియా ప్రత్యర్థిపై చెలరేగుతుందా... లేక బంగ్లాదేశ్ కాస్త పోటీ ఇస్తుందా అనేదే ఆసక్తికరం.

నేటి నుంచి భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టు

ఫేవరెట్‌గా టీమిండియా ● సంచలనంపై బంగ్లాదేశ్ ఆశలు

ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



రోహిత్

రిషభ్ పంత్



షకీబ్

చెన్నై: భారత జట్టు ఈ ఏడాది మార్చిలో తమ చివరి టెస్టు మ్యాచ్ ఆడింది. ఇప్పుడు ఆరు నెలల విరామం తర్వాత మళ్లీ టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఎంఎ చిదంబరం స్టేడియంలో నేటి నుంచి తొలి టెస్టు జరుగుతుంది. రాబోయే రెండున్నర నెలల వ్యవధిలో టీమిండియా ఆడబోయే 10 టెస్టుల్లో ఇది మొదటిది. తమతో పోలిస్తే బలహీన ప్రత్యర్థితో తలపడుతున్న రోహిత్ శర్మ బృందం సత్తా చాటి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత పొందేందుకు ఇది మంచి అవకాశం. మరోవైపు పాకిస్తాన్‌లో జరిగిన తరహాలోనే బంగ్లాదేశ్ కూడా ఏ మూలో సంచలనాన్ని ఆశిస్తోంది.

పంత్ చాలా కాలం తర్వాత...

భారత్ తుది జట్టు ఎంపికకు సంబంధించి ఎలాంటి గందరగోళం లేదు. ఇంగ్లండ్‌పై ధర్మశాలలో టీమిండియా తమ ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడింది. ఆ జట్టులో మూడు మార్పులతో ఈసారి టీమ్ బరిలోకి దిగనుంది. వ్యక్తిగత కారణాలతో ఇంగ్లండ్‌తో సిరీస్ ఆడని కోహ్లి జట్టులోకి వచ్చాడు. నాటి మ్యాచ్ ఆడిన పడిక్కల్‌కు ఇప్పుడు చోటు లేదు. వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురేల్ స్థానంలో రిషభ్ పంత్, మిడిలార్డర్‌లో సర్ఫరాజ్‌కు బదులుగా కేఎల్ రాహుల్ ఆడటం ఖాయం. 2022లో బంగ్లాదేశ్‌పైనే పంత్ తన ఆఖరి టెస్టు ఆడాడు. ఆ తర్వాత కారు ప్రమాదం, ఆపై కోలుకున్న తర్వాత టి20లు వన్డేల్లో జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతనికి ఇదే మొదటి టెస్టు. ఇటీవల దులీప్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో ఆడిన పంత్ 125.4 ఓవర్ల పాటు కీపింగ్ చేసి తన ఫిట్‌నెస్‌ను కూడా నిరూపించుకున్నాడు. టెస్టు బ్యాటర్‌గా రాహుల్ ప్రతిభపై సందేహం లేదు. ఈ ఏడాది జనవరి (దక్షిణాఫ్రికాపై) తర్వాత టెస్టు ఆడబోతున్నా... కోహ్లి స్థాయి ప్లేయర్‌గా ఫామ్ అందుకోవడం పెద్ద సమస్య కాదు. టాప్-3లో కూడా రోహిత్, యశస్వి, గిల్‌లతో భారత బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. సాధారణంగా సొంతగడ్డపై భారత్ ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లతో ఆడుతుంది. ఈసారీ అదే చేస్తే బుమ్రా, సిరాజ్ పేసర్లుగా దిగుతారు. జడేజా, కుల్దీప్‌లతో పాటు తన సొంత మైదానంలో సీనియర్ ప్లేయర్ అశ్విన్ చెలరేగడానికి సిద్ధంగా ఉన్నాడు.

సీనియర్లను నమ్ముకొని...

పాకిస్తాన్‌ను వారి సొంతగడ్డపై బంగ్లాదేశ్ ఇటీవల 2-0తో క్లీన్‌స్వీప్ చేసి ఉండవచ్చు. కానీ భారత్‌తో పోలిస్తే టెస్టుల్లో పాక్ చాలా బలహీనమైన జట్టు కాబట్టి ఈ సిరీస్‌తో పోలిక అనవసరం. భారత్‌పై బంగ్లా ఏనాడూ చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వలేకపోయింది. అయితే ఆ జట్టు కోణంలో చూస్తే పాక్‌పై విజయం వారి ఆత్మవిశ్వాసాన్ని కాస్త పెంచిందనడంలో సందేహం లేదు. ఎప్పటిలాగే సీనియర్ ఆటగాళ్లు షకీబ్ అల్ హసన్, ముష్ఫికర్ జట్టు బ్యాటింగ్ భారం మోస్తున్నారు. ఇటీవలి కాలంలో ఎంతో మెరుగైన లిటన్ దాస్ కూడా జట్టుకు కీలకం కానున్నాడు. కెప్టెన్ నజ్ముల్ ఫామ్‌లో లేకపోగా... అనుభవం లేని షాద్‌మన్, జాకీర్ ఎలా రాణిస్తారో చూడాలి. బౌలింగ్‌లో మాత్రం బంగ్లా పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. బంగ్లా కూడా ముగ్గురు స్పిన్నర్లు షకీబ్, మిరాజ్, తైజుల్‌లతో బరిలోకి దిగడం ఖాయం. ఇటీవల మిరాజ్ అద్భుత ఫామ్‌లో ఉండటం జట్టుకు సానుకూలాంశం.

పిచ్, వాతావరణం

ఎర్రమట్టితో తయారు చేసిన పిచ్‌పై మ్యాచ్ జరగనుంది. **దాంతో టెస్టు** ఆరంభంలో మంచి బౌన్స్ **ఉంటుంది. అయితే** చెన్నైలో ఎండలు తీవ్రంగా **ఉన్నాయి. మ్యాచ్ సాగిన** కొద్దీ పిచ్‌పై పగుళ్లు **ఖాయం. దాంతో స్పిన్నర్లు** ప్రభావం చూపిస్తారు. **కాబట్టి టాస్ గెలిచిన** జట్టు బ్యాటింగ్‌ను **ఎంచుకోవడం ఖాయం.**

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, **కోహ్లి, రాహుల్,** జడేజా, పంత్, అశ్విన్, **కుల్దీప్, బుమ్రా,** సిరాజ్.

బంగ్లాదేశ్: నజ్ముల్ (కెప్టెన్), షాద్‌మన్, జాకీర్, మోమినుల్, ముష్ఫికర్, దాస్, షకీబ్, మిరాజ్, తస్కిన్, హసన్, తైజుల్.



బంగ్లాదేశ్ జట్టులో ప్రతిభావంతులైన, సీనియర్ ప్లేయర్లు చాలా మంది ఉన్నారు. ముఖ్యంగా వారి స్పిన్ కూడా పటిష్టంగా ఉంది. అయినా సరే వారిని ఎదుర్కోగల బ్యాటింగ్ మా సొంతం. మొదటి బంతి నుంచే ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తాం. అయితే ప్రత్యర్థిని తక్కువగా అంచనా వేయం. ప్రస్తుత మా బౌలింగ్ బృందం పట్ల చాలా గర్వంగా ఉన్నా. నాతో కలిసి ఆడిన ప్లేయర్లే ఇప్పుడు సీనియర్లుగా ఉన్నారు. వారితో మంచి సంబంధాలు ఉండటం సానుకూలాంశం. కోచింగ్ బృందంలో ఎవరున్నా పరిస్థితులను బట్టి జట్టు ఆట శైలి మారడం ముఖ్యం. లేదంటే ఆ జట్టు అక్కడే ఆగిపోతుంది. పిచ్‌పై చర్చ అనవసరం. ఇక్కడికి వచ్చే జట్టు స్పిన్‌ను ఎలా ఆడాలో నేర్చుకోవాలి తప్ప పిచ్ గురించి మాట్లాడవద్దు. సర్ఫరాజ్, జురేల్ గత సిరీస్‌లో బాగా ఆడినా కొన్నిసార్లు పక్కకు తప్పుకొని తమ అవకాశం కోసం వేచి ఉండక తప్పదు.

– గౌతమ్ గంభీర్, భారత కోచ్



వైశాలి | వంతిక

భారత చెస్ జట్లకు వరుసగా ఏడో విజయం

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు వరుసగా ఏడో విజయం సాధించి టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాయి. జార్జియా జట్టుతో బుధవారం జరిగిన ఏడో రౌండ్ మ్యాచ్‌లో భారత్ 3-1తో గెలిచింది. వైశాలి 62 ఎత్తుల్లో లెలా జవాఖిష్‌విలిపై, వంతిక 46 ఎత్తుల్లో బెలా ఖోటెనాష్‌విలిపై నెగ్గారు. నానా జాగ్‌నిడ్జెతో గేమ్‌ను హారిక 59 ఎత్తుల్లో; నినో బత్సియాష్‌విలితో గేమ్‌ను దివ్య 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు. తానియాకు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు. భారత పురుషుల జట్టు 2.5-1.5తో చైనాపై గెలిచింది. గుకేశ్ 80 ఎత్తుల్లో యి వెను ఓడించగా... ఇరిగేశి అర్జున్-బు జియాంగ్జి గేమ్ 26 ఎత్తుల్లో, ప్రజ్ఞానంద-యు యాంగీ గేమ్ 17 ఎత్తుల్లో, హరికృష్ణ-యు వాంగ్ గేమ్ 56 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. విదిత్‌కు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు.



మాళవిక సంచలనం

ప్రపంచ ఏడో ర్యాంకర్‌పై విజయం

చాంగ్జౌ (చైనా): భారత బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్ తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని నమోదు చేసింది. చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సంచలన విజయంతో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 43వ ర్యాంకర్ మాళవిక 26-24, 21-19తో ప్రపంచ ఏడో ర్యాంకర్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా)పై గెలిచింది. 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మాళవిక తొలి గేమ్‌లో మూడు గేమ్ పాయింట్లను కాపాడుకోవడం విశేషం. ప్రిక్వార్టర్ ఫైనల్లో స్కాట్లాండ్ ప్లేయర్ క్రిస్టీ గిల్మోర్‌తో మాళవిక తలపడుతుంది. మహారాష్ట్రకు చెందిన 22 ఏళ్ల మాళవిక ప్రస్తుతం థానే బ్యాడ్మింటన్ అకాడమీలో కోచ్ శ్రీకాంత్ వాడ్ వద్ద శిక్షణ తీసుకుంటోంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

ఓ పిల్లో బీటెక్‌లో మిస్సయ్యానే..



● మీనాక్షీ చౌదరి, విశ్వక్ సేన్

'ఓ పిల్లో బీటెక్‌లో నే మిస్సయ్యానే నిన్నే కొంచెంలో...' అంటూ పాడేస్తున్నారు విశ్వక్ సేన్. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 31న విడుదల కానుంది. జేక్స్ బిజోయ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ఓ పిల్లో...' అంటూ సాగే పాటని బుధవారం విడుదల చేశారు. 'ఓ పిల్లో.. బీటెక్‌లో... నే మిస్సయ్యానే నిన్నే కొంచెంలో, ఇవ్వాలో.. రేపట్లో... నిన్నయితే సెట్ చేస్తానే తొందర్లో....' అంటూ ఈ పాట సాగుతుంది. కృష్ణచైతన్య సాహిత్యం అందించిన ఈ పాటని నకాష్ అజీజ్ పాడారు. ''మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'మెకానిక్ రాకీ' రూపొందుతోంది. విశ్వక్ సేన్, మీనాక్షీ చౌదరిల మధ్య వచ్చే 'ఓ పిల్లో..' పాట అందంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కాటసాని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: 'సత్యం' రాజేష్, విద్యాసాగర్ జె.



● ఉపేంద్ర

అక్టోబర్‌లో ఫిక్స్

కన్నడ స్టార్ హీరోల్లో ఒకరైన ఉపేంద్ర హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'యుఐ'. రీష్మా నానయ్య హీరోయిన్‌గా నటించగా, నిధి సుబ్బయ్య, మురళీ శర్మ, పి. రవిశంకర్ ముఖ్య పాత్రలు పోషించారు. లహరి ఫిల్మ్స్, జి. మనోహరన్-వీనస్ ఎంటర్‌టైనర్స్, కేపీ శ్రీకాంత్ నిర్మించిన ఈ సినిమా అక్టోబర్‌లో విడుదల కానుంది. బుధవారం (సెప్టెంబర్ 18న) ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలోని గుర్రపు స్వారీ చేస్తున్న ఉపేంద్ర పోస్టర్ రిలీజ్ చేశారు. ''ఉపేంద్ర కెరీర్‌లోనే ఎక్కువ బడ్జెట్‌తో క్రేజీ ప్రాజెక్ట్‌గా 'యుఐ' తెరకెక్కింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: 'కాంతార' ఫేమ్ అజనీష్ బి. లోకనాథ్, కెమెరా: హెచ్‌సీ వేణుగోపాల్.



● పూజా హెగ్డే

లారెన్స్ సరసన..?

రాఘవా లారెన్స్ హీరోగా రమేశ్ వర్మ దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని ఎ స్టూడియోస్ ఎల్ఎల్‌పీ, నీలాద్రి ప్రొడక్షన్స్, హవీష్ ప్రొడక్షన్స్‌పై కోనేరు సత్యనారాయణ నిర్మించనున్నారు. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు కీర్తీ సురేష్, పూజా హెగ్డే, రకుల్‌ప్రీత్ సింగ్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే పూజా హెగ్డే కన్ఫార్మ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. మరి... రాఘవా లారెన్స్‌తో పూజా హెగ్డే జోడీ కడతారా? అంటే కొంత సమయం వేచి చూడాల్సిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. నవంబరులో చిత్రీకరణ ప్రారంభించి, వచ్చే ఏడాది వేసవిలో సినిమాని రిలీజ్ చేయాలను కుంటున్నారు. అలాగే హిందీ హిట్ ఫిల్మ్ 'కిల్' సినిమాకు తమిళ రీమేక్‌గా రాఘవా లారెన్స్ 25వ చిత్రం రూపొందుతోందని కోలీవుడ్ టాక్.

డబుల్ చాన్స్?



● కరీనా కపూర్

హీరో ప్రభాస్, హీరోయిన్ కరీనా కపూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం తొలిసారి పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించనున్నారు ప్రభాస్. ప్రస్తుతం 'స్పిరిట్' సినిమాకు చెందిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ప్రారంభంలో 'స్పిరిట్' సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లాలనుకుంటున్నారట. ఈ లోపు ఈ సినిమాకు చెందిన నటీనటుల ఎంపికపై సందీప్ రెడ్డి దృష్టి పెట్టారట. ఈ క్రమంలోనే హీరోయిన్ పాత్ర కోసం కరీనా కపూర్‌ను సంప్రదించారని సమాచారం. అంతేకాదు... కరీనా భర్త, నటుడు సైఫ్ అలీఖాన్ కూడా 'స్పిరిట్' చిత్రంలో కనిపిస్తారని, సైఫ్‌ది విలన్ పాత్ర అని బాలీవుడ్ భోగట్టా. మరోవైపు మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది చివర్లో చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారట రాజమౌళి. ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం కరీనాను సంప్రదించారనే ప్రచారం టాలీవుడ్‌లో వినిపిస్తోంది. మరి... ప్రభాస్ 'స్పిరిట్'కు కరీనా ఫైనల్ అవుతారా? మహేశ్‌బాబు చిత్రంలోనూ నటిస్తారా? లేదా ఈ రెండు భారీ చిత్రాల్లో భాగమయ్యేలా డబుల్ చాన్స్ దక్కించుకుంటారా? అనేది చూడాలి.

ఆస్కార్ బరిలో...!



● 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' పోస్టర్

భారతీయ దర్శకురాలు పాయల్ కపాడియా తెరకెక్కించిన 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రం ఆస్కార్ బరిలో నిలిచే చాన్స్ ఉంది. కనికస్రుతి, దివ్య ప్రభ ప్రధాన పాత్రల్లో, ఛాయాకదం ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం ఇది. ఫ్రాన్స్, ఇండియా, నెదర్లాండ్స్, ఇటలీ, లక్సెంబర్గ్ దేశాలు ఈ సినిమా నిర్మాణంలో పాలు పంచుకున్నాయి. ఈ ఏడాది మేలో జరిగిన 77వ కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఈ సినిమాను ప్రదర్శించారు. కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ ప్రీ అవార్డు ఈ చిత్రం గెలుచుకుంది. తాజాగా ఈ సినిమాను 2025 ఆస్కార్ బరిలో నిలిపేందుకు మేకర్స్ సన్నాహాలు మొదలు పెట్టారట. ఈ చిత్రాన్ని ఆస్కార్‌కు పంపేందుకు ఫ్రాన్స్ దేశం షార్ట్ లిస్ట్ చేసిందని టాక్. ఇక 97వ ఆస్కార్ అవార్డుల వేడుక 2025 మార్చిలో జరగనున్న సంగతి తెలిసిందే. ఇక 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రం అక్టోబరు 2న ఫ్రాన్స్‌లో రిలీజ్ కానుందని, మలయాళం, హిందీ, మరాఠీ భాషల్లో రూపొందిన ఈ సినిమాను ఇండియాలో హీరో రానా నిర్మాణసంస్థ 'స్పిరిట్ మీడియా' డిస్ట్రిబ్యూట్ చేయనుందట. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ముంబైలో పని చేస్తున్న ఇద్దరు కేరళ నర్సులు ప్రభ (కనికస్రుతి), అను (దివ్య) జీవితాల్లో జరిగిన ఘటనల నేపథ్యంలో 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' కథనం సాగుతుంది.

ప్రయాణం సిద్ధం



● శర్వానంద్, అనన్య

శర్వానంద్, జై హీరోలుగా, అనన్య, అంజలి హీరోయిన్లుగా నటించిన తమిళ చిత్రం 'ఎంగేయుమ్ ఎప్పోదుమ్' (తెలుగులో 'జర్నీ'). ఎం. శరవణన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2011 సెప్టెంబర్ 16న తమిళంలో విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని తెలుగులో 'జర్నీ' పేరుతో అనువదించి, 2011 డిసెంబర్ 16న విడుదల చేయగా ఇక్కడా సూపర్ హిట్‌గా నిలిచింది. దాదాపు పదమూడేళ్లకి మరోసారి 'జర్నీ' సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. లక్ష్మీ నరసింహా మూవీస్ పతాకంపై సుప్రియ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ చిత్రాన్ని ఈ నెల 21న తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నారు. ''జర్నీ' చిత్రంలో రెండు ప్రేమ కథల్ని సమాంతరంగా చూపించిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. ఈ హార్ట్ టచింగ్ ఎమోషనల్ మూవీ మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది''అని సుప్రియ శ్రీనివాస్ తెలిపారు.

ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు

- రితేష్ రానా



''మత్తు వదలరా' సినిమా హిట్ కావడంతో సీక్వెల్ చేద్దామని చెర్రీగారు అన్నారు. మేము అనుకున్నట్లే వర్కవుట్ అయ్యింది. 'మత్తు వదలరా 2'ని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తున్నారు. మేము ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది'' అని డైరెక్టర్ రితేష్ రానా అన్నారు. శ్రీ సింహా కోడూరి, ఫరియా అబ్దుల్లా, సత్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మత్తు వదలరా 2'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రితేష్ రానా మాట్లాడుతూ– ''నా దృష్టిలో మా సినిమాకి మంచి ప్రశంస అంటే టీమ్ అంతా హ్యాపీగా ఉండటమే. అది నాకు చాలా సంతోషాన్నిచ్చింది. అలాగే చిరంజీవి, మహేశ్‌బాబుగార్లు అభినందించడం కూడా ఆనందాన్నిచ్చింది. మా సినిమా రాజమౌళిగారికి చాలా నచ్చింది. నేనిప్పటివరకూ అన్ని సినిమాలు చెర్రీగారితోనే చేశాను. నా తర్వాతి చిత్రం కూడా ఆయనతోనే చేస్తాను. 'మత్తు వదలరా 3' సినిమా ఉంటుంది'' అన్నారు.

రెట్టింపు వినోదం



● రామ్ నితిన్, నార్నే నితిన్, సంగీత్

నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ లీడ్ రోల్స్‌లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'మ్యాడ్ స్క్వేర్'. వీరి కాంబినేషన్‌లో గత ఏడాది వచ్చిన హిట్ మూవీ 'మ్యాడ్'కు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రూపొందుతోంది. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, తొలి పాటను ఈ నెల 20న రిలీజ్ చేయనున్నట్లుగా బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''ఫస్ట్ పార్ట్‌ని ఇష్టపడిన ప్రతి ఒక్కరూ రెండో భాగాన్ని మరింతగా ఇష్టపడతారు. రెట్టింపు వినోదంతో ఈ చిత్రం ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

ఎందుకా టైటిల్?



● నోయల్, రిషిత

''బహిర్భూమి' సినిమాకు నిర్మాత వేణు మాధవ్, దర్శకుడు రాంప్రసాద్, సినిమాటోగ్రాఫర్ ప్రవీణ్‌గార్లే మూలస్తంభాలు. 'బహిర్భూమి' అనే టైటిల్ ఎందుకు పెట్టామనేది సినిమా చూస్తే తెలుస్తుంది'' అన్నారు నోయల్. రాంప్రసాద్ కొండూరు దర్శకత్వంలో నోయల్, రిషిత నెల్లూరు జంటగా నటించిన చిత్రం 'బహిర్భూమి'. మచ్చ వేణుమాధవ్ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ రిలీజ్ ఈవెంట్‌లో మచ్చ వేణుమాధవ్ మాట్లాడుతూ– ''సినిమాల మీద ప్యాషన్‌తో పరిశ్రమకు వచ్చాను'' అన్నారు. ''వెస్ట్రన్ కల్చర్ కంటే మన సంస్కృతి చాలా గొప్పదనే విషయాన్ని మా మూవీలో చెబుతున్నాం'' అని రాంప్రసాద్ కొండూరు చెప్పారు.

సాక్షి బిజినెస్
గురువారం
19-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
131	41
82,948	25,377

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,772	▲	143
డోజోన్స్	41,865	▲	259
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,254	▽	56
డాక్స్	18,711	▽	15
షాంఘై	2,717	▲	14
నికాయ్	36,380	▲	177

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,257
బంగారం (99.5 స్వచ్ఛత)	72,964
వెండి (కేజీ)	87,406

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	82.05	85.73
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	107.85	112.79
€	యూరో	భారతీయ	90.84	95.34
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	48.00	70.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	53.96	58.83
S$	సింగపూర్ డాలర్	భారతీయ	62.31	67.01
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.47	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.95	23.73
¥	చైనా యువాన్	భారతీయ	10.95	12.79

జీబీలకు జీబీలు వాడేస్తున్నారు!

ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల జోరు.. | మెట్రోలకు మించి భారీగా మొబైల్ డేటా వాడకం | నెలకు ఒక్కో యూజర్ సగటు వినియోగం 38-42 జీబీ | ఢిల్లీ, ముంబై వంటి చోట్ల ఇది 30-34 జీబీ మాత్రమే!



స్వాతి వైజాగ్‌లో ఓ ఫ్యాషన్ డిజైనర్. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో తాజా ట్రెండ్స్ చూసేందుకు గంటల కొద్దీ సమయం గడుపుతుంది. ఇక రాయ్‌పూర్‌లో ఉబెర్ ఆటో డ్రైవర్ కిశోర్ సాహు అయితే సిటీలో తిరిగే 12 గంటల్లో యూట్యూబ్, ఓటీటీ కంటెంట్‌లోనే మునిగి తేలుతాడు. రోజువారీ మొబైల్ డేటా లిమిట్ 1.5-2 జీబీ డేటా అయిపోతే, మళ్లీ డేటా టాపప్ కూడా చేస్తాడు. చిన్న నగరాల్లో సైతం డేటా వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే!

4జీ.. 5జీ పుణ్యమా అని దేశంలో మొబైల్ డేటా వాడకం ఓ రేంజ్‌లో దూసుకుపోతోంది. ఇదేదో మెట్రోలు, బడా నగరాలకే పరిమితం అనుకుంటే పొరబాటే! ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు డేటా వాడకంలో మెట్రోలను మించిపోతుండటం విశేషం. ముఖ్యంగా తమిళనాడు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని చిన్న చిన్న నగరాలు 'టాప్'లేపుతున్నాయి. ఇక్కడ యూజర్ల నెలవారీ సగటు డేటా వినియోగం 38-42 జీబీగా ఉన్నట్లు పరిశ్రమ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన నగరాల్లో ఇది 30-42 జీబీ మాత్రమే కావడం గమనార్హం.

అప్పుడైతే పీక్స్...

ఐపీఎల్ మ్యాచ్‌లు, క్రికెట్ వరల్డ్ కప్ ఇతరత్రా ముఖ్యమైన క్రీడా ఈవెంట్ల సమయంలో అయితే డేటా వాడకం పీక్స్‌కు వెళ్తోంది. గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ సగటు నెలవారీ వినియోగం 50-58 జీబీలను తాకుతున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. అధిక రోజువారీ డేటా ఉండే ప్యాక్‌లను రీచార్జ్ చేసుకోవడమే కాకుండా.. డేటా టాపప్‌లు కూడా హాట్ కేకుల్లా సేల్ అవుతున్నాయట! సోషల్ మీడియా, ఓటీటీ వీడియోలు, షోలు, గేమ్ స్ట్రీమింగ్‌తో పాటు క్రీడా ఈవెంట్లు దేశంలో డేటా వినియోగానికి బూస్ట్ ఇస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. చౌక స్మార్ట్ ఫోన్లు, డేటా రేట్లు దీనికి దన్నుగా నిలుస్తున్నాయి.

2029 నాటికి మనమే టాప్...

అంతర్జాతీయ టెలికం పరికరాల తయారీ దిగ్గజం ఎరిక్‌సన్ అంచనా ప్రకారం 2023లో భారత్‌లో ఒక్కో యూజర్ సగటు నెలవారీ డేటా వినియోగం 29 జీబీలుగా ఉంది. నోకియా మాత్రం దీన్ని 24.1 జీబీగా అంచనా వేసింది. గడిచిన ఐదేళ్లలో 21.1% వార్షిక వృద్ధి నమోదైందని పేర్కొంది. కాగా, 2029 నాటికి నెలవారీ సగటు వాడకం 68 జీబీకి చేరుతుందని, చైనాను సైతం అధిగమించి డేటా వాడకంలో భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుందని ఎరిక్‌సన్ చెబుతోంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

జీడీపీకి దన్ను

పెద్ద నగరాల్లో ఇంట్లో, ఆఫీసుల్లో వైఫై బాగా అందుబాటులో ఉంటుంది. ఫోన్లు, పీసీల్లో వైఫై డేటాతోనే పనైపోతుంది. అయితే ద్వితీయ శ్రేణి మార్కెట్ల విషయానికొస్తే యూజర్లు ఎక్కువగా డేటా ప్యాక్‌లపైనే ఆధారపడుతున్నారని, అక్కడ మొబైల్ డేటా వాడకం భారీగా పెరిగేందుకు ఇది కూడా కారణమని టెలికం కన్సల్టెంట్, నెట్‌వర్క్ స్పెషలిస్ట్ పరాగ్ కర్ చెప్పారు. కాగా, టెలికం కంపెనీలకు మాత్రం ఆ స్థాయిలో ఆదాయాలు పెరగడం లేదని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. 2020-21లో ఒక్కో జీబీ డేటాపై రూ.10.82 చొప్పున ఆదాయం లభించగా, 2023-24లో ఇది రూ.9.12గా తగ్గిందని ట్రాయ్ గణాంకాల్లో వెల్లడైంది. మరోపక్క, మొబైల్ కనెక్టివిటీ పెరగడం, బ్రాండ్‌బ్యాండ్ విస్తరణ వల్ల ఉద్యోగాల కల్పనతో పాటు ఎకానమీ వృద్ధిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని అధ్యయనాల్లో వెల్లడైనట్లు గ్లోబల్ టీఎంటీ కన్సల్టింగ్ సంస్థ ఎనాలిసిస్ మేసన్‌కు చెందిన అశ్విందర్ సేథి చెప్పారు.

అత్యధిక మొబైల్ డేటా వినియోగ మార్కెట్లు
తమిళనాడు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, చత్తీస్‌గఢ్‌లోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు

50-58 జీబీ
గ్రామీణ, పట్టణ మార్కెట్ రెండింటిలో గరిష్ట స్థాయి (పీక్) నెలవారీ వినియోగం

ప్రతి 10%
బ్రాడ్‌బ్యాండ్ విస్తరణతో జీడీపీ 1% వృద్ధి చెందుతుందని అంచనా

సోషల్ మీడియా, ఓటీటీ వీడియోలు, గేమ్ స్ట్రీమింగ్
డేటా వాడకం జోరుకు ప్రధాన కారణం

టాలీ నుంచి ప్రైమ్ 5.0

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యాపార నిర్వహణ సాఫ్ట్‌వేర్ సంస్థ టాలీ తాజాగా ఏపీఐ ఆధారిత టాలీ ప్రైమ్ 5.0 వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. జీఎస్‌టీ పోర్టల్‌ను సందర్శించాల్సిన అవసరం లేకుండా 'కనెక్టెడ్ జీఎస్‌టీ' ఫీచరు పొందుపర్చిన ఈ సమగ్ర వెర్షన్‌తో సంస్థలకు సమయం ఆదా అవుతుంది. అలాగే కచ్చితత్వం పెరుగుతుందని కంపెనీ సౌత్ జోన్ జీఎం అనిల్ భార్గవన్ తెలిపారు. ప్రస్తుతం తమకు రెండు తెలుగు రాష్ట్రాల్లో 1.20 లక్షల పైచిలుకు కస్టమర్లు ఉన్నారని చెప్పారు. వచ్చే మూడేళ్లలో 30-40 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 25 లక్షలుగా ఉన్న కస్టమర్లను 2026-27 నాటికి 35 లక్షలకు పెంచుకోనున్నట్లు వివరించారు. ఇందుకోసం ఏటా మరిన్ని కొత్త ఉత్పత్తులను ప్రవేశపెడుతున్నట్లు అనిల్ వివరించారు.



ఫెడ్ అర శాతం వడ్డీ కట్

నాలుగేళ్ల తర్వాత యూటర్న్

న్యూయార్క్: యూఎస్ ఫెడరల్ రిజర్వ్ నాలుగేళ్ల తర్వాత తొలిసారి వడ్డీ రేట్ల తగ్గింపు బాట పట్టింది. అత్యధిక శాతం విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగా వడ్డీ రేటులో ఏకంగా 0.5 శాతం కోత పెట్టింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 4.75-5 శాతానికి దిగివచ్చాయి. ఇప్పటివరకూ 5.25-5.5 శాతంగా అమలవుతున్నాయి. 32 నెలల తదుపరి ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) వడ్డీ రేట్ల పెంపు నుంచి యూటర్న్ తీసుకుంది. ఆగస్టులో వ్యవసాయేతర ఉద్యోగాలు అంచనాలకంటే తక్కువగా 1,42,000కు పరిమితంకాగా.. రిటైల్ ధరలు 0.3 శాతం బలపడి 3.2 శాతాన్ని తాకాయి. దీంతో ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతున్న సంకేతాలు అందినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఇంతక్రితం కోవిడ్-19 కారణంగా 2000 మార్చిలో ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపును ప్రకటించింది. 2022 మార్చి నుంచి వడ్డీ రేట్లను పెంచుతూ వచ్చిన ఫెడ్ 2023 జూలై తదుపరి నిలకడను కొనసాగిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. 2000 డిసెంబర్‌లో 6.5 శాతానికి ఎగసిన ఫెడ్ ఫండ్స్ రేట్లు గతేడాది తిరిగి 5.5 శాతానికి చేరడంతో గరిష్టస్థాయిలో కొనసాగుతున్నాయి! వడ్డీ రేట్ల తగ్గింపుతో యూఎస్ మార్కెట్లు 1% పైగా ఎగసి ట్రేడవుతున్నాయి. పసిడి ఔన్స్ ధర 24 డాలర్లు పెరిగి 2,618 డాలర్ల ఆల్‌టైమ్ హైని చేరింది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టప్పర్‌వేర్ దివాలా | ఎడ్‌టెక్‌కు తగ్గిన ఫండింగ్

జీవితకాల గరిష్టాల నుంచి వెనక్కి..

సూచీలకు స్వల్ప నష్టాలు

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ ప్రకటనకు ముందు ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు జీవితకాల గరిష్టాల నుంచి వచ్చాయి. సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 82,948 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41 పాయింట్లు పతనమై 25,377 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు బ్యాంకులు, ఫైనాన్స్ సర్వీసు షేర్లు రాణించడంతో ప్రథమార్థంలో లాభాలు గడించాయి. ఒక దశలో సెన్సెక్స్ 246 పాయింట్లు బలపడి 83,326 వద్ద, నిఫ్టీ 64 పాయింట్లు ఎగసి 25,482 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. ఐసీఐసీఐ బ్యాంకు దేశంలోనే అయిదో అతిపెద్ద కంపెనీగా అవతరించింది. ఇంట్రాడేలో షేరు 2% పెరిగి రూ.1,295 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. మార్కెట్ విలువ తొలిసారి రూ.9 లక్షల కోట్ల మైలురాయిని దాటింది.



పిల్లలకూ పెన్షన్!

ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రారంభం

న్యూఢిల్లీ: పిల్లల పేరిట పింఛను పథకం ప్రారంభించి, ఇన్వెస్ట్ చేయడానికి వీలుగా 'ఎన్‌పీఎస్ వాత్సల్య' పథకాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. ఈ పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. ఎన్‌పీఎస్ పథకం మెరుగైన రాబడులను అందిస్తోందని, భవిష్యత్ ఆదాయం కోసం ఇందులో ఇన్వెస్ట్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు మంత్రి సీతారామన్ చెప్పారు. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీ విభాగంలో 14 శాతం, కార్పొరేట్ డెట్‌లో 9.1 శాతం, జీ-సెక్‌లలో 8.8 శాతం చొప్పున రాబడులు ఉన్నట్టు వివరించారు. 'పీఎం వాత్సల్య పథకాన్ని అమలు చేసే క్రమంలో దీన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటాం' అని ఆర్థిక శాఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం కార్యదర్శి నాగరాజు మద్దిరాల తెలిపారు.

ఎవరు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు..?

ఆన్‌లైన్‌లో లేదంటే ఆఫ్‌లైన్‌లో బ్యాంక్ శాఖ లేదా పోస్టాఫీస్‌కు వెళ్లి రూ.1,000తో ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రారంభించొచ్చు. ఆ తర్వాత నుంచి ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.1,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. 18 ఏళ్లలోపు పిల్లల పేరుమీద ఖాతా తెరిచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. 18 ఏళ్లు నిండిన వెంటనే వారి పేరు మీద రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతాగా అది మారుతుంది. వారికి 60 ఏళ్లు నిండే వరకు కొనసాగుతుంది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ ఇప్పటికే ఎన్‌పీఎస్ వాత్సల్య ప్రారంభించేందుకు పీఎఫ్‌ఆర్‌డీఏతో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ముంబైలో ఈ పథకాన్ని ప్రారంభించి, కొందరు పిల్లలను పేరిట ఖాతాలు తెరిపించింది. పిల్లల పేరిట ఈ ఖాతాను ప్రారంభించడం ద్వారా వారి భవిష్యత్తుకు తల్లిదండ్రులు భరోసా కల్పించినట్టు అవుతుంది. పెట్టుబడి దీర్ఘకాలంలో కాంపౌండింగ్ ప్రభావంతో మంచి సంపదగా మారుతుంది.



ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం కోసం హైదరాబాద్ బాలిక లాంబా కరణం ఆదిత్రికి యాక్సిస్ బ్యాంక్ తరఫున ఖాతా నంబర్‌ను అందిస్తున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బామర్ లారీ-కో లిమిటెడ్‌లో 18 పోస్టులు

కోల్‌కతాలోని బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్(బామర్ లారీ-కో లిమిటెడ్) ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ మేనేజర్-01, మేనేజర్-01, డిప్యూటీ మేనేజర్-06, అసిస్టెంట్ మేనేజర్-10.
» **విభాగాలు:** ఇండస్ట్రియల్ సేల్స్, అకౌంట్స్ అండ్ ఫైనాన్స్, కాంట్రాక్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, హెచ్‌ఆర్, కమర్షియల్, ఆపరేషన్స్, సేల్స్ అండ్ మార్కెటింగ్, ఐటీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, ఎంఎస్సీ, ఎంబీఏ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీనియర్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 37 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 32 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 27 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **పనిచేయాల్సిన ప్రాంతాలు:** సిల్వస్సా, కోల్‌కతా, ముంబై, పుణె, చెన్నై, మనాలీ, లక్నో.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.10.2024
» **వెబ్‌సైట్:** www.balmerlawrie.com

ఎన్‌ఐటీటీటీఆర్, చెన్నైలో గ్రూప్ ఎ, బి పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఎన్‌ఐటీటీటీఆర్) గ్రూప్-ఎ, గ్రూప్-బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
» **పోస్టుల వివరాలు:** గ్రూప్-ఎ పోస్టులు:సీనియర్ టెక్నికల్ ఆఫీసర్-1, టెక్నికల్ ఆఫీసర్-3.
» **గ్రూప్-బి పోస్టులు:** సీనియర్ ఆఫీసర్ గ్రేడ్ 1/2-04, టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్1-01.
» **విభాగాలు:** ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, ఎడిటర్/ప్రొడక్షన్ అసిస్టెంట్, అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్, సీనియర్ పీఏ టూ డైరెక్టర్,అకౌంట్స్, కెమెరామ్యాన్, సినిమాటోగ్రఫీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా,డిగ్రీ,బీఈ/బీటెక్,ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** గ్రూప్ ఎ పోస్టులకు 45 ఏళ్లు, గ్రూప్ బి పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.67,000 నుంచి రూ.2,08,700. టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.56,100 నుంచి రూ.1,77,500. సీనియర్ ఆఫీసర్ గ్రేడ్-1 పోస్టులకు రూ.44,900 నుంచి రూ.1,42,400, మిగతా పోస్టులకు రూ.35,400 నుంచి రూ.1,12,400.
» **పని చేయాల్సిన ప్రాంతాలు:** విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కలమస్సేరి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.10.2024
» **వెబ్‌సైట్:** https://www.nitttrc.ac.in

బీఈసీఐఎల్-ఐఐఎం జమ్మూలో 16 పోస్టులు

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్) జమ్మూ కశ్మీర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ జమ్మూ(ఐఐఎం-జమ్మూ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
» **పోస్టుల వివరాలు:** ఆపరేటర్-07, ఐటీ టెక్నిషియన్-02, ఐటీ ఇంజనీర్-01, నెట్‌వర్క్ ఇంజనీర్-01, అకౌంట్ అసిస్టెంట్-02, ఎగ్జిక్యూటివ్-02,ఆడియో-వీడియో టెక్నీషియన్-01.
» **విభాగాలు:** ఏసీ/రిఫ్రిజిరేషన్, చిల్లర్/బాయిలర్, ఎస్‌టీపీ, రివర్స్ ఆస్మాసిస్/డబ్ల్యూటీపీ, ఫైర్ అలారమ్ తదితరాలు.
» **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ఆడియో-వీడియో టెక్నీషియన్ పోస్టుకు 38 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62,నోయిడా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.09.2024.
» **వెబ్‌సైట్:** www.becil.com

సర్కారీ బ్యాంకుల్లో ఎస్‌ఓ

» 58 పోస్టులతో ఎస్‌బీఐ, 213 పోస్టులతో పీఎస్‌బీ నోటిఫికేషన్లు
» ఎంఎంజీఎస్-2 నుంచి ఎస్‌ఎంజీఎస్-4 వరకు పలు హోదాలు
» రూ.లక్షల్లో వార్షిక వేతనం

ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లా, అగ్రికల్చర్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ కొలువులు స్వాగతం పలుకుతున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లు స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశాయి. ఎంపికైతే ప్రారంభంలోనే రూ.లక్షల్లో వేతనం సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది! రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుంది!! ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ ఎస్‌సీఓ, పీఎస్‌బీ ఎస్‌ఓ నోటిఫికేషన్ల వివరాలు, పోస్ట్‌లు, ఎంపిక విధానం,విజయానికి అనుసరించాల్సిన మార్గాలపై ప్రత్యేక కథనం..

ఎస్‌బీఐలో 58, పీఎస్‌బీలో 213 పోస్ట్‌లు

తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ల ప్రకారం- ఎస్‌బీఐ 58 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్ట్‌లు, పీఎస్‌బీలో 213 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి నియామక ప్రక్రియ చేపట్టనున్నాయి.

అర్హతలు వేర్వేరుగా

- ఆయా పోస్ట్‌లను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/ఎంబీఏ/నిర్దేశిత స్పెషలైజేషన్లలో పీజీ/పీజీడీఎం/పీజీడీబీఎం/బీటెక్/ఎంటెక్/సీఏ/సీఎఫ్‌ఏ/ఎన్ఐఎస్ఎం సర్టిఫికెట్ ఉత్తీర్ణత ఉండాలి. అదే విధంగా.. ఆయా పోస్ట్‌లను అనుసరించి కనిష్టంగా 2 ఏళ్లు,గరిష్టంగా 10ఏళ్ల పని అనుభవం తప్పనిసరి.
- **వయసు:** పోస్ట్‌లను అనుసరించి ఆగస్ట్ 1 నాటికి 20 నుంచి 45 ఏళ మధ్య ఉండాలి.

ఎంపిక విధానం

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌సీఓ పోస్ట్‌లకు సంబంధించి నేరుగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ముందుగా ఆయా పోస్ట్‌లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. అర్హతలు, పని అనుభవం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారిని పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. మొత్తం 100 మార్కులకు ఉండే ఈ ప్రక్రియలో అభ్యర్థుల పని అనుభవం, ఇప్పటి వరకు వారు నిర్వర్తించిన విధులు, వాటిలో విజయాలు, బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలపై అవగాహన, వ్యక్తిగత దృక్పథం వంటి అంశాలను పరిశీలిస్తారు. అభ్యర్థులు ఇచ్చిన సమాధానాల ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ఆ తర్వాత రిజర్వేషన్లు, ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, పని అనుభవం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని తుది నియామకం ఖరారు చేస్తారు.

పీఎస్‌బీలో రెండు దశలుగా

- పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లోని స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ముందుగా రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- రాత పరీక్ష మూడు విభాగాల్లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ (20 ప్రశ్నలు-20 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (20 ప్రశ్నలు-20 మార్కులు), ప్రొఫెషనల్ నాలెడ్జ్ (60 ప్రశ్నలు - 60 మార్కులు) మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు 15 నిమిషాలు, జనరల్ అవేర్‌నెస్‌కు 30 నిమిషాలు, ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కు 60 నిమిషాలు చొప్పున సమయం కేటాయిస్తారు.
- పీఎస్‌బీలోని ఆఫీసర్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), మేనేజర్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పోస్ట్‌లకు రాత పరీక్ష ఉండదు. గేట్ స్కోర్ ఆధారంగా దరఖాస్తులను షార్ట్ లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు పిలుస్తారు. దీంతో ఈ రెండు కేటగిరీలకు దరఖాస్తు చేయాలనుకుంటే గేట్ అభ్యర్థులే అర్హులని స్పష్టం చేశారు.

వేతనాలు భారీగా

- ఎస్‌బీఐలో ఎస్‌సీఓ పోస్ట్‌లకు సంబంధించి.. డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ పోస్ట్‌లకు గరిష్టంగా రూ.45 లక్షలు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పోస్ట్‌లకు గరిష్టంగా రూ.35 లక్షలు; సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్‌లుకు గరిష్టంగా రూ.29 లక్షల వార్షిక వేతనం లభిస్తోంది.
- పీఎస్‌బీలో ఆఫీసర్ పోస్ట్‌లకు రూ.48,480-రూ.85,920; మేనేజర్ పోస్ట్‌లకు రూ.64,820-రూ.93,960; సీనియర్ మేనేజర్ పోస్ట్‌లకు రూ.85,920- రూ.1,05,280; చీఫ్ మేనేజర్ పోస్ట్‌లకు రూ.1,02,300-రూ.1,20,940 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది.



బ్యాంక్ జాబ్స్

ఎస్‌బీఐలో అయిదేళ్ల కాంట్రాక్ట్

ఎస్‌బీఐలోని ఎస్‌సీఓ పోస్ట్‌లకు ఎంపికైన వారికి ముందుగా మూడేళ్లకు నియామకం ఖరారు చేస్తారు. ఆ తర్వాత పనితీరును పరిగణనలోకి తీసుకుని మరో రెండేళ్లు పొడిగిస్తారు.

పీఎస్‌బీలో శాశ్వత నియామకాలు

పీఎస్‌బీలోని పోస్ట్‌లకు మాత్రం శాశ్వత ప్రాతిపదికన నియామకాలు ఖరారు చేస్తారు. ఆఫీసర్ పోస్ట్‌లలో నియమితులైన వారు మూడేళ్లు, ఇతర పోస్ట్‌లో నియమితులైన వారు రెండేళ్లు చొప్పున సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది. అదే విధంగా ఆఫీసర్ పోస్ట్‌లకు రెండేళ్లు, మిగతా పోస్ట్‌లకు ఒక ఏడాది చొప్పున ప్రొబేషన్ పీరియడ్ నిబంధన ఉంటుంది.

పీఎస్‌బీ రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగం కోసం అభ్యర్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు,అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపైనా పట్టు సాధించాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ఈ విభాగం కోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్, దానికి సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగించాలి ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఎస్‌బీఐ ఎస్‌వో పోస్టులు

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 24.
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** అక్టోబర్ రెండో వారంలో నిర్వహించే అవకాశం ఉంది.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:**https://sbi.co.in/web/careers/currentopenings

పీఎస్‌బీ బ్యాంక్ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 22.
- **రాత పరీక్ష తేదీ:** అక్టోబర్ చివరి వారం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, హైదరాబాద్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://punjabandsindbank.co.in/content/recuitment
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://ibpsonline.ibps.in/psbsoaug24

క్లుప్తంగా...

డీఎస్పీగా నికత్ జరీన్

● విధుల్లో చేరిన మహిళా బాక్సర్



సాక్షి, హైదరాబాద్: మహిళా బాక్సర్ నికత్ జరీన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ పోలీస్)గా జాయినింగ్ రిపోర్ట్‌ను బుధవారం డీజీపీ డాక్టర్ జితేందర్‌కు అందజేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన నికత్ జరీన్ బాక్సింగ్‌లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా, కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం, ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం గెలుచుకోవడం తెలిసిందే. ఇటీవల ప్యారిస్‌లో ముగిసిన ఒలింపిక్స్ క్రీడల్లోనూ ఆమె పాల్గొన్నారు. నికత్ జరీన్ ప్రతిభకు గుర్తింపుగా ఆమెను డీఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నికత్ జరీన్‌కు డీజీపీ జితేందర్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ శుభాకాంక్షలు తెలిపారు.

3 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు అక్టోబర్ 3 నుంచి 9వ తేదీ వరకూ జరుగుతాయని తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ డైరెక్టర్ పీవీ శ్రీహరి తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ మరో సెషన్ ఉంటుందని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు 16 నుంచి 23 వరకూ ఉంటాయని వెల్లడించారు. పరీక్షకు వారం రోజుల ముందు హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఓపెన్ స్కూల్స్ అధికారి సోమిరెడ్డి తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను సొసైటీ అధికారులు బుధవారం విడుదల చేశారు.

గుజరాత్‌లో ‘తెలంగాణ’ స్టాల్‌కు విశేష స్పందన

సాక్షి, హైదరాబాద్: గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ నెల 16న ప్రారంభమైన ప్రపంచ 4వ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సు బుధవారం ముగిసింది. సదస్సు ప్రాంగణంలో తెలంగాణ ఏర్పాటు చేసిన స్టాల్‌కు విశేష స్పందన లభించింది. స్టాల్‌ను సౌర, పవన, జీవవ్యర్థాలతో విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు నిర్వహిస్తున్న సుజలాన్, రెన్యూ సోలార్, జిందాల్ ఇండియా, అమర్ రాజా, గ్రీన్ ఎనర్జీ, అవడాతోపాటు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు, గిజ్ వంటి సంస్థల ప్రతినిధులు తెలంగాణ స్టాల్‌ను సందర్శించారు. వీరంతా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని ప్రదర్శించారు. యూరోపియన్ యూనియన్‌కు సంబంధించిన ఎనర్జీ క్లైమేట్ యాక్షన్, ఎన్విరాన్‌మెంట్ విభాగం కౌన్సిలర్ బర్ట్‌స్జ్ ప్రైజివార తన ప్రతినిధుల బృందంతో స్టాల్‌ను సందర్శించారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటుకున్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలను తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(రెడ్కో) వైస్ చైర్మన్, ఎండీ వావిళ్ల అనిల వారికి వివరించారు.

‘క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ’



కాచిగూడ (హైదరాబాద్): తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 26న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను బుధవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ జిలకర రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులందరికీ ఒక్కొక్కరికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఇల్లు కట్టుకోవడానికి రూ.12 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ప్రతి ఉద్యమకారునికి ప్రతి నెలా రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రాజ రాజ చోర



అది ఓ చిన్న పాఠశాల. విద్యార్థులు టీచర్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతలో ఓ వ్యక్తి తరగతి గది లోపలకు వచ్చాడు. అతడి చేతిలో కత్తెర, బ్లేడు, తాళాలు, స్క్రూడ్రైవర్ వంటి సరంజామా ఉంది. వెంటనే పాఠం మొదలుపెట్టాడు.

అంటే ఏవో సైన్స్ ప్రాక్టికల్స్ చెబుతున్నాడేమో అనుకోకండి. అక్కడ జరిగే సంగతి తెలిస్తే నోరెళ్లబెడతారు.

పిక్ పాకెటింగ్ ఎలా చేయాలి? దొంగతనం చేసిన తర్వాత దొరక్కుండా ఎలా తప్పించుకోవాలి? తాళాలను ఎలా ఓపెన్ చేయాలి వంటి అంశాల్లో అక్కడ తర్ఫీదు ఇస్తారు.

వినడానికి విడ్డూరంగా విన్నా కొన్నేళ్లుగా అక్కడ జరుగుతున్న తతంగం ఇది.

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖడియా, గుల్ ఖేడి, హుల్ ఖేడి అనే మూడు గ్రామాల్లో దొంగల స్కూళ్లు ఉన్నాయి. 12 సంవత్సరాల నుంచి 17 ఏళ్ల లోపు వయసున్న వారికి దొంగతనాలు, దోపిడీలు ఎలా చేయాలో అందులో శిక్షణ ఇస్తారు. అవసరమైన సందర్భాల్లో హత్యలు ఎలా చేయాలో కూడా నేర్పిస్తారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలను లక్ష్యంగా చేసుకుని ఓ దొంగల ముఠా ఈ స్కూళ్లు నడుపుతోంది. ఏడాదిపాటు సకల చోర కళల్లో శిక్షణ ఇస్తారు. జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో పిక్ పాకెటింగ్ ఎలా చేయాలి, బ్యాగు ఎలా లాక్కోవాలి? ఆపై ఎవరికీ చిక్కకుండా ఎలా పారిపోవాలి? బ్యాంకులను ఎలా దోచుకోవాలి? పోలీసులకు చిక్కితే వారి లాఠీ దెబ్బలను ఎలా తట్టుకోవాలి? వంటి అన్ని అంశాల్లోనూ సుశిక్షితులను చేస్తారు. ముఖ్యంగా పెద్దింటి పిల్లలు ఎలా వ్యవహరిస్తారో, వారు ఎలాంటి డ్రెస్సులు వేసుకుంటారో కూడా వివరించి అన్ని విధాలా సన్నద్ధం చేస్తారు. ఈ శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్నవారు దొంగతనాల్లో గ్రాడ్యుయేట్ల కిందే లెక్క. అంతేకాదు.. ఏడాదిపాటు ఇచ్చే శిక్షణ కోసం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు ఫీజుగా తీసుకుంటున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వారిని గ్యాంగులో సభ్యులుగా చేర్చుకుంటారు. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రాక్టికల్స్‌కు పంపిస్తారు. అలా వారు కొట్టుకొచ్చిన సొమ్ము ఈ దొంగల ముఠాయే తీసుకుని, వారి తల్లిదండ్రులకు ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు మాత్రమే ఇస్తుంది. దీంతో ఇదేదో బాగుందని భావిస్తున్న ఆ చుట్టుపక్కల ఊళ్ల జనం నానా తిప్పలూ పడి ఫీజులు చెల్లించి తమ పిల్లలను దొంగల స్కూళ్లలో చేర్పిస్తున్నారు.



సాక్షి సెంట్రల్ డెస్క్

ఇలా బయటపడింది..

ఈ దొంగల శిక్షణ వ్యవహారం చాలాకాలంగా సాగుతున్నప్పటికీ, ఇటీవల ముంబైలో జరిగిన ఓ దొంగతనంతో వెలుగులోకి వచ్చింది. ఓ బడా పారిశ్రామికవేత్త కుటుంబ వివాహ వేడుక ముంబైలోని ఓ ఖరీదైన హోటల్‌లో ఘనంగా జరిగింది. ఆ హోటల్లోకి ఈ ముఠాకు చెందిన కుర్రాడు పెద్దింటి బిడ్డగా చొరబడి రూ.కోటిన్నర విలువైన నగలతో మాయమయ్యాడు. నగలు కనిపించకపోవడంతో సీసీ కెమెరాలు పరిశీలించగా దొంగతనం విషయం బయటపడింది. ఆ కుర్రాడు ఎవరా అని ఆరా తీసిన పోలీసులు చివరకు మధ్యప్రదేశ్‌లోని ఈ మూలాలు గుర్తించి అవాక్కయ్యారు.

పోలీసులు ఏం చేయలేరా?

నిజానికి ఆ మూడు గ్రామాల్లో దొంగల స్కూళ్లు నడుస్తున్నాయనే సంగతి స్థానిక పోలీసులకు తెలిసినా వారు ఏమీ చేయలేని పరిస్థితి. ఆ ఊళ్లోకి పోలీసులు వెళ్తే చాలు.. ఊరి జనమంతా ఏకమై అడ్డుకుంటారు. ఎవరైనా అపరిచితులు అక్కడకు వెళ్లినా వదిలిపెట్టరు. దీంతో ఒక్క దొంగను అరెస్టు చేయడానికి వెళ్లాలంటే పోలీసులు పెద్ద ఎత్తున మందీమార్బలంలో వెళ్లాల్సిందే. పైగా దొంగల స్కూల్‌ను మూయించే పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే అది మామూలు పాఠశాలలాగే ఉంటుంది. మేం విద్యార్థులకు ట్యూషన్ చెబుతున్నాం.. అది కూడా తప్పా అని ప్రశ్నిస్తారు. దీంతో పోలీసులు తిరుగుముఖం పట్టడం తప్ప చేసేదేమీ ఉండదు. దేశవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో ఈ ముఠాకు చెందిన 2వేల మందికి పైగా వ్యక్తులపై దాదాపు 8వేల కేసులు నమోదయ్యాయి.

అన్ని అంశాల్లో మెరికల్లా శిక్షణ

సైబర్ నేరాలు, కొత్త చట్టాలపై ప్రత్యేక ఫోకస్ | రేపు దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొననున్న ఐపీఎస్‌లు, విదేశీ అధికారులు | ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్ గార్గ్

సాక్షి, హైదరాబాద్: అకాడమీ శిక్షణలో భాగంగా శాంతిభద్రతల నిర్వహణ, సైబర్ నేరాల కట్టడి, డ్రగ్స్ మహమ్మారిని తుద ముట్టించడం సహా అనేక అంశాల్లో యువ ఐపీఎస్‌లను సుశిక్షితులైన అధికారులుగా మార్చినట్టు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్ చెప్పారు. 76వ బ్యాచ్ ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్)కు చెందిన 188 మంది ఐపీఎస్ అధికారులు, నేపాల్, రాయల్ భూటాన్, మారిషస్, మాల్దీవులకు చెందిన 19 మంది విదేశీ అధికారులు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్నట్టు తెలిపారు. వీరిలో 58 మంది మహిళా అధికారులు ఉన్నారన్నారు. వీరంతా శుక్రవారం అకాడమీలో జరిగే దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ హాజరుకానున్నట్టు చెప్పారు. బుధవారం అకాడమీ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

మహిళా అధికారులు పెరిగారు

సైబర్ నేరాలు, డ్రోన్ టెక్నాలజీ, కొత్త చట్టాలపై అవగాహన, శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచడం, అన్ని రకాల ఆయుధాలను వాడే విధానం, వివిధ పోలీస్ విభాగాల్లో, సరిహద్దుల్లో మిలిటరీ విభాగాల్లో పనిచేయడం సహా అనేక అంశాల్లో యువ ఐపీఎస్ అధికారులు శిక్షణ పొందినట్లు అమిత్ గార్గ్ తెలిపారు. ఐపీఎస్ అధికారులు కేటాయించబడే రాష్ట్రంలోని స్థానిక భాష, అక్కడి భౌగోళిక పరిస్థితులు, స్థానిక సమస్యలు, సాంప్రదాయాలపై పట్టు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఈ బ్యాచ్ అధికారుల్లో విద్యార్హత పరంగా చూస్తే ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు 109 మంది, ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు 15 మంది ఉన్నట్టు తెలిపారు. మహిళా అధికారుల సంఖ్యలో ఈసారి పెరుగుదల ఉందని, 75వ బ్యాచ్‌లో 21 శాతం మహిళలుండగా, ఈసారి 29% మంది ఉన్నట్టు చెప్పారు. పరేడ్ కమాండర్‌గా అచ్యుత్ అశోక్ వ్యవహరిస్తారని, ఈ బ్యాచ్‌లో టాపర్స్‌గా నిలిచిన 8 మంది పరేడ్ అనంతరం ట్రోఫీలు అందుకోనున్నట్టు తెలిపారు.



మాట్లాడుతున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్

తెలంగాణ, ఏపీకి నలుగురు చొప్పున ఐపీఎస్‌లు

76వ ఐపీఎస్ బ్యాచ్ నుంచి తెలంగాణకు నలుగురు, ఏపీకి నలుగురు చొప్పున అధికారులను కేటాయించారు. తెలంగాణ కేడర్‌కు తెలంగాణకు చెందిన రుత్విక్ సాయి కొట్టె, పత్తిపాక సాయికిరణ్, జమ్మూకశ్మీర్‌కు చెందిన మనన్ భట్, యూపీకి చెందిన యాదవ్ వసుంధర ఫరేబీలను కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మనీశ రెడ్డి వంగాల, హేమంత్ బొడ్డు, హరియాణాకు చెందిన దీక్ష, తమిళనాడుకు చెందిన ఆర్ సుస్మితలను కేటాయించారు.

తప్పుల్లోంచి పాఠాలు నేర్చుకున్నా..



మాది వరంగల్ జిల్లా భీందేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామం. నాన్న పేరు కొమరెల్లి, అమ్మపేరు లక్ష్మి. మాది వ్యవసాయ ఆధారిత కుటుంబం. మా కుటుంబం నుంచి మొదటి ఐపీఎస్ అధికారిని. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో 2019లో జాబ్‌కు రిజైన్ చేసి, నేనే సొంతంగా ఇంటి వద్ద ప్రిపరేషన్ కొనసాగించా. రోజుకు 8 గంటలు చదివేవాడిని. మా తల్లిదండ్రులు, సిస్టర్స్, ఇతర కుటుంబసభ్యుల నుంచి సంపూర్ణ సహకారం లభించింది. అయితే నా తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు వెళ్లా. మొత్తం మీద మూడో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించా. తెలంగాణ కేడర్‌కు రావడం, మన రాష్ట్ర ప్రజలకే సేవ చేసే అవకాశం దక్కడంతో సంతోషంగా ఉంది.

\- పత్తిపాక సాయికిరణ్

డ్రగ్స్ విషయంలో గట్టిగా పని చేయాలనుకుంటున్నా



నా స్వస్థలం వరంగల్. అక్కడే స్కూల్, ఇంటర్ చదివా. నాన్న రాధాకృష్ణరావు సోషల్ వెల్ఫేర్ విభాగంలో లైబ్రేరియన్. మా అమ్మ టీచర్‌గా కొంత కాలం పనిచేశారు. నాన్న చిన్నప్పటి నుంచి చెప్పే మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి. బీటెక్ పూర్తయిన తర్వాత 2017 నుంచి సివిల్స్ ప్రిపరేషన్ మొదలు పెట్టా. 2022లో నాకు ఐపీఎస్ వచ్చింది. పక్కా ప్రణాళికతో ముందుకు వెళితే తప్పకుండా విజయం సాధించవచ్చు. ఐపీఎస్ శిక్షణ మనలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంచుతుంది. తెలంగాణ కేడర్‌కు రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఏదైనా సమస్య ఉంటే ప్రజలు స్వేచ్ఛగా, ధైర్యంగా రాగలిగేలా పోలీసులపై విశ్వాసం పెంచడమే నా లక్ష్యం. డ్రగ్స్ విషయంలో నేను గట్టిగా పనిచేయాలనుకుంటున్నా.

\- రిత్విక్ సాయి కొట్టే

జానీ మాస్టర్‌పై పోక్సో కేసు

- రాష్ట్ర మహిళా కమిషన్‌కు మహిళా సంఘాల ఫిర్యాదు.. కఠినచర్యలు తీసుకోవాలన్న బీజేపీ మహిళా మోర్చా
- తనకు జరిగిన అన్యాయాన్ని మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు వివరించిన బాధితురాలు..
- అండగా ఉంటామన్న చైర్‌పర్సన్ శారద



మీడియాతో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య

సాక్షి, హైదరాబాద్/బన్సీలాల్‌పేట్/రాజేంద్రనగర్ (హైదరాబాద్): నృత్య దర్శకుడు జానీ మాస్టర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నార్సింగి పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన జానీ మాస్టర్ సహాయకురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణలో భాగంగా జానీ మాస్టర్ వేధించిన సమయంలో నృత్య సహాయకురాలు మైనర్ కావడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జానీ మాస్టర్ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని వెల్లడించారు.

బాధిత మహిళను జానీ వేధింపులకు గురిచేశాడు..

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సాయంత్రం మహిళా సంఘాల ప్రతినిధులు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య, అనిత తదితరులు సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో నేరెళ్ల శారదను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య, అనితలు విలేకరులతో మాట్లాడారు. జానీ మాస్టర్ అవకాశాల పేరిట మహిళలను లోబర్చుకొని లైంగిక దాడికి పాల్పడటంతోపాటు తీవ్ర వేధింపులకు గురి చేశారని చెప్పారు. తమ ఫిర్యాదుపై మహిళా కమిషన్ చైర్మన్ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. బాధిత యువతి మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి మహిళా కమిషన్ చైర్మన్‌కు తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

లైంగిక వేధింపుల కేసులో కఠిన చర్యలు తీసుకోవాలి...

మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై జానీ మాస్టర్ లైంగిక వేధింపులను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలని, నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా డిమాండ్ చేసింది. ఈ కేసులో పారదర్శకంగా విచారణ జరిపించేలా చర్యలు తీసుకోవాలని మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు పోరాడతామని ఓ ప్రకటనలో హెచ్చరించారు.

బాధిత మహిళకు అండగా ఉంటాం: నేరెళ్ల శారద

జానీ మాస్టర్ చేతిలో వేధింపులకు గురైన మహిళకు అండగా ఉంటామని తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద ప్రకటించారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జానీ మాస్టర్ అనే వ్యక్తి తనను లైంగికంగా వేధించారని బాధిత మహిళ బుధవారం ఫిర్యాదు చేసిందన్నారు. ఆమెకి సెక్యూరిటీ ఇవ్వాలని పోలీసులను ఆదేశిస్తామని చెప్పారు. రాష్ట్రంలో మహిళలు, యువతులు, చిన్నారులకు భరోసా కల్పించే దిశగా మహిళా కమిషన్ ముందుకు సాగుతోందని ఆమె వెల్లడించారు.

రూ.5.27 కోట్ల సైబర్ మోసం..
నిందితుడి అరెస్టు

సాక్షి, హైదరాబాద్



శిఖాగోయల్

స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులతో భారీగా లాభాలు వస్తాయని ఆశజూపి హైదరాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.5.27 కోట్లు కొల్లగొట్టిన కేసులో టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు పురోగతి సాధించారు. ఈ కేసులో నిందితుడు సైదుల్ ఇస్లామ్ ఖాన్‌ను పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పుర్బ మెదినిపూర్‌లో అరెస్టు చేసినట్లు టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో వచ్చిన బిజినెస్ ప్రమోషన్ లింక్ ద్వారా ‘ఏ117 ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరిటీస్ అఫీషియల్ స్టాక్ కమ్యూనిటీ’అనే వాట్సాప్ గ్రూప్‌లో చేరినట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ గ్రూప్ సీఈవో అంకుర్ కేడియాగా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి మాటలు నమ్మి రెండు దఫాల్లో రూ.5.27 కోట్లు అతడు చెప్పిన బ్యాంకు ఖాతాల్లోకి పంపినట్లు తెలిపాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు టీజీసీఎస్‌బీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన అధికారులు కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని అరెస్టు చేశారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయంటూ ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు నమ్మి మోసపోవద్దని శిఖాగోయల్ సూచించారు.

ప్లీజ్.. వెళ్లొద్దు సార్!



వీణవంక (హుజూరాబాద్): ‘సార్ మీరు మా స్కూల్ వదిలి వెళ్లొద్దు. మీరు లేకుంటే స్కూల్ బోసిపోతుంది. మా మోడల్ స్కూల్‌ను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. ప్రిన్సిపాల్‌గా కాకుండా ఆడపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు’అంటూ.. బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్‌ను పట్టుకుని విద్యార్థులు వెక్కివెక్కి ఏడ్చారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఘన్ముక్కుల మోడల్ స్కూల్‌లో చోటుచేసుకుంది. ఇక్కడ 11 ఏళ్లుగా ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి రెండ్రోజుల క్రితం జనగాం జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు బదిలీ అయ్యారు. బుధవారం వేణుగోపాల్ రెడ్డి స్కూల్‌కు రాగానే విద్యార్థులు బోరున విలపించారు. ‘మీరు బదిలీని విరమించుకోండి సార్. మీరే మాకు ప్రిన్సిపాల్‌గా కావాలి’అంటూ విద్యార్థులు వెక్కివెక్కి రోదించడంతో అక్కడ నిశ్శబ్ద వాతావరణం ఏర్పడింది.

రూ.160 పల్లీ నూనె 90కే విక్రయం



- ఏపీ నుంచి ఆయిల్ ట్యాంకర్ ఎత్తుకొచ్చి అమ్మకాలు
- ఎగబడిన జనం

ఎర్రుపాలెం: ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా నందిగామ నంచి పల్లీనూనె లోడ్ ట్యాంకర్‌ను చోరీ చేసిన దుండగులు.. తక్కువ ధరకే అమ్ముతుండడంతో జనం ఎగబడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ట్యాంకర్‌ను చోరీ చేసి సోమవారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం, పుల్లూరులో నూనె అమ్ముతూ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం జమలాపురం, కంద్రిక, బంజర వరకు చేరుకున్నారు. మార్కెట్‌లో లీటర్ రూ.160 వరకు ధర ఉన్న పల్లీ నూనెను రూ.90కే విక్రయిస్తుండడంతో జనాలు ఆయిల్ టిన్నులు, క్యాన్లతో బారులు దీరారు. ఈ విషయం పోలీసులకు చేరింది. దీంతో ఎస్ఐ పి.వెంకటేష్, సిబ్బంది చేరుకునేలోగా ట్యాంకర్‌తో వచ్చిన వారు జారుకున్నారు. ఈమేరకు విచారించిన ఎస్ఐ ఆయిల్ ట్యాంకర్ నందిగామకు చెందిన శ్రీవేంకటేశ్వర ట్రేడర్స్ యజమాని శ్రీనివాస నాగప్రసాద్‌కు చెందినదని గుర్తించి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఈమేరకు యాజమాన్య బాధ్యులు చేరుకుని ట్యాంకర్‌ను తీసుకెళ్లి నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, అప్పటికే ట్యాంకర్‌లో సగం మేర నూనె అమ్మేయడం గమనార్హం.

వీధి కుక్కల నియంత్రణకు
చర్యలు చేపట్టాం

హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన జీహెచ్‌ఎంసీ

బాధితులకు పరిహారం చెల్లింపుపై 2 వారాల గడువు

సాక్షి, హైదరాబాద్: వీధి కుక్కల నియంత్రణకు జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు హైకోర్టుకు జీహెచ్‌ఎంసీ వెల్లడించింది. వీధికుక్కల సంఖ్యను తగ్గించడానికి, రేబిస్ వ్యాధి నివారణకు యాంటీ రేబిస్ కార్యక్రమం కింద చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నివేదిక అందజేశారు. స్థానిక సంస్థలు, జంతు సంక్షేమ సంస్థల ఆధ్వర్యంలో 898 జంతు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జూన్ 28న పటాన్‌చెరు ఇస్నాపూర్‌లో వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతి చెందాడు. ఈ దారుణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. అలాగే గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో పిటిషన్లకు దీన్ని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కౌంటర్ దాఖలు చేసింది. ‘హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బయట కుక్కల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం. కుక్క కాట్లు, ఇతర ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 040-21111111 ఏర్పాటు చేశాం. రోజుకు 200 ఫిర్యాదుల వరకు తీసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా ట్విట్టర్, మై జీహెచ్‌ఎంసీ యాప్, మై జీహెచ్‌ఎంసీ వెబ్ పోర్టల్, డయల్ 100, అధికారుల ఈ-మెయిల్, ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ నంబర్లపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రచారం కల్పించాం’అని పేర్కొంది. కుక్క కాట్లతో నష్టపోయిన కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు రెండు వారాలు సమయం కావాలని కోరింది. దీంతో ధర్మాసనం తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

నైరుతి తిరోగమనం షురూ...

మూడు వారాల్లో దేశవ్యాప్తంగా తిరోగమించనున్న నైరుతి

ఈ సీజన్‌లో సాధారణం కంటే 33 శాతం అధిక వర్షపాతం నమోదు

5 జిల్లాల్లో అత్యధికం, 21 జిల్లాల్లో అధికం, 7 జిల్లాల్లో సాధారణ వర్షపాతం

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల తిరోగమన ప్రక్రియ మొదలైంది. బుధవారం నుంచి ప్రారంభమైన రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ దేశవ్యాప్తంగా దాదాపు 3 వారాలపాటు కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది మే 30న కేరళను తాకిన రుతుపవనాలు... క్రమంగా విస్తరిస్తూ జూన్ 6 నాటికి రాష్ట్రంలోకి ప్రవేశించాయి. తొలుత అత్యంత చురుకుగా సాగిన రుతుపవనాలు... జూలైలో మందగించాయి. దీంతో జూలైలో ఎక్కువ రోజులు వర్షాలు కురవలేదు. రాష్ట్రంలోని చాలాప్రాంతాలు ఆగస్టు రెండో వారం నాటికి లోటు వర్షపాతంతోనే ఉన్నాయి. ఆగస్టు మూడో వారం నుంచి రుతుపవనాల కదలికలు చురుకవడంతో వర్షాలు ఊపందుకున్నాయి. ఆగస్టు నెలాఖరులో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. సీజన్‌లో రాష్ట్రంలో నమోదు కావాల్సిన సాధారణ వర్షపాతం 72.52 సెం.మీ.. ఈ సీజన్‌లో ఇప్పటివరకు కురవాల్సిన సగటు సాధారణ వర్షపాతం 67.42 సెం.మీ. కాగా, నమోదైన వర్షపాతం 89.81 సెం.మీ.. ఈ లెక్కన సాధారణ వర్షపాతం కంటే 22% అధికంగా నమోదైంది.

నిష్క్రమణ సమయమూ కీలకమే...

రుతుపవనాలు నిష్క్రమించే సమయం కూడా కీలకమైందని నిపుణులు చెప్పారు. ఇప్పటివరకు ముందుకు కదులుతూ దేశాన్ని చుట్టేసిన రుతుపవనాలు... ఇప్పుడు తిరోగమన దిశలో ప్రయాణిస్తున్నాయి. ఈ సమయంలో కూడా భారీ వర్షాలకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. గత పదేళ్లలో ఎక్కువగా వర్షాలు తిరోగమన సమయంలోనే నమోదైనట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఇప్పటివరకు వర్షపాతం సాధారణం నుంచి అత్యధిక స్థాయిలో నమోదైంది. ఇందులో ఐదు జిల్లాలు అత్యధిక వర్షపాతం కేటగిరీలో ఉండగా... 21 జిల్లాల్లో అధిక వర్షపాతం, 7 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ప్రస్తుత సీజన్‌లో లోటు వర్షపాతం ఉన్న జిల్లాలేవీ నమోదు కాలేదు. గత మూడేళ్లుగా జిల్లా కేటగిరీలో లోటు వర్షపాతం నమోదు కాకపోవడం గమనార్హం.

వర్షపాతం ఎక్కడ ఎలా?

అత్యధిక వర్షపాతం: మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణ పేట

అధిక వర్షపాతం: నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, ములుగు

సాధారణ వర్షపాతం: ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, హనుమకొండ, కామారెడ్డి, జనగామ, యాదాద్రి-భువనగిరి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం । 19-9-2024



ఉద్యోగాలు.. ఉద్వేగాలు

భారత్‌లో 86 శాతం ఉద్యోగులు ఇలా ఇబ్బందిపడుతున్నవారే

భావోద్వేగాలపరంగా ప్రతీరోజు కోపం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వారు 35 శాతం మంది

గ్యాలప్ స్టేట్ ఆఫ్ ద గ్లోబల్ వర్క్‌ఫోర్స్- 2024 నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భారతీయ ఉద్యోగులు తమ పని ప్రదేశాలు, రోజువారీ జీవనాన్ని గడిపే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగుల్లో అత్యధికులు తమ జీవితం సాగుతున్న తీరు పట్ల అంత సంతోషంగా లేరని తెలుస్తోంది. దక్షిణాసియాలోనే రెండో అతి పెద్దసంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్న దేశంగా భారత్ గుర్తింపు పొందింది. మనదేశంలోని ఉద్యోగుల స్థితిగతులు, ఇతర అంశాల గురించి లోతుగా పరిశీలించినప్పుడు.. వారి ఉద్యోగ జీవితం మానసికంగా, భావోద్వేగాలపరంగా, సామాజిక అంశాలపరంగా అంతగా సంతోషంగా, సంతృప్తికరంగా సాగడం లేదని స్పష్టమవుతోంది. దేశంలోని 86 శాతం మంది ఉద్యోగులు ఇబ్బందులు లేదా కష్టాల్లో (స్ట్రగులింగ్ ఆర్ సఫరింగ్) సాగుతున్నట్టుగా గ్యాలప్ స్టేట్ ఆఫ్ ద గ్లోబల్ వర్క్‌పోర్స్–2024 వార్షిక నివేదిక తెలిపింది. మొత్తం ఉద్యోగుల్లో 14 శాతం మంది మాత్రమే తాము అన్నివిధాలుగా పురోగతి సాధిస్తూ సంతృప్తిగా, పూర్తి ఆశావహ దృక్పథంతో ముందుకు అడుగువేస్తున్నట్టుగా ఈ అధ్యయనం తెలియజేసింది. దక్షిణాసియాలోనే రెండో పెద్ద వర్క్‌ఫోర్స్‌గా ఉన్న మన దేశంలోని ఉద్యోగుల పరిస్థితులపై రూపొందించిన ఈ నివేదికలో భాగంగా.. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల మానసికస్థితి, వారి శ్రేయస్సు, అభ్యున్నతి ఎలా ఉందనే అంశంపై ఈ సంస్థ అంచనా వేసింది. ప్రధానంగా గ్యాలప్ కేటగిరీల వారీగా జీవన మూల్యాంకన సూచీ (లైఫ్ ఎవల్యువేషన్ ఇండెక్స్)..సంతృప్తి-పురోగతి (థ్రైవింగ్), కష్టాలు ఎదుర్కోవడం (స్ట్రగులింగ్), బాధ-కుంగుబాటు (సఫరింగ్) మూడు గ్రూపులుగా ఉద్యోగులను వర్గీకరించింది.



పరిశీలన ఇలా...

ఉద్యోగులు తాము సాగిస్తున్న జీవనం, భవిష్యత్ ఆలోచనల పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారా లేదా ? ప్రస్తుతం తామున్న పరిస్థితిపై సంతృప్తి, ఆశావహ దృక్పథం, ఇతర ధోరణులకు అనుగుణంగా పది పాయింట్లకు గాను ఏడు ఆపై స్థాయిలో పాయింట్లు సాధించే వారిని 'థ్రైవింగ్' (సంతృప్తితో) కేటగిరీలోని వారిగా ఈ సంస్థ లెక్కించింది. ఉద్యోగులు గడుపుతున్న జీవితం పట్ల అభద్రతాభావంతో అగమ్యగోచరంగా లేదా ప్రతికూలతతో ఉన్న వారిని, రోజువారీ ఒత్తిళ్లు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారిని 'స్ట్రగులింగ్'గా పరిగణించింది. ఇక 'సఫరింగ్' గ్రూపులో ఉన్న వారిని...వ్యక్తులుగా వారు ప్రస్తుత జీవనం, భవిష్యత్ అనేవి దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నట్టుగా భావిస్తున్న వారిగా, కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక, శారీరకంగా, భావోద్వేగపరంగా బాధ అనుభవిస్తున్న వారిగా వర్గీకరించింది.

'స్టేట్ ఆఫ్ ద గ్లోబల్ వర్క్‌ఫోర్స్' నివేదికలో ఇంకా ఏముందంటే..

- ప్రతీరోజు భావోద్వేగపరంగా ఎదురవుతున్న అనుభవాలు, మనస్థితిని బట్టి 35 శాతం మంది భారతీయులు రోజూ కోపం, ఆగ్రహానికి లోనవుతున్నారు. ఇది దక్షిణాసియాలోనే అత్యధికం.
- భారత్‌లో రోజువారీ ఒత్తిళ్లు అనేవి అత్యల్పంగా ఉన్నట్టు తేలింది. దక్షిణాసియా ప్రాంతంలో చూస్తే..శ్రీలంకలో ఇది 62 శాతంగా, అఫ్గానిస్తాన్‌లో 58 శాతంగా, భారత్‌లో 32 శాతంగా ఉంది.
- దక్షిణాసియాలో..గడిచిన ముందు రోజు పట్ల ఒంటరితనం (29 శాతం), ఆగ్రహం, కోపం (34 శాతం), విచారం (42 శాతం) బారిన ఉద్యోగులు పడినట్టు స్పష్టమైంది.
- దక్షిణాసియాలో 48 శాతం మంది ప్రస్తుత సమయంలో ఉద్యోగాలు పొందడానికి సరైనదనే భావనలో ఉన్నారు
- అదే భారత్ విషయానికొస్తే...57 శాతం మంది అదే అభిప్రాయంతో ఉన్నారు.
- ప్రాంతీయంగా చూస్తే...తాము ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగాలు విడిచిపెట్టి కొత్త వాటిని కోరుకుంటున్నవారు 58 శాతం కాగా... భారత్‌లో మాత్రం 52 శాతంగా ఉన్నారు.

గ్యాలప్ స్టేట్ ఆఫ్ ద గ్లోబల్ వర్క్‌ఫోర్స్ అంటే...

ప్రపంచవ్యాప్తంగా 80 ఏళ్లుగా వివిధ కంపెనీలు, సంస్థలు ఎదుర్కొనే ముఖ్యమైన సమస్యలపై అధ్యయనం చేసి, అవసరమైన విశ్లేషణలు అందిస్తూ ఆయా సమస్యలను అధిగమించేందుకు 'గ్యాలప్'సంస్థ కృషి చేస్తోంది. ఉద్యోగులు, వినియోగదారులు, విద్యార్థులు, పౌరుల వైఖరులు, వారి ప్రవర్తన తీరుతెన్నులపై ఈ సంస్థ పూర్తి అవగాహన కలిగి ఉండడంతో, ఈ వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యలను సరిగ్గా ఎత్తిచూపగలుగుతోంది. వారి మనస్థితి, సంతృప్తి, ఇబ్బందులు, విచారం వంటి వాటిని అంచనా వేయగలుగుతోంది.



బుధవారం హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

ఫాంహౌస్‌లో ఎంజాయ్ చేస్తున్నది రేవంతే..


బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయం చేస్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి ఫాంహౌస్‌లో ఎంజాయ్ చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. ఫాంహౌస్ సీఎంను కాను.. అని రేవంత్‌రెడ్డి అన్న మాటలపై బుధవారం ఆయన స్పందించారు. తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఇడ్లీ, వడ అమ్ముకోవాలంటూ చిరు వ్యాపారులను రేవంత్‌రెడ్డి అవమానించడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా పచ్చ పార్టీలో ఉన్నప్పుడు.. కంప్యూటర్‌ను పుట్టించింది చంద్రబాబు అని అన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రాజీవ్‌గాంధీ అంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రధానిగా చాలా మంది పనిచేశారని, దేశంలో గాంధీలు తప్ప మరెవరూ లేరా? అని నిలదీశారు. తెలంగాణ సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం ఏమిటని మండిపడ్డారు. సోనియా గాంధీ తెలంగాణ తల్లి అయితే.. బలి దేవత ఎవరో చెప్పాలని రాకేశ్‌రెడ్డి ప్రశ్నించారు.

'మ్యాప్స్'కేసుపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేటలో ఎర్రకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారంటూ మ్యాప్స్ ఇన్‌ఫ్రాపై నమోదు చేసిన క్రిమినల్ కేసు వివరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఆలోగా వివరాలు తెలుసుకుని చెప్పాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. ఆక్రమణలపై నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ మ్యాప్స్ ఇన్‌ఫ్రా తరపున మేనేజింగ్ పార్ట్‌నర్ సుధాకర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ భూమిని హైడ్రా అధికారులు ఆగస్టు 14న సందర్శించారని తెలిపారు. గతంలోనూ ఇక్కడ తనిఖీలు చేసినప్పుడు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించారని పేర్కొన్నారు. బాచుపల్లి సర్వే నంబర్ 48, 49లో నివాసాల నిర్మాణానికి హెచ్‌ఎండీఏ ఇచ్చిన అనుమతి పత్రాలు, రెవెన్యూ అధికారుల స్కెచ్ మ్యాప్‌లను 2023లోనే అధికారులకు అందజేసినట్టు తెలిపారు. సర్వే నంబర్ 134లోని ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలను హైడ్రా గత నెలలో తొలగించిందని, కేవలం తమను వేధించడం కోసమే కేసులు నమోదు చేశారని వెల్లడించారు. పిటిషనర్ సంస్థ 2023లో కంపెనీస్ యాక్ట్ ప్రకారం ఏర్పాటైందని, 1188, 1189, 1190, 1191, 1192, 1193 ప్లాట్లకు సంపూర్ణ యజమానులమని వివరించారు. మొత్తం 1,452 చదరపు అడుగుల భూమిని అధికారిక సేల్ డీడ్ ద్వారా కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసు కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన బుధవారం విచారణ చేపట్టారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. పోలీసుల వివరణ చెప్పాలని ఆదేశించారు.

అక్టోబర్ 2 దాకా 'సేవాపక్షం' కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: అక్టోబర్ 2వ తేదీ దాకా పార్టీ ఆధ్వర్యంలో 'సేవాపక్షం'పేరుతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు బీజేపీ ఉపాధ్యక్షుడు డా.జి.మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ప్రధాని మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17న మొదలుపెట్టి, ఈనెల 25న పార్టీ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి, అక్టోబర్ 2న గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి వరకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లా కేంద్రాల్లో రక్తదాన శిబిరాలతో పాటు 23న జన ఆరోగ్య యోజన కార్డుల జారీ, 18 నుంచి 25 దాకా అసెంబ్లీ కేంద్రాల్లో మెగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. 25న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మెగా మెంబర్‌షిప్ డ్రైవ్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 2న హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాల అలంకరణ, ఖాదీ దుస్తుల కొనుగోలు, పారా ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి పతకాలు సాధించిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నేడు బమ్మెరలో భూ న్యాయ శిబిరం

సాక్షి, హైదరాబాద్: లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థ ఆధ్వర్యంలో జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో గురువారం భూ న్యాయ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో నిర్వహించినట్టే.. భూ సమస్యలపై అవగాహన, ధరణి సమస్యల పరిష్కారానికి రైతులకు ఉచిత న్యాయ సలహా ఇవ్వనున్నారు. రైతుల భూసమస్యల వివరాలను సేకరించి, వారి పత్రాలు పరిశీలించి నివేదిక తయారు చేయనున్నారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని, తాము గతంలో భూన్యాయ శిబిరాలు నిర్వహించిన వెంపటి, ఫణిగిరి, చిన వంగర, ఆరుట్ల, రావిర్యాల, కందవాడ గ్రామాల్లోనూ ఈ శిబిరాలను నెల రోజుల్లో నిర్వహించనున్నట్టు లీఫ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.సునీల్‌కుమార్ వెల్లడించారు.

'సరళ'జల తరంగిణి

పది గ్రామాల్లో పంట సిరుల కోసం సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలనుకున్నారు. అనుకున్నదే తడవు అమెరికాకు చెందిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి ముందు మొదలై.. స్వాతంత్ర్యానంతరం ప్రారంభమైన ఆ సాగునీటి ప్రాజెక్టు వయసు ఏడున్నర దశాబ్దాలు.. వనపర్తి జిల్లా మదనాపురం మండలం శంకరమ్మపేట సమీపంలో సంస్థానాధీశుల కాలంలో అప్పట్లో రూ.35 లక్షలతో నిర్మించిన సరళాసాగర్ ప్రాజెక్టు విశేషాలివి.

- వనపర్తి

రాజారామేశ్వర్‌రావు సరళాసాగర్ ప్రాజెక్టు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం ● పది గ్రామాల సాగునీటి కోసం..

అప్పట్లోనే రూ.35 లక్షల వ్యయం ● 1947లో పనులు ప్రారంభం.. 1959లో వినియోగంలోకి..



ఇటీవల సరళాసాగర్ ప్రాజెక్టు నిండడంతో ఆటోమేటిగ్గా సైఫన్ల నుంచి విడుదలవుతున్న నీరు (ఫైల్)

వనపర్తి సంస్థానాధీశుడి ఆలోచనే..

స్వాతంత్ర్యానికి ముందే ఇక్కడ ప్రాజెక్టు నిర్మించాలనే ఆలోచన.. అప్పటి వనపర్తి సంస్థానాధీశుడు రాజారామేశ్వర్‌రావుకు వచ్చింది. తన తల్లి సరళాదేవి పేరుపై ప్రత్యేకంగా నిర్మించేందుకు ఆయన అమెరికాలోని కాలిఫోర్నియాలో ఆటోమేటిక్ సైఫన్ సిస్టం అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్కడికి తీసుకొచ్చారు. అనధికారికంగా 1947 జూలై 10న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా.. స్వాతంత్ర్యానంతరం అప్పటి మిలిటరీ గవర్నర్ జేఎన్ చౌదరి 1949 సెప్టెంబర్ 15న తిరిగి శంకుస్థాపన చేశారు. పదేళ్లపాటు ప్రాజెక్టు నిర్మాణం కొనసాగింది. అప్పట్లో రూ.35 లక్షలతో దీన్ని పూర్తి చేశారు. 1959 జూలై 26న అప్పటి పీడబ్ల్యూడీ మంత్రి జేవీ రంగారావు ప్రాజెక్టును ప్రారంభించారు.

ఆటోమేటిక్ సైఫన్ సిస్టం అంటే..

ప్రాజెక్టులోని నీరు పూర్తిస్థాయి మట్టానికి చేరుకోగానే సైఫన్లు వాటంతటవే తెరుచుకుంటాయి. అప్పట్లో ఈ పరిజ్ఞానంతో ఆసియాలోనే నిర్మించిన మొదటి ప్రాజెక్టు కాగా.. ప్రపంచంలో రెండోది కావడం విశేషం. 17 వుడ్ సైఫన్లు, 4 ప్రీమింగ్ సైఫన్లతో 391 అడుగుల వెడల్పుతో మెయిన్ సైఫన్‌ను నిర్మించారు. ఒక్కొక్క సైఫన్ నుంచి 520 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. మట్టికట్ట పొడవు 3,537 అడుగులు, రాతికట్ట పొడవు 520 అడుగులు, కట్ట గరిష్ట ఎత్తు 45.2 అడుగులు. నీటి విస్తరణ ప్రదేశం రెండు చదరపు మైళ్లు, కుడికాల్వ 8 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 20 కిలోమీటర్లు ప్రవహిస్తూ ఆయకట్టుకు నీరందిస్తున్నాయి. ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న కట్ట ఇప్పటికి రెండుసార్లు తెగిపోయింది. 1964లో మొదటిసారి, 2019 డిసెంబర్ 31వ తేదీన రెండోసారి కట్టకు గండిపడింది.

ముంపు సమస్య పరిష్కారానికే..

వర్షం నీరు ఊకచెట్టు వాగులో నుంచి వృథాగా కృష్ణానదిలో కలిసిపోవటం.. ఈ వాగు సమీపంలోని గ్రామాలు తరచూ వరద ముంపునకు గురయ్యేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకు సరళాసాగర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. వనపర్తి సంస్థానం అధీనంలోని పది గ్రామాల్లోని సుమారు 4,182 ఎకరాలకు సాగునీరందించేలా 0.5 టీఎంసీ సామర్థ్యంతో సరళాసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు సాగునీరందే గ్రామాలు ప్రస్తుతం మదనాపురం మండల పరిధిలో ఉన్నాయి. ఎడమ కాల్వ పరిధిలో శంకరంపేట, దంతనూరు, మదనాపురం, తిరుమలాయపల్లి, వడ్డెవాట, చర్లపల్లి, రామన్‌పాడు, అజ్జకోలు, కుడికాల్వ పరిధిలో నెల్విడి నర్సింగాపూర్ గ్రామాలున్నాయి. కాగా.. సరళాసాగర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. కానీ ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఇటీవల పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి సరళాసాగర్‌ను సందర్శించినా.. ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకపోవడం గమనార్హం.

మరమ్మతులకు ప్రతిపాదనలు

"ఏడు దశాబ్దాల క్రితం నిర్మించిన సరళాసాగర్ ప్రాజెక్టుకు అక్కడక్కడా ఏర్పడిన నెర్రెలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇందుకోసం నిపుణులైన ఇంజనీర్లను రప్పించి.. ఆధునిక పద్ధతిలో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపరింటెండింగ్ ఇంజనీరు ఆదేశించారు. ఈ మేరకు సరళాసాగర్‌ను సందర్శించనున్నాం.

- రవీల్‌రెడ్డి, ఇంజనీర్, నీటి పారుదలశాఖ

ట్రాలీ ఎక్కిన పడవ



నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం రాజుపాలెం పరిసర ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌ల్లో డ్రెడ్జింగ్ కోసం రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల నుంచి ట్రాలీలపై భారీ పడవలను తరలిస్తున్నారు. రాజుపాలెం జాతీయ రహదారి వద్ద ఈ దృశ్యాలు కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఇంకా రోడ్డుపైనే..



విజయవాడలోని సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో ఇప్పటికీ వరద నీరు నిలిచే ఉంది. పశువుల మేతకు వ్యవసాయ క్షేత్రాలు అనుకూలంగా లేకపోవడంతో యజమానులు వాటిని ఇలా రోడ్డు డివైడర్లలో కట్టేసి మేపుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉపాధి వరదపాలు



విజయవాడను ముంచెత్తిన బుడమేరు వరద దెబ్బకు అజిత్‌సింగ్ నగర్ వందడుగుల రోడ్డులో మండపాల అలంకరణ సామగ్రి పూర్తిగా నీటమునిగిపోయింది. ఫైబర్‌తో చేసిన బొమ్మలు నీట మునిగి ఎందుకూ పనికిరాకుండాపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఏపీ మాజీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు అస్వస్థత



విశ్వ భూషణ్ హరిచందన్‌ను పరామర్శిస్తున్న సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ గవర్నర్, ఒడిశా రాష్ట్ర మాజీమంత్రి విశ్వ భూషణ్ హరిచందన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో చికిత్స కోసం ఆయనను పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఆయన్ను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పరామర్శించారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సైతం గవర్నరుగా బాధ్యతలు నిర్వర్తించారు.

వరద బాధితులకిచ్చే పరిహారం పెంచాలి

సీపీఎం డిమాండ్

సాక్షి, అమరావతి: ఇటీవల వరదల్లో నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ప్యాకేజీ ఏమాత్రం సరిపోదని, భారీ నష్టానికి అనుగుణంగా ప్యాకేజీ పెంచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బుడమేరు, కృష్ణా వరదలతో విజయవాడ సహా పలు ప్రాంతాల్లో దాదాపు 10 రోజుల పాటు ఇళ్లు ముంపులోనే ఉన్నాయని, నివాసితులు సర్వం కోల్పోగా.. భారీ ఆస్తి నష్టం జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ రూ.లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని, చేతివృత్తులు, వ్యాపారం, పరిశ్రమలకు రూ.కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ప్యాకేజీ నష్టానికి అనుగుణంగా లేదన్నారు. ముంపునకు గురైన ప్రతి కుటుంబానికీ పరిహారం రూ.50 వేలకు తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.5 లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.2 లక్షల సాయం చేయాలన్నారు. చిరు వ్యాపారులకు ఇచ్చే పరిహారం రూ.25 వేలు సరిపోదని, వారికి కనీసం రూ.లక్ష ఇవ్వాలన్నారు. పంటలకు ప్రకటించిన పరిహారం కూడా ఏమాత్రం సరిపోదని, వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం

ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావాల్సిన 5 మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం గర్హనీయమని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య కళాశాలను ప్రైవేటు పరం చేయడం ద్వారా ఈ విద్యా సంవత్సరం రాష్ట్రానికి రావాల్సిన మెడికల్ సీట్లలో 700 సీట్లు విద్యార్థులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆయిల్‌పామ్ రైతుల ఖుషీ



క్రూడ్ పామాయిల్‌పై 20 శాతం దిగుమతి సుంకం విధించిన కేంద్రం

- కేంద్రం నిర్ణయంతో ఆయిల్‌పామ్ గెలల టన్ను ధర రూ.13,950 నుంచి రూ.16 వేలకు పెరిగే అవకాశం
- వైఎస్ జగన్ హయాంలో గెలల ధర రూ.24 వేలు
- ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో 2022లో దిగుమతి సుంకం ఎత్తేసిన కేంద్రం
- ఫలితంగా భారీగా ధర పడిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులు
- రైతులకు బాసటగా కేంద్రానికి లేఖలు రాసిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించడంతో రైతుల్లో ఆనందం

సాక్షి, అమరావతి: ఆయిల్‌పామ్ ధరలు పతనమవుతున్న దశలో కేంద్రం తీసుకున్న నిర్ణయం రైతులకు ఊరటనిస్తోంది. మూడేళ్ల తర్వాత క్రూడ్ పామాయిల్ (సీపీవో)పై ఇకనుంచి 20 శాతం దిగుమతి సుంకం వసూలు చేస్తామని కేంద్రం ప్రకటించడంతో ఆయిల్‌పామ్ రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 45 శాతం మంది పామాయిల్‌నే వంట నూనెగా వినియోగిస్తుండగా.. మన దేశంలో ఉత్పత్తి అయ్యేది స్వల్పమే. దేశీయ అవసరాలు తీర్చేందుకు నెలకు సుమారు 6,84,000 టన్నుల పామాయిల్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. 2022కు ముందు క్రూడ్ పామాయిల్‌పై 49 శాతం దిగుమతి సుంకం ఉండేది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయడంతో ధరలు పడిపోయాయి. దీంతో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

సాగు, దిగుబడుల్లో నంబర్ వన్‌గా ఎదిగిన ఏపీ




వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా గడచిన ఐదేళ్లలో ఆయిల్‌పామ్ సాగు, దిగుబడుల్లో ఆంధ్రప్రదేశ్‌లో అగ్రస్థానం సాధించి దేశంలోనే నంబర్ వన్‌గా ఎదిగింది. క్రమం తప్పకుండా ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో(ఓఈఆర్)ను ప్రకటించడంతో ఓ దశలో ఫ్రెష్ ఫ్రూట్ బెంచ్ (ఎఫ్ఎఫ్‌బీ)కు టన్ను రూ.24 వేల వరకు పొందిన ఆయిల్ పామ్ రైతులు.. 2022లో దిగుమతి సుంకాన్ని ఎత్తివేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో సాగుదారులు ఒక్కసారిగా కుదేలయ్యారు. ఈ నేపథ్యంలో పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా ఉప ఉత్పత్తుల (గింజల) విలువను చేరుస్తూ వయబిలిటీ ధరను సవరిస్తూ రైతుకు లాభదాయకమైన ధరను ప్రకటించాలని, దిగుమతి సుంకాన్ని తక్షణమే పునరుద్ధరించాలంటూ ఆయిల్‌పామ్ రైతులు ఉద్యమ బాట పట్టారు. వీరికి బాసటగా నిలిచిన వైఎస్ జగన్ పలుమార్లు లేఖలు రాయడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఇటీవల రాష్ట్రానికి విచ్చేసిన కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను జాతీయ ఆయిల్‌పామ్ రైతుల సంఘ ప్రతినిధులు కలిసి కేంద్రం ఆదుకోకపోతే ఆయిల్‌పామ్ సాగుదారులు సంక్షోభంలో కూరుకుపోతారనే విషయాన్ని వివరించారు. గతంలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన కృషి, ఆయిల్‌పామ్ రైతులు ఆందోళన ఫలించడంతో ఎట్టకేలకు సీపీవోపై దిగుమతి సుంకాన్ని పునరుద్ధరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టన్ను రూ.13,950 పలుకుతున్న ఆయిల్‌పామ్ గెలల ధర కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో టన్ను రూ.16 వేలకు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

కనీసం రూ.20 వేలు ఉండాల్సిందే

పెరిగిన ఎరువుల ధరలు, పెట్టుబడి ఖర్చుల నేపథ్యంలో టన్నుకు రూ.20 వేలు వస్తే కానీ ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. దిగుమతి సుంకం పునరుద్ధరించిన కేంద్రం వయబిలిటీ ధరను కూడా సవరించి, డైనమిక్ డ్యూటీ మెకానిజం ఏర్పాటు చేయాలి. దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించిన కేంద్రానికి రుణపడి ఉంటాం.

– బొబ్బ వీరరాఘవరావు, అధ్యక్షుడు, ఏపీ ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమ సంఘం


ఆయిల్‌పామ్ రైతులకు ఊరట



కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సంక్షోభంలో ఉన్న ఆయిల్‌పామ్ రైతులకు ఎంతో ఊరటనిస్తుంది. రైతు అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించి దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించేందుకు సహకరించిన కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఆయిల్‌పామ్ రైతుల తరఫున కృతజ్ఞతలు. క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకం విధించడం వల్ల దేశీయంగా ఆయిల్‌పామ్ సాగు మరింత విస్తరించేందుకు దోహద పడుతుంది.

– కె.క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి, జాతీయ ఆయిల్‌పామ్ రైతుల సంఘం

జలవిద్యుదుత్పత్తిలో ఏపీ ముందంజ



- ఇప్పటికే 1,610 మెగావాట్ల ఉత్పత్తి
- పోలవరం జల విద్యుత్ కేంద్రం పూర్తయితే అందుబాటులోకి మరో 960 మెగావాట్లు
- దేశంలో 1,48,701 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం
- నిర్మాణం పూర్తయిన కేంద్రాల్లో ప్రస్తుతం 42,104.55 మెగావాట్ల ఉత్పత్తి
- కేంద్ర జలసంఘం అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: జల విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. శ్రీశైలం కుడిగట్టు, లోయర్ సీలేరు, అప్పర్ సీలేరు తదితర జల విద్యుత్ కేంద్రాల ద్వారా ఇప్పటికే 1,610 మెగావాట్లను ఉత్పత్తి చేస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు అనుబంధంగా 960 మెగావాట్ల సామర్థ్యంతో జల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులను 2019 నవంబర్‌లో ప్రారంభించి శరవేగంగా నిర్మిస్తోంది. పోలవరం జల విద్యుత్ కేంద్రం కూడా పూర్తయితే రాష్ట్రంలో 2,570 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. రాష్ట్రంలో 2,596 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అంచనా వేయగా.. అందులో 2,570 మెగావాట్లు(99 శాతం) ఉత్పత్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జల విద్యుత్ ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, తమిళనాడు సరసన ఆంధ్రప్రదేశ్ చేరిందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) వెల్లడించింది. దేశంలో జల విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలు.. ఇప్పటికే పూర్తయిన కేంద్రాల్లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్.. నిర్మాణంలో ఉన్న కేంద్రాలు పూర్తయితే అందుబాటులోకి వచ్చే విద్యుత్ తదితర అంశాలపై సీడబ్ల్యూసీ 2017–23 మధ్య సమగ్ర అధ్యయనం చేసింది. అధ్యయనంలో వెల్లడైన అంశాలపై కేంద్రానికి ఇటీవల నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో ప్రధానాంశాలు ఇవీ..

సద్వినియోగం చేసుకున్నది 41.95 శాతమే

దేశంలో హిమాలయ నదులు, ఈశాన్య రాష్ట్రాలు, ద్వీపకల్ప నదులు, జలపాతాలపై 1,48,701 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంది. ఇందులో 25 మెగావాట్లు, అంతకంటే ఎక్కువ సామర్థ్యంతో ఉత్పత్తి చేసే కేంద్రాల్లోనే 1,33,401.03 మెగావాట్లు ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంది. ఇప్పటికే పూర్తయిన జల విద్యుత్ కేంద్రాల ద్వారా 42,104.55 మెగావాట్లు (31.56 శాతం) విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యం 13,867.50 మెగావాట్లు (10.39 శాతం). అంటే.. ఇప్పటివరకు జల విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాల్లో 41.95 శాతం మాత్రమే సద్వినియోగం చేసుకున్నట్టు స్పష్టమవుతోంది. వివిధ కారణాల వల్ల నిర్మాణ దశలో ఆగిపోయిన కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యం 1,156 మెగావాట్లు (0.87 శాతం). 76,282 మెగావాట్లు (57.18 శాతం) ఉత్పత్తి చేసే కేంద్రాల నిర్మాణాన్ని ఇప్పటికీ చేపట్టలేదు.

రాష్ట్రాల్లో జల విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలు.. ఉత్పత్తి చేస్తున్న తీరు ఇలా



రాష్ట్రం	జల విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశం (మెగావాట్లలో)	పూర్తయిన కేంద్రాల ద్వారా ఉత్పత్తవుతున్న విద్యుత్ (మెగావాట్లలో)	శాతం
ఉత్తరప్రదేశ్	501.60	501.60	100
గుజరాత్	500	500	100
రాజస్థాన్	411	411	100
తమిళనాడు	1,785.20	1,778.20	99.61
పంజాబ్	1,300.73	1,096.30	84.28
మహారాష్ట్ర	3,144	2,647.09	84.19
కర్ణాటక	4,414.40	3,689.20	83.57
మధ్యప్రదేశ్	2,819	2,235	79.28
ఒడిశా	2,824.50	2,154.55	76.28
కేరళ	2,472.75	1,864.15	75.39
ఆంధ్రప్రదేశ్	2,596	1,610	62.02
తెలంగాణ	1,302	800	61.44
హిమాచల్ ప్రదేశ్	18,305	10,263	56.07
ఉత్తరాఖండ్	13,481.35	3,975.35	29.49
జమ్మూకశ్మీర్	12,264.50	3,360	27.40
అరుణాచల్ ప్రదేశ్	50,394	1,115	2.21

అరుణాచల్‌లో అవకాశాలు అపారం

హిమాలయ నదులు ప్రవహించే రాష్ట్రాల కంటే ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌లో జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు అపారంగా ఉన్నాయి. ఆ రాష్ట్ర భౌగోళిక పరిస్థితులు జల విద్యుత్ ఉత్పత్తికి అత్యంత అనుకూలం. అరుణాచల్ ప్రదేశ్‌లో 50,394 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంది. ఇప్పటికి నిర్మాణం పూర్తయిన కేంద్రాల్లో 1,115 మెగావాట్లు (2.21 శాతం) విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. చైనాతో సరిహద్దు సమస్యలు, శాంతిభద్రతల పరిస్థితులు జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి అడ్డంకిగా మారాయి. దేశంలో అత్యధిక సామర్థ్యంతో జల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్. ఆ రాష్ట్రంలో 18,305 మెగావాట్ల ఉత్పత్తికి అవకాశం ఉంటే.. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన కేంద్రాల ద్వారా 10,263 మెగావాట్లు (56.07 శాతం) ఉత్పత్తి అవుతోంది. హిమాచల్‌ప్రదేశ్ తర్వాత అత్యధికంగా జల విద్యుత్ ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఉత్తరాఖండ్, కర్ణాటక, జమ్మూకశ్మీర్ నిలిచాయి.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు




తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ కృష్ణతేజ అతిథిగృహం వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,072 మంది స్వామివారిని దర్శించుకోగా 30,384 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా ఒంటిమిట్ట రామయ్య కల్యాణం




ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ముగిసిన కడపరాయుడి పవిత్రోత్సవాలు



కడప కల్చరల్: కడప రాయుడు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం నుంచి కొనసాగుతున్న ఈ ఉత్సవాలలో భాగంగా చివరి రోజు పవిత్రాల సమర్పణతో కార్యక్రమాలు ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయం 6.00 గంటల నుంచి పవిత్రాల విసర్జనలు, మహా పూర్ణాహుతి, చతుస్థాన ఉద్వాసనలు, కుంభ ప్రోక్షణ, పవిత్రాల వితరణ, విద్వత్ సంభావన తదితరాలను నిర్వహించారు.

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ



సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం నుంచి నిత్యకల్యాణాన్ని పునరుద్ధరించారు. ఐదురోజుల పాటు ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాల కారణంగా నిత్యకల్యాణంతో పాటు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. మంగళవారంతో పవిత్రోత్సవాలు ముగియడంతో బుధవారం నుంచి ఆర్జిత సేవలన్నీ పునరుద్ధరించారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిను వేదికపై అధిష్టింపజేసి వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు.

ప్రతి రోజూ శ్రీవారి లడ్డూ విక్రయాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఇక నుంచి ప్రతి రోజూ తిరుమల లడ్డూలను విక్రయించనున్నట్లు ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు వారంలో మూడు రోజులు మాత్రమే లడ్డూలు విక్రయించే వారమని, భక్తుల కోరిక మేరకు ఇక నుంచి ప్రతి రోజూ విక్రయిస్తామని ఆయన వెల్లడించారు.

రావణబ్రహ్మపై లంబోదరుడి విహారం

ఐరాల/తవణంపల్లె: చిత్తూరు జిల్లా కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం వినాయకస్వామి రావణబ్రహ్మ వాహనంపై పురవీధుల్లో విహరించారు. వేకువజామున స్వయంభు వరసిద్ధి వినాయక స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఉభయకర్తలు మేళ తాళాలతో స్వామివారి వాహన సేవకు పూజాసామగ్రి తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు స్వామివారి అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధభరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం మేళ తాళాలు, కళాకారుల కోలాటలు, చెక్కభజనల నడుమ స్వామివారిని ఊరేగించారు.

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం



తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు సుదర్శన హోమం నిర్వహించారు. బుధవారం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ప్రత్యంగిర హోమం




అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి భాద్రపద పౌర్ణిమ పర్వదినం సందర్భంగా బుధవారం ఘనంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అమ్మవారికి ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చండి



తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరంలో చేరిన నూతన సంవత్సరం విద్యార్థినులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ డీఈఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ అధ్యాపకులు చెప్పే పాఠాలతో పాటు జీవిత పాఠాలను నేర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను నెరవేర్చే దిశగా అడుగులు వేయాలని సూచించారు.



ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీన నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ టెస్ట్(ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏ ప్రభుత్వ పాఠశాలల్లో అయినా 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఆధార్ కార్డులో ఉన్నట్టు విద్యార్థి పూర్తి పేరు, పుట్టిన తేదీ, తండ్రి/తల్లి పేరు సరిగ్గా నమోదు చేయాలన్నారు.

కేఎల్‌యూలో 'ఫ్యూచర్ స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'

తాడేపల్లిరూరల్: సాంకేతిక విద్యలో గణనీయమైన పురోగతి సాధించిన కేఎల్‌యూలో ఫ్యూచర్ స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపిస్తున్నట్లు కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరంలోని యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యూఢిల్లీలోని హయ్యత్ రీజెన్సీ హోటల్‌లో జరిగిన సదస్సులో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ప్రముఖ గ్లోబల్ పారిశ్రామికవేత్తల సహకారంతో కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఫ్యూచర్ స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.



ఏకశిలా నిర్మితమైన కైలాసాలయం

ఒకే రాతితో చెక్కిన అతి పెద్ద పురాతన హిందూ దేవాలయాలలో ఒకటి కైలాసాలయం. దీనిని కైలాసం అని కూడా అంటారు. కొండను పై నుంచి తొలిచి ఏకశిలతో నిర్మించిన ఈ అతి పెద్ద దేవాలయం మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో కనిపిస్తుంది.


ఎల్లోరాలో ఉన్న గుహాలయాలలో ఇది ఒకటి. 276 అడుగుల పొడవు, 154 అడుగుల వెడల్పు ఉన్న ఈ ఆలయాన్ని నిర్మించడానికి దాదాపు 400,000 టన్నుల శిలలను వందల సంవత్సరాలుగా తవ్వించారని అంచనా. ప్రపంచంలోని అత్యంత ఆకర్షణీయమైన గుహాలయాలలో ఇది ఒకటి. ఆలయ గోడలపై లభించిన ఉలి జాడల ఆధారంగా మూడు రకాల ఉలులను ఉపయోగించారని పురావస్తు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆలయ నిర్మాణం 46.92 మీటర్ల వెడల్పుతో పిరమిడ్ రూపంలో మూడు అంతస్తులు కలిగి ఉంది. ఎల్లోరా గుహలుగా పిలువబడే 34 గుహ దేవాలయాలలో కైలాస దేవాలయం ఒకటి. ఇది 16వ గుహ. దీనిని 8వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూట రాజు నిర్మించాడు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రాతి కట్టడం.

స్థలపురాణం ప్రకారం స్థానిక రాజు తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో అతడి భార్య శివుడిని ప్రార్థించింది. రాజు పూర్తిగా ఆరోగ్యవంతంగా కోలుకుంటే ఆలయాన్ని కట్టిస్తానని, ఆలయం గోపురం చూసేవరకు తాను ఉపవాసం ఉంటానని మొక్కుకుంది. వెంటనే ఆ రాజు కోలుకున్నాడు. రాణి మొక్కు తీర్చేందుకు అప్పటి శిల్పులు కొండను తొలచి ఆలయ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న కోకసా అనే శిల్పి అలా నిర్మాణం చేపడితే ఆమె ఆలయ గోపురాన్ని చూసేందుకు కొన్ని వందల ఏళ్లు పడుతుందని చెప్పాడు. దీంతో ఆలయాన్ని ముందు నుంచి కాకుండా కొండ పై భాగం నుంచి చెక్కుకుని వచ్చారు. ముందుగా ఆలయం గోపురాన్ని చెక్కి రాణిని ఉపవాస దీక్ష విరమించేలా చేశారు.

శిల్పరీతి


ఈ ఆలయ ప్రవేశ ద్వారం వద్ద రెండు అంతస్తుల గోపురం ఉంది. ప్రవేశ ద్వారం వైపున శైవులు, వైష్ణవులు పూజించే దేవతల శిల్పాలు ఉన్నాయి. ప్రవేశ ద్వారం నుంచి రెండు అంతర్గత ప్రాంగణాలు కనిపిస్తాయి. ఉత్తరం, దక్షిణ ప్రాంగణంలోని రాయిల మీద పెద్ద ఏనుగు నిలుచుని ఘీంకరిస్తున్నట్లు కనిపిస్తుంది. రాష్ట్రకూట రాజులు తమ గజ దళంతో అనేక యుద్ధాల్లో గెలిచి, ఏనుగులను తమకు ఇష్టమైన జంతువులలో ఒకటిగా మార్చుకున్నారు. ఆలయంలో గజ శిల్పాలు ఉండటం రాష్ట్రకూట రాజుల బలాన్ని సూచిస్తుంది. ప్రధాన ఆలయంలో లోపల గోడపైన కమలంపై ఆసీనురాలై ఉన్న గజలక్ష్మి ప్రతిమ దర్శనమిస్తుంది. ఆ ప్రతిమ వెనుక నాలుగు ఏనుగులు ఉన్నాయి. రెండు పెద్ద ఏనుగులలో ప్రతి ఒక్కటి పై వరుసలో ఒక కుండ నుండి గజలక్ష్మి పైన తొండంతో నీటిని అభిషేకిస్తున్నట్లు, రెండు చిన్న ఏనుగులు దిగువ వరుసలో తామర చెరువు నుంచి కుండలను నింపుతున్నట్లు చిత్రీకరించబడ్డాయి.





శిఖరం దాని కింద అంతస్తునుండి 96 అడుగుల ఎత్తులో ఉంది. గర్భగుడి చుట్టూ ఒక చిన్న అంతరాళ గది ఉంది, ఇది ఒక పెద్ద సభ-మండపం (స్తంభాల హాలు) తో కలిసి ఉంటుంది. దీనికి పక్కల అర్ధమండపం, ముందు భాగంలో అగ్రమండపం ఉన్నాయి. నంది-మండపం, గోపురం, పూజా మందిర అగ్ర-మండపానికి మధ్య ఉంది, మూడు భాగాలను ఏకరాతి దూలంతో కలిపారు. ప్రధాన ఆలయం పునాది పైన ఆలయ నిర్మాణ మొత్తం బరువును మోస్తున్నట్లుగా కనిపించే ఏనుగుల శిల్పాల వరుసలు ఉన్నాయి. కొండ పక్కన ఉన్న ప్రదక్షిణ మార్గ ఆలయ ప్రాంగణంలో ఐదు వేరు వేరు దేవాలయాలు ఉన్నాయి.

ఆలయ నిర్మాణంలో రెండు వేర్వేరు 45 అడుగుల ఎత్తయిన విజయ స్తంభాలు కూడా ఉన్నాయి. ఒకప్పుడు ఈ స్తంభం పైన త్రిశూలం ఉండేది, కానీ ఇప్పుడు లేదు. ప్రధాన ఆలయానికి ఇరువైపులా ధ్వజ స్తంభం వెనుక వెలుపలి గోడపై మహాభారతం, రామాయణం నుండి కొన్ని ఆసక్తికరమైన సన్నివేశాలు చిత్రీకరించారు. ప్రధాన ఆలయానికి దక్షిణం వైపున ఉన్న రావణమూర్తి త్రిమితీయ శిల్పం వలన ఈ ఆలయానికి 'కైలాస' అని పేరు వచ్చింది. రావణుడు కైలాస పర్వతాన్ని ఎత్తడానికి ప్రయత్నించడం అక్కడ శివుడు విశ్రాంతిలో కూర్చున్నట్లు, శివుని బొటన వేలు ఒత్తిడితో రావణుడి అహం తొక్కినట్లు చిత్రీకరించారు. ఒక మండపం నుంచి మరొక మండపానికి వెళ్ళేటప్పుడు హాలు పరిమాణం, స్థలం క్రమేపీ తగ్గుతూ పోతుంది. వెలుతురు కూడా తగ్గిపోతుంది. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు అనేక పర్యాయాలు ఈ ఆలయాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు.



ధర్మ సందేహాలు



• శ్రీ గోవింద రాజస్వామి వారి సన్నిధిలో కుంచం ఉంటుంది ఎందుకు ?

తిరుపతి శ్రీ గోవింద రాజస్వామి వారి సన్నిధిలో కుంచం ఉండటం నిజమే. దీనికి కారణం ఈ విధంగా చెబుతారు. తిరుమల స్వామి శ్రీ వెంకటేశ్వరస్వామి కుబేరుని వద్ద అప్పు చేశాడట. దానిని తీర్చటం కోసం ద్రవ్యాన్ని కుంచంతో కొలిచి ఇచ్చేవారట స్వామివారు. స్వామివారి పక్షాన గోవింద రాజస్వామి ఈ కార్యాన్ని సాగించారని ఒక కథ ప్రచారంలో ఉంది. కాసులు కొలిచీ కొలిచీ అలసి పోయిన స్వామివారు ఆ కుంచాన్ని తలకింద పెట్టుకుని నిద్రపోయారని చెబుతారు.



• ఏయే ప్రదేశాల్లో జపం చేస్తే ఎంతెంత ఫలితం?

ఇంట్లో చేసే జపానికి సత్ఫలితమే ఉంటుంది. అయితే అదే జపాన్ని నదీ పరీవాహక ప్రాంతాల్లో చేస్తే రెట్టింపు ఫలితం ఉంటుంది. గోశాలలో చేసే జపం వల్ల వందరెట్ల ఫలితం ఉంటుంది. యాగశాలలో చేసే జపం వల్ల వంద రెట్ల కంటే అధికమైన ఫలితం వస్తుంది. దేవాలయాలలో, పుణ్య ప్రదేశాలలో చేసే జపం పదివేల రెట్లు ఫలితాన్ని ఇస్తుంది. శివాలయాలలో, శివ సాన్నిధ్యం నందు చేసే జపం వలన అత్యున్నతమైన ఫలితం దక్కుతుంది.

• దేవాలయాల వద్ద గృహ నిర్మాణం చేయడం దోషమా?

శివాలయానికి నూరు బారుల దూరం లోపల, విష్ణాలయానికి ఇరవై బారుల దూరం లోపల, శక్తి ఆలయానికి సమీపంలోనూ గృహనిర్మాణం చేయకూడదు. గుడి దగ్గర ఉన్న ఇళ్ళకు ఏ వైపునైనా, ఏ మాత్రమైనా గుడి నీడ పడిందంటే దరిద్రం, ప్రాణనష్టం వంటి అనేక కష్టనష్టాలు ఎదుర్కోక తప్పదు అని అప్పటిలో పెద్దలు చెప్పారు. అయితే ప్రస్తుత కాలంలో అలా గృహనిర్మాణం చేసుకోవడం సాధ్యం కాదు కాబట్టి వీలయినంత వరకు మన వల్ల ఆలయ పవిత్రతకు, ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా చూసుకోవాలి. మన ఇంటి వ్యర్థాలు ఆలయానికి వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలిగించకుండా జాగ్రత్త పడాలి.



• తాంబూలం సేవించేప్పుడు తమలపాకు తొడిమ, చివర్లు ఎందుకు తుంచాలి ?

తాంబులం వేసుకునే ముందు తమలపాకుల తొడిమలు, చివరలు తుంచివేయాలి. ఎందుకంటే తొడిమను తినడం వ్యాధికారకం అవుతుంది. చిగుర్లు పాపానికి ప్రతీకలు అని అంటారు. కనుక తమలపాకు తొడిమలు, చివరలు తుంచిన తర్వాతే తాంబులం వేసుకోవడం ఆరోగ్యప్రదం. అలాగే తమలపాకులో ఉండే ఈనెలు బుద్ధిని మందగింప చేస్తాయి. అందుకే తమలపాకును నమిలి మొదటగా నోటిలో ఊరిన రసాన్ని ఉమ్మివేయాలి తొడిమలు, చివరలు తుంచి వేసినా ఇంకా అవి తమలపాకులో శేషించి ఉంటాయి కనుక.

బౌద్ధవాణి



ఉత్తమ గుణం

ఒక జాతిగాని, కులంగానీ, వంశంగానీ మొత్తంగా ఉన్నతోన్నతమైంది ఉంటుందా అనే ధర్మసంశయం ఆనందుణ్ణి పట్టి పీడించసాగింది. ఆనందుడు బుద్ధుని సోదరుడు. భిక్షువై, తన అన్న ఆదర్శాలను పాటిస్తూ, భిక్షు సంఘంలో జీవించాడు. ఆనందుడు ఒకసారి బుద్ధునితో–

''భగవాన్! మీరు సింధూ దేశంలో మేలు జాతి సైంధవ అశ్వాలు ఉంటాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో శ్రేష్ఠమైన వృషభాలు జన్మిస్తాయని చెప్పారు. మేలు జాతికి చెందిన ఛద్దంతి ఏనుగులు ఏనుగుల్లో ఉత్తమమైనవని సెలవిచ్చారు. అలాగే ధాన్యాల్లో, ఫలాల్లో, వృక్షాల్లో ఉత్తమ జాతి గురించి వివరించారు. కానీ, ఉత్తమమైన మానవ జాతి గురించి, ఆ జాతి జీవించే ప్రదేశాలూ, దేశాలూ, వంశాలూ, జాతుల గురించి చెప్పనే లేదు?'అని ప్రశ్నించాడు.

దానికి బుద్ధుడు– ''ఆనందా! అలాంటి ప్రత్యేక జాతులూ, వంశాలు మానవుల్లో ఉండవు. ఒకే గుణాన్ని అందిపుచ్చుకునే వంశంగానీ, జాతిగానీ, కులంగానీ ఉండవు. ఉత్తముడైన వాడు ఎక్కడో ఒకచోట జన్మించవచ్చు. అలా ఒక ఉత్తముడు జన్మించడం వల్ల ఆ వంశానికో, జాతికో కీర్తి సంతోషాలు కలగవచ్చు. అంతేకానీ, ఉత్తమమైన జాతిగానీ, అధమమైన జాతిగానీ మనుషుల్లో ఉండవు'' – అని చెప్పాడు. జంతువులు తమ బలాల్ని బట్టి ఉత్తమమైనవి ఎంచబడతాయని, మనుషులు బలాన్ని బట్టిగాక, గుణాల్ని బట్టి ఎంచబడతారనే బుద్ధ సందేశాన్ని ఆనందుడు గ్రహించాడు. జాత్యహంకారులకు ఈ బుద్ధప్రబోధం పెద్ద కనువిప్పు.

– డా. బొర్రా గోవర్ధన్

అంతరార్థం



తలంబ్రాలు

వివాహ సంప్రదాయంలో తలంబ్రాల వేడుక చూడముచ్చటగా సాగుతుంది. వధూవరులు పోటాపోటీగా ఇందులో పాల్గొంటారు. మాంగల్య ధారణ తర్వాత జరిగే తంతు ఇది. తలంబ్రాలకు ఎంచుకునే బియ్యానికి కొన్ని కొలతలు ఉంటాయి. అవి ఆయా ఇంటి ఆచారాలను బట్టి ఉంటుంది. ఇందులో విరిగిన బియ్యం వాడకూడదు. తలంబ్రాల వేడుకలో పఠించే మంత్రాల్లో విశేషమైన అర్థాలు ఉంటాయి. అవి సంసార బాధ్యతలను గుర్తుచేస్తాయి.

మొదట తలంబ్రాలను కొబ్బరి చిప్పలో పోసి, పాలతో ప్రోక్షించి వధూవరులకు అందిస్తూ దానం, పుణ్యం చేయాలని, శాంతి, పుష్టి, తుష్టి వృద్ధి కలగాలని, విఘ్నాలు తొలగి ఆయుష్షు, ఆరోగ్యం, క్షేమం, మంగళం కలగాలని, సత్కర్మలు వృద్ధి చెందాలని, తారలు, చంద్రుని వల్ల దాంపత్యం సజావుగా సాగి, సుఖశాంతులు కలగాలని' పురోహితుడు మంత్ర పఠనం చేస్తాడు.

మొదటగా వరుడు వధువు శిరస్సున పోస్తాడు. ఆ సమయంలో 'నీవలన సత్సంతాన వృద్ధి జరుగునుగాక' అను మంత్రాన్ని చదువుతారు. వధువు చేత 'పాడిపంటలు వృద్ధియగునుగాక' అను మంత్రాన్ని చదువుతూ తలంబ్రాలు పోయిస్తారు. మూడో సారి వరుడిచేత 'ధన ధాన్య వృద్ధి జరుగునుగాక' అంటూ తలంబ్రాలు వధువు శిరస్సు మీద పోయిస్తారు. ఆ తర్వాత ఆ తలంబ్రాలను అన్నింటినీ వధూవరులు ఉల్లాసంగా ఒకరి శిరస్సున ఒకరు దోసిళ్ళతో పోసుకుంటారు. ఆ తర్వాత, వారి దాంపత్య బంధం ఆజన్మాంతం వర్ధిల్లాలను విషయానికి సూచనగా, వారి కొంగులను ముడివేస్తారు. దీనినే బ్రహ్మ ముడి/ బ్రహ్మగ్రంధి అంటారు.

సూక్తి సుధ

ఏమి చేసినా సమర్థించే వాళ్ళు స్వార్థపరులు
తప్పు చేసినపుడు తప్పు అని తెలియజేసే వాళ్ళు శ్రేయోభిలాషులు.
మంచిని చెడుని రెంటినీ తెలియజేసే వాళ్ళు నిజమైన స్నేహితులు.

ఒకరి గురించి వేరొకరి దగ్గర మాట్లాడితే దూరాలు పెరుగుతాయి.
ఒకరితో ఒకరు మాట్లాడుకుంటే దూరాలు తగ్గుతాయి.

వ్యక్తిత్వానికి మించిన అందం లేదు.
సాధనకు మించిన అదృష్టం లేదు.
ప్రేమకు మించిన తోడు లేదు.
ప్రతిభకు మించిన ధనం లేదు.
విజయానికి మించిన ఆనందం లేదు.
ధైర్యానికి మించిన శక్తి లేదు.
సాయానికి మించిన సాంత్వన లేదు.

ముందుచూపు ఉన్నప్పుడే జీవితంలో గెలవగలం.
పడవ మునుగుతున్నప్పుడే ఈత నేర్చుకుందామనుకుంటే బతుకు వ్యర్థం అవుతుంది

కష్టం శత్రువే కావొచ్చు కానీ నీ మిత్రులెవరో చూపించి వెళ్తుంది

ఓడిన ప్రతిసారీ మనమే గుర్తు చేసుకోవాలి.
ఇది ఓటమి కాదు పాఠం అని

ఖుర్ ఆన్ అవగాహనం

తల్లిదండ్రులు... పొరుగువారు



మీరంతా తల్లిదండ్రుల యెడల సద్భావంతో మెలగండి. బంధువులు, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులైన పొరుగువారు, పక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీ జనం పట్ల ఉదార బుద్ధితో వ్యవహరించండి. గర్వాతిశయంతో కన్నూ మిన్నూ కానని వారు, తమ గొప్పతనం గురించి విర్రవీగే వారిని అల్లాహ్ ఇష్టపడడు (దివ్య ఖుర్ ఆన్: 4:36)

- **బంధువులు:** నానమ్మ, తాతయ్య, పెదనాన్న, బాబాయి, మేనత్త, అమ్మమ్మ, తాతయ్య, మామయ్యలు, పిన్నమ్మలు, వారి సంతానంతో మనం కలిసి మెలిసి ఉండాలి. పరస్పరం ఆదుకుంటూ... సహకరించు కుంటూ ... సేవ చేసుకుంటూ ఉండాలి. పొరపొచ్చాలు రాకుండా జాగ్రత్తపడాలి. ఒకరి పట్ల ఒకరు ప్రేమ, అభిమానం, ఆప్యాయతలు కలిగి బంధుత్వాలను పటిష్ఠపరుచుకోవాలి.
- **అనాథులు:** వీరికి శాపనార్థాలు పెట్టకూడదు. తిట్టకూడదు. కోపగించుకోకూడదు. ప్రేమగా, లాలనగా చూడాలి. మీరు మీ పిల్లల పట్ల ఎంత ప్రేమ కలిగి ఉంటారో అంత ప్రేమతో గనుక ఈ అనాథ తల నిమిరితే మీ చేతికి ఎన్ని వెంట్రుకలయితే తగులుతాయో అన్ని పాపాలు క్షమించబడతాయి అన్నారు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం.
- **నిరుపేదలు:** ఎవరైతే పేదరికంతో ఉండి కూడా అభిమానం వల్ల ఎవరి ముందూ చేయి చాపకుండా ఎవరి వద్ద బాకీ తీసుకోకుండా అంతలోనే ఇబ్బంది పడుతూ గడుపుతూ ఉంటారో అలాంటి వారిని నిరుపేదలు అంటారు. వారికి కుడి చేతితో ఇస్తే ఎడమ చేతికి తెలియకుండా ఇస్తామనే సామెతలా మసులుకోవాలి.
- **పొరుగున ఉన్న బంధువులు:** పొరుగున నిజంగా మన బంధువులు లేక బంధువులు కాని వారు ఉన్నా వారిని కూడా బంధువులు గానే పరిగణించాలి. అన్నారు మహనీయ ప్రవక్త.
- **అపరిచితులైన పొరుగువారు:** అంటే మనం ప్రయాణిస్తున్న సందర్భంగా పరిచయం లేని వారు. మన పక్కన కూర్చుంటారు. వారికి ఇబ్బంది కలిగించకూడదు. పొగ తాగుతూ, గుట్కా నములుతూ, జర్దా పాన్ వేసుకుంటూ ఇబ్బంది కలిగించే పనులు చేయకూడదు. వారికి కూర్చోవడంలో ఇబ్బంది కలగకుండా చూడాలి. అదేవిధంగా మనం బజారులో సరుకులు కొనడానికి వెళ్లినప్పుడు మన పొరుగున నిలబడిన వాళ్ళు సరుకులు కొంటూ ఉంటారు, వారు కూడా పొరుగువారే. వారు మంచి వస్తువులు ఏరుకుంటున్న సందర్భంగా మనం వారితో పోటీపడకుండా వారికే ప్రాధాన్యమిస్తే మనకు మంచే జరుగుతుంది.

– అబ్దుల్ రషీద్

నోరు.. నాలుక... నిప్పురవ్వ



''నోటిని, నాలుకను అదుపు చేసుకొనువాడు శ్రమల నుండి తన ప్రాణమును కాపాడుకొనును'' *(సామెతలు 21: 23)*

కొందరు అనవసర మాటల వల్ల తొందరపడి తప్పులు చేస్తున్నారు.. చిక్కుల్లో పడుతున్నారు. అవతలివారికి చిక్కి, జగడమాడుతున్నారు. అదుపులేని మాటలు, అసభ్యకర మాటలను పెద్దలు వింటున్నారని కూడా విచక్షణ లేకుండా మాట్లాడుతున్నారు. ఎదుటివారికి కోపం వస్తుందని, వారి మనసుకు గాయమవుతుందని గ్రహించలేకపోతున్నారు. జంతువులు కేకలు వేస్తాయి, అరుపులు అరుస్తాయి. కానీ దేవుడు మనకు వాక్శక్తి అనుగ్రహించాడు. ఎంతమంది నాలుకను అదుపులో పెట్టుకుంటున్నారు... సద్వినియోగపర్చుకుంటున్నారు! నోటికొచ్చినట్టు వాగ్దానాలు చేస్తున్నారు కొందరు. కానీ ఎన్ని వాగ్దానాలు అమలు చేస్తున్నారో తెలియదు. ఈ విషయంలో ఏసుక్రీస్తు శిష్యుడైన యాకోబు తాను రాసిన పత్రిక 3 :2 లో ఏమని రాశారో గమనిద్దాం. అనేక విషయాలలో మనమందరం తప్పిపోతున్నామని, ఎవరైనా మాట తప్పిన యెడల అట్టివాడు లోపం లేనివాడై, తన మొత్తం శరీరాన్ని కాపాడుకోగల శక్తి గలవాడవుతాడని గుర్రాలను, మనుషులు లోబరచుకోవడానికి నోటికి కళ్లెం పెట్టి త్రిప్పుతున్నారు కదా! ఓడలను కూడా చూడండి. అవి ఎంతో గొప్పవై పెనుగాలికి కొట్టుకొనిపోయినా ఓడ నడుపువాని ఉద్దేశం చొప్పున చాలా చిన్నదైన చుక్కాని చేత తిప్పబడుతుందికదా! ఆలాగున నాలుక కూడా చిన్ని అవయవమైనా బహుగా అదిరిపడుతుంది.

ఎంతో చిన్నదైన నిప్పురవ్వ బహు విస్తారమైన అడవిని కూడా తగులబెడ్తుంది కదా! నాలుక కూడా అగ్ని వంటిదే. నాలుక కూడా చిన్నదైనను బహుగా అదిరిపడును. సర్వశరీరమును మాలిన్యం కలుగజేస్తుందని వాక్యం సెలవిస్తుంది. అంతేకాదు అది ప్రకృతి చక్రాన్నే తిప్పును. నరకంలోకి తీసుకొనిపోవును. మృగ, పక్షి, సర్ప, జలచరములలో ప్రతి జాతీ నరులకు సాధు కాజాలును కానీ మానవుడు నాలుకను సాధు చేసుకోలేక పోతున్నాడు. మాటలు తక్కువగా మాట్లాడాలి. సక్రమంగా మాట్లాడాలి. ఇతరులను కించపరచకూడదు.

దేహమును శిక్షకు లోనగునంత నోటివలన చేయకుము, అది పొరపాటున జరిగెనని దూతల యెదుటను చెప్పకూడదు. నీ నోటి మాటల వల్ల దేవునికి కోపము పుట్టింపనేల అని సెలవిచ్చాడు. మహరాజైన దావీదు నోటికి చిక్కము పెట్టుకుంటానన్నాడు. పంచాయితీలోను, ప్రజలలోను, సభలలోను అనాలోచితంగా మాట్లాడక ఆలోచించి యుక్తముగా మాట్లాడాలి. యేసుప్రభువు కూడా పిలాతు మాట్లామన్నా మాట్లాడలేదు. పిలాతు యేసుక్రీస్తు వారితో నేను సహాయము చేసి శిక్షను పడకుండా చేస్తానన్నా ప్రభువు ఆయన నోటిని అదుపులో పెట్టుకొన్నాడు. మారుమాట పలకలేదు. కావున మానవమాత్రులమైన మనం నోటిని అదుపులో పెట్టుకొని మన ప్రాణాలను కాపాడుకోవాలి. సమాజంలో ఒక గొప్ప స్థానాన్ని పొందాలి.

– కోట బిపిన్ చంద్రపాల్

బిజినెస్ రీల్

దక్షిణాదిన కోటి మందికి యాక్టివా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దక్షిణాదిన యాక్టివా స్కూటర్ కస్టమర్ల సంఖ్య ఒక కోటి దాటిందని హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ మార్కెట్లు వీటిలో ఉన్నాయి. ఈ మార్కెట్లలో తొలి 50 లక్షల యూనిట్ల మైలురాయిని 2017లో చేరుకుంది. దక్షిణాదిన సంస్థకు 1,700లకుపైగా టచ్ పాయింట్స్ ఉన్నాయి. భారత్‌లో యాక్టివా స్కూటర్ 2001లో ఎంట్రీ ఇచ్చింది. 110, 125 సీసీ ఇంజన్ సామర్థ్యంతో యాక్టివా స్కూటర్స్ లభిస్తాయి.

డీసీఎం శ్రీరామ్‌లో వాటా తగ్గించుకున్న ఎల్‌ఐసీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ.. డీసీఎం శ్రీరామ్ ఇండస్ట్రీస్‌లో వాటా తగ్గించుకుంది. గడిచిన మూడేళ్లలో నికరంగా 2.01 శాతం వాటాకు సమానమైన షేర్లను(ఒక్కో షేరు రూ.110 చొప్పున) విక్రయించినట్లు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీంతో మొత్తం వాటా 6.675% నుంచి 4.659 శాతానికి దిగివచ్చింది. ఎల్‌ఐసీ వాటా తగ్గింపు వార్తలతో డీసీఎం శ్రీరామ్ ఇండస్ట్రీస్ షేరు 2% తగ్గి రూ.194 వద్ద స్థిరపడింది.

జింక్‌కు భారీ డిమాండ్

ఉదయ్‌పూర్: బ్యాటరీ టెక్నాలజీ, పర్యావరణ హిత విద్యుత్ తదితర కొత్త రంగాల ఊతంతో 2030 నాటికి జింక్‌కు డిమాండ్ భారీగా పెరగనుందని ఇంటర్నేషనల్ జింక్ అసోసియేషన్ (ఐజెడ్‌ఏ) వెల్లడించింది. రాబోయే అయిదేళ్లలో ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్ ఏడు రెట్లు పెరగనుందని, తదనుగుణంగా జింక్ వినియోగం కూడా పెరుగుతోందని జింక్ కాలేజ్ 2024 కార్యక్రమంలో ఐజెడ్‌ఏ చైర్మన్ అరుణ్ మిశ్రా తెలిపారు.

బ్రిటన్ మెట్రో బ్యాంకుతో ఇన్ఫీ జట్టు

న్యూఢిల్లీ: బ్రిటన్‌కి చెందిన మెట్రో బ్యాంక్ కార్యకలాపాలను డిజిటలీకరించేందుకు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం తమ కృత్రిమ మేథ సంబంధ టోపాజ్ సర్వీసులను ఉపయోగించి బ్యాంకు డిజిటల్ సామర్థ్యాలను, ఆటోమేషన్‌ను ఇన్ఫీ మెరుగుపర్చనుంది. నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపర్చుకునేందుకు,వ్యయాలను తగ్గించుకునేందుకు ఇది సహాయపడుతుందని మెట్రో బ్యాంక్ సీఈవో డేనియల్ ఫ్రమ్‌కిన్ తెలిపారు. బ్యాంకు మరింత అధిక వృద్ధిని సాధించేందుకు డిజిటల్, ఫిజికల్ కార్యకలాపాలను అనుసంధానం తోడ్పడుతుందని ఇన్ఫోసిస్ ఈవీపీ జి. డెన్నిస్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-9-2024	
విశాఖ	550-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	3,569.00	4.22
BAJFINANCE	7,613.00	3.36
BAJAJFINSV	1,881.15	1.76
NESTLEIND	2,590.70	1.72
HDFCBANK	1,692.95	1.45

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TCS	4,347.90	-3.5
INFY	1,892.35	-3.08
HCLTECH	1,758.10	-3.07
TECHM	1,604.80	-2.83
WIPRO	537.7	-2.57

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,017
ఎన్ఎస్ఈ	1,13,946
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,46,352
ఎఫ్ఐఐ	+ 1,154
డీఐఐ	+ 152

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.81	$ 69.96
బ్రెంట్	73.44	$ 73.07

టప్పర్‌వేర్ దివాలా

కంపెనీకి 1.2 బిలియన్ డాలర్ల రుణభారం



న్యూయార్క్: నాణ్యమైన ప్లాస్టిక్‌వేర్‌కి పర్యాయపదంగా, ఫుడ్ స్టోరేజీలో కొత్త మార్పులు తెచ్చిన అమెరికన్ దిగ్గజం టప్పర్‌వేర్ బ్రాండ్స్ తాజాగా రుణభారంతో దివాలా ప్రకటించింది. కార్యకలాపాలను యథాప్రకారం కొనసాగిస్తూ, విక్రయానికి వెసులుబాటునిచ్చేలా చాప్టర్ 11 కింద రక్షణ కల్పించాలంటూ కోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. 1946లో ఎర్ల్ టప్పర్ అనే కెమిస్ట్ ప్రారంభించిన టప్పర్‌వేర్ భారత్‌లో కూడా గణనీయంగా ప్రాచుర్యం పొందిన సంగతి తెలిసిందే. పోటీ తీవ్రమవుతుండటంతో 2018 నుంచి కంపెనీ అమ్మకాలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. కోవిడ్-19 తొలినాళ్లలో విక్రయాలు కాస్త మెరుగుపడినప్పటికీ ఆర్థిక కష్టాలు వెన్నాడుతూనే ఉన్నాయి. మొత్తం రుణాల భారం 1.2 బిలియన్ డాలర్లుగా, అసెట్స్ 679.5 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు దివాలా పిటీషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొంది. సంస్థ షేరు ఈ ఏడాది 75 శాతం మేర పతనమైంది. టప్పర్‌వేర్‌కి 41 దేశాల్లో 5,450 మంది పైగా ఉద్యోగులు ఉన్నారు. అలాగే సుమారు 70 దేశాల్లో ఫ్రీలాన్స్ ప్రాతిపదికన ఉత్పత్తులను విక్రయించే కన్సల్టెంట్లు దాదాపు 4,65,000 మంది ఉన్నారు.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు 16 శాతం అప్

సెప్టెంబర్ 17 నాటికి రూ.9.95 లక్షల కోట్ల వసూళ్లు



న్యూఢిల్లీ: అధిక ముందస్తు పన్ను చెల్లింపుల కారణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 17వ తేదీ వరకూ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 16.12 శాతం పెరిగి రూ.9,95,766 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్స్ విలువ గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 56.49% ఎగసి రూ.2.05 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. వెరసి స్థూలంగా వసూళ్లు రూ. 12.01 లక్షల కోట్లుగా నమోదయ్యాయని గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇవి 21.48% అధికం. విభాగాల వారీగా చూస్తే..

- నికర వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 19 శాతం పెరిగి రూ. 5.15 లక్షల కోట్లకు చేరాయి.
- కార్పొరేట్ పన్ను వసూళ్లు 10.55 శాతం పెరిగి రూ. 4.52 లక్షల కోట్లకు చేరాయి.
- సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) ఆదాయం రూ.26,154 కోట్లు.
- ఒక్క అడ్వాన్స్ ట్యాక్స్ చూస్తే 22.61 శాతం పెరిగి రూ.4.36 లక్షల కోట్లుగా ఉన్నాయి. వ్యక్తిగత పన్నుల విషయంలో ఈ మొత్తాలు 39.22 శాతం పెరిగితే, కార్పొరేట్ పన్నుల విషయంలో ఈ పెరుగుదల 18.17 శాతంగా ఉంది.
- ప్రత్యక్ష పన్ను వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 13 శాతం పెరిగి రూ.22.12 లక్షల కోట్లకు చేరాలన్నది బడ్జెట్ లక్ష్యం.

సహారా గ్రూప్ డిపాజిటర్లకు రిఫండ్ పరిమితి పెంపు

రూ.10,000 నుంచి రూ.50,000కి అప్



న్యూఢిల్లీ: సహారా గ్రూప్ కోఆపరేటివ్ సొసైటీల చిన్న డిపాజిటర్ల రిఫండ్ మొత్తాలపై గతంలో ఉన్న రూ.10,000 పరిమితిని ప్రభుత్వం రూ.50,000కు పెంచింది. సహకార మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు ఈ విషయాన్ని తెలిపారు. సహారా గ్రూప్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీలకు చెందిన 4.29 లక్షల మందికి పైగా డిపాజిటర్లకు ప్రభుత్వం ఇప్పటివరకు సీఆర్‌సీఎస్ (సహకార సంఘాల సెంట్రల్ రిజిస్ట్రార్)-సహారా రిఫండ్ పోర్టల్ ద్వారా రూ.370 కోట్లను విడుదల చేసింది. రిఫండ్ మొత్తం పరిమితిని రూ. 50,000కి పెంచడంతో, రాబోయే 10 రోజుల్లో సుమారు రూ. 1,000 కోట్ల చెల్లింపులు జరుగుతాయని అధికారి వెల్లడించారు.

సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా చర్యలు

సహారా గ్రూప్ నాలుగు మల్టీ-స్టేట్ కోఆపరేటివ్ సొసైటీల వాస్తవ డిపాజిటర్లు క్లెయిమ్‌ల సమర్పణకు, డిపాజిట్ల వాపసుకు సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి సీఆర్‌సీఎస్-సహారా రిఫండ్ పోర్టల్ గత ఏడాది జూలై 18న ఏర్పాటయిన సంగతి తెలిసిందే. వీటిలో స్టార్స్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (హైదరాబాద్)సహా సహారా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (లక్నో) సహారైన్ యూనివర్సల్ మల్టీపర్పస్ సొసైటీ లిమిటెడ్ (భోపాల్), హుమారా ఇండియా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (కోల్‌కతా) ఉన్నాయి. 2023 మార్చి 29 నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా 2023 మే 19న సెబీ-సహారా రీఫండ్ ఖాతా నుండి సెంట్రల్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్‌కి రూ. 5,000 కోట్లు బదిలీ అయ్యాయి. డిజిటల్ రూపంలో డబ్బు పంపిణీని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాష్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

ఈ ఏడాది రేట్ల కోత ఉండకపోవచ్చు

- ద్రవ్యోల్బణం ఆధారంగానే నిర్ణయం
- ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ: ఆహార ద్రవ్యోల్బణం విషయంలో అనిశ్చితి నెలకొన్నందున ఆర్‌బీఐ ఈ ఏడాది వడ్డీ రేట్ల కోతను చేపట్టకపోవచ్చని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అభిప్రాయపడ్డారు. యూఎస్ ఫెడ్ నాలుగేళ్లలో మొదటిసారి వడ్డీ రేట్లను తగ్గించిన నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ఇతర ఆర్థిక సెంట్రల్ బ్యాంక్‌లు సైతం ఇదే బాట పట్టొచ్చన్న అంచనాలు నెలకొండడం తెలిసిందే. ''రేట్ల విషయంలో సెంట్రల్ బ్యాంక్‌లు స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటాయి. ఫెడ్ రేట్ల కోత ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తుంది. కానీ, ఆర్‌బీఐ మాత్రం ఈ విషయంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకునే ఓ నిర్ణయానికొస్తుంది. మా అభిప్రాయం ఇదే. ఈ కేలండర్ సంవత్సరంలో ఆర్‌బీఐ రేట్లను తగ్గించకపోవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం పరంగా మంచి పురోగతి ఉంటే తప్ప ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (2025 జనవరి-మార్చి) వరకు వేచి చూడాల్సి రావచ్చు'' అని శెట్టి పేర్కొన్నారు.

ఆహార ద్రవ్యోల్బణం కీలకం

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అధ్యక్షతన గల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) తదుపరి వడ్డీ రేట్ల సమీక్షను అక్టోబర్ 7-9 మధ్య చేపట్టనుంది. రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టు నెలకు 3.65 శాతానికి పెరగడం తెలిసిందే. జూలై నెలకు ఇది 3.54 శాతంగా ఉంది. ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టు నెలకు 5.66 శాతంగా నమోదైంది. అయినప్పటికీ ఆర్‌బీఐ దీర్ఘకాల కట్టడి లక్ష్యం 4 శాతంలోపే ద్రవ్యోల్బణం ఉండడం గమనార్హం. ఆగస్టు నాటి ఎంపీసీ సమీక్షలో ఆర్‌బీఐ కీలక రేట్లలో ఎలాంటి మార్పులు చేయకపోవడం తెలిసిందే. రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగించింది. అంతేకాదు ఆర్‌బీఐ 2023 ఫిబ్రవరి నుంచి రేట్లను యథాతథంగా కొనసాగిస్తోంది. చివరి ఎంపీసీ భేటీలో నలుగురు సభ్యులు యథాతథ స్థితికి మొగ్గు చూపితే, ఇద్దరు సభ్యులు రేట్ల తగ్గింపునకు మద్దతు పలికారు.



ఎస్‌బీఐ నిధుల సమీకరణ

రూ. 7,500 కోట్ల బాండ్ల జారీ

ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) బాండ్ల జారీ ద్వారా రూ. 7,500 కోట్లు సమీకరించింది. బాసెల్-3 నిబంధనలకు అనుగుణమైన టైర్-2 బాండ్ల జారీని చేపట్టినట్లు ఎస్‌బీఐ పేర్కొంది. అర్హతగల సంస్థాగత బిడ్డర్లకు బాండ్లను ఆఫర్ చేయగా.. భారీ స్పందన లభించినట్లు వెల్లడించింది. ప్రాథమికం(బేస్)గా రూ. 4,000 కోట్ల సమీకరణకు బాండ్ల జారీని చేపట్టగా మూడు రెట్లు అధికంగా బిడ్స్ దాఖలైనట్లు తెలియజేసింది. దీంతో రూ. 7,500 కోట్లవరకూ బాండ్ల జారీకి నిర్ణయించినట్లు వివరించింది. ప్రావిడెంట్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంకులు తదితరాలు దరఖాస్తు చేసినట్లు పేర్కొంది. విభిన్న సంస్థలు బిడ్డింగ్ చేయడం ద్వారా దేశీ దిగ్గజ బ్యాంక్‌పై నమ్మకముంచినట్లు ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి వ్యాఖ్యానించారు. కాగా.. 7.33% కూపన్ రేటుతో 15ఏళ్ల కాలపరిమితిగల బాండ్లను జారీ చేసినట్లు ఎస్‌బీఐ తెలియజేసింది. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25)లో బాసెల్-3 ప్రమాణాలకు అనుగుణమైన టైర్-2 బాండ్ల జారీకి తెరతీసినట్లు పేర్కొంది. 10ఏళ్ల తదుపరి ప్రతీ ఏడాది కాల్ ఆప్షన్‌కు వీలుంటుందని వెల్లడించింది. ప్రపంచ ఫైనాన్షియల్ వ్యవస్థకు నిలకడను తీసుకువచ్చే బాటలో రూపొందించినవే అంతర్జాతీయ బ్యాంకింగ్ నిబంధనలు(బాసెల్-3).

బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 1.2% బలపడి రూ. 792 వద్ద ముగిసింది.

బెంగళూరులో యశోద హాస్పిటల్స్‌కు స్థలం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల రంగంలో ఉన్న యశోద హాస్పిటల్స్ బెంగళూరులో 4.5 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసినట్టు సమాచారం. రింగ్ రోడ్డు మార్గంలో సిల్క్ బోర్డ్ జంక్షన్ వద్ద ఉన్న ఈ స్థలం కోసం కంపెనీ రూ.344 కోట్లు వెచ్చించిందని తెలుస్తోంది. రింగ్ రోడ్డులో ఈ లావాదేవీ అత్యధిక విలువైన ల్యాండ్ డీల్‌గా నిలిచింది. ఈ మార్గం ఆఫీస్ హబ్‌గా పేరుగాంచింది. ఓజోన్ గ్రూప్ నిర్మిస్తున్న 12 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ ప్రాజెక్టులో ఈ ల్యాండ్ డీల్ ఒక భాగం. కమర్షియల్ టవర్‌తో కూడిన ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా నిలిచిపోయింది. తాజా నిధుల రాకతో నిర్మాణం త్వరితగతిన పూర్తి కానుంది. ఓజోన్ గ్రూప్ ఈ ప్రాజెక్టును నిర్మించి యశోద హాస్పిటల్స్‌కు అప్పగించనుంది.


అమెజాన్ కంట్రీ మేనేజర్‌గా సమీర్ కుమార్



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ కంట్రీ మేనేజర్‌గా సమీర్ కుమార్ నియమితులయ్యారు. అక్టోబర్ 1 నుంచి ఆయన కొత్త బాధ్యతలను స్వీకరిస్తారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న మనీశ్ తివారీ రాజీనామా చేశారు. భారత్‌తోపాటు మధ్యప్రాచ్య, దక్షిణ ఆఫ్రికా, టర్కీ కంజ్యూమర్ బిజినెస్ వ్యవహారాలను సైతం సమీర్ నిర్వహిస్తారు. అమెజాన్‌లో 1999లో సమీర్ చేరారు. భారత్‌లో 2013లో కంపెనీ కార్యకలాపాలను ప్రారంభించిన బృందంలో ఆయన ఒకరు.

టొరెంట్ పవర్ భారీ పెట్టుబడులు

గ్రీన్ ప్రాజెక్టులపై రూ. 64,000 కోట్లు



గాంధీనగర్: ప్రయివేట్ రంగ కంపెనీ టొరెంట్ పవర్ పునరుత్పాదక(గ్రీన్) ఇంధన ప్రాజెక్టులపై భారీ పెట్టుబడులకు తెరతీయనుంది. గ్రీన్, సస్టెయినబుల్ ఎనర్జీ ప్రాజెక్టులపై మొత్తం రూ. 64,000 కోట్లుపైగా ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా 26,000 మందికి ఉపాధి కల్పించే అవకాశముంది. ఈ బాటలో పెట్టుబడుల కట్టుబాటును ప్రదర్శిస్తూ కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖకు రెండు శపథ పత్రాలను దాఖలు చేసింది. పరిశ్రమల సమాఖ్య(సీఐఐ)తో కలసి పునరుత్పాదక ఇంధన శాఖ నిర్వహించే ఆర్‌ఈ-ఇన్వెస్ట్ 4వ సదస్సులో భాగంగా టొరెంట్ పవర్ 2030కల్లా 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందుకునే లక్ష్యాన్ని ప్రకటించింది. తొలి శపథ పత్రంలో భాగంగా సుమారు రూ. 57,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25,000 మందికి ఉద్యోగావకాశాలు లభించే వీలుంది. ఇందుకు ద్వారకలో 5 గిగావాట్ల సోలార్ లేదా విండ్ లేదా రెండింటి కలయికతో హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు గుజరాత్ ప్రభుత్వంతో తాజాగా అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకుంది. ఇక రెండవ శపథ పత్ర ప్రకారం ఏడాదికి లక్ష కిలో టన్నుల సామర్థ్యంతో గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ప్లాంటును ఏర్పాటు చేయనుంది. ఇందుకు రూ. 7,200 కోట్లు వెచ్చించనుంది. తద్వారా 1,000 మందికి ఉపాధి లభించనుంది. దేశంలోని విద్యుత్ రంగ దిగ్గజాలలో ఒకటైన టొరెంట్ పవర్ భారత్ పునరుత్పాదక ప్రయాణంలో భాగమయ్యేందుకు కట్టుబడి ఉన్నట్లు కంపెనీ చైర్మన్ సమీర్ మెహతా పేర్కొన్నారు.

భారత్‌లో లెనోవో ఏఐ సర్వర్ల తయారీ

బెంగళూరు: పర్సనల్ కంప్యూటర్ల తయారీలో ఉన్న బీజింగ్ కంపెనీ లెనోవో.. వచ్చే ఏడాది నుంచి భారత్‌లో ఏఐ సర్వర్ల తయారీ చేపట్టనుంది. వీటిని పుదుచ్చేరి ప్లాంటులో ఉత్పత్తి చేస్తారు. ఏటా 50,000 యూనిట్ల ఎంటర్‌ప్రైజ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సర్వర్స్, 2,400 యూనిట్ల హై ఎండ్ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్స్ (జీపీయూ) తయారు చేయనున్నట్టు లెనోవో ఇండియా ఎండీ శైలేంద్ర కటియాల్ తెలిపారు. వీటిలో 60 శాతంపైగా సరుకును ఆసియా పసిఫిక్ ప్రాంతానికి ఎగుమతి చేస్తారు. అలాగే సంస్థకు నాల్గవ అతిపెద్ద పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని బెంగళూరులో నెలకొల్పింది. భవిష్యత్తులో అన్ని ప్రధాన సర్వర్ డిజైన్, డెవలప్‌మెంట్స్, కొత్త సాంకేతిక కార్యక్రమాలను ఈ ల్యాబ్‌లో నిర్వహిస్తామని కంపెనీ తెలిపింది. ఇప్పటికే ఇటువంటి సెంటర్స్ ప్రపంచవ్యాప్తంగా సంస్థకు 18 ఉన్నాయి.


సుంకాలు పెరిగినా
వంటనూనెల రేట్లు పెంచొద్దు

ఆయిల్ కంపెనీలకు ఆహార శాఖ సూచన



న్యూఢిల్లీ: ఇటీవల దిగుమతి సుంకాలు పెంచినప్పటికీ రిటైల్ ధరలను (ఎంఆర్‌పీ) పెంచొద్దంటూ వంటనూనెల కంపెనీలకు కేంద్ర ఆహార శాఖ సూచించింది. తక్కువ సుంకాలతో దిగుమతి చేసుకున్న ఆయిల్స్‌ను ఉపయోగించుకోవాలని పేర్కొంది. ఇలా దిగుమతి చేసుకున్న నూనెల నిల్వలు 30 లక్షల టన్నుల మేర ఉంటాయని, అవి 45-50 రోజులకు సరిపోతాయని వివరించింది. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ అసోసియేషన్ (ఎస్ఈఏ), ఇండియన్ వెజిటెబుల్ ఆయిల్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐవీపీఏ) తదితర సంస్థల ప్రతినిధులతో ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా భేటీ అనంతరం ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో ఈ విషయాలు పేర్కొంది. దేశీయంగా నూనెగింజల ధరలకు మద్దతు కల్పించే దిశగా కేంద్రం గత వారం వివిధ రకాల వంటనూనెలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని పెంచింది. సెప్టెంబర్ 14 నుంచి అమల్లోకి వచ్చిన ఆదేశాల ప్రకారం ముడి సోయాబీన్ ఆయిల్, ముడి పామాయిల్ మొదలైన వాటిపై డ్యూటీ సున్నా స్థాయి నుంచి 20 శాతానికి పెరిగింది. ఇతరత్రా అంశాలన్నీ కూడా కలిస్తే ముడి నూనెలపై ఇది 27.5 శాతంగా ఉంటుంది. మరోవైపు, రిఫైన్డ్ పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ మొదలైన వాటిపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 12.5 శాతం నుంచి 32.5 శాతానికి, నికరంగా 37.5 శాతానికి పెరిగింది. భారత్ పామాయిల్‌ను మలేషియా, ఇండొనేషియా నుంచి, సోయాబీన్ ఆయిల్‌ను బ్రెజిల్, అర్జెంటీనా నుంచి, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను ప్రధానంగా రష్యా, ఉక్రెయిన్ నుంచి దిగుమతి చేసుకుంటోంది.

ఎడ్‌టెక్‌కు తగ్గిన ఫండింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దశాబ్ద కాలంలో భారతీయ ఎడ్‌టెక్ రంగం నూతన గరిష్టాలను నమోదు చేసింది. ప్రస్తుతం ఈ రంగం నిధుల కొరతను ఎదుర్కొంటోంది. 2021లో దాని గరిష్ట స్థాయితో పోలిస్తే ఈ ఏడాది 47% తగ్గుదల ఉంది. అయితే అభివృద్ధి చెందుతున్న పోకడలు, మార్కెట్ స్థితిస్థాపకత ద్వారా ఈ రంగంలో దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇటీవల విడుదలైన ట్రాక్‌ఎక్స్‌ఎన్ ఫీడ్ జియో రిపోర్ట్: ఎడ్‌టెక్ ఇండియా 2024 ప్రకారం భారతీయ ఎడ్‌టెక్ పర్యావరణ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా మూడవ అత్యధిక నిధులతో కొనసాగుతోంది. ప్రస్తుతం నిధుల సవాళ్లు ఉన్నప్పటికీ దాని సామర్థ్యాన్ని గణాంకాలు నొక్కి చెబుతున్నాయి.

గరిష్టం నుంచి క్షీణత..

భారతీయ ఎడ్‌టెక్ రంగం 2024 సంవత్సరంలో ఇప్పటి వరకు 215 మిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. 2023లో పరిశ్రమ 321 మిలియన్ డాలర్లను అందుకుంది. అయితే ఈ మొత్తాలు 2021లో సేకరించిన 4.1 బిలియన్ డాలర్ల అత్యున్నత స్థాయితో పోల్చితే చాలా తక్కువగా ఉంది. 2022లో మొదలైన క్షీణత 2023 వరకు కొనసాగింది. 2022లో ఈ రంగం 87 శాతం క్షీణించింది. ఇది స్థూల ఆర్థికపర ఎదురుగాలులు, పెట్టుబడిదారుల హెచ్చరిక, సంప్రదాయ అభ్యాస నమూనాలకు తిరిగి మారడం వంటి కారణాలతో కూడిన సవాళ్ల వాతావరణాన్ని ప్రతిబింబిస్తుంది.

పుంజుకునే సంకేతాలు..

ఇన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ ఈ రంగం పుంజుకునే సంకేతాలను చూపుతోంది. 2024 మొదటి అర్ధ భాగంలో ఎడ్‌టెక్ రంగంలోకి వచ్చిన నిధులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 96 శాతం దూసుకెళ్లి 164 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2023 జనవరి-జూన్‌లో ఇది 81.9 మిలియన్ డాలర్లుగా ఉంది. ఈ వృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ 2021 క్యూ3లో ఎడ్‌టెక్ పరిశ్రమ అందుకున్న 2.48 బిలియన్ డాలర్ల త్రైమాసిక గరిష్టంతో పోలిస్తే చాలా తక్కువ.

మార్కెట్ సవాళ్లు ఉన్నప్పటికీ..

నిధుల హెచ్చుతగ్గుల మధ్య కీలక కంపెనీలు వ్యూహాత్మక ఎత్తుగడలను కొనసాగించాయి. ఆన్‌లైన్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ అవాన్స్ 120 మిలియన్ డాలర్ల నిధులను పొందింది. న్యాయ విద్య స్టార్టప్ అయిన లాసీకో 2024లో పబ్లిక్ ఇష్యూకు వెళ్లింది. దీంతో ఈ ఏడాది ఎడ్‌టెక్ రంగంలో ముఖ్యమైన మైలురాళ్లు నమోదయ్యాయి. ఈ పరిణామాలు విస్తృత మార్కెట్ సవాళ్లు ఉన్నప్పటికీ పెట్టుబడిని ఆకర్షించడానికి, వృద్ధిని పెంచడానికి రుణాలు, ప్రత్యేక శిక్షణా ప్లాట్‌ఫామ్‌ల వంటి ఎడ్‌టెక్‌లోని సముచిత విభాగాల సామర్థ్యాన్ని నొక్కిచెప్పాయి.

2024లో ఒకటి మాత్రమే..

అన్‌అకాడమీ, ఎరుడిటస్, అప్‌గ్రాడ్ వంటి ప్రముఖ ఎడ్‌టెక్ కంపెనీలు భారత మార్కెట్‌లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. అన్‌అకాడమీ ఏకంగా 3.44 బిలియన్ డాలర్ల విలువతో అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ఈ రంగంలో 2023 నుండి కొత్త యునికార్న్ ఉద్భవించలేదు. పెట్టుబడిదారుల విశ్వాసం ఇంకా పూర్తిగా కోలుకోలేదని ఇది సూచిస్తోంది. ఈ రంగంలో కొనుగోళ్లు 2021లో ఏకంగా 31 నమోదయ్యాయి. 2023లో ఈ సంఖ్య 13కు పరిమితమైంది. 2024లో ఒకటి మాత్రమే నమోదు కావడం నిరాశ కలిగిస్తోంది.

మారుతున్న పెట్టుబడుల తీరు..

భారతీయ ఎడ్‌టెక్ రంగంలో నిధుల ల్యాండ్‌స్కేప్ నాటకీయంగా మారిపోయింది. లేట్ స్టేజ్ నిధులు 2021లో గరిష్ట స్థాయికి చేరుకుని 3.9 బిలియన్ డాలర్లు నమోదయ్యాయి. 2023లో 187 మి.డాలర్లు, 2024లో ఇప్పటి వరకు 166 మిలియన్ డాలర్లకు పడిపోయింది. ప్రారంభ దశ పెట్టుబడులు 2022లో 654 మి.డాలర్ల నుండి 85 శాతం తగ్గి ఆ తర్వాతి సంవత్సరంలో 96.4 మి.డాలర్లకు వచ్చి చేరాయి. 2021లో 175 మి.డాలర్లకు చేరుకున్న సీడ్ స్టేజ్ ఫండింగ్ 2024లో కేవలం 8.5 మి.డాలర్లకు పడిపోయింది. అన్ని దశలలో తగ్గుతున్న పెట్టుబడులనుబట్టి ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు అవగతమవుతోంది. స్థూల ఆర్థిక అనిశ్చితులు, మహమ్మారి అనంతర విద్యా విధానంలో మార్పులు ఇందుకు కారణం.

యూఎస్ తర్వాత మనమే..

ప్రస్తుత నిధుల సవాళ్లు ఉన్నప్పటికీ భారతీయ ఎడ్‌టెక్ రంగం గ్లోబల్ లీడర్‌గా ఉంది. ఆరు యునికార్న్‌లతో విజయవంతంగా కొనసాగుతోంది. యూనికార్న్‌ల సంఖ్య పరంగా యూఎస్ తర్వాత రెండవ స్థానంలో భారత్ నిలిచింది. మారుతున్న వినియోగదారుల అవసరాలు, అంచనాలకు అనుగుణంగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విద్యా నమూనాల ఏకీకరణ ద్వారా ఈ రంగం భవిష్యత్తు వృద్ధి ఆధారపడి ఉంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, తరగతి గదులలో వాయిస్ టెక్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను స్వీకరించడం ఆవిష్కరణను ప్రోత్సహిస్తుంది. అలాగే వృద్ధికి కొత్త మార్గాలను సృష్టిస్తోంది. ఉదాహరణకు వ్యక్తిగతీకరించిన అభ్యాసం, స్మార్ట్ అసెస్‌మెంట్‌లు, ఏఐ ఆధారిత అడాప్టివ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఈ రంగంలో ప్రముఖంగా మారుతున్నాయి.

విస్తరణకు అనుకూలమైన విధానం

డిజిటల్ విద్య, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలను నొక్కిచెప్పే జాతీయ విద్యా విధానం-2020 వంటి విధాన మద్దతు భవిష్యత్ విస్తరణకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తోంది. సంప్రదాయ, డిజిటల్ వేదికలలో ఉత్తమమైన వాటిని మిళితం చేసే హైబ్రిడ్ లెర్నింగ్ మోడల్స్ ప్రమాణికంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలలో ఈ విధానం విద్య సౌలభ్యాన్ని, నాణ్యతను పెంపొందిస్తుంది. దీర్ఘకాలిక దృక్పథం సానుకూలంగానే ఉన్నప్పటికీ భారతీయ ఎడ్‌టెక్‌కు ముందున్న మార్గం సవాళ్లతో నిండి ఉంది అని ట్రాక్‌ఎక్స్‌ఎన్ నివేదిక చెబుతోంది.

'మసాలా' వార్తలకు ముగింపునిస్తున్నాం!

'ఢిల్లీ బాయ్స్' కోహ్లి, గంభీర్ సరదా సంభాషణ


గంభీర్, కోహ్లి

చెన్నై: మైదానంలో దూకుడైన స్వభావానికి వారిద్దరు చిరునామా... ఆటతోనే కాకుండా ప్రత్యర్థులపై మాటలతో దూసుకుపోయేందుకు ఎవరూ వెనుకాడరు... భారత ఆటగాళ్లుగా ఇతర జట్లతో తలపడిన సందర్భాలే కాదు... ఒకరికొకరు కూడా ఆవేశంతో మాటా మాటా అనుకున్న సందర్భాలు ఉన్నాయి. ఐపీఎల్‌లో అలాంటివి అభిమానులు చూశారు. అలాంటివారు ఒకరు ప్లేయర్‌గా, మరొకరు అదే జట్టుకు కోచ్‌గా కలిసి భారత జట్టును నడిపించబోతున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు 'ఢిల్లీ బాయ్స్' విరాట్ కోహ్లి, గౌతమ్ గంభీర్‌ల మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. తామిద్దరి మధ్య ఏదో వైరం ఉందంటూ మసాలా వార్తలు రాసుకునే వారికి ఈ సంభాషణ తర్వాత అలాంటి అవకాశం ఉండదని వారు ఈ 'బీసీసీఐ' వెబ్‌సైట్ రూపొందించిన వీడియోలో చెప్పేశారు.

- మైదానంలో బ్యాటింగ్ సమయంలో దూషణలకు దిగితే అది బ్యాటింగ్‌పై ప్రభావం చూపి అవుటవుతారా లేక మరింత దూకుడుగా ఆడి ఆధిపత్యం ప్రదర్శించవచ్చా అని గంభీర్‌ను కోహ్లి అడిగాడు. దీనిపై గంభీర్ 'ఇలాంటి తరహా అనుభవాలు నాకన్నా నీకే ఎక్కువగా ఉన్నాయి. నువ్వే బాగా చెప్పగలవు' అని సమాధానం ఇవ్వడంతో నవ్వులు విరిశాయి. 'ఇది తప్పు కాదు. ఇలా చేయవచ్చు అని నాకు మద్దతిస్తావని ఆశించా' అంటూ కోహ్లి బదులిచ్చాడు. తన విషయంలో ఆ తరహా దూకుడు బాగా పని చేసిందని గంభీర్ అన్నాడు.
- మైదానంలో మంచి ఇన్నింగ్స్‌లు ఆడిన సందర్భాల్లో దైవభక్తి బాగా పని చేసిందని ఇద్దరూ గుర్తు చేసుకున్నారు. తాను న్యూజిలాండ్‌పై నేపియర్‌లో అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్న సమయంలో 'హనుమాన్ చాలీసా' పారాయణం చేసినట్లు గంభీర్ చెప్పగా... అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై సెంచరీ చేసినప్పుడు 'ఓం నమః శివాయ' అంటూ వచ్చానని కోహ్లి వెల్లడించాడు.
- 2011 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ విజయం సాధించిన క్షణాల వీడియో చూస్తుండటంతో వీరి సంభాషణ మొదలైంది. ఢిల్లీ గ్రౌండ్‌లో గంభీర్‌ను చూసి తాను ఎలా కెరీర్‌లో ఎదగాలో స్ఫూర్తిగా తీసుకున్న విషయాన్ని కోహ్లి చెప్పగా... కెరీర్ ఆరంభంలో కోహ్లి ఆడిన కొన్ని అత్యుత్తమ ఇన్నింగ్స్‌లపై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. అనంతరం ఈ చర్చ భారత టెస్టు క్రికెట్ వైపు మళ్లింది. ఒక ఆటగాడి గొప్పతనాన్ని గుర్తించేందుకు టెస్టు క్రికెట్ మాత్రమే అసలైన వేదిక అని ఇద్దరూ అభిప్రాయ పడ్డారు. భారత జట్టు బ్యాటింగ్‌లో చాలా కాలంగా బలంగా ఉందని... అయితే బౌలింగ్‌ను శక్తివంతంగా మార్చి బౌలర్ల ద్వారా మ్యాచ్‌లను గెలిపించిన ఘనత కెప్టెన్‌గా కోహ్లిదేనని గంభీర్ వ్యాఖ్యానించాడు. రాబోయే తరంలో టెస్టులను ఇష్టపడేలా ఆటగాళ్లను ప్రోత్సహించాల్సిన బాధ్యత తమపై ఉందని వీరిద్దరు అభిప్రాయపడ్డారు.
- లక్ష్య ఛేదన అంటేనే తనకు ఇష్టమని, తాను చేయాల్సిన పనిపై స్పష్టత ఉంటుందని కోహ్లి అన్నాడు. ఒక ఆటగాడు సొంత మైలురాళ్ల గురించి ఆలోచించకుండా టీమ్ కోసం ఏం కావాలో ఆలోచిస్తేనే ఛేదన సులువై జట్టుకు విజయాలు లభిస్తాయని గంభీర్ విశ్లేషించాడు. వరల్డ్ కప్ ఫైనల్లో తాను సెంచరీ గురించి ఆలోచించనే లేదని, అవుటైనప్పుడు కూడా ప్రత్యర్థి కోలుకునే అవకాశం ఇవ్వడం పట్ల బాధపడ్డానని గంభీర్ వివరించాడు.
- తర్వాతి అతిథి రోహిత్ శర్మ అయితే ఏం ప్రశ్న వేయాలని గంభీర్ అడగ్గా... ఉదయమే నానబెట్టిన బాదం పలుకులు తిన్నావా లేదా అని అడగాలని (అతని మతిమరుపును గుర్తు చేస్తూ)... ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూకు రమ్మంటే రాత్రి 11 గంటలకు వస్తాడని కోహ్లి చెప్పడంతో నవ్వులతో సంభాషణ ముగిసింది.

'డోపీ' కిరణ్ బలియాన్

- నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్న భారత షాట్‌పుట్ క్రీడాకారిణి
- గత ఏడాది ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన కిరణ్


కృష్ణ ప్రసాద్



కిరణ్ బలియాన్

న్యూఢిల్లీ: భారత మహిళా షాట్‌పుట్ క్రీడాకారిణి కిరణ్ బలియాన్ డోప్ టెస్టులో విఫలమైంది. ఆమె నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు పరీక్షల్లో తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ఆమెపై చర్యలు చేపట్టింది. కాగా ఈ డోపీల జాబితా నుంచి స్టార్ రెజ్లర్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజరంగ్ పూనియాను తప్పించారు. నిజానికి అతను డోపీగా ఏ టెస్టులోనూ నిరూపణే కాలేదు. కానీ మార్చిలో జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొన్న బజరంగ్ మూత్ర నమూనాలు ఇవ్వలేదన్న కారణంతో 'నాడా' క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఏప్రిల్ 23న అతన్ని సస్పెండ్ చేసింది. తాజా నిర్ణయంతో బజరంగ్‌కు పెద్ద ఊరట లభించినట్లయ్యింది. 25 ఏళ్ల కిరణ్ గతేడాది చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. తద్వారా షాట్‌పుట్‌లో పతకం గెలిచిన రెండో మహిళా అథ్లెట్‌గా ఆమె గుర్తింపు పొందింది. జాతీయ ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్ (2023)లో బంగారు పతకం గెలిచిన ఆమె ఈ ఏడాది ఫెడరేషన్ కప్‌లో రజతం చేజిక్కించుకుంది. 'నాడా' నిర్వహించిన డోపింగ్ (శాంపిల్–ఎ) పరీక్షలో ఆమె నిషేధిత స్టెరాయిడ్ తీసుకున్నట్లు తేలడంతో తాత్కాలిక నిషేధం విధించారు. 'బి' శాంపిల్ పరీక్షలోనూ విఫలమైతే ఆమెపై గరిష్టంగా నాలుగేళ్ల నిషేధం పడే అవకాశముంది.

షట్లర్ కృష్ణ ప్రసాద్ కూడా...

ఆంధ్రప్రదేశ్ షట్లర్, డబుల్స్ స్పెషలిస్ట్ గరగ కృష్ణ ప్రసాద్ కూడా డోపింగ్‌లో దొరికిపోయాడు. రెండేళ్ల క్రితం జరిగిన థామస్ కప్ (2022)లో స్వర్ణ పతకం గెలిచిన భారత పురుషుల జట్టులో సభ్యుడైన కృష్ణ ప్రసాద్ నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలింది. అతని నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాల్లో హ్యూమన్ కొరియోనిక్ గొనడొట్రొపిన్ (హెచ్‌సీజీ) పాజిటివ్ రిపోర్టు వచ్చింది. దీంతో అతనిపై తాత్కాలిక వేటు పడింది. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన హ్యామర్ త్రోయర్ మంజుబాలా డోపీగా తేలడంతో ఆమెపై కూడా చర్యలు తీసుకున్నారు. వీరితో పాటు ఫెడరేషన్ కప్‌లో రజతం నెగ్గిన షాలిని చౌదరి (డిస్కస్ త్రో), చావి యాదవ్ (రన్నర్), డీపీ మనూ (జావెలిన్ త్రోయర్), దీపాన్షి (రన్నర్), పర్వేజ్ ఖాన్ (రన్నర్), అర్జు (రెజ్లింగ్), వుషు ప్లేయర్లు మేనకా దేవి, మన్‌జిందర్ సింగ్, గౌతమ్ శర్మలు కూడా డోపింగ్‌లో పట్టుబడ్డారు.

ఇటలీ మేటి ఫుట్‌బాలర్ స్కిలాచీ కన్నుమూత

రోమ్: ఇటలీ మాజీ ఫుట్‌బాల్ ప్లేయర్ సాల్వటోర్ స్కిలాచీ బుధవారం కన్నుమూశాడు. 59 ఏళ్ల స్కిలాచీ కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్నాడు. స్వదేశంలో జరిగిన 1990 ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో స్కిలాచీ 6 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచి 'గోల్డెన్ బూట్' అవార్డుతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'కి ఇచ్చే 'గోల్డెన్ బాల్' అవార్డును కూడా దక్కించుకున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఇటలీ మూడో స్థానం సాధించింది. ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాను ఓడించిన జర్మనీ విజేతగా నిలిచింది. అయితే వ్యక్తిగత ప్రదర్శనతో ఇటలీ స్ట్రయికర్ స్కిలాచీ అభిమానుల్ని అలరించాడు.



కమిందు మెండిస్ శతకం

- శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 302/7
- న్యూజిలాండ్‌తో తొలి టెస్టు



గాలె: మిడిలార్డర్ ప్లేయర్ కమిందు మెండిస్ (173 బంతుల్లో 114; 11 ఫోర్లు) సెంచరీతో చెలరేగడంతో న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక భారీ స్కోరు దిశగా సాగుతోంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం ప్రారంభమైన తొలి టెస్టులో టాస్ గెలిచిన శ్రీలంక మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. కమిందు మెండిస్ శతకం సాధించగా... కుశాల్ మెండిస్ (68 బంతుల్లో 50; 7 ఫోర్లు) హాఫ్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. ఇతర ప్లేయర్లలో దినేశ్ చండీమల్ (30), ఏంజెలో మాథ్యూస్ (36), పాథుమ్ నిసాంక (27) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. దిముత్ కరుణరత్నె (2), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (11), రమేశ్ మెండిస్ (14) విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో రూర్కె 3 వికెట్లు పడగొట్టగా... ఫిలిప్స్ 2 వికెట్లు తీశాడు.

అఫ్గానిస్తాన్ సంచలనం

వన్డే ఫార్మాట్‌లో తొలిసారి దక్షిణాఫ్రికాపై విజయం


అజ్మతుల్లా

షార్జా: అంతర్జాతీయ క్రికెట్‌లో పసికూన ముద్రను తొలగించుకుంటున్న అఫ్గానిస్తాన్ మరో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన తొలి వన్డేలో అఫ్గానిస్తాన్ 6 వికెట్ల తేడాతో గెలిచి 1–0తో ముందంజ వేసింది. వన్డే ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా జట్టుపై అఫ్గానిస్తాన్‌కిదే తొలి విజయం కావడం విశేషం. అఫ్గాన్ బౌలర్లు చెలరేగడంతో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 33.3 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌటైంది. వియాన్ ముల్డర్ (84 బంతుల్లో 52; 5 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకంతో పోరాడగా... మిగిలిన వాళ్లంతా విఫలమయ్యారు. కెప్టెన్ మార్క్‌రమ్ (2), హెండ్రిక్స్ (9), టోనీ డి జార్జి (11), ట్రిస్టన్ స్టబ్స్ (0), వెరినె (10), జాసన్ స్మిత్ (0), ఫెలుక్వాయో (0) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. అఫ్గాన్ పేసర్ల ధాటికి ఒక దశలో 36 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా వన్డే ఫార్మాట్‌లో తమ అత్యల్ప స్కోరు (69)ను కూడా అధిగమించడం కష్టమే అనిపించింది. ఆ సమయంలో ఎదురుదాడికి దిగిన ముల్డర్ జట్టును 100 పరుగుల మార్క్ దాటించాడు. అఫ్గాన్ బౌలర్లలో ఫజల్ హక్ ఫరూఖీ 4 వికెట్లు, ఘజాన్‌ఫర్ 3 వికెట్లు, రషీద్ ఖాన్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గాన్ 26 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. గుల్బదీన్ (27 బంతుల్లో 34 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), అజ్మతుల్లా (25 నాటౌట్; 2 సిక్సర్లు) రాణించారు.

తొలి రౌండ్‌లోనే ఇంటిదారి

చైనా ఓపెన్‌లో భారత షట్లర్లకు నిరాశ


సుమీత్, సిక్కి

చాంగ్జౌ: చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో మాళవిక బన్సోద్ మినహా మిగతా భారత క్రీడాకారులంతా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి... మహిళల సింగిల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి సామియా ఇమాద్ ఫారూఖీ, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ, రుతుపర్ణ–శ్వేతాపర్ణ జోడీలు... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి, సతీశ్ కుమార్–ఆద్యా జంటలకు నిరాశ ఎదురైంది. ప్రపంచ 40వ ర్యాంకర్ కిరణ్ జార్జి సంచలన విజయాన్ని సాధించే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ప్రపంచ 13వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో కిరణ్ జార్జి 21–4, 10–21, 21–23తో ఓడిపోయాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో కిరణ్ రెండు మ్యాచ్ పాయింట్లను వృథా చేసుకోవడం గమనార్హం. సామియా 9–21, 7–21తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్) చేతిలో... ఆకర్షి 15–21, 19–21తో చియు పిన్ చెయిన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు.

మహిళల డబుల్స్‌లో గాయత్రి–ట్రెసా జాలీ 21–16, 15–21, 17–21తో సెయి పె షాన్–హంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) చేతిలో... రుతుపర్ణ–శ్వేతాపర్ణ 11–21, 21–16, 11–21తో టింగ్ చున్ సున్–యాంగ్ చున్ యున్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూశారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత నంబర్‌వన్ జోడీ సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి 10–21, 16–21తో టాన్ కియాన్ మెంగ్–లాయ్ పె జింగ్ (మలేసియా) జంట చేతిలో... సతీశ్–ఆద్యా ద్వయం 14–21, 11–21తో చెన్ టాంగ్ జె–తో ఈ వె (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయాయి.

పంజాబ్ కింగ్స్ రాత మారేనా!

'అంగట్లో అన్నీ ఉన్నా... అల్లుడి నోట్లో శని అన్నట్లు'... మెరుగైన ప్లేయర్లు, అంతకుమించిన సహాయక సిబ్బంది, ప్రతి మ్యాచ్‌లో దగ్గరుండి ప్రోత్సహించే ఫ్రాంచైజీ యాజమాన్యం, అన్నీటికి మించి జట్టు ఎలాంటి ప్రదర్శన చేసినా వెన్నంటి నిలిచే అభిమాన గణం ఇలా అన్నీ ఉన్నా... పంజాబ్ కింగ్స్ జట్టు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవలేకపోయింది. గత ఏడేళ్లుగా కనీసం టాప్‌-5లో కూడా నిలవలేకపోయింది. మరి ఇప్పుడు కొత్త హెడ్ కోచ్‌గా ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ రాకతోనైనా పంజాబ్ రాత మారుతుందా లేదా వేచి చూడాలి.

-సాక్షి క్రీడా విభాగం

వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం కొత్త హెడ్ కోచ్‌తో బరిలోకి





పాంటింగ్ (ఫైల్)

- జట్టు పేరు మార్చినా ఆటలో రాని మార్పు
- గతంలో మేటి కోచ్‌లు పని చేసినా కనిపించని ఫలితం
- కొత్త హెడ్ కోచ్ రికీ పాంటింగ్‌పై భారీ ఆశలు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆరంభం నుంచి కొనసాగుతున్న జట్లలో పంజాబ్ ఒకటి. కొన్నేళ్లు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ పేరుతో లీగ్‌లో ఆడింది. ఆ తర్వాత ఈ పేరును పంజాబ్ కింగ్స్‌గా మార్చుకుంది. అయితేనేం ఐపీఎల్ విన్నర్స్ ట్రోఫీ మాత్రం పంజాబ్ జట్టుకు అందని ద్రాక్షగానే ఉంది. క్రిస్ గేల్, ఆడమ్ గిల్‌క్రిస్ట్, వీరేంద్ర సెహ్వాగ్, యువరాజ్ సింగ్, కేఎల్ రాహుల్, షాన్ మార్ష్, డేవిడ్ మిల్లర్, మ్యాక్స్‌వెల్, శిఖర్ ధావన్ వంటి విధ్వంసక బ్యాటర్లు ప్రాతినిధ్యం వహించినా... టామ్ మూడీ మొదలుకొని అనిల్ కుంబ్లే వరకు ఎందరో దిగ్గజాలు హెడ్ కోచ్‌లుగా పనిచేసినా పంజాబ్ రాత మాత్రం మారడంలేదు. చివరిసారిగా 2014లో ఫైనల్ చేరిన పంజాబ్ జట్టు... గత ఏడు సీజన్లలో కనీసం టాప్‌-5లో కూడా చోటు దక్కించుకోలేకపోయింది. ఈ ఏడాది శిఖర్ ధావన్ సారథ్యంలో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ జట్టు తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఆడిన 14 మ్యాచ్‌ల్లో తొమ్మిదింట ఓడి 10 పాయింట్లు మాత్రమే సాధించింది. గాయం కారణంగా ధావన్ కొన్ని మ్యాచ్‌లకే అందుబాటులో ఉండటం... భారీ ధర పెట్టి కొనుగోలు చేసుకున్న ఇంగ్లండ్ పేస్ ఆల్‌రౌండర్ స్యామ్ కరన్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడం పంజాబ్ విజయావకాశాలపై ప్రభావం చూపింది. ఇలాంటి దశలో జట్టు ప్రక్షాళన చేపట్టిన పంజాబ్ ఆ దిశగా తొలి అడుగు వేసింది.

తన ముద్ర వేస్తాడా?

గత పదేళ్లలో తరచూ ప్లేయర్లను మార్చడం... కెప్టెన్లను మార్చడం... కోచ్‌లను మార్చడం ఇలాంటి వాటితోనే వార్తల్లో నిలుస్తున్న పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతోనే ఆస్ట్రేలియాకు రెండు ప్రపంచకప్‌లు అందించిన రికీ పాంటింగ్‌ను హెడ్ కోచ్‌గా నియమించుకుంది. ఆటగాడిగా, శిక్షకుడిగా అపార అనుభవం ఉన్న పాంటింగ్ మార్గనిర్దేశకత్వంలో పంజాబ్ ప్రదర్శన మారుతుందని యాజమాన్యం ధీమాగా ఉంది. ఐపీఎల్ ఆరంభం నుంచి ఆటగాడిగా, కోచ్‌గా కొనసాగుతున్న రికీ పాంటింగ్... గత ఏడేళ్లుగా ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు. ప్రతిభను గుర్తించి సానబెట్టడం, యువ ఆటగాళ్లకు అండగా నిలవడంలో తనదైన ముద్ర వేసిన పాంటింగ్... ఢిల్లీ జట్టును 2020 సీజన్‌లో ఫైనల్‌కు చేర్చాడు. ముంబై ఇండియన్స్ వంటి స్టార్‌లతో కూడిన జట్టుకు శిక్షణ ఇచ్చిన అనుభవం ఉన్న పాంటింగ్... పంజాబ్ జట్టును గాడిన పెడతాడని యాజమాన్యం బలంగా విశ్వసిస్తోంది. సుదీర్ఘ ప్రణాళికలో భాగంగానే పాంటింగ్‌ను నాలుగేళ్లకు కోచ్‌గా నియమించినట్లు ఫ్రాంచైజీ సీఈవో సతీశ్ మీనన్ పేర్కొన్నాడు.

వారికి భిన్నంగా..

ఇప్పటి వరకు పంజాబ్ జట్టుకు టామ్ మూడీ, ఆడమ్ గిల్‌క్రిస్ట్, సంజయ్ బంగర్, వీరేంద్ర సెహ్వాగ్, బ్రాడ్ హాడ్జ్, అనిల్ కుంబ్లే, ట్రెవర్ బేలిస్ కోచ్‌లుగా వ్యవహరించారు. వీరందరికీ భిన్నంగా పాంటింగ్ జట్టును నడిపిస్తాడని యాజమాన్యం ఆశిస్తోంది. అందుకు తగ్గట్లే పంజాబ్ జట్టుతో కలిసి పనిచేసేందుకు ఉత్సుకతతో ఉన్నట్లు పాంటింగ్ వెల్లడించాడు. 'కొత్త సవాల్ స్వీకరించడం ఆనందంగా ఉంది. ఫ్రాంచైజీ యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నా. ఎన్నో ఏళ్లుగా జట్టుకు మద్దతుగా నిలుస్తున్న అభిమానులకు... భిన్నమైన జట్టును చూపిస్తా' అని పాంటింగ్ అన్నాడు. జట్టులో సమూల మార్పులు ఆశిస్తున్న పాంటింగ్... త్వరలోనే సహాయక బృందాన్ని ఎంపిక చేయనున్నాడు. ప్రస్తుతం బంగర్ పంజాబ్ ఫ్రాంచైజీ క్రికెట్ డెవలప్‌మెంట్ హెడ్‌గా కొనసాగుతుండగా... లాంగ్‌వెల్ట్ ఫాస్ట్ బౌలింగ్, సునీల్ జోషి స్పిన్ బౌలింగ్ కోచ్‌లుగా ఉన్నారు.

కోర్ గ్రూప్‌పై దృష్టి

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన శిఖర్ ధావన్ ఈ ఏడాది పంజాబ్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అర్ష్‌దీప్, జితేశ్ శర్మ, రబడ, లివింగ్‌స్టోన్, స్యామ్ కరన్, బెయిర్‌స్టో వంటి పలువురు నాణ్యమైన ప్లేయర్లు జట్టులో ఉన్నారు. వచ్చే ఐపీఎల్‌కు ముందు మెగా వేలం జరగనున్న నేపథ్యంలో ఈ స్టార్ ఆటగాళ్లను అట్టిపెట్టుకోవాలా లేదా అనే విషయంపై పాంటింగ్ నిర్ణయం తీసుకుంటాడు. ఈ ఏడాది ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా రికార్డు సృష్టించిన పంజాబ్ కింగ్స్... అదే తీవ్రతను చివరి వరకు కొనసాగించలేకపోయింది. ఈ సీజన్ ద్వారా పంజాబ్ జట్టుకు శశాంక్ సింగ్, అశుతోష్ శర్మ వంటి నైపుణ్యం ఉన్న ఆటగాళ్లు లభించినట్టైంది. తాజా సీజన్‌లో అతి క్లిష్ట పరిస్థితులను సైతం ఈ జోడీ సమర్థంగా ఎదుర్కొని భవిష్యత్తుపై భరోసా పెంచింది. ఇలాంటి వాళ్లను సానబెట్టడంలో సిద్ధహస్తుడైన పాంటింగ్ వేలం నుంచే తనదైన ముద్ర వేస్తాడనడంలో సందేహం లేదు.



7 కీలక హామీలు

హరియాణా ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన ఖర్గే

మహిళలకు ప్రతి నెల రూ.2,000 ఆర్థికసాయం ● రూ. 500కే గ్యాస్ సిలిండర్

దివ్యాంగులు, వితంతువులు, వయో వృద్ధులకు రూ.6,000 పెన్షన్ ● పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ

సాక్షి, న్యూఢిల్లీ

హరియాణా శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ బుధవారం తమ హామీల చిట్టీని బహిర్గతం చేసింది. తాము అధికారంలోకి వస్తే ప్రజల సంక్షేమం కోసం ఏం చేస్తామనే విషయాన్ని మేనిఫెస్టోలో వివరించింది. పేద, మధ్య తరగతి ప్రజలు, మహిళలు, రైతులకు వరాలు కురిపించింది. మహిళలకు ప్రతి నెల రూ.2,000 ఆర్థికసాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్ సహా పలు వర్గాలపై వరాల జల్లు కురిపించింది. ఏడు కీలకమైన **హామీలు ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, హరియాణ మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాన్‌ల సమక్షంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 53 పేజీల మేనిఫెస్టోను విడుదల చేశారు.**

ఏడు గ్యారంటీలు ఇవే

- **మహిళా సాధికారత:** 18 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళలకు నెలకు రూ.2,00 చొప్పున ఆర్థికసాయం. రూ.500కే గ్యాస్ సిలిండర్
- **సామాజిక భద్రత:** వృద్ధులు, దివ్యాంగులు, వితంతులకు రూ.6,000 పెన్షన్
- **యువతకు:** రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- **ఉచితాలు:** రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- **పేదలకు:** ప్రతి పేద కుటుంబానికి 100 గజాల స్థలంలో ఇల్లు. ఇందులో రూ.3.5 లక్షల ఖర్చుతో రెండు గదుల ఇళ్లు
- **రైతులకు:** పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత
- **వెనుకబడిన వర్గాలకు:** కులగణన చేసి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తగు చర్యలు తీసుకోవడం. క్రిమిలేయర్ పరిమితిని రూ.10లక్షలకు పెంపు

గెలిచాకే సీఎం అభ్యర్థి ఖరారు: ఖర్గే

హరియాణలో ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఇచ్చిన ఏడు హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు ''దాదాపు 35 లక్షల ఉద్యోగాలను కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయకుండా నిలిపివేసింది. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఒక ఇంజన్ ముందుకు తీసుకెళ్తుంటే మరో ఇంజన్ వెనక్కి లాగుతోంది. మేం మేనిఫెస్టోలో చెప్పిన ఏడు ప్రధాన వాగ్దానాలను అధికారంలోకి రాగానే నెరవేరుస్తాం. తొమ్మిదిన్నరేళ్లలో రాష్ట్రానికి బీజేపీ చేసిన నష్టాన్ని సరిదిద్దటంతో **పాటు రాష్ట్రంలో వృద్ధి పథంలో** పరుగులు పెట్టించేందుకు **'అభివృద్ధి ఎక్స్‌ప్రెస్ ఇంజన్'జత చేస్తాం**''అని ఖర్గే వ్యాఖ్యా**నించారు. ఎన్నికల్లో ఘన విజయం** సాధించాకే ముఖ్యమంత్రి **అభ్యర్థిని ప్రకటిస్తామని ఖర్గే** స్పష్టంచేశారు. మేనిఫెస్టో **విడుదల సందర్భంగా హరియా**ణా మాజీ ముఖ్యమంత్రి **భూపేందర్ హుడా** సైతం మాట్లాడారు. ''నాటి **ప్రధాని, దివంగత ఇం**దిరాగాంధీ హయాంలో **1966లో మా రా**ష్ట్రం ఏర్పాటైంది. నాటి **నుంచి 2014** వరకు రాష్ట్రం అభివృద్ధి **చెందింది.** అయితే తొమ్మిదిన్నరేళ్ల **బీజేపీ** పాలనలో రాష్ట్రం వెనుక**బడి**పోయింది. మేం అధికారంలోకి వచ్చాక మళ్లీ హరియాణాను నంబర్ వన్ చేస్తాం' అని హుడా అన్నారు.

యుద్ధానికి ముగింపు పలకాలి

గాజాపై ఇజ్రాయెల్ దురాక్రమణకు దిగింది ● అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ వ్యాఖ్య

హైతీ శరణార్థులపై ట్రంప్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శ



ఫిలడెల్ఫియా: గాజా స్ట్రిప్‌లో దురాక్రమణకు దిగిన ఇజ్రాయెల్ ఇకనైనా మారణహోమం ఆపాలని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ సాయుధుల మధ్య కాల్పుల విరమణ ఒప్పందమే గాజా స్ట్రిప్ సమస్యకు అసలైన పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు. గాజాలోని ప్రతి ఒక్కరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కాల్పుల విరమణకు ఇరు పక్షాలు ముందుకు రావాలని ఆమె అభిలషించారు. ఫిలడెల్ఫియాలో జరిగిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ బ్లాక్ జర్నలిస్ట్స్ (ఎన్ఏబీజే)సమావేశంలో కమల పాల్గొని ప్రసంగించారు. దాదాపు 45 నిమిషాలపాటు పలు అంశాలపై ఆమె మాట్లాడారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు తనదైన రీతిలో బదులిచ్చారు. హైతీలు ఇంటి పెంపుడు జంతువులను తింటున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చను, వలసదారులను సామూహిక బహిష్కరణ చేస్తామని ట్రంప్ ఇచ్చిన హామీని హారిస్ తప్పుబట్టారు. 'ట్రంప్ ద్వేషపూరిత వ్యాఖ్యలు హానికరం. ఇలాంటి వాటిని సహించకూడదు'అని అన్నారు. ఆర్థిక అంశాలపైనా ఆమె విస్తృతంగా మాట్లాడారు. ''అమెరికన్లను ప్రభావితం చేసే పెద్ద సమస్యలలో సరిపడా గృహాలు లేకపోవడం కూడా ఒకటి. నేనుఅధ్యక్షురాలిగా ఎన్నికైతే గృహాల నిర్మాణానికి ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేస్తా. చైల్డ్ ట్యాక్స్ క్రెడిట్‌ను 6,000 డాలర్లకు విస్తరిస్తాం. దీంతో అమెరికన్లు తమ ఆదాయంలో ఏడు శాతం కంటే ఎక్కువ మొత్తాలను పిల్లల సంరక్షణకు చెల్లించాల్సిన అవసరం లేదు''అని కమల వ్యాఖ్యానించారు.

కమలకు నల్లజాతీయుల బాసట

2020 అధ్యక్ష ఎన్నికల్లో నల్లజాతీయుల్లో ఏకంగా 92 శాతం మంది అప్పటి డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్‌కు మద్దతు పలికారు. రిపబ్లికన్ పార్టీ తరఫున నాటి అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు కేవలం 8 శాతం మంది నల్లజాతీయులే మద్దతు పలికారు. ఈ సారిసైతం అదే సరళి కనిపిస్తోంది ఎన్ఏఏసీపీ సర్వే తేల్చింది. ఇటీవల విడుదలైన ఎన్ఏఏసీపీ సర్వే ప్రకారం 63 శాతం మంది నల్లజాతి ఓటర్లు కమలా హారిస్‌కు మద్దతు పలికారు. గతంతో పోలిస్తే డెమొక్రటిక్ పార్టీ నుంచి నల్లజాతీయులు కాస్తంత దూరం జరిగారని చెప్పాలి. అయినప్పటికీ ఇప్పటికీ నల్లజాతీయుల మెజారిటీ మద్దతు కమలకే దక్కడం విశేషం. ఈసారి పోటీలో నిలిచిన ట్రంప్‌కు కేవలం 13 శాతం మంది నల్లజాతీయులు మద్దతుగా నిలబడినట్లు సర్వే వెల్లడించింది. పెన్సిల్వేనియా, జార్జియా వంటి రాష్ట్రాల్లో నల్లజాతీయుల మద్దతు నిర్ణయాత్మకంగా ఉంటుంది. పెన్సిల్వేనియా అత్యంత కీలకమైన రాష్ట్రం. ఈ రాష్ట్ర ప్రజలను ప్రభావితం చేసే సామర్థ్యం ఎన్ఏబీజేకు ఉందని చెబుతారు. దీంతో వీరిని ఎలాగైనా తమ వైపునకు తిప్పుకోవాలని కమలా హారిస్, ట్రంప్ ఇద్దరూ చెమటోడుస్తున్నారు. అయితే గతంలో ట్రంప్ చేసిన జాత్యాహంకార వ్యాఖ్యల కారణంగా ఇప్పటికీ నల్లజాతీయుల మద్దతు కూడగట్టడం ఆయనకు సంక్లిష్టంగా తయారైంది. జార్జియాలో మూడు వంతుల మంది నల్లజాతీయులే కావడంతో ఇక్కడా వారి ఓటు నిర్ణయాత్మకంగా మారింది.

'ఉచిత హామీ'లపై విచారణ జరుపుతాం

పిటిషన్లను విచారిస్తామన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు ఎన్నికల వేళ ఇస్తున్న ఉచిత హామీలపై తప్పకుండా విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలు ఉచితాలపై హామీలు గుప్పించడం.. అత్యంత ముఖ్యమైన అంశమని, వాటిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జే.బి.పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఉచితాలను సవాల్ చేస్తూ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసిన న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ బుధవారం బిజినెస్ లిస్టులో ఈ పిటిషన్లు ఉన్నాయని, వాటిని విచారణకు స్వీకరించాలని కోరారు. తమ పిల్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం లేదని, దీన్ని మరో తేదీన విచారించడానికి వీలుగా జాబితాలో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీజేఐ చంద్రచూడ్ స్పందిస్తూ.. ఇది అత్యంత ముఖ్యమైన అంశం. దీన్ని కాజ్ లిస్టులో నుంచి తొలగించబోం'అని చెప్పారు.

ప్రతీకారం ఏ స్థాయిలో ఉంటుందో చెప్పలేం

● లెబనాన్ విదేశాంగ మంత్రి అబ్దుల్లా వ్యాఖ్య

బీరుట్: హెజ్‌బొల్లా సభ్యులే లక్ష్యంగా జరిగిన పేజర్ల పేలుళ్ల ఘటనకు ప్రతీకారం తీర్చుకుంటామని లెబనాన్ ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్దుల్లా బౌ హబీబ్ మాట్లాడారు. ''మొదట హెజ్‌బొల్లా ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్నాం. ఇజ్రాయెల్‌పై ప్రతీకారం కచ్చితంగా పెద్ద ఎత్తున ఉంటుంది. అయితే అది ఎలా ఎప్పుడు అనేది నాకు కూడా ఇంకా తెలీదు. మొదట ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఇజ్రాయెల్‌పై ఫిర్యాదు చేస్తాం''అని అబ్దుల్లా అన్నారు. లెబనాన్‌లో నెలకొన్న అస్థిర పరిస్థితులు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి అధికార ప్రతినిధి డుజారిక్ తెలిపారు. పౌరుల మరణాలకు తాము చింతిస్తున్నామన్నారు.

అమెరికా ప్రమేయం లేదు: మాథ్యూమిల్లర్: లెబనాన్‌లో పేజర్‌ల పేలుళ్ల ఘటన వెనుక తమ ప్రమేయం లేదని అమెరికా స్పష్టంచేసింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ముందస్తు సమాచారం లేదని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ చెప్పారు. ''గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ చర్చలు జరిపేందుకు అంతర్జాతీయ ప్రయత్నాలు నిలిచిపోవడం, ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా మధ్య ఉద్రిక్తతలను దౌత్యవేత్తలు తగ్గించలేకపోవడంతో ఈ పేలుళ్లు సంభవించాయి''అని ఆయన అన్నారు. హెజ్‌బొల్లాతో ఇజ్రాయెల్ ఘర్షణ నివారించే ప్రయత్నంలో బైడెన్ పరిపాలన సీనియర్ అధికారి ఆమోస్ హోచిస్టీన్ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలెంట్‌తో టెల్‌అవీవ్‌లో సమావేశమైన మరుసటి రోజే ఈ పేలుళ్లు జరగడం గమనార్హం. హమాస్, హెజ్‌బొల్లా అనుబంధం కారణంగానే దౌత్యపరమైన పరిష్కారానికి లభించట్లేదని హోచ్‌స్టీన్ వ్యాఖ్యానించారు. హమాస్ చె**రలో** బందీలుగా ఉన్న బాధితులను విడిపించేందుకు 'సైనిక చర్య'ఒక్కటే మార్గమని గాలెంట్ పేర్కొన్నారు.



దాడికి ముందు, దాడి తర్వాత రష్యా ఆయుధాగారాలు

రష్యా ఆయుధాగారాలపై ఉక్రెయిన్ భీకర దాడి

కీవ్: రష్యాకు చెందిన కీలక ఆయుధాగారాలపై **ఉక్రెయిన్ డ్రోన్‌లతో విరుచుకుపడింది.** మిస్సైళ్లు, ఇతర ఆయుధాలను ధ్వంసం చే**సింది. సరిహద్దు నుంచి 500 కిలోమీటర్ల** దూరంలోని ఆయుధ గిడ్డంగులపై ఉక్రెయి**న్ మంగళవారం రాత్రి వందకు పైగా** డ్రోన్లను ప్రయోగించి వాటిని నేలమట్టం చేసింది**. భారీ పేలుళ్లతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.** టోరోపెట్స్‌లో ఉన్న రష్యా ఆయుధ గిడ్డంగుల**ను ధ్వంసం చేశామని ఉక్రెయిన్ ప్రకటించింది.** మాస్కోకు 380 కిలోమీటర్ల దూరంలో టోరోపెట్స్ **ఉంది. ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీసెస్, ఉక్రెయిన్ ఇం**టలిజెన్స్ అండ్ స్పెషల్ ఆపరేషన్ ఫోర్సెస్ కలిపి **సంయుక్తంగా ఈ భీకర దాడిని చేపట్టాయి. స్వదేశీ తయారీ** కామికేజ్ డ్రోన్లను ఉక్రెయిన్ ఈ దాడికి వాడింది. **ఇస్కాండర్, టోచ్కా–యు మిస్సైళ్లు, గైడ్ బాంబులు, ఇతర మం**దుగుండు సామాగ్రి ఈ గిడ్డంగుల్లో ఉందని ఉక్రె**యిన్ అధికారులు తెలిపారు. ఉత్తరకొరియా సరఫరా చేసిన కేఎన్–23** స్వల్పశ్రేణి బాలిస్టిక్ మిస్సైళ్లు కూడా ఇందులో **ఉన్నాయని చెప్పారు. భూకంపం వచ్చినంతటి తీవ్రతతో పేలుళ్లు జరిగాయని, పరి**సర ప్రాంతాల్లోని ప్రజలను ఖాళీ చేయించారని ర**ష్యా వార్తా సంస్థలు తెలిపాయి. టోరోపెట్స్‌లో 11 వేల జనాభా ఉంది. ఉక్రెయిన్ డ్రోన్ల** దాడులతో మిస్సైళ్లు పేలిపోయి 6 కిలోమీటర్ల ప్ర**ాంతమంతా మంటలు వ్యాపించాయి.**

రాహుల్‌పై కుట్ర వెనుక మోదీ, షా

● ప్రజల గొంతుకను వినిపిస్తున్నందుకే రాహుల్‌పై దూషణలు

● కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మండిపాటు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ నేతల కుట్రలు, అనుచిత వ్యాఖ్యల వెనుక ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హస్తం ఉందని కాంగ్రెస్ ప్రధాన ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం ఆరోపించారు. వారిద్దరికి తెలిసే ఇదంతా జరుగుతోందని మండిపడ్డారు. రాహుల్‌పై బెదిరింపు వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తున్నందుకే రాహుల్‌ను బీజేపీ నేతలు లక్ష్యంగా చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాహుల్ పట్ల బీజేపీ నేతల అభ్యంతకర వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఎదుట, ఢిల్లీ పీసీసీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున గుమికూడారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అడ్డుకొనేందుకు ప్రయత్నించిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. అంతకుముందు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభిషేక్ సింఘ్వీ, కేసీ వేణుగోపాల్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ నేతలు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నా నరేంద్ర మోదీ, అమిత్ షా నోరువిప్పడం లేదని ధ్వజమెత్తారు. రాహుల్‌పై కుట్ర వెనుక వారిద్దరి ప్రమేయం ఉన్నట్లు దీన్నిబట్టి స్పష్టంగా తెలిసిపోతోందని అన్నారు. రాహుల్‌కు ప్రాణహాని తలపెట్టేలా బెదిరిస్తూ మాట్లాడిన నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా పెద్ద కుట్ర జరుగుతోందని ఈ పార్టీ ప్రధాన కార్యదర్శి అజయ్ మాకెన్ ఆరోపించారు. రాహుల్‌పై అధికార ఎన్డీయే నాయకులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని, బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నారని, అయినా బీజేపీ నాయకత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాహుల్ భద్రతకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం సమాజంలో శాంతిని విచ్ఛిన్నం చేసి, ప్రజలను రెచ్చగొట్టాలన్నదే అధికార కూటమి నాయకుల ప్రయత్నమని విమర్శించారు. రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకొని బెదిరించేలా మాట్లాడిన బీజేపీ నేతలు తర్విందర్ సింగ్ మార్వా, రవనీత్‌సింగ్ బిట్టూ, రఘురాజ్ సింగ్, శివసేన(షిండే) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అజయ్ మాకెన్ బుధవారం ఢిల్లీలో తుగ్లక్ రోడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాహుల్ నాలుకకు చురుకు పెట్టాలి

● బీజేపీ ఎంపీ అనిల్ బోండే వివాదాస్పద వ్యాఖ్య

అమరావతి: మన దేశంలో అమలవుతున్న రిజర్వేషన్లపై పరాయి గడ్డపై ప్రమాదకరమైన వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాలుకకు నిప్పుతో చురుకు పెట్టాలని బీజేపీ రాజ్యసభ సభ్యుడు అనిల్ బోండే అన్నారు. ఆయన మహారాష్ట్రలోని అమరావతిలో మీడియాతో మాట్లాడారు. రాహుల్ నాలుకను నరికితే రూ.11 లక్షలు బహుమతిగా ఇస్తానంటూ శివసేన(షిండే) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ఇచ్చిన ఆఫర్‌పై స్పందించారు. నాలుకను నరికేయాలనడం, అలాంటి భాష ఉపయోగించడం సరైంది కాదని చెప్పారు. మన దేశం గురించి విదేశాల్లో ఇష్టానుసారంగా మాట్లాడితే నాలుకను నరికేయడానికి బదులు నాలుకకు నిప్పుతో చురుకు పెట్టడం సమంజసమని అన్నారు. అదే సరైన శిక్ష అవుతుందని స్పష్టంచేశారు.

21న ఢిల్లీ సీఎంగా ఆతిశీ ప్రమాణ స్వీకారం!

● లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ప్రతిపాదన

న్యూఢిల్లీ: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఆతిశీ నెల 21వ తేదీన ప్రమాణ స్వీకారం చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా బుధవారం ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమాచారం ఇచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా పత్రాన్ని సైతం ముర్ముకు పంపించినట్లు వెల్లడించాయి. రాజ్ నివాస్‌లో అత్యంత నిరాడంబరంగా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగనుంది. అయితే, ఈ నెల 21న ఆతిశీ ప్రమాణం చేయాలన్న ప్రతిపాదన పట్ల ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉండగా, తమ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భద్రతను వదులుకుంటారని, మరో 15 రోజుల్లో సీఎం అధికారిక నివాసం నుంచి బయటకు వెళ్తారని ఆప్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రమాణ స్వీకారం తరువాత ఆతిశీ ఢిల్లీ అసెంబ్లీలో బలనిరూపణ చేసుకోనున్నారు. ఇందుకోసం ఈ నెల 26, 27 అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తారు. నూతన మంత్రి వర్గ కూర్పుపై ఆతిశీ కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

మోదీని అమెరికాలో కలుస్తా

ఆయన అసాధారణ నేత: ట్రంప్

వాషింగ్టన్/ న్యూయార్క్: మూడ్రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ అమెరికాకు వచ్చినపుడు ఆయనను కలుస్తానని అమెరికా ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్‌బీచ్ గోల్ఫ్‌క్లబ్‌లో ఆగంతకుడు తనను చంపేందుకు విఫలయత్నంచేశాక ట్రంప్ తొలిసారిగా ఎన్నికల ప్రచారకార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం మిషిగన్ రాష్ట్రంలోని ఫ్లింట్ నగరంలోని టౌన్‌హాల్‌లో రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలనుద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. ''అమెరికా దిగుమతుల విషయంలో అధిక సుంకాలు విధిస్తూ భారత్ భిన్నంగా వ్యవహరిస్తోంది. అయినాసరే వారి నేత, ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వచ్చినపుడు ఆయనను కలుస్తా. ఆయన అసాధారణ వ్యక్తి''అని అన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ స్పందించలేదు.

కాబోయే అధ్యక్షులనే కాల్చుతున్నారెందుకో..

తనపై జరిగిన దాడి యత్నాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ''వేలాది మంది మద్దతుదారుల సమక్షంలో ప్రచారంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. అయితే కార్ రేసింగ్‌లో బుల్ రైడింగ్‌లో పాల్గొనడం ఎంత ప్రమాదకరమో అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనడం కూడా అంతే ప్రమాదకరం. అసలు కాబోయే అధ్యక్షులను మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడుతున్నారో అర్థంకావట్లేదు''అని ట్రంప్ అన్నారు. కాల్పుల యత్నం తర్వాత కమల తనకు ఫోన్ చేశారని ట్రంప్ వెల్లడించారు. ''ఆమె అలా ఫోన్ చేయడం చాలా బాగుంది. ఇలాంటి పద్ధతిని మనం ఖచ్చితంగా అభినందించాల్సిందే'అని అన్నారు. అమెరికాలో హింసకు తావులేదు అని ట్రంప్‌కు ఫోన్‌చేసిన సందర్భంగా చెప్పానని కమల హారిస్ వెల్లడించడం తెల్సిందే.



పరస్పర ఆరోపణలు

ట్రంప్‌పై యత్యాయత్నాలకు మీరంటే మరే కారణమని రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీ నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. తాను అధ్యక్షుడినైతే డెమొక్రాట్లపై కేసులు బనాయించి, జైల్లో పడేస్తానని, శరణార్థులను బలవంతంగా దేశం నుంచి బహిష్కరించి పంపించేస్తానని ట్రంప్ చేస్తున్న ప్రకటనలే ఆయన ప్రాణాల మీదకు తెచ్చాయని డెమొక్రాట్లు ఆరోపించారు. డెమొక్రాట్ల ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌పై విద్వేష వ్యాఖ్యలు చేయడం వల్లే ట్రంప్ ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని రిపబ్లికన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కేరళలో ఎంపాక్స్ కేసు

యూఏఈ నుంచి వచ్చిన వ్యక్తికి సోకినట్లు నిర్ధారణ

మలప్పురం: కేరళలో మంకీపాక్స్ (ఎంపాక్స్) కేసు నమోదైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి ఇటీవల వచ్చిన 38 ఏళ్ల వ్యక్తి ఎంపాక్స్ లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. అతనికి ఎంపాక్స్ సోకినట్లు టెస్టుల్లో నిర్ధారణ అయిందని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ బుధవారం వెల్లడించారు. విదేశాల నుంచి వచ్చేవారు ఎంపాక్స్ లక్షణాలుంటే వెంటనే ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేరళలోని అన్ని మెడికల్ కాలేజీల్లో ఎంపాక్స్ చికిత్స కోసం ఐసోలేటెడ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది భారత్‌లో రెండో ఎంపాక్స్ కేసు. గతవారం హరియాణాలోని హిసార్‌కు చెందిన 26 ఏళ్ల యువకుడికి ఎంపాక్స్ పాజిటివ్ రావడంతో ఢిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో ఉంచి చికిత్స అందించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆరోగ్య అత్యయిక పరిస్థితిని ప్రకటించిన ఎంపాక్స్‌లో వైరస్ క్లేడ్–1 తరగతికి చెందినదని, హిసార్ యువకుడికి సోకింది పశ్చిమాఫ్రికా క్లేడ్–2 వైరస్ అని కేంద్ర ఆరోగ్యశాఖ గత వారం వెల్లడించింది. 2022 జూలై నుంచి భారత్‌లో నమోదైన 30 కేసుల్లో వైరస్ ఇదే కోవకు చెందినదని, ఆందోళన అక్కర్లేదని తెలిపింది. మలప్పురం ఎంపాక్స్ కేసులో క్లేడ్ ఏరకానికి చెందినది అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. పరీక్షల్లో తేలుతుంది.

నైతికపర నియమావళి ఆధారంగా..

సామాజిక జీవనంలో వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, నమ్మకం, గౌరవం లాంటి వాటిని ఉదాత్తమైన మానవీయ పరిపక్వతా లక్షణాలుగా పేర్కొంటారు. సమాజం ద్వారానే వ్యక్తి అన్ని లక్షణాలను, స్వభావాలను అలవర్చుకుంటాడు. అదేవిధంగా సమాజం నుంచి అనేక ప్రయోజనాలు పొందుతాడు. దీనికి ప్రతిగా సమాజానికి సేవ, సహాయాన్ని అందించాల్సిన కనీస బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక విధులు

విధి అంటే ఒక వ్యక్తి ఇతరుల కోసం నిర్వర్తించాల్సిన పని లేదా బాధ్యత అని అర్థం. విధులు సమాజ వికాసానికి, దేశాభివృద్ధికి, సామాజిక స్పృహ కల్పించడానికి దోహదం చేస్తాయి. ఇవి దేశ ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయి. ప్రాథమిక హక్కులనే ఫలాలు విధులుగా పరిపక్వం చెందినపుడే సమాజ జీవనం సాఫల్యం అవుతుంది.

విధులు – రకాలు: సాధారణంగా విధులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

ఎ) నైతిక విధులు బి) చట్టబద్ధమైన విధులు

నైతిక విధులు అనేవి ప్రజల నైతిక విలువలు, సామాజిక స్పృహపై ఆధారపడి ఉంటాయి. **ఉదా:** పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం; అభాగ్యులను, విధివంచితులను ఆదుకోవడం.

చట్టబద్ధమైన విధులు సమాజంతో ఆమోదం పొంది, ప్రభుత్వం గుర్తించిన బాధ్యతలు. వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారు.

ఉదా: ట్రాఫిక్ నియమాలు పాటించడం, పన్నులు సక్రమంగా చెల్లించడం.

భారత రాజ్యాంగం – ప్రాథమిక విధులు

ప్రతి పౌరుడు దేశం పట్ల, తన తోటి పౌరుల పట్ల కొన్ని కనీస బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అందువల్ల వీటిని ప్రాథమిక విధులు అంటారు. వీటిని రష్యా రాజ్యాంగం నుంచి గ్రహించారు. మౌలిక రాజ్యాంగంలో ప్రాథమిక విధుల ప్రస్తావన లేదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్దార్ స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో పొందుపర్చారు. ప్రారంభంలో పది ప్రాథమిక విధులు ఉండేవి.2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక విధిని రాజ్యాంగంలో చేర్చడంతో వీటి సంఖ్య పదకొండుకు పెరిగింది. ప్రాథమిక విధులు 1977జనవరి 3 నుంచి అమల్లోకి వచ్చాయి. అందువల్ల ఈ రోజును ప్రాథమిక విధుల దినోత్సవంగా పరిగణిస్తారు.

ప్రాథమిక విధులు – లక్షణాలు

ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. అవి..

- ప్రాథమిక విధులకు న్యాయ సంరక్షణ లేదు. ఇవి నేరుగా అమల్లోకి రావు. వీటి అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక చట్టాలు చేయాలి.
- ప్రాథమిక విధులు కేవలం పౌరులకు మాత్రమే వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక విధులు నైతికపరమైన బాధ్యతలు, మరికొన్ని పౌర బాధ్యతలు.
- కొన్ని ప్రాథమిక విధులను భారత సనాతన సంప్రదాయాలు, మత విలువలు, పురాణాల ఆధారంగా తీసుకున్నారు.

ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలోని 4–ఎ భాగంలో నిబంధన 51–ఎలో పొందుపర్చారు.

51–ఎ:

ఎ) రాజ్యాంగానికి కట్టుబడి ఉండి దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలి.

బి) జాతీయ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ఉన్నత ఆదర్శాలను పాటించాలి.

సి) భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను పరిరక్షించాలి.

డి) దేశ రక్షణకు, జాతీయ సేవకు సదా సన్నద్ధంగా ఉండాలి.

ఇ) భారత ప్రజల మధ్య మత, భాష ప్రాంతీయ, వర్గ వైవిధ్యాలకు అతీతంగా సోదర భావాన్ని, స్ఫూర్తిని పెంపొందించాలి. స్త్రీల గౌరవాన్ని భంగపరిచేవాటిని త్యజించాలి.

ఎఫ్) భారత మిశ్రమ సంస్కృతి, ఔన్నత్యం, సంప్రదాయాలను గౌరవించి, పరిరక్షించాలి.

జి) అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులు సహా ప్రకృతిలోని పరిసరాలను కాపాడాలి, అభివృద్ధి చేయాలి, జీవులపట్ల కారుణ్యాన్ని కలిగి ఉండాలి.

హెచ్) శాస్త్రీయ దృక్పథాన్ని, మానవ జిజ్ఞాసను, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.

ఐ) ప్రజల ఆస్తిని సంరక్షించాలి, హింసను ప్రేరేపించే చర్యల్లో పాల్గొనకూడదు.



జె) వ్యక్తిగత, సమష్టి చర్యల ద్వారా ప్రతి కార్యరంగంలోనూ అత్యున్నత స్థానాన్ని పొందడానికి కృషి చేయాలి. తద్వారా దేశ అత్యున్నత అభ్యుదయానికి తోడ్పడాలి.

కె) 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు విద్యావకాశాలను కల్పించే బాధ్యతను తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు నిర్వర్తించాలి.

ప్రాథమిక విధులు – సుప్రీంకోర్టు తీర్పులు

శ్యాం నారాయణ్ చౌక్సీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా

ఈ కేసులో జాతీయ పతాకాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రచారం కోసం వినియోగించరాదని సుప్రీం కోర్టు పేర్కొంది.

బిజో మాన్యూవల్ Vs కేరళ (1986)

ఈ కేసులో సుప్రీం కోర్టు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జాతీయ గీతాలాపన అనేది మత విశ్వాసాలకు విరుద్ధమైతే ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. జాతీయ గీతాన్ని ఆలపించినప్పుడు మాత్రం అందరూ గౌరవ సూచకంగా నిలబడాలని పేర్కొంది.

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ Vs స్టూడెంట్ యూనియన్ (2002)

ప్రాథమిక విధులను విస్మరించరాదని, అవి దేశ సమగ్రతకు, సామాజిక జీవనానికి ఆదర్శంగా ఉంటాయని ఈ కేసులో సుప్రీం కోర్టు పేర్కొంది.

డాక్టర్ దాశరథి Vs ఆంధ్రప్రదేశ్

ఈ కేసులో ఆస్థాన కవుల హోదా చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

గ్రామీణ వ్యాజ్యాల హక్కుల కేంద్రం Vs ఉత్తరప్రదేశ్ (1986)

పర్యావరణ పరిరక్షణలో ప్రాథమిక విధులను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

నవీన్ జిందాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా(2004)

జాతీయ జెండాను ఎగురవేయడం భావ వ్యక్తీకరణ కిందకి వస్తుందని, పౌరులకు స్వేచ్ఛగా జెండా ఎగురవేసే హక్కు ఉంటుందని పేర్కొంది

ప్రాథమిక విధులు – జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ సూచనలు

1999లో నియమించిన వర్మ కమిటీ ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని సిఫారసులు చేసింది. అవి..

- జాతీయ పతాకం, జాతీయ గీతం, భారత రాజ్యాంగ పరిరక్షణకు, గౌరవానికి సంబంధించి 1971లో చేసిన చట్టం సరిపోతుందని పేర్కొంది. అదేవిధంగా భారత శిక్షాస్మృతిలో ఉన్న చట్టాల ద్వారా కొన్ని విధులను అమలు చేయవచ్చని చెప్పింది. ఉదాహరణకు..
  పౌర హక్కుల పరిరక్షణ చట్టం – 1955,
  ప్రజాప్రాతినిధ్య చట్టం – 1951,
  చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం–1967,
  వన్యప్రాణి సంరక్షక చట్టం – 1972,
  అడవుల పరిరక్షణ చట్టం – 1980,
- ఏటా జనవరి 3ను ప్రాథమిక విధుల దినోత్సవంగా పాటించాలి.
- అన్ని విద్యా ప్రణాళికల్లో ప్రాథమిక విధులను పాఠ్యాంశంగా చేర్చాలి.
- అన్ని విద్యా సంస్థల్లో ఎన్‌సీసీలను తప్పక ప్రవేశపెట్టాలి.
- ప్రసార మాధ్యమాల ద్వారా ప్రాథమిక విధుల గురించి విస్తృత ప్రచారం కల్పించాలి.

విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చడంపై అనేక విమర్శలున్నాయి.

- దేశంలో భారత పౌరులు సహజంగా చట్ట విధేయులు, క్రమశిక్షణ ఉన్నవారు అయినప్పుడు వారి బాధ్యతలను ప్రత్యేకంగా గుర్తు చేయడం సమంజసం కాదని కొంతమంది అభిప్రాయం.
- అత్యంత ముఖ్యమైన విధులైన సక్రమంగా పన్నులు చెల్లించడం, కుటుంబ నియంత్రణ, ఎన్నికల్లో ఓటు వేయడం లాంటి వాటిని ప్రాథమిక విధుల్లో పొందుపరచలేదు.
- ఈ విధులు కేవలం నైతికపరమైన నియమావళిపైనే ఆధారపడి ఉన్నాయి. వీటిని పాటించకపోతే శిక్షించే ఆస్కారం లేదు.
- ప్రాథమిక విధుల్లో పేర్కొన్న కొన్ని పదాలకు స్పష్టత లేదు. **ఉదా:**శాస్త్రీయ దృక్పథం,మిశ్రమ సంస్కృతి,పరిశోధనా స్ఫూర్తి అనే పదాలకు నిర్దిష్ట అర్థాలు లేవు. వీటిని నాలుగో భాగంలో కాకుండా మూడో భాగంలోనే చేర్చి ఉండాల్సింది.
- సాధారణంగా ప్రాథమిక విధులు ప్రజాస్వామ్య రాజ్యాంగంలో అంతర్భాగంగా ఉండవు. నియంతృత్వ దేశాల రాజ్యాంగంలో మాత్రమే ఇవి ఉంటాయి.
- ఇవి చట్ట నిర్దేశానికి, ఆత్మ ప్రబోధానికి మధ్య వైవిధ్యాన్ని కలిగించవచ్చు.

ప్రాథమిక విధుల ప్రయోజనాలు

- ప్రాథమిక విధులకు న్యాయసంరక్షణ లేకపోయినా, కొన్ని లోపాలున్నా.. వీటిని రాజ్యాంగంలో చేర్చడం సమంజసమే. ఎందుకంటే విధులు లేకుండా హక్కులను మాత్రమే గుర్తిస్తే అది బాధ్యతారాహిత్యానికి దారితీస్తుంది. అదేవిధంగా హక్కులు లేని బాధ్యతలు బానిసత్వానికి ప్రతీక అవుతాయి. కాబట్టి హక్కులు, విధులు, పరస్పర పోషకాలు. అవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల లాంటివి.
- ప్రాథమిక విధులు కూడా ఆదేశిక సూత్రాల్లా ప్రభుత్వ విధానాలు, కార్యాచరణను ప్రభావితం చేస్తాయి.
- ఆచరణాత్మకమైనవి కాకపోయినా నిరంతరం పౌరుల నైతిక బాధ్యతలను గుర్తు చేస్తాయి.
- అనేక వైవిధ్యాలున్న భారతదేశంలో పౌరులు చిత్తశుద్ధితో విశాల దృక్పథంతో బాధ్యతాయుత పౌరులుగా దేశ ఐక్యతకు, సమగ్రతకు, కృషి చేసేలా దోహద పడతాయి.
- ప్రాథమిక విధులను, ప్రాథమిక హక్కులపై ఉన్న హేతుబద్ధమైన పరిమితులుగా పరిగణించవచ్చని 1992లో సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

ప్రముఖుల వ్యాఖ్యానాలు

- ఆదేశిక సూత్రాల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధిపై ఆధారపడి ఉన్న విధంగానే ప్రాథమిక విధుల అమలు అనేది వ్యక్తుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది – దుర్గాదాస్ బసు
- ప్రాథమిక విధులు కేవలం అలంకార పూర్వకమైనవి – జస్టిస్ కె.వి. ముఖర్జీ
- హక్కులు, విధులనేవి ఒకే నాణేనికి ఉన్న పార్శ్వాలు (Two sides of a same coin) – హెచ్.జె. లాస్కీ
- ప్రాథమిక విధులు అసంబద్ధంగా, గందరగోళంగా ఉన్నాయి – నానీ పాల్కీవాలా

మాదిరి ప్రశ్నలు

1. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులెన్ని?
   1) 8 2) 9 3) 10 4) 11
2. ఏ కమిటీ సూచనల మేరకు ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చారు?
   1) రాజమన్నార్ 2) సర్కారియా
   3) స్వరణ్ సింగ్ కమిటీ
   4) బల్వంత్ రాయ్ కమిటీ
3. ప్రాథమిక విధులకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   1) ప్రాథమిక హక్కులతోపాటే వీటిని ప్రవేశ పెట్టారు
   2) ఆదేశిక సూత్రాల స్థానంలో వీటిని ప్రవేశ పెట్టారు
   3) వీటిని ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు
   4) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో కలిపి ప్రవేశ పెట్టారు

సమాధానాలు: 1) 4 2) 3 3) 3

ఆక్వారీజియం అనేది వేటి మిశ్రమం?

నీరు – దాని సంఘటిత మూలకాలు నత్రజని – దాని సమ్మేళనాలు

- ★ నీటి అణువు ఆకృతి: కోణీయం
- ★ నీటి స్ఫటికాలను మంచు అంటారు.
- ★ ఉప్పునీటి ద్రావణాన్ని బ్రైన్ ద్రావణం అంటారు.
- ★ నీటి రసాయన నామం: హైడ్రోజన్ మోనాక్సైడ్
- ★ నీటి ఘనపరిమాణాత్మక సంఘటనం: 2 ఘ.ప. H_2, 1 ఘ.ప. O_2
- ★ నీటి విద్యుత్ వాహకతను పెంచడానికి చిటికెడు ఉప్పు/ఆమ్లాన్ని కలుపుతారు.
- ★ నీటిని విశ్వద్రావణి అంటారు.
- ★ నీటికి కఠినత్వం దానిలో కరిగిన Ca, Mg సల్ఫేట్స్, క్లోరైడ్‌ల వల్ల కలుగుతుంది.
- ★ నీటిలో తేలియాడుతున్న మలినాలను తొలగించడానికి పటికను కలుపుతారు.
- ★ ఒక లీటర్ హైడ్రోజన్ భారం: 0.09 గ్రా.
- ★ ఒక లీటర్ గాలి భారం: 1.29 గ్రా.
- ★ కుళ్లిన కోడిగుడ్ల వాసననిచ్చే వాయువు: H_2S
- ★ హేబర్ పద్ధతిలో అమ్మోనియా తయారీకి ఉపయోగించే ఉత్ప్రేరకం: Fe
- ★ ఆక్సీహైడ్రోజన్ జ్వాల ఉష్ణోగ్రత: 2400°C
- ★ ఆక్సీ ఎసిటలీన్ జ్వాల ఉష్ణోగ్రత:3200°C
- ★ నీటి వాయువు సంఘటనం: $CO+H_2$
- ★ ప్రొడ్యూసర్ వాయువు సంఘటనం: $CO+H_2+N_2$
- ★ కృత్రిమ పెట్రోల్‌ను సంశ్లేషించిన శాస్త్రవేత్త: బెర్గియస్
- ★ నూనెల హైడ్రోజనీకరణంలో ఉపయోగించే ఉత్ప్రేరకం: Ni
- ★ కాపర్, పాదరసం, ప్లాటినం వంటి లోహా లు ఆమ్లం నుంచి హైడ్రోజన్‌ను విడుదల చేయవు.
- ★ ఆక్సిజన్ ఇసుకలో 56 శాతం, నీటిలో 89 శాతం ఉంటుంది.
- ★ ఆక్సిజన్‌ను మొదటిసారి తయారుచేసిన శాస్త్రవేత్త: షీలే
- ★ ఆక్సిజన్ అని నామకరణం చేసిన శాస్త్రవేత్త: లెవోయిజర్
- ★ నవీన రసాయనశాస్త్ర పితామహుడు: లెవోయిజర్
- ★ H_2O_2ను వేడిచేసి O_2ను పొందడంలో MNO_2ను ఉత్ప్రేరకంగా ఉపయోగిస్తారు.
- ★ $K_2Cr_2O_7$ ద్రావణంలో ముంచిన వడ పోత కాగితాన్ని SO_2 వాయువు ఆకు పచ్చగా మార్చుతుంది.
- ★ తుప్పు రసాయన ఫార్ములా: $Fe_2O_3.XH_2O$
- ★ ఆమ్ల ఆక్సైడ్‌లకు ఉదాహరణ: SO_2, P_2O_5, CO_2, N_2O_3
- ★ క్షార ఆక్సైడ్‌లకు ఉదాహరణ: CaO, MgO, Na_2O, Fe_2O_3, CuO
- ★ తటస్థ ఆక్సైడ్: CO
- ★ గాలిలో మండించినప్పుడు బంగారు పసుపు రంగులో మండే లోహం: సోడియం
- ★ విష వాయువులను విషరహిత వాయువు లుగా మార్చే పరికరం:కెటలైటిక్ కన్వర్టర్స్.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

రసాయన శాస్త్రం - ఎస్ఏ కంటెంట్

- ★ నత్రజని గాలిలో 75 శాతం భార శాతంగా, 80 శాతం ఘనపరిమాణం పరంగా లభిస్తుంది.
- ★ వాయువును పీడనానికి గురి చేసి, వ్యాకోచింపచేసి చల్లబరిచే విధానాన్ని జౌల్ – థామ్సన్ ప్రభావం అంటారు.
- ★ అమ్మోనియం నైట్రైట్ ఒక పేలుడు పదార్థం.
- ★ నైట్రోజన్ ఘనీభవన స్థానం: 210.5°C
- ★ హేబర్ పద్ధతిలో ఉత్ప్రేరకం: చూర్ణ స్థితిలో ఉన్న ఇనుము
- ★ హేబర్ పద్ధతిలో ఉన్న ఉత్తేజకం: మాలిబ్డినమ్
- ★ TNT పూర్తిపేరు: ట్రైనైట్రోటోలిన్
- ★ అమ్మోనియా ద్రవీభవన స్థానం: –33.4°C
- ★ అమ్మోనియా ఘనీభవన స్థానం: –78°C
- ★ అమ్మోనియాను ఆక్సీకరణం చేస్తే ఏర్పడే పదార్థం: NO
- ★ అధిక పరిమాణంలో ఉన్న క్లోరిన్‌తో అమ్మోనియా చర్య జరిపితే ఏర్పడే పదార్థం: $NCl_3 + HCl$
- ★ అధిక ఆక్సిజన్ సమక్షంలో అమ్మోనియా ఆక్సీకరణం పొందితే ఏర్పడే పదార్థం: NO_2
- ★ NH_4Clను లెక్లాంచి, నిర్జల ఘటాల్లో ఉపయోగిస్తారు. దీన్ని సోల్డరింగ్‌లోనూ వాడతారు.
- ★ FACT విస్తరణ రూపం: Fertilizers And Chemical Travancore
- ★ అమ్మోటల్ సంఘటనం: NH_4NO_3+20% TNT
- ★ అమ్మోనల్ సంఘటనం: NH_4NO_3 + Al పొడి
- ★ MAP ఫార్ములా: $NH_4H_2PO_4$
- ★ DAP ఫార్ములా: $(NH_4)_2HPO_4$
- ★ అమ్మోనియం ఫాస్ఫేట్ ఫార్ములా: $(NH_4)_3PO_4$
- ★ కాపర్ వేడి గాఢత HNO_3తో చర్య జరిపితే NO_2 వాయువు వెలువడుతుంది.
- ★ కాపర్ సజల నత్రికామ్లంతో చర్య జరిపితే NO వాయువు వెలువడుతుంది.
- ★ జింక్ గాఢ HNO_3 తో చర్య జరిపితే NO_2 వాయువు వెలువడుతుంది.
- ★ జింక్ సజల HNO_3తో చర్య జరిపితే N_2O వాయువు వెలువడుతుంది.
- ★ సెల్యులోజ్ నైట్రేట్‌ను కృత్రిమ సిల్క్ అంటారు.
- ★ ద్రవ రాజం 1 ఘ.ప. గాఢ HNO_3+ 3 ఘ.ప. గాఢ HClల మిశ్రమం.
- ★ చనిపోయిన వృక్ష, జంతు కళేబరాలను, వాటి వ్యర్థ పదార్థాలను అమ్మోనిఫైయింగ్ బ్యాక్టీరియా అమ్మోనియా లవణాలుగా మారుస్తుంది.
- ★ అమ్మోనియా లవణాలను డీ నైట్రిఫైయింగ్ బ్యాక్టీరియా నత్రజనిగా మారుస్తుంది.
- ★ అమ్మోనియా లవణాలను నైట్రసోఫైయింగ్ బ్యాక్టీరియా నైట్రైట్స్‌గా మారుస్తుంది.
- ★ నైట్రైట్స్‌ని నైట్రిఫైయింగ్ బ్యాక్టీరియా నైట్రేట్స్‌గా మార్చుతుంది.
- ★ $Pb(NO_3)_2$ను వేడి చేసినప్పుడు NO_2 జేగురు రంగు వాయువు వెలువడుతుంది.
- ★ బ్రౌన్ రింగ్ వలయ ఫార్ములా: $FeSO_4.NO$
- ★ లెగ్యుమినేసి కుటుంబ మొక్కల వేరు బుడిపెలలో ఉండే బ్యాక్టీరియా: రైజోబియం
- ★ అద్దకం పరిశ్రమల్లో ఉపయోగించే లవణం: NH_4Cl
- ★ ఆస్వాల్డ్ పద్ధతిలో తయారు చేసే ఆమ్లం: HNO_3
- ★ NCl_3 ఒక పేలుడు పదార్థం.
- ★ KNO_3ని వియోగం చెందిస్తే వెలువడే వాయువు O_2

మాదిరి ప్రశ్నలు

1. ద్రవ నైట్రోజన్ ఉపయోగం?
   ఎ) పేలుడు పదార్థంగా
   బి) శీతలీకరణ కారకంగా
   సి) ఆక్సీకరణ కారకంగా
   డి) ప్రయోగశాల కారకంగా
2. పెద్ద మొత్తంలో అమ్మోనియాను తయారు చేసే పద్ధతి?
   ఎ) హేబర్ పద్ధతి
   బి) సీమన్-మార్టిన్ పద్ధతి
   సి) కాస్నర్- కెల్నర్ పద్ధతి
   డి) స్వర్శా పద్ధతి
3. గాలిలో నైట్రోజన్ శాతం?
   ఎ) 99.5 బి) 75
   సి) 22 డి) 80
4. మెగ్నీషియం.. నైట్రోజన్‌తో మండి ఏర్పర్చే సమ్మేళనం?
   ఎ) Mg_2N_3 బి) Mg_3N_2
   సి) MgN డి) $MgNO_3$
5. అమ్మోనియం నైట్రేట్ ద్వారా నీటి ఆవిరిని పంపితే వెలువడే వాయువు?
   ఎ) ఆక్సిజన్ బి) అమ్మోనియా
   సి) నైట్రోజన్ డి) హైడ్రోజన్
6. ద్రవ నైట్రోజన్ మరిగే స్థానం?
   ఎ) -183°C బి) -210.5°C
   సి) -273°C డి) -196°C
7. ఒక వాయువును పీడనానికి గురిచేసి వ్యాకోచింప చేసి చల్లబరిచే విధానాన్ని ఏమంటారు?
   ఎ) సీబెక్ ప్రభావం
   బి) రామన్ ప్రభావం
   సి) న్యూటన్ ప్రభావం
   డి) జౌల్–థామ్సన్ ప్రభావం
8. అధిక పరిమాణం గల క్లోరిన్‌తో అమ్మో నియా చర్య పొందితే ఏర్పడే పదార్థం?
   ఎ) N_2 బి) NH_4Cl
   సి) NCl_3 డి) NCl_3+HCl
9. అధిక ఆక్సిజన్ సమక్షంలో అమ్మోనియా ఆక్సీకరణం పొందితే ఏర్పడే పదార్థం?
   ఎ) N_2 బి) NO_2
   సి) N_2O డి) N_2O_3
10. అమ్మోనియాను ఆక్సీకరణం చెందిస్తే ఏర్పడే పదార్థం?
    ఎ) NO బి) N_2O
    సి) NO_2 డి) N_2O_3
11. సోడామైడ్ రసాయన ఫార్ములా
    ఎ) $NaNH_2$ బి) NaCl
    సి) $NaNO_3$ డి) $NaNO_2$
12. ఫెర్రిక్ హైడ్రాక్సైడ్ అవక్షేపం రంగు?
    ఎ) లేత నీలం బి) పాలిన ఆకుపచ్చ
    సి) బ్రౌన్ రంగు డి) తెలుపు
13. జిప్సం రసాయన ఫార్ములా?
    ఎ) $CaSO_4$ బి) $CaSO_42H_2O$
    సి) $CaSO_4.½H_2O$ డి) $CaCO_3$
14. మోనో అమ్మోనియా ఫాస్ఫేట్ ఫార్ములా?
    ఎ) $(NH_4)_3PO_4$ బి) $NH_4H_2PO_4$
    సి) $(NH_4)_2HPO_4$
    డి) $(NH_4)_2PO_4$
15. కాలికో ప్రింటింగ్‌లో ఉపయోగించే అమ్మోనియా లవణం?
    ఎ) అమ్మోనియా సల్ఫేట్
    బి) అమ్మోనియా ఫాస్ఫేట్
    సి) అమ్మోనియా క్లోరైడ్
    డి) అమ్మోనియా డయోడ్
16. జింక్‌తో గాఢ నత్రకామ్లం చర్య జరిపితే ఏర్పడే నైట్రోజన్ ఆక్సైడ్?
    ఎ) NO_2 బి) N_2O
    సి) N_2O_3 డి) NO
17. కాపర్‌పై సజల నత్రికామ్లం వల్ల ఏర్పడే నైట్రోజన్ ఆక్సైడ్?
    ఎ) NO_2 బి) N_2O
    సి) N_2O_3 డి) NO
18. [illegible] చర్యలో అయోడిన్?
    ఎ) క్షయకరణం చెందింది
    బి) రంగు కోల్పోయింది
    సి) ఆక్సీకరణం చెందింది
    డి) తటస్థీకరణం చెందింది
19. ఆక్వారీజియం అనేది వేటి మిశ్రమం?
    ఎ) గాఢ HCl + గాఢ H_2SO_4
    బి) గాఢ HNO_3 + గాఢ HCl
    సి) గాఢ HNO_3 + గాఢ H_2SO_4
    డి) గాఢ HNO_3+ గాఢ H_3PO_4
20. సజల నత్రికామ్లం ఏ లోహంతో చర్య జరిపి H_2 వాయువును వెలువరిస్తుంది?
    ఎ) Zn బి) Cu సి) Ag డి) Mg
21. వేరు బుడిపెలు కలిగి నత్రజని స్థాపన చేయగల మొక్క?
    ఎ) మొక్కజొన్న బి) చిక్కుడు
    సి) వరి డి) వెదురు
22. నత్రజనిని స్థాపించగల బ్యాక్టీరియా?
    ఎ) అమ్మోనిఫైయింగ్
    బి) నైట్రసోఫైయింగ్
    సి) సహజీవన డి) నైట్రిఫైయింగ్
23. వెండి, బంగారం శుద్ధిలో వాడే ఆమ్లం?
    ఎ) H_2SO_4 బి) HCl
    సి) H_3PO_4 డి) HNO_3
24. హేబర్ పద్ధతిలో ఉపయోగించే ఉత్ప్రేరకం?
    ఎ) Ni బి) Fe
    సి) Mo డి) Pt
25. లెడ్ నైట్రేట్‌ను వేడిచేస్తే వెలువడే వాయువు?
    ఎ) NO బి) N_2O
    సి) N_2O_3 డి) NO_2

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) బి; 5) సి;
6) డి; 7) డి; 8) డి; 9) బి; 10) ఎ;
11) ఎ; 12) సి; 13) బి; 14) బి; 15) సి;
16) ఎ; 17) డి; 18) సి; 19) బి; 20) డి;
21) బి; 22) సి; 23) డి; 24) బి; 25) డి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సోడియం నైట్రేట్‌ను పరీక్షనాళికలో తీసుకొని వేడి చేస్తే పరీక్షనాళికలో మిగిలి ఉండే పదార్థం? (DSC-2006)
   ఎ) సోడియం నైట్రైట్ బి) NO_2
   సి) O_2 డి) ఏదీకాదు
2. నీటి శాశ్వత కాఠిన్యతకు కారణం?
   ఎ) Ca, Mgల సల్ఫేట్స్, కార్బొనేట్స్
   బి) Ca, Mgల సల్ఫేట్స్, క్లోరైడ్స్
   సి) Ca, Mgల బైకార్బొనేట్స్
   డి) Ca, Mgల నైట్రేట్స్
3. తాత్కాలిక కాఠిన్యత గల నీటిని మరిగిస్తే వెలువడే పదార్థం?
   ఎ) $CaCO_3$ బి) నీరు
   సి) CO_2 డి) అన్నీ
4. ఫాస్ఫారిక్ ఆమ్ల సంకేతం?
   ఎ) H_3PO_3 బి) H_3PO_4
   సి) HPO_3 డి) H_2SO_4

సమాధానాలు

1) ఎ; 2) బి; 3) డి; 4) బి

మానవ శరీరంలో అతి కఠిన భాగం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజికల్ సైన్స్

అస్థిపంజర వ్యవస్థ

అస్థిపంజరం.. ఎముకలతో నిర్మితమైన చట్రం. దీనిలో కొన్ని మృదులాస్థి నిర్మాణాలు కూడా ఉంటాయి. దేహభాగాలకు నిర్దిష్టమైన ఆకృతి, దృఢత్వాన్ని, మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్షణనిస్తూ శరీర కదలికల్లో అస్థిపంజర వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. మానవుడి దేహంలోని మొత్తం ఎముకలన్నింటినీ కలిపి అస్థిపంజరం అంటారు. అస్థిపంజరం అధ్యయనాన్ని ఆస్టియాలజీ అంటారు. ఎముకల్లో ఉండే ప్రొటీన్ ఆస్టిన్. మానవుడి అస్థిపంజరంలో 206 ఎముకలు ఉంటాయి.

ఎముకలను ఏర్పర్చే కణాలు ఆస్టియోసైట్స్. ఎముకల్లో ఉండే మూలకాలు కాల్షియం, ఫాస్ఫరస్. ఎముకల్లో కాల్షియం ఫాస్ఫేట్ ఎక్కువగా, కాల్షియం కార్బొనేట్ తక్కువగా ఉంటుంది. కాల్షియం ఎముకకు దృఢత్వాన్నిస్తుంది. మానవ శరీరంలో అత్యధికంగా ఉండే మూలకం కాల్షియం.

పాలు, గుడ్లు, ఆకుకూరల్లో కాల్షియం అధికంగా లభిస్తుంది. విటమిన్-డి కూడా చర్మం, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఎముకల మధ్య భాగంలో అస్థిమజ్జ ఉంటుంది. ఎరుపు రంగు అస్థిమజ్జ ఎర్ర రక్తకణాల (ఆర్‌బీసీ)ను ఉత్పత్తి చేస్తుంది.

పక్షుల ఎముకల్లో అస్థిమజ్జ ఉండదు. వీటిలో గాలి ఉంటుంది. వీటిని వాతులాస్థులు (న్యుమాటిక్ బోన్స్) అంటారు. పక్షుల్లో ఆర్‌బీసీలను ఉత్పత్తి చేసే అవయవం బర్సా.

అస్థిపంజరం - రకాలు

1) బాహ్యాస్థిపంజరం
2) అంతరాస్థిపంజరం.

బాహ్యాస్థిపంజరం

బాహ్యాస్థిపంజరం జీవి దేహం బయట ఉంటుంది.
వివిధ జీవుల్లోని బాహ్యాస్థిపంజరం..

1) చేపలు - పొలుసులు
2) పక్షులు - ఈకలు
3) కోడిగుడ్లు - పెంకు
4) నత్తలు, ఆల్చిప్పలు, ప్రవాళాలు (కోరల్స్)- కర్పరం
5) కీటకాలు - స్క్లీరైట్స్
6) సకశేరుకాలు - రోమాలు, నఖాలు, కొమ్ములు, గిట్టలు మొదలైనవి. వీటిలో ఉండే ప్రొటీన్ ఆల్ఫాకెరాటిన్.

నోట్: క్యారెట్‌లోని విటమిన్-ఏను బీటా కెరోటిన్ అంటారు.

గోర్లను కత్తిరించినప్పుడు నొప్పి, బాధ అనిపించకపోవడానికి కారణం అవి మృతకణ జాలంతో తయారైన కొమ్ము వంటి పదార్థంతో ఏర్పడటం.

అంతరాస్థిపంజరం

అంతరాస్థిపంజరం దేహం లోపల ఉంటుంది. అస్థిపంజరంలోని ఎముకలు రెండు రకాలు. ఎ) మృదులాస్థి బి) అస్థి

మృదులాస్థి

మెత్తగా ఉండే ఎముకలను మృదులాస్థి ఎముకలు అంటారు. పిండదశలో ఎముకలన్నీ మృదులాస్థి నిర్మితాలు. శిశువు ఎదిగిన తర్వాత ఈ మృదులాస్థులు అస్థులుగా రూపొందుతాయి. మృదులాస్థిలో ఉండే ప్రొటీన్ 'కాండ్రిన్'. మృదులాస్థి అధ్యయనాన్ని కాండ్రాలజీ అంటారు.

మృదులాస్థి ఉండే భాగాలు..

1) ముక్కుకొన (నాసికాగ్రం)
2) వెలుపలి చెవి
3) వాయునాళంలోని 'సి' ఆకారపు ఉంగరాలు
4) కొండనాలుక
5) అంగిలి (ఇది నాసికాకుహరం, ఆస్యకుహరాన్ని వేరు చేస్తుంది)
6) సొరచేప అస్థిపంజరం

షార్క్ చేప కాలేయ నూనెలో విటమిన్ - ఎ, డిలు లభిస్తాయి.

అస్థి (బోన్)

అస్థి అంటే దృఢంగా ఉండే ఎముక.
చిన్నపిల్లల్లో 300 పైగా ఎముకలు ఉంటాయి.

శరీర భాగం	ఎముకల సంఖ్య
1. తల	29 (పుర్రె-22 హయాయిడ్ ఎముక-1, రెండు చెవులు-6)
2. వెన్నుపూసలు	26 (చిన్నపిల్లల్లో- 33)
3. పక్కటెముకలు/రిబ్స్	24
4. రెండు చేతులు	60
5. రెండు కాళ్లు	60

మొత్తం ఎముకల సంఖ్య (పెద్ద వారిలో) 206

గమనిక: ఉరి వేసుకున్న వారిలో హయాయిడ్ ఎముక విరుగుతుంది.

శైశవ దశలో 33 వెన్నుపూసలుంటాయి. తర్వాత వాటిలో చివరి 9 వెన్నుపూసలు (ఐదు కలిసి ఒక త్రికంగా, 4 కలిసి అనుమత్రికంగా) 2 వెన్నుపూసలుగా ఏర్పడతాయి.

కాబట్టి పెద్ద వారిలో ఉండే మొత్తం వెన్నుపూసల సంఖ్య 26

తలలోని ఎముకల గూడును పుర్రె అంటారు. పుర్రెలో మెదడు ఉండే పెట్టెవంటి నిర్మాణం కపాలం (క్రేనియం). కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు.

- కపాలంలోని ఎముకలు- 8
- ముఖంలోని ఎముకలు -14
- పుర్రెలో కదిలే ఎముక - 1
- కింది దవడ కదులుతుంది
- పుర్రెలో కదలని ఎముకలు- 21
- అతిపెద్ద ఎముక - ఫీమర్ (తొడ ఎముక)
- అతిచిన్న ఎముక - స్టెపిస్ (కర్ణాంతరాస్థి)
- పుర్రెలో అతిదృఢమైన ఎముక - కింది దవడ (మాండిబ్యూల్)
- అతి మెత్తని ఎముక - మృదులాస్థి


చేతి ఎముకలు:
ప్రతి చేయిలో 30 ఎముకలుంటాయి.
చేయిలో మూడు భాగాలు ఉంటాయి.

1) పై చేయి (భుజాస్థి ఎముక - హ్యూమరస్ 1)
2) ముంజేయి (రత్ని, అరత్ని ఎముకలు -2)
3) హస్తం
   ఎ) మణిబంధాస్థులు -8
   బి) కరభాస్థులు - 5
   సి) చేతివేళ్లు - 14

గమనిక: రాస్తున్నప్పుడు పెన్నుకు ఆధారాన్నిచ్చే చేతి వేళ్ల ఎముకలను ఫాలింజెస్ అంటారు.

కాలు ఎముకలు: ప్రతికాలులో 30 ఎముకలుంటాయి. కాలులో మూడు భాగాలున్నాయి.

1) తొడ: ఫీమర్ - 1
2) మోకాలు: టిబియా, ఫిబులా (అంతర్‌జంగిక, బహిర్జంగిక- 2)



3) పాదం
ఎ) చీలమండలం (టార్సల్స్)-7
బి) ప్రపాదాస్థులు-మెటాటార్సల్స్-5
సి) కాలివేళ్లు - ఫాలింజస్-14
డి) మోకాలి చిప్ప - పటెల్లా - 1

ఉరోమేఖల (పెక్టోరల్ గిర్డిల్): ఇది చేతులను అంటిపెట్టుకుని ఉంటుంది. ఉరోమేఖల / భుజ వలయంలో రెండు ఎముకలుంటాయి. అవి..
ఎ) జత్రుక (కాలర్ బోన్)
బి) అంస ఫలకం (స్కాపులా)
(ఇది త్రిభుజాకారంలో ఉంటుంది)

ఉరఃపంజరం: ఉరోస్థి ముందువైపు (రొమ్ము ఎముక), పక్కటెముకల ఇరువైపులా, వెన్నెముక వెనుకవైపు ఉండి గుండె, ఊపిరితిత్తులను రక్షిస్తుంది

శ్రోణిమేఖల (పెల్విస్ గిర్డిల్): ఇది కాలి ఎముకలను అంటుకుని ఉదరం కింది భాగంలో ఉంటుంది. కూర్చోవడానికి ఉపయోగపడుతుంది.

కీళ్లు (జాయింట్స్)

రెండు ఎముకలు కలిసే ప్రాంతాన్ని కీలు అంటారు. రెండు ఎముకలను బంధించే కొల్లాజెన్ పోగులను లిగ్మెంట్ (స్నాయువు) అంటారు. ఎముకను కండరంతో బంధించే కొల్లాజెన్ పోగును టెండాన్ (స్నాయుబంధనం) అంటారు. కీళ్ల మధ్యలో సైనోవియల్ కుహరం ఉంటుంది. దీనిలో సైనోవియల్ ద్రవం ఉంటుంది. సైనోవియల్ ద్రవం కీళ్ల కదలికలో కందెనలా ఉపయోగపడుతుంది. ఎముకలు, దేహం కదలడానికి కీళ్లు తోడ్పడతాయి. కీళ్ల అధ్యయనాన్ని ఆర్థాలజీ అంటారు. శరీరంలో మొత్తం 230 కీళ్లుంటాయి. కీళ్ల, ఎముకల వైద్య నిపుణుడ్ని ఆర్థోపెడిక్ డాక్టర్ అంటారు.

కీళ్లు - రకాలు

కీళ్లు రెండు రకాలు.

1) కదలని (స్థిరమైన) కీళ్లు

పుర్రెలో పైదవడ, కపాలానికి మధ్య ఉండే వి కదలని కీళ్లు

2) కదిలే కీళ్లు

పుర్రెలో కింది దవడ కదిలే కీలు.
ఇవి నాలుగు రకాలు. అవి..

బొంగరపు కీలు: ఇది మెడలో పుర్రె, వెన్నెముక కలిసే ప్రాంతంలో ఉంటుంది. మెడలో 7 ఎముకలు ఉంటాయి. బొంగరపు కీలు చేసే కోణం 180 డిగ్రీలు

నోట్: భరతనాట్యం చేసే వారిలో ఈ కీలు ఎక్కువగా ఉపయోగపడుతుంది.

బంతిగిన్నె కీలు: ఇది భుజం-దండచేయి, తొడ-కటివలయం ప్రాంతంలో ఉంటుంది. ఈ కీలు చేసే కోణం 360 డిగ్రీలు

నోట్: చేతులు, కాళ్లను ఈ కీలు వృత్తాకారంగా (గుండ్రంగా) తిప్పుతుంది.

మడతబందు కీలు: ఇది మోచేయి, మోకాలు, కాలు, చేతి వేళ్లకు మధ్య ఉంటుంది. ఈ కీలు చేసే కోణం - 90 డిగ్రీలు

నోట్: ఈ కీలు మోచేయి, మోకాలును ఒకేవైపు వంచుతుంది. తలుపులు, కిటికీలకు బంధించే నిర్మాణాలు మడతబందులు.

జారుడు కీలు: ఇది వెన్నెముకలోని వెన్నుపూసల మధ్య పక్కటెముకలు, మణికట్టులో ఉంటుంది.

నోట్: తాళం వేసేటప్పుడు, తీసేటప్పుడు, ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాస సమయంలో అవసరమయ్యే కీలు జారుడు కీలు. నేలమీది ఉన్న వస్తువును వంగి తీసుకునేటప్పుడు (వెన్నుపూసలు) ఉపయోగపడేది జారుడు కీలు.

ఎముకలను నిర్వాత స్వేదనం చేసి ఎముకల బొగ్గును తయారుచేస్తారు. ఎముకల బొగ్గును చక్కెర పరిశ్రమలో విరంజనకారి (డీ కలరింగ్ ఏజెంట్)గా ఉపయోగిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మానవుడి శరీరంలో (పెద్దవారిలో) ఎముకల సంఖ్య?
   1) 330 2) 260
   3) 206 4) 220
2. మానవ శరీరంలోని అతి కఠిన భాగం?
   1) దంతాలు 2) గోర్లు
   3) ఎముకలు 4) ఎనామిల్
3. జంతువులలోని అస్థిమజ్జ నిర్వహించే క్రియ?
   1) మూత్రపిండాలకు సహాయం
   2) రక్తకణోత్పత్తి
   3) కాలేయానికి సహాయం
   4) రక్తపీడన నియంత్రణ
4. గోర్లను కత్తిరించినప్పుడు ఎందుకు నొప్పి కలగదు?
   1) మృతకణజాలంతో తయారైన కొమ్మువంటి పదార్థం ఉండటం
   2) శరీరంలో అనవసర భాగం
   3) బహిష్కృత భాగంగా రూపాంతరం చెందడం
   4) కాల్షియం ఫాస్ఫేట్‌తో తయారు కావడం
5. మనం చేతితో రాస్తున్నప్పుడు పెన్నుకు ఆధారాన్నిచ్చే చేతి వేళ్లలోని ఎముకలు?
   1) కార్పెల్స్
   2) మెటాకార్పెల్స్
   3) టార్సల్స్ 4) ఫాలింజెస్
6. ఎముకల అధ్యయన శాస్త్రం?
   1) ఓటాలజీ 2) ఆస్టియాలజీ
   3) ఆర్నిథాలజీ 4) అంకాలజీ
7. అప్పుడే పుట్టిన శిశువులో ఉండే ఎముకల సంఖ్య?
   1) 300 2) 320
   3) 330 4) 340
8. కింది వాటిలో మానవుడి వెన్నెముకకు సంబంధించిన వ్యాధి?
   1) హైపోథార్మియా
   2) కాటరాక్ట్
   3) హెర్నియా
   4) సర్వైకల్ స్పాండలైటిస్
9. మానవ శరీరంలో అతిపెద్ద ఎముక?
   1) ఫిబులా 2) టిబియా
   3) స్టెపిస్ 4) ఫీమర్
10. నీటిలో ఏ పదార్థం ఎక్కువ ఉండటంతో ఎముకల్లో వంకర్లు వస్తాయి?
   1) ఫ్లోరిన్ 2) క్లోరైడ్
   3) లెడ్ 4) ఏదీకాదు
11. చెవులలోని మొత్తం ఎముకల సంఖ్య?
   1) 2 2) 4
   3) 6 4) 8
12. మానవుడి పుర్రెలోని మొత్తం ఎముకల సంఖ్య?
   1) 24 2) 22
   3) 20 4) 21

సమాధానాలు


1) 3; 2) 4; 3) 2; 4) 1; 5) 4; 6) 2; 7) 1; 8) 4; 9) 4; 10) 1; 11) 3; 12) 2.

How far is point T from point B?

Direction Test

Problems on direction test are framed to gauge the sense of direction of an aspirant. Following few points should be borne in mind while solving the questions on direction test.

- ★ There are four major directions (North, South, East and West) and four cardinal directions (North-East, South-East, North-West and South-West).
- ★ Always use direction plane as reference in solving all the questions




- ★ In a journey the left hand side of a person is his left turn and the right hand side of a person will be his right turn.
- ★ Further in a journey path mark the starting point and end point differently.
- ★ In the morning the Sun rises in the East and the shadow of any object falls in the opposite direction to the Sun i.e. in the West direction.
- ★ In the evening the Sun sets in the West and hence the shadow of any objects falls in East.

MODEL QUESTIONS


1. Animesh who is standing at Point P, walks 12 metres towards East to reach Point Q. He then turns left and walks 4 metres to reach point R. Now he takes a right turn and walks 7 metres to reach Point S. From Point S, he turns right and walks 16 metres to reach point I. From Point I he walks 7 metres towards West and stops at point J. Point J is in which direction with respect to Point P?
   1) South-East 2) North-East
   3) South-West 4) North-West
   5) South

Sol:



(i) (ii) (iii) (iv) (v)

Now draw a direction diagram at P and then join P to J. The direction shown by the line PJ will be the answer.



The direction shown by PJ is South-East. *Ans: 1*

2. One evening before sunset two friends Ram and Raheem were talking to each other face to face. If Ram shadow was exactly to his right side, which direction was Raheem facing ?
   1) North 2) South
   3) West 4) Data inadequate
   5) None of these

Sol: In the evening the sun sets in the West and the shadow of any object falls in East.
Here Ram's shadow was exactly to his (Ram's) right side.
⇒ Ram was exactly to the left of his (Ram's) shadow.
⇒ Ram was to the left of east [shadow falls in East].
∴ Ram was facing North.
∴ Raheem was facing opposite to the direction of Ram. Hence Raheem would be facing the South direction. *Ans: 2*



BANK EXAMS

REASONING

3. Malavika's back is facing 'North East'. If she turns 45° in anti clock wise direction and later 180°, which side is she facing now?
   1) North 2) South-West
   3) West 4) North-East
   5) None of these

Sol: If Malavika's back is facing North-East then Malavika will be facing South-West (i.e. opp to North-East) If she turns 45° anti-clockwise direction then she will be facing South direction. Later when she turns 180° she will be facing direction opposite to South i.e. North direction. *Ans: 1*


4. A man facing South turns to his left and walk 10 metre, then he turns to his right and walk 15 metre, again he turns to his left and walk 5 metre and then he turns to his left and walk 15 metre. In which direction he is facing now?
   1) West 2) North
   3) South 4) East
   5) None of these

Sol: Man is initially facing South and turns left, right, left and left successively. As taking one right turn nullifies the effect of taking one left turn, it can be concluded that the man is effectively taking two left turns only. If a person takes two left turns he would be facing a direction opposite to initial direction. The direction opposite to South is North. So the man is facing North direction. *Ans: 2*


Directions (Q.No.6-8): Study the following information carefully and answer the questions given below:

Point B is 10 metre to the North of Point C. Point J is 7 metre to the East of point B. Point K is 5 metre to the West of point C. Point S is 12 metre to the South of point K. Point T is 5 metre to the East of point S.


Sol: Point B is 10 m to the North of Point C




Point J is 7 metre to the East of point B




Point K is 5 metre to the West of point C



Point S is 12 metre to the South of point K



Point T is 5 metre to the East of point S




6. If Suman walks 7 metre to the East of T, takes a left turn and walks for 10 metre to reach Point X, how far and in which direction should Suman walk to reach point J?
   1) 10 metre East
   2) 12 metre North
   3) 8 metre North
   4) 10 metre South
   5) 12 metre South

Sol: If Suman walks 7 metres to East of T and takes a left turn then J will be at a distance of 12+10= 22m to the North of the point where Suman takes a turn. If he walks 10 metres to reach X then he should walk a further distance of 12 m in North direction to reach J.
Ans: 2

7. In what direction is Point S with respect to Point C?
   1) South-East 2) North-West
   3) South-West4) West
   5) North

Sol: Draw a direction diagram at point C and then join 'C' and 'S'. The direction shown by CS will be the answer.



The direction shown by CS is South-West. *Ans: 3*


8. How far is point T from point B?
   1) 12 metre 2) 26 metre
   3) 22 metre 4) 15 metre
   5) 18 metre

Sol: BC = 10 CT = 12
∴ BT = BC + CT = 10 + 12
= 22 M *Ans:3*


Directions(Q.No.9-11):Study the following information carefully and answer the questions given below:

Raman walks 14m towards south from point P and reaches point Q. Then he takes a left turn and walks 18m to reach point R and he turns left and walks 19m to reach point S. Again, he turns left and walks 10m to reach point T. Finally he turns left and walks 5m to reach point V.

Sol:



(i) (ii)



(iii) (iv) (v)

9. How far and in which direction is point V from point P ?
   1) 10m to the East
   2) 12m to the East
   3) 8m to the East
   4) 8m to the West
   5) None of these

∴V is at a distance of 8 m to the East of P. *Ans: 3*

10. Point Q is in which direction with respect to point S ?
   1) South -East 2) South- West
   3) North-East 4) South
   5) None of these

∴ Drawing a direction diagram at Q and on joining with S, the line QS shows South-west direction. *Ans:2*

11. What is the total distance that Raman walks?
   1) 66m 2) 60m
   3) 70m 4) Can't be determined
   5) None of these

∴Total distance walked by Raman = 14 + 18 + 19 + 10 + 5 = 66 m *Ans: 1*